ఈనాడు

హైదరాబాద్ 9-8-2017 బుధవారం సిటీ సంపుటి 43 . సంచిక 361

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


ON SALE
amazon.in
ఎలెక్ట్రానిక్స్
Apple iPhone SE (32GB) ₹26,000 ₹19,999
Honor 6X (64GB) ₹13,999 ₹12,999
Coolpad Note 5 Lite (16GB, 3GB RAM) ₹8,999 ₹6,999
Intel Core i3 6th Gen Laptops Starting at ₹25,990 ₹22,990
Seagate 1TB Hard Drive ₹7,999 ₹4,099
Refrigerators MIN 20% OFF
TP-Link Wireless-N Router ₹1,499 ₹899
TCL 109.3 cm (43) 4K UHD LED TV ₹39,990 ₹30,990
LG 28 Ltrs Convection Microwave Oven ₹13,990 ₹11,990
boAt Headphones MIN 50% OFF
ఫ్యాషన్
విమెన్స్ క్లాతింగ్ 40-70% OFF
pantaloons
W
Jealous 21
People
మెన్స్ క్లాతింగ్ 40-70% OFF
Levi's
GAP
VAN HEUSEN
MARKS & SPENCER
షూస్ 40-70% OFF
adidas
Reebok
Bata
Clarks
వాచెస్ 30-60% OFF
TITAN
CASIO
GIORDANO timewear
CITIZEN
ఇతర ఆఫర్లు
Fitbit Charge 2
amazon prime
₹14,999 ₹9,749
Pigeon Cruise Induction Cooktop ₹3,195 ₹1,199
Nivia Sports Products
MIN 30% OFF
Morphy Richards Iron ₹1,095 ₹499
బెడ్‌షీట్స్ MIN 40% OFF
Bombay Dyeing
Raymond Home
SPACES
SWAYAM
బొమ్మలు MIN 20% OFF
Funskool
Hot Wheels
LEGO
Barbie
గ్యాస్ స్టవ్వులు MIN 30% OFF
Prestige
Sunflame
Pigeon
Ambrane Power Banks MIN 55% OFF
Cello Plastic Canister Set (18 Piece) ₹998 ₹699
Electronic Accessories amazonbasics MIN 30% OFF
Samsung EVO Plus 32GB MicroSDHC Card ₹1,149 ₹699
Kindle Paperwhite ₹10,999 ₹8,999 Additional offers worth ₹4199
యాప్‌లో షాప్
10 జంటలు బాలికి ట్రిప్ గెలుచుకోవచ్చు
అందజేసిన వారు GOOMO
NO-COST EMI** Buy now, pay later in instalments
అదనపు క్యాష్‌బ్యాక్* 15% యాప్ పై | 10% సైట్ పై
SBI Debit Card
SBI Card Make life simple
*కనీస లావాదేవీ: ₹5000, గరిష్ఠ క్యాష్‌బ్యాక్: ₹1500 ప్రతి కార్డ్ అకౌంట్ పై. SBI క్రెడిట్ కార్డ్ పై EMI లావాదేవీలు కూడా ఉన్నాయి.
amazon
AMAZON APP ని ఇప్పుడే డౌన్‌లోడ్ చేసుకోండి.
ప్రతిరోజు రాత్రి 9గంటలకు గోల్డెన్ అవర్ డీల్స్
amazon.in

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 9-8-2017 బుధవారం సిటీ సంపుటి 43 . సంచిక 361

రూ. 5-00 పేజీలు 18+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



- విచారించిన 12 మందిలోనూ వారిపైనే తీవ్ర ఆరోపణలు
- ఒకరి నుంచి కోర్టు అనుమతితో నమూనాల సేకరణకు యోచన
- మత్తుమందుల వ్యవహారంలో సిట్ నిర్ణయం!

ఈనాడు - హైదరాబాద్

మత్తుమందుల వ్యవహారంలో ఆబ్కారీ అధికారులు పట్టు బిగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇప్పటివరకూ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారించిన 12మంది సినీప్రముఖులలో ఇద్దరిపై చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మాదక ద్రవ్యాల నిరోధక చట్టం(ఎన్.డి.పి.ఎస్.) ప్రకారం వీరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసేందుకు అవసరమైన ప్రాథమిక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. మత్తుమందులు సరఫరా చేస్తూ ఇటీవల కెల్విన్ పట్టుబడ్డ తర్వాత ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. పాఠశాల విద్యార్థులు మొదలు సినీప్రముఖులకు మత్తుమందులు సరఫరా చేస్తున్నాడని తెలియడంతో దీన్ని విచారించేందుకు సిట్ ఏర్పాటుచేశారు. 12మంది (మిగతా 2లో)

మరో రెండేళ్లు గరిష్ఠ వయోపరిమితి పెంపు

2019 జులై 26 వరకు అమలు • తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు -5లో

పునరుజ్జీవానికి పునాది

- శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకానికి రేపు సీఎం కేసీఆర్ శంకుస్థాపన
- పథకంలో భాగంగా కాళేశ్వరం నుంచి 60 టీఎంసీల నీటి మళ్లింపు
- పోచంపాడులో బహిరంగ సభ చరిత్ర సృష్టించాలన్న ముఖ్యమంత్రి

ఈనాడు - హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా మేడిగడ్డ నుంచి మళ్లించే నీటిలో 60 టీఎంసీలను శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు తరలించనున్నారు. ప్రాజెక్టు తరచూ నీటి సమస్యను ఎదుర్కొంటుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాలువల ఆధునికీకరణను కూడా కలిపి శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడతారు. పునరాకృతిలో భాగంగా కాళేశ్వరం దిగువన మేడిగడ్డ వద్ద గోదావరిపై బ్యారేజి నిర్మించి రోజుకు రెండు టీఎంసీల నీటిని మళ్లించేలా పనులు జరుగుతున్నాయి. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి, అక్కడి నుంచి మధ్యమానేరుకు, తర్వాత కాళేశ్వరంలో భాగంగా నిర్మించే రిజర్వాయర్లకు నీళ్లొస్తాయి. వరద కాలువ 99వ కి.మీ నుంచి మూడు లిఫ్టుల ద్వారా శ్రీరాంసాగర్‌కు నీటిని మళ్లించే పథకానికి రూ.1067 కోట్లతో ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. గుత్తేదారును కూడా ఖరారు చేశారు. త్వరలోనే ఒప్పందం పూర్తవుతుందని ఈఎన్‌సీ అనిల్‌కుమార్ తెలిపారు. రోజూ 11,500 క్యూసెక్కుల నీటిని మళ్లించడానికి ఎనిమిది పంపులతో లిఫ్టును ఏర్పాటు చేస్తారు. 60 రోజుల్లో 60 టీఎంసీలను ఎస్సారెస్పీలోకి మళ్లించడం ద్వారా 9.63 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఎలాంటి సమస్య లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మించినపుడు మొదటిదశలో 9.68 లక్షల ఎకరాలు, రెండో దశలో ఐదు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. కానీ, పూడిక కారణంగా రిజర్వాయర్ సామర్థ్యం 112 నుంచి 90 టీఎంసీలకు తగ్గిపోయింది. దీంతోపాటు ఈ ప్రాజెక్టులోకి రావాల్సిన ప్రవాహం (మిగతా 2లో)



మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం లక్మాపూర్‌లో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి తదితరులు

తండాలను పంచాయతీలుగా మారుస్తాం: కేసీఆర్ -2లో

జీఎస్టీకి అదనపు చెల్లింపులు

- ఇంజినీరింగ్ విభాగాల్లో గుత్తేదారులకు ఇవ్వాలని సర్కారు నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ విభాగాలపై జీఎస్టీ అదనపు భారం ప్రారంభమైంది. జులై నెల నుంచి గుత్తేదారు చేసిన పనికి చెల్లించే బిల్లులో అదనంగా పది శాతం కలిపి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మధ్యేమార్గంగా ప్రస్తుతానికి ఈ నిర్ణయం తీసుకొంది. కానీ, జీఎస్టీని 18 నుంచి 12 శాతానికి తగ్గించినందున దీన్ని సవరించి అదనంగా 5 శాతం చెల్లించేలా ఆదేశాలిచ్చే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. జీఎస్టీ ప్రారంభం కాకముందు గుత్తేదారులకు వ్యాట్ కింద ప్రభుత్వం ఐదు శాతం చెల్లించేది. జీఎస్టీ అమలుతో ఈ విధానం మారింది. జులై 1 తర్వాత చేసిన పనులకు బిల్లులో పది శాతం అదనంగా కలిపి గుత్తేదారులకు చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ ఈ నెల 5న నీటిపారుదల, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. అంటే గుత్తేదారు రూ.కోటి విలువగల పని చేస్తే రూ.1.10 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఒప్పందంలోని ఇతర ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీపై తుది నిర్ణయానికి లోబడి ఈ చెల్లింపులు చేయాలని మధ్యంతర ఆదేశాల్లో పేర్కొన్నారు. తర్వాత గుత్తేదారులకు ఎక్కువ చెల్లించినట్లు తేలితే మిగిలిన చెల్లింపుల నుంచి లేదా సెక్యూరిటీ డిపాజిట్లు, బ్యాంకు గ్యారంటీల నుంచి వసూలు చేయాలని తెలిపారు. కానీ, ఈ ఆదేశాలు (మిగతా 2లో)

ఉత్కంఠ మధ్య అహ్మద్ పటేల్ గెలుపు



గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో అర్ధరాత్రి హైడ్రామా

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు రద్దు

ఫిర్యాదుల మేరకు ఈసీ నిర్ణయం

వివాదాల మధ్యే ఓట్ల లెక్కింపు -12లో



వానరకం!



ఇది నీ సమస్య, నా సమస్య. ఊళ్లో వాళ్లందరూ ఎదుర్కొంటున్న తలపోటు. పల్లె, పట్నం, నగరం అనుభవిస్తున్న ప్రత్యక్ష నరకం. తలుపులు బార్లా తెరవనివ్వదు. వంటింటి గిన్నెల్లో ఆహారాన్ని ఉండనివ్వదు. పెరట్లో మొక్కలు పెంచుకోనివ్వదు. ఇంటి పైకప్పులపై పెంకుల్ని ఉండనివ్వదు. దుకాణదారుణ్ని వ్యాపారం చేసుకోనివ్వదు. రోడ్డుపై నిర్భయంగా నడవనివ్వదు. బాటసారి చేతి సంచిని లాక్కెళ్లి చెట్టెక్కి కూర్చుంటుంది. బతిమాలినా, బామాలినా దిగకుండా చుక్కలు చూపిస్తుంది. ఏదో ఒక తిండిని ఇస్తే కానీ సంచిని కిందికి వదలదు. లేదంటే దాన్ని చిందరవందర చేసి పడేస్తుంది. దేవుడి దర్శనం చేసుకుని గుడి ఆవరణలో స్థిమితంగా కూర్చుందామనుకుంటే కళ్లజోడో, పర్సో లాక్కెళ్లిపోతుంది. పొలాల్లో పండిన పంటల్ని విచ్చలవిడిగా ఆరగిస్తుంది, లేదా వాటిని సర్వనాశనం చేసేస్తుంది. బెదిరిద్దామని వెళ్లిన వ్యక్తిని ఒళ్లు గగుర్పొడిచేలా భయపెడుతుంది. గాయాలపాల్జేస్తుంది. మర్కట మూక సృష్టిస్తున్న ఆగడాలివి. మనిషి ఎదుర్కొంటున్న 'వానర'కం ఇది!! అడవుల్లో ఆహారం దొరక్క.. ఊళ్లపై పడి ప్రజల్ని తీవ్ర భయకంపితుల్ని చేస్తున్న మర్కట గుంపులు ఊళ్లలో 'దాదాగిరి' చేస్తున్నాయి. ఇంతమందిని ఇబ్బంది పెడుతున్న కోతుల సమస్యకు కారణాలేంటి? వనాల్లో ఉండాల్సినవి జనాల్లోకెందుకు వస్తున్నాయి? వీటివల్ల ఏర్పడుతున్న సమస్యలేమిటి? -11లో

రాజధానికి కొత్త రవాణా సౌకర్యం

జనవరి 3 నుంచి మెట్రో పరుగులు!

- ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం
- రెండు కారిడార్లలో మొదలు -6లో
- నాగోలు నుంచి బేగంపేట వరకు
- మియాపూర్ నుంచి అమీర్‌పేట వరకు..



రాజ్యసభలో రగడ..

కొత్తనోట్ల వివాదం

- రూ.500, 2వేల నోట్ల పరిమాణాల్లో తేడాలున్నాయంటూ కాంగ్రెస్ ఆందోళన
- సభా కార్యకలాపాలను అడ్డుకున్న ఆ పార్టీ సభ్యులు

-12లో



సుప్రీంకోర్టు కొత్త సీజేఐగా జస్టిస్ దీపక్‌మిశ్ర

ఇదీ సంగతి!



తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీలకు పచ్చజెండా

- ఉమ్మడి ప్రభుత్వాల ఉత్తర్వులు జారీ
- భార్యాభర్తలు, స్థానిక, రాష్ట్ర కేడర్లలో పరస్పర బదిలీలు
- నెల రోజుల గడువు
- రెండు నెలల్లో ఉత్తర్వులు

ఈనాడు - హైదరాబాద్

ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లాలనుకుంటున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగులకు ఇది తీపికబురు. రెండు రాష్ట్రాల మధ్య (అంతరరాష్ట్ర) బదిలీలకు అనుమతిస్తూ, దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మంగళవారం జారీ చేశాయి. భార్యాభర్తల బదిలీలు, స్థానిక (జిల్లా, జోనల్, బహుళ జోనల్), కేంద్రం ఆమోదం పొందిన రాష్ట్రస్థాయి కేటగిరీల్లో పరస్పర బదిలీలకు అనుమతి లభించింది. ప్రభుత్వ శాఖలతోపాటు స్థానిక సంస్థల ఉద్యోగులకు సైతం ఇవి వర్తిస్తాయి. రెండు రాష్ట్రాల్లో ఇప్పటికే 5 వేల మందికి పైగా బదిలీల కోసం దరఖాస్తు చేసుకోగా, కొత్తగా వాటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల విభజన సందర్భంగా కమలనాథన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల విభజన జరిగింది. 58,42 శాతం దామాషాలో కేటాయింపులు జరిపారు. ఈ సందర్భంగా (మిగతా 2లో)

ప్రజలకు దగ్గరగానే ఉంటా

- నమ్మిన సిద్ధాంతాల వల్లే స్వచ్ఛంగా ఉండగలిగా
- నాకు ఆదర్శం వల్లభ్‌భాయ్.. నేను ఆరాధించే వ్యక్తి రామోజీరావు
- 'అలుపెరుగని గళం.. విరామమెరుగని పయనం' సంకలనాల ఆవిష్కరణ సభలో వెంకయ్యనాయుడు
- రాష్ట్రపతిగానూ వెంకయ్య సేవలందించాలి : రామోజీరావు



వెంకయ్యనాయుడు ప్రసంగాలు, రచనల సంకలనం 'అలుపెరుగని గళం.. విరామమెరుగని పయనం' పుస్తకాలను ఆవిష్కరించి ఎమెస్కో విజయ్‌కుమార్‌కు అందజేస్తున్న రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు. చిత్రంలో తెలంగాణ, ఏపీ సభాపతులు మధుసూదనాచారి, కోడెల శివప్రసాదరావు, ప్రముఖ విశ్లేషకులు గురుమూర్తి, భాజపా తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు - హైదరాబాద్

ఉపరాష్ట్రపతి అయితే ప్రజలకు దూరం కావాల్సి వస్తుందని కొందరు అంటున్నారని, కానీ తనకు ఏ బాధ్యత అప్పగించినా ప్రజలకు దగ్గరగానే ఉంటానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతిగా ప్రజలకేం చేయాలో అన్నీ చేస్తానన్నారు. బహుశా ఇదే తన ఆఖరి ప్రసంగం కావచ్చన్నారు. తనకు ఆదర్శం వల్లభ్‌భాయ్ పటేల్ అని.. తాను అమితంగా ఆరాధించే వ్యక్తి రామోజీరావు అని తెలిపారు. వెంకయ్యనాయుడు ప్రసంగాలు, రచనల సంకలనాలతో ఎమెస్కో ప్రచురించిన 'అలుపెరుగని గళం.. విరామమెరుగని పయనం' గ్రంథాలను హైదరాబాద్ సైబర్ సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'కొన్ని రోజుల తర్వాత వెంకయ్య ప్రసంగాలకు ఎక్కువ అవకాశం ఉండదని జైట్లీ అన్నారు. ఎలాంటి బాధ్యత అయినా.. ప్రజలకు ఎలా దగ్గరగా ఉండాలో వెంకయ్యనాయుడుకు తెలుసని ప్రధాని మోదీ అన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిగా ఉంటే జైలు జీవితం అనుభవించినట్లేనని కొందరు సరదాగా అంటున్నారు. అయినా దేశ ప్రజలతో ఉన్నత ఆలోచనల్ని పంచుకోవడానికి ప్రయత్నిస్తా. ఇందిరాగాంధీ పుణ్యాన ఎమర్జెన్సీ సమయంలోనే జైలు జీవితం అనుభవమైంది. దాన్నే సోపానంగా మలుచుకొని ఇంత ఎత్తుకు ఎదిగాను. మనిషి ఏ స్థాయికి ఎదిగినా కన్నతల్లి, పుట్టిన ఊరు, మాతృభాష, మాతృదేశాన్ని మరిచిపోతే మనిషే కాదు. రామోజీరావు కూడా పెదపారుపూడి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు. అమ్మా అంటే అంతరాలంలో నుంచి వస్తుంది.. మమ్మీ అంటే అలా రాదు. కానీ దురదృష్టవశాత్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆంగ్లానికే ప్రాధాన్యమిస్తున్నారు.

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నా

నాకు నేపథ్యం లేకున్నా నమ్మిన సిద్ధాంతానికే కట్టుబడి ఉన్నా. శాసనసభ్యునిగా ఉన్నప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య, నేను ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలు తీసుకోలేదు. ఎంపీగా ఉన్నప్పుడు బెంగళూరులో ఇల్లు ఇచ్చినా తిరస్కరించాను. ఇంత ఆదర్శంగా ఉన్నా.. రాజకీయాల్లో ఉన్నందుకు ఒక్కోసారి ఆరోపణలు ఎదుర్కోవలసి రావడం బాధ కలిగిస్తోంది. నా కుమారుడి డీలర్‌షిప్ విషయంలో, స్వర్ణ భారతి ట్రస్ట్‌కు నోటీసుల విషయంలో అనవసర రాద్ధాంతం చేయడం బాధ కలిగించింది. రాజకీయాల్లో ఇంత దిగజారుడుతనం ఉంటుందా అనిపించింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతాలను వదలకపోవడం వల్లే స్వచ్ఛంగా ఉండగలిగాను. వారసత్వం లేకపోయినా జవసత్వాలపై ఆధారపడి పైకి వచ్చాను. కష్టపడే మనస్తత్వం అలవర్చుకోవాలి. చిన్నప్పుడు ఆరు కి.మీ.లు నడిచి బడికెళ్లా. ఆర్‌ఎస్‌ఎస్, విద్యార్థి పరిషత్‌తో అనుబంధం నా జీవితాన్ని మలుపు తిప్పింది. సంఘ్‌లో గోగా దుర్గాప్రసాద్, సోంపల్లి సోమయ్య నాకు గురువులు. వారి వల్లే ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నా. వారసత్వ రాజకీయాలకు నేను వ్యతిరేకం. అందుకే నా కుటుంబసభ్యులెవరినీ రాజకీయాల్లోకి రానివ్వలేదు. నేను రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత వారిష్టం.

ఆశించకుండానే అన్ని పదవులు వరించాయి

నా చిన్నప్పుడే మా అమ్మ చనిపోయింది. ఆమె స్మృతిపథంలో కూడా లేదు. పార్టీనే నన్ను అమ్మలాగా పోషించింది. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైనట్లు ప్రకటించగానే మంత్రి పదవి పోతుందని కొందరు నాపై సానుభూతి ప్రకటించారు. కానీ నేనే నాడు పదవులు ఆశించలేదు. వాటంతట అవే నన్ను వరించాయి. వాజ్‌పేయి హయాంలో మంత్రి పదవినే కాలదన్ని పార్టీ పదవి స్వీకరించాను. 2019లో మోదీ మరోసారి ప్రధాని అయ్యాక రాజకీయాలు వదిలేద్దామనుకున్నా. కానీ ఆయనే వారించి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేశారు.

ఉత్తమమైన వ్యక్తి రామోజీరావు

తెలుగు రచనలతో ప్రజల్లో చైతన్యం కలిగించిన వ్యక్తి రామోజీరావు. తెలుగువారికి ఆయనో ఐకాన్. నా పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించడం నా అదృష్టం. జర్నలిజంలో ఆనాటి తరానికి రాంనాథ్ గోయెంకా గొప్పవారు. ఈ తరానికి అంతే గొప్పవాడైన రామోజీరావు తెలుగువారు కావడం గర్వకారణం. నిజాన్ని నిర్భీతిగా, నిస్సంకోచంగా, అనుకున్నది అనుకున్నట్లు రాయడం ఆయనకే చెల్లింది. బలవంతులను కూడా ఎలా ఎదుర్కోవాలో అలా ఎదుర్కొన్నారు. అందరికన్నా ఉత్తమమైన వ్యక్తి ఆయన అనడంలో సందేహం లేదు.

ఎన్టీఆర్‌కు వెన్నుపోటుపై ఉద్యమించా

జైఆంధ్ర ఉద్యమంతో పాటు 1980 దశకంలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడు ఉద్యమించా. ఆ సమయంలో ఎన్టీఆర్‌తో కలిసి పనిచేయాలని చాలామంది నన్ను అడిగారు. కానీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పోరాడాను తప్ప పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశా. ఎన్టీఆర్‌కు నాయకులు పాదాభివందనం చేస్తుంటే చూసి వద్దన్నాను. అది వారి అభిమానం అని ఎన్టీఆర్ చెప్పారు. కానీ ఆరు నెలలు తిరగక ముందే పాదాభివందనం చేసిన నాయకులే ఎన్టీఆర్ కాళ్లు పట్టి లాగారు' అని గుర్తుచేసుకున్నారు.

భాషే ఆయుధంగా...

తెలంగాణ శాసనసభాపతి మధుసూదనచారి మాట్లాడుతూ 'భాషను ఆయుధంగా చేసుకొని సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల్లో వెంకయ్యనాయుడు, కేసీఆర్ ముందువరుసలో ఉంటారు. కసి, కృషికి నిదర్శనం వెంకయ్యనాయుడు. గొప్ప ఆలోచన శక్తి కలిగిన ఆయన చట్టసభల్లో శాశ్వతంగా ఉండాల్సిన వ్యక్తి. సాధారణ కుటుంబం నుంచి స్వీయ ప్రతిభతో ఉన్నత స్థాయికి ఎదిగిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకం' అని ప్రశంసించారు.

ఈ గ్రంథం ఓ నిఘంటువు లాంటిది

ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ 'వెంకయ్యనాయుడితో 30 ఏళ్ల పరిచయం ఉంది. ఆయన ఉపన్యాసాల్లో విషయంతో పాటు భాష, హాస్యం, చురకలు ఉంటాయి. ఆయన ఏనాడూ భాష పరిమితి దాటి ప్రసంగించిన సందర్భాలు లేవు. వెంకయ్యనాయుడు ఏ పదవిలో ఉన్నా ఆ పదవి నియమనిబంధనలు, సంప్రదాయాలు దాటకుండా, చొరవ, శక్తి, ఉత్సాహాన్ని దేశానికి అందించాలి. ఆయన రచన, ప్రసంగాలు, ఆచరించిన విషయాలను గ్రంథ రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయం. భవిష్యత్తు తరాలకు ఈ గ్రంథం ఒక ప్రామాణికం, ఒక నిఘంటువు లాంటిది. ఆయన ప్రసంగాల నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంటుంది' అన్నారు. రాజకీయ విశ్లేషకుడు ఎస్.గురుమూర్తి మాట్లాడుతూ 'రాజకీయాల్లో క్రియాశీలంగా వ్యవహరించిన వెంకయ్యనాయుడు పార్టీ నిర్ణయాన్ని గౌరవించి ఉపరాష్ట్రపతిగా వెళ్లేందుకు అంగీకరించడం అభినందనీయం. వెంకయ్య చేసిన ప్రసంగాలు, రచనలతో కూడిన గ్రంథాలు రాజకీయ నాయకులకు విశ్వవిద్యాలయం లాంటివి' అన్నారు.

వెంకయ్య మాట మకరందం.. మనసు మంచి గంధం: రామోజీరావు

వెంకయ్యనాయుడి మాట మకరందం.. మనసు మంచి గంధం అంటూ కితాబిచ్చారు రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు. 'వెంకయ్యనాయుడు రచనలతో పాటు పలు వేదికలపై ఆయన చేసిన అమూల్య ప్రసంగాల సంకలనాల్ని విడుదల చేసే అవకాశం నాకు దక్కడం చాలా ఆనందంగా ఉంది. నమ్మిన సిద్ధాంతానికి జీవితాంతం కట్టుబడిన ఆదర్శ నాయకుడతను. సేవాభావం, కర్తవ్య నిష్ఠ కలగలిసిన విశిష్ట వ్యక్తిత్వం ఆయన సొంతం. తెలుగువారి ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో వెంకయ్యనాయుడుది ప్రత్యేక స్థానం. దాదాపు అయిదు దశాబ్దాల క్రితం విద్యార్థి నేతగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి నేడు దేశ రాజకీయాల్లో అతి కీలక వ్యక్తుల్లో ఒకరిగా అగ్రస్థానానికి చేరారు. ఒక ప్రజా నాయకునిగా క్రియాశీల రాజకీయాల్లో ఆయన పయనానికి విరామం ఉండదని నమ్మిన అసంఖ్యాక ప్రజల్లో నేనూ ఒకణ్ని. సభికుల్ని అలరించేలా, ఆలోచింపజేసేలా మాట్లాడటం అంటే మాటలు కాదు. అనర్గళంగా ఉపన్యసించడమే కాదు, అందులో ఆహ్లాదపరిచే ఛలోక్తులూ, భావగంభీరత, లోతైన విషయ పరిజ్ఞానం నిండుగా ఉండాలి. వాటన్నింటి కలబోతే వెంకయ్యనాయుడి ప్రసంగాలు. తన ఆలోచనల్ని సూటిగా, సరళంగా జనవాహిని మెచ్చేలా ఆవిష్కరించగల మాటల మాంత్రికుడాయన. మాటలతో మనసుల్ని గెలుచుకొనే త్రిభాషా మంత్రం ఆయనకు కొట్టిన పిండి. తెలుగులో మాట్లాడినంత అనర్గళంగానే హిందీ, ఇంగ్లీషు భాషల్లోనూ మాట్లాడగలరు. శబ్దార్థ చమత్కారాలతో, అంత్యప్రాసలతో సాగే ఆయన ప్రసంగాలను మెచ్చుకోనివారుండరు. ప్రవాహంలా సాగే ఆయన వాగ్ధాటిని విని ఆనందించే అదృష్టం దేశ ప్రజలకు ఇక అరుదుగానే లభించనుంది. అయితే ఉపరాష్ట్రపతిగా దేశానికి సేవలందించే భాగ్యం ఆయనకు దక్కడం ఆయనకే కాదు తెలుగు ప్రజలందరికీ లభించిన అరుదైన గౌరవం. ఇప్పటివరకు ఆయన నిర్వహించిన పదవులన్నిటికీ వన్నె తెచ్చారు. ఉపరాష్ట్రపతిగానూ అందరి మన్ననలు పొందుతారని గట్టిగా నమ్ముతున్నాను. రాజ్యసభ ఛైర్మన్‌గా ఆయన సభను హుందాతనంతో నిర్వహిస్తారని, రాజ్యాంగ బాధ్యతల నిర్వహణలో ఉన్నత ప్రమాణాలు పాటించి తన ప్రతిభాపాటవాలు చాటుతారని ఆశిస్తున్నాను. ఆయన ఎంతటి ఉన్నత పదవుల్ని అధిష్ఠించినా, మరెంత ఎత్తుకు ఎదిగినా తెలుగువారి మనసులకెప్పుడూ దగ్గరగానే ఉంటారు. నిజాయతీ, నిబద్ధత, చొరవ, కార్యదక్షతలే జీవలక్షణాలుగా ఎదిగిన వెంకయ్యనాయుడు రానున్న కాలంలో భారత రాష్ట్రపతిగానూ దేశానికి సేవలందిస్తారని విశ్వసిస్తున్నాను' అని రామోజీరావు అభిప్రాయపడ్డారు.

తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీలకు పచ్చజెండా

(మొదటి పేజీ తరువాయి)

కొంతమందికి ఇష్టం లేకపోయినా మరో రాష్ట్రానికి వెళ్లారు. కొందరు భర్తలు ఒక రాష్ట్రంలో ఉండగా, భార్యలు మరో రాష్ట్రంలో పని చేస్తున్నారు. దీంతోపాటు వివిధ కారణాల వల్ల హైదరాబాద్‌లో పని చేయాలని ఎక్కువమంది కోరుకుంటున్నారు. ఈ కారణాలతో చాలామంది ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీలను కోరారు. దీనిపై గవర్నర్ నరసింహన్ నేతృత్వంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఇద్దరు అంతర రాష్ట్ర బదిలీలకు ఆమోదం తెలిపారు. దీనికి అనుగుణంగా ఇద్దరు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు సమావేశమై మార్గదర్శకాలను రూపొందించారు. వాటిని తాజాగా విడుదల చేశారు.

నెల రోజుల్లోపు దరఖాస్తు

బదిలీలు కోరే వారు తమ ఉన్నతాధికారుల ద్వారా శాఖాధిపతికి నెలరోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత శాఖలు రెండు నెలల్లోగా ఉత్తర్వులు జారీ చేయాలి.

- నిర్దేశిత నమూనాలో ఉద్యోగులు దరఖాస్తు పత్రం నింపాలి. వాటిపై తమ శాఖ కార్యదర్శి, ముఖ్యకార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంతకం చేయాలి.
- వ్యక్తిగత, వైద్యపరమైన కారణాలతో బదిలీని కోరేవారు దానిని దరఖాస్తులో పేర్కొనాలి.

ఒకేసారి అవకాశం

- ఒక ఉద్యోగికి మొత్తం సర్వీసులో ఒకేసారి అంతరరాష్ట్ర బదిలీకి అవకాశం ఉంటుంది.
- కోరుకునే స్థానం ఖాళీగా ఉంటేనే బదిలీ చేస్తారు.
- రాష్ట్ర, జోనల్, బహుళ జోనల్, జిల్లా కేడర్‌లోని ఉద్యోగులకు అవే కేడర్‌కి బదిలీలుంటాయి.
- భార్యాభర్తల కేటగిరీలో బదిలీని కోరే సమయంలో.. వారి భర్త లేదా భార్య ఆ రాష్ట్రంలో స్థానికులై ఉండాలి. పరస్పర బదిలీలకు సైతం ఈ నిబంధన వర్తిస్తుంది.
- బదిలీ అయిన వారికి సీనియారిటీలో చివరి స్థానం ఉంటుంది. ప్రస్తుతం తీసుకుంటున్న జీతభత్యాలనే కల్పిస్తారు.
- బదిలీ అయిన వారికి టీఏ, డీఏలుండవు.
- ప్రభుత్వ శాఖలతో పాటు జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, పురపాలక సంఘాలకు ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయి.

ఉపాధ్యాయులకు..

- బదిలీ అయ్యే ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న యాజమాన్యం, కేటగిరీ, సబ్జెక్టు కిందే చేరాలి.
- బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను ఆయా శాఖలు తమ తమ రాష్ట్రాల్లోని సాధారణ పరిపాలన శాఖకు పంపించాలి. వాటిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు పంపాలి. రెండు ప్రభుత్వాల ఆమోదం అనంతరం ఉత్తర్వులు జారీ అవుతాయి.
- తెలంగాణ నుంచి ఏపీ వెళ్లడానికి 1955 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 547 పరస్పరం, 176 మంది భార్యాభర్తల కేటగిరీ, 1452 వ్యక్తిగత కారణాలపై ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు.

ఉద్యోగ, అధికారుల సంఘాల హర్షం..

పరస్పర బదిలీలకు మార్గదర్శకాలు జారీ కావడంపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, ఉద్యోగుల సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. దీని వల్ల ఏపీలో ఉన్న తెలంగాణ ఉద్యోగులు స్వరాష్ట్రానికి వచ్చేందుకు అవకాశం ఏర్పడిందని టీజీవోల ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, అధ్యక్షురాలు మమత, కార్యదర్శి సత్యనారాయణలు తెలిపారు. స్వరాష్ట్రం వస్తున్న వారికి వెసులుబాట్లు కల్పించాలనీ, తెలంగాణ నుంచి ఏపీ వెళ్లే వారందరికీ ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించాలని వారు కోరారు. స్వరాష్ట్రం వెళ్లేందుకు పోలీసు అధికారులకు సైతం అనుమతివ్వాలన్నారు. ఉమ్మడి ఏపీలో మాదిరిగా కాకుండా పారదర్శకంగా బదిలీలు జరగాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి సూచించారు.



మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మూడు చింతలపల్లి గ్రామసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

పంచాయతీలుగా తండాలు

- వచ్చే ఎన్నికల్లోగా ప్రక్రియ పూర్తి చేస్తాం
- బంగారు తెలంగాణ.. అందరి బాధ్యత
- మూడుచింతలపల్లి గ్రామసభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- శామీర్‌పేట మండల అభివృద్ధికి రూ.120 కోట్లు మంజూరు

శామీర్‌పేట, న్యూస్‌టుడే: కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం మూడుచింతలపల్లిలో మంగళవారం జరిగిన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. శామీర్‌పేట మండల సమగ్ర అభివృద్ధికి రూ.120 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. తొలి విడత తెలంగాణ ఉద్యమంలో మేడ్చల్ నుంచి మర్రి చెన్నారెడ్డికి కుడి భుజంలా నిలిచిన వెంకట్రామిరెడ్డి, కామిడి వీరారెడ్డిల జ్ఞాపకార్థం మూడుచింతలపల్లికి వచ్చినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. 14 గ్రామాల కూడలిగా ఉన్న మూడుచింతలపల్లిలో వీరారెడ్డి పేరిట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వారం రోజుల్లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి దానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

నిధులకు కొరత లేదు

రాష్ట్రంలో 84 లక్షల గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటికే 10 లక్షల జీవాలను అందించినట్లు కేసీఆర్ వెల్లడించారు. లింగాపూర్ తండాను పంచాయతీగా మార్చాలని మూడుచింతలపల్లి సర్పంచి పద్మ సీఎంను కోరగా.. వచ్చే ఎన్నికల్లోపు రాష్ట్రంలోని అన్ని గిరిజన తండాలను పంచాయతీలుగా మారుస్తామన్నారు. రాష్ట్రంలో నిధుల కొరత లేదని, మూడేళ్లలోనే సొంత ఆదాయం కలిగిన రాష్ట్రంగా వృద్ధి సాధించామని తెలిపారు. గతంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళుతుంటే శామీర్‌పేట చెరువు నీరు లేకుండా కనిపించేదని.. అలాంటి పరిస్థితి ఉండకూడదనే 'మిషన్ కాకతీయ' పథకం ప్రవేశపెట్టామని చెప్పారు. మ్యుటేషన్ పత్రాల కోసం ఇకపై ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా కొరియర్ ద్వారా నేరుగా ఇంటికే వచ్చేలా సంస్కరణలు తీసుకొస్తున్నామన్నారు. మూడుచింతలపల్లిలో 600 ఇళ్లు ఉన్నాయని, ఆరు కంటే ఎక్కువ మొక్కలు పెంచుకున్న ఇంటికి రెండు పాడి పశువులు బహుమతిగా ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. మూడుచింతలపల్లికి 50 రెండు పడక గదుల ఇళ్లు, లింగాపూర్ తండాకు మరో 50 కేటాయిస్తామని చెప్పారు.

374 చెరువులకు నీరు..

పాములపర్తి నుంచి గోదావరి నీళ్లను కాలువల ద్వారా తరలించి లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి గ్రామాల చెరువులను వచ్చే ఏడాదిలోపు నింపుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. శామీర్‌పేట చెరువుతో పాటు 374 చెరువులను గోదావరి నీటితో నింపి 75వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

కేశవరంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ భూమిపూజ చేశారు. లక్ష్మాపూర్‌లో రూ.75 లక్షలతో నిర్మించే సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడుచింతలపల్లి చౌరస్తాలోని కామిడి వీరారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 'మేడ్చల్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ మల్లారెడ్డిలు ముఖ్యమంత్రి వస్తున్నారని ప్రజలను పురమాయించి నిధులు అడిగిస్తున్నారని' కేసీఆర్ చమత్కరించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన కలెక్టర్ ఉండడం జిల్లా ప్రజల అదృష్టమంటూ కలెక్టర్ ఎంవీరెడ్డిని ముఖ్యమంత్రి అభినందించారు.



రూ.15 కోట్ల ప్రతిపాదనలు..

మూడుచింతలపల్లిలో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులు రూ.15కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేశారు. సర్పంచి పద్మ ఆ నివేదికను సీఎంకు అందించగా ఆయన నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ బస్సులు, మినీ స్టేడియం ఏర్పాటు అంశాలు పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. గ్రామానికి 100కేవీ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని గ్రామస్థులు కోరగా.. అక్కడికక్కడే మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం మరో రెండు ఇస్తారని సీఎం తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పి.మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, వివేక్‌గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల విరమణను ఉల్లంఘిస్తున్నారు

భారత్‌పై పాక్ ఆరోపణ

ఇస్లామాబాద్: భారత సైన్యం వాస్తవాధీన రేఖ వెంబడి కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపిస్తూ భారత డిప్యూటీ హైకమిషనర్‌కు పాకిస్థాన్ సమన్లు జారీ చేసింది. దక్షిణాసియా, సార్క్ దేశాల డైరెక్టర్ జనరల్ డా.మహ్మద్ ఫైజల్ భారత డిప్యూటీ హైకమిషనర్ జేపీ సింగ్‌కు సమన్లు జారీ చేసి భారత సైన్యం చర్యను ఖండించారని పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం తెలిపింది. ఉద్దేశపూర్వకంగా పౌరులే లక్ష్యంగా కాల్పులకు తెగబడటం అంతర్జాతీయ మానవ హక్కులను, మానవ చట్టాలను ఉల్లఘించడమేనని పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం భారత్‌ను విమర్శించింది.

జీఎస్టీకి అదనపు చెల్లింపులు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసిన తర్వాత జీఎస్టీని 18 నుంచి 12 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకొన్నందున గుత్తేదారులకు అదనంగా చెల్లించే మొత్తాన్ని ఐదు శాతానికి పరిమితం చేయాలని నిర్ణయం తీసుకొన్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ఆదేశాలు రావలసి ఉంది. ఈ నిర్ణయంతో గుత్తేదారులు ఏకీభవించడం లేదని సమాచారం. గతంలో వ్యాట్ ఐదు శాతం ఉన్నందున దీనికి మించి ఎంత శాతం పెరిగితే అంత మొత్తం అదనంగా చెల్లించాలని కోరుతున్నారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఎంత వస్తుందో నిర్ణయించి మిగిలిన మొత్తాన్నే ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందని వాణిజ్య పన్నులశాఖ అధికారులు పేర్కొంటుండగా.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌తో సంబంధం లేదని, జీఎస్టీ వల్ల పెరిగిన అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించాలని గుత్తేదారులు కోరుతున్నట్లు తెలిసింది. దీనిపై చర్చలు జరుగుతున్నాయి.

పునరుజ్జీవానికి పునాది

(మొదటి పేజీ తరువాయి)

తగ్గడం, ఎగువన కొత్త ప్రాజెక్టుల నిర్మాణం కారణంగా అవసరానికి, నీటి లభ్యతకు మధ్య 60 టీఎంసీల వ్యత్యాసం ఉన్నట్లు తేలిందని నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి నివేదించింది. దీంతో కాళేశ్వరం ద్వారా నీటిని మళ్లించడంతోపాటు మరో రూ.863 కోట్లు ఖర్చుచేసి కాలువలను ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పోచంపాడు సభ చరిత్ర సృష్టించాలి

పోచంపాడులో గురువారం నిర్వహించనున్న ఎస్సారెస్పీ పునరుజ్జీవన సభ చరిత్ర సృష్టించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షించారు. ఐదు లక్షల కంటే ఎక్కువ మందిని సమీకరించాలని ఆదేశించారు. సభ నిర్వహణపై మంగళవారం రాత్రి ఆయన ప్రగతిభవన్‌లో పార్టీ ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం నీటిపారుదల రంగంలో విప్లవాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచిపోతుందని తెలిపారు. బహిరంగ సభకు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు జనసమీకరణ బాధ్యతలు చేపట్టాలని కేసీఆర్ సూచించారు. సభకు ఆరు వేల బస్సులతో పాటు ఇతర వాహనాల్లో జనసమీకరణ చేస్తున్నట్లుగా పార్టీ నేతలు సీఎంకు చెప్పారు. బుధవారం రాత్రికే కేసీఆర్ పోచంపాడు చేరుకోనున్నారు.

ఇద్దరికి ఉచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

సినీప్రముఖులతో పాటు మరో 27మంది ఇతరులను సిట్ విచారించింది. కెల్విన్ ద్వారా వీరు మత్తుమందులు పొందుతున్నట్లు ఆబ్కారీ అధికారులు గుర్తించడంతో దానిపై లోతుగా విచారణలు కొనసాగించారు. విచారణ ప్రక్రియ మొత్తం వీడియోలో చిత్రీకరించారు. మత్తుమందుల సరఫరా, వాడకంలో వీరి పాత్ర ఏమిటన్నది తెలుసుకునేందుకు ప్రయత్నించారు. విచారణ సందర్భంగా చిత్రీకరించిన వీడియోలను ఇప్పుడు అధ్యయనం చేస్తూ ఎవరెవరు ఏ స్థాయిలో ఈ మత్తుమందుల వ్యవహారంలో కూరుకొని పోయారన్నది అంచనా వేస్తున్నారు. దాదాపు 60గంటల వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. ఈ ప్రక్రియ పూర్తికావచ్చింది. విచారణకు హాజరైనవారిలో చాలామంది తమ గురించే కాకుండా తమకు తెలిసిన ఇతర విషయాల గురించి వివరించారు.

ఒక సినీప్రముఖుడు మత్తుమందులు వాడుతున్న 53మంది పేర్లు వెల్లడించినట్లు సమాచారం. అలానే మిగతా నటులూ పలువురి పేర్లు ప్రస్తావించారు. వీరందరూ వేర్వేరుగా పేర్లు చెప్పినప్పటికీ ఒకట్రెండు పేర్లు మాత్రం అందరి జాబితాలోనూ ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో వారిపై ఇప్పుడు సిట్ అధికారులు ఉచ్చు బిగించబోతున్నారు. మత్తుమందులు రవాణా చేయడం, వాడటం రెండూ నేరమే. వాడుతున్నట్లు నిరూపణ అయితే అరెస్టు చేయడానికి అవకాశముందని అధికారులే చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం సిట్ అధికారులు విచారించిన 12మంది సినీప్రముఖుల్లో ఇద్దరిపై తీవ్రమైన అభియోగాలున్నాయని, వారి విషయంలో కఠినంగానే వ్యవహరించాలని, అవసరమైతే కేసులు నమోదు చేయాలని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణకు హాజరైనవారిలో కొందరి నుంచి గోళ్ళు, వెంట్రుకలు, రక్తం నమూనాలు సేకరించారు. మత్తుమందులు వాడుతున్నారా? లేదా? అన్నది నిర్ధారించేందుకు వీటిని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపారు. కొందరు నమూనాలు ఇస్తామన్నా అధికారులు తీసుకోలేదు. కొందరు నిరాకరించారు. నిరాకరించిన వారిలో ఒకరి నుంచి న్యాయస్థానం ద్వారా నమూనాలు సేకరించాలని ఆలోచిస్తున్నారు. ఇప్పటికే సేకరించిన నమూనాల విశ్లేషణ కొద్దిరోజుల్లో పూర్తికానుంది. ఈ నివేదికలు వచ్చిన తర్వాత తగిన నిర్ణయం తీసుకోబోతున్నారు.

గ్రహం అనుగ్రహం

9-8-2017 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
విదియ: రా. 11-52 తదుపరి తదియ
శతభిషం నక్షత్రం: పూర్తి
అమృతఘడియలు: రా. 10-37 నుంచి 12-17 వరకు
వర్జ్యం: మ. 12-41 నుంచి 2-20 వరకు
దుర్ముహూర్తం: మ. 11-41 నుంచి 12-31 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-44; సూర్యాస్తమయం: సా.6-27

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	22.6	29.5
నిజామాబాద్	24.0	30.0
కరీంనగర్	24.0	31.5
మహబూబ్‌నగర్	24.5	33.5
రామగుండం	24.6	30.2
హైదరాబాద్	24.6	32.8
హన్మకొండ	25.0	29.0
ఖమ్మం	25.0	32.0
సూర్యాపేట	25.0	35.5

ప్రపంచ పారిశ్రామిక సదస్సుకు కేటీఆర్

అమెరికా-భారత వాణిజ్య మండలి ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: అమెరికా, భారత వాణిజ్య మండలి ఆధ్వర్యంలో వచ్చే నెల 12న వాషింగ్టన్‌లో జరిగే ప్రపంచ పారిశ్రామిక సదస్సుకు హాజరుకావాలని తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. వాణిజ్య మండలి ఉపాధ్యక్షుడు ఎమి హరియాని మంత్రికి లేఖ రాశారు. అమెరికా, భారత్‌తోపాటు ఇతర దేశాల నుంచి ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొంటారు. అమెరికా-భారత్‌ల మధ్య వాణిజ్య పురోగతి తదితర అంశాలపై ఇందులో చర్చిస్తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్, విదేశాంగ మంత్రి రెక్స్‌టిల్లర్‌సన్ ఇందులో ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన అంశాలపై ప్రసంగించాలని హరియాని కేటీఆర్‌ను తమ లేఖలో కోరారు.

నేరెళ్ల బాధితులకు అండగా నిలుస్తాం

- రాజకీయ లబ్ధికోసమే ప్రతిపక్షాల ఆరోపణలు
- పోలీసుల అత్యుత్సాహంపై చర్యలు: మంత్రి కేటీఆర్


బాధితులను పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

వేములవాడ, న్యూస్‌టుడే : నేరెళ్ల బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. వేములవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఆయన మంగళవారం పరామర్శించారు. గంటకు పైగా బాధితులతో మాట్లాడారు. వారి ఆరోగ్యం గురించి వైద్యులనడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక ఎమ్మెల్యే నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నేరెళ్లలో జరిగిన ఘటన చాలా బాధాకరం, దురదృష్టకరమన్నారు. క్షణికావేశంలో స్థానికులు లారీలను తగులపెట్టడం, పోలీసులు కేసులు పెట్టడం జరిగాయన్నారు. ప్రతిపక్షాలు నేరెళ్ల ఘటనతో రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నాయని.. తనకు, నియోజకవర్గ ప్రజలకు మధ్య విబేధాలు సృష్టించాలని ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఇసుక మాఫియా అని మాట్లాడుతున్న వారు గత 60 సంవత్సరాల్లో ఇసుకతో వచ్చిన ఆదాయం, తెలంగాణ ఏర్పాటయ్యాక ప్రభుత్వానికి వస్తున్న ఆదాయాన్ని గమనిస్తే ఎవరిది దోపిడీయో అర్థమవుతుందన్నారు. మధ్యమానేరు జలాశయంలో నీటిని నిల్వ ఉంచేందుకు అక్కడ ఉన్న ఇసుకను తరలిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి ఆదాయం రావాలనే సదుద్దేశంతో చేసినవేనన్నారు. పోలీసులు కేసులు పెట్టారని, అందులో అన్ని వర్గాల వారున్నారని పేర్కొన్నారు. బాధితులతో మాట్లాడితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేరని, పోలీసులు తమను హింసించారని.. ఆ హక్కు వారికెక్కడిదని ప్రశ్నించారని తెలిపారు. పోలీసులపై డీఐజీ స్థాయిలో విచారణ జరుగుతుందని, బాధ్యులు ఎవరైనా చర్యలు తీసుకుంటామని చెప్పామన్నారు. వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని, హైదరాబాదుకు తరలించేందుకు తమకు అభ్యంతరం లేదన్నారు. బాధితుల తరఫున న్యాయవాదులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. పోలీసుల అత్యుత్సాహం ఉంటే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు రమేశ్‌బాబు, పుట్ట మధు, టీఎస్‌కాబ్ అధ్యక్షుడు రవీందర్‌రావు, ఉన్నారు.

గ్రామ సంఘాల సహాయకుల(వీవోఏ)కు నెలవారీ గౌరవ వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం రూ.83.17కోట్లు మంజూరు చేసింది. వీవోఏలకు తనవంతుగా నెలవారీ రూ.మూడు వేలు చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు రావటం తెలిసిందే. ప్రభుత్వ ఉత్తర్వులు ఏప్రిల్ నుంచీ అమల్లోకి వస్తాయి.

అమెజాన్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో చేనేత వస్త్రాల క్రయవిక్రయాలకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న వాణిజ్య సంస్థ ఆమెజాన్‌కు మంత్రి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి లభిస్తుందని మంగళవారం మంత్రి ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అమెజాన్, వీవర్స్ మార్ట్‌తోపాటు నిఫ్ట్‌తోనూ సోమవారం చేనేత దినోత్సవం సందర్భంగా హైటెక్స్‌లో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

నేరెళ్ల ఘటనపై సీబీఐ దర్యాప్తు చేయించాలి

ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు

ఈనాడు, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామంలో దళితులపై జరిగిన దాడి కేసును సీబీఐతో దర్యాప్తు చేయించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఉమ్మడి హైకోర్టులో మంగళవారం ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల దాడిలో గాయపడిన దళితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందజేసేలా ఆదేశాలివ్వాలని, స్థానిక న్యాయస్థానం ఆధ్వర్యంలో బాధితుల వాంగ్మూలాలను నమోదుచేసి పంపించేలా చూడాలని అందులో కోరారు. బాధితుల వైద్య చికిత్సల వివరాలను తెలుసుకోవడంతోపాటు..వారిని నిమ్స్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని, దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై కేసులు నమోదు చేసేలా ఆదేశాలివ్వాలని విన్నవించారు. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఎస్పీ, డీజీపీ, సీబీఐ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా భోజన విరామ సమయంలో విచారణ చేపట్టాలని మంగళవారం ఉదయం పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రఘునాథ్ ధర్మాసనాన్ని కోరారు. దీనికి ధర్మాసనం నిరాకరిస్తూ. .మొదట పిటిషన్ దాఖలు చేస్తే కోర్టు పరిశీలిస్తుందని చెప్పారు.

తాగునీటికి 15 టీఎంసీలివ్వండి

కర్ణాటక మంత్రికి లేఖ రాసిన హరీశ్

ఈనాడు, హైదరాబాద్: రాజధాని సహా పలు జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలంటూ కర్ణాటక నీటిపారుదల శాఖ మంత్రికి తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. శ్రీశైలంలోకి ఎలాంటి ప్రవాహం లేకపోవడం, ఆలమట్టికి వచ్చిన నీటిని మొత్తం అక్కడే నిల్వ చేయడం, తాగునీటికి తలెత్తుతున్న ఇబ్బందుల గురించి ఆ లేఖలో వివరించినట్లు తెలిసింది. నాగార్జునసాగర్ నీటిమట్టం పూర్తిగా పడిపోవడంతో హైదరాబాద్‌తోపాటు నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకొని 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని హరీశ్‌రావు కోరారు. ఇదే అంశంపై నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శికి మరో లేఖ రాశారు.

చేనేత పురస్కారాల కోసం కమిటీ

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఏడాది జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని ఉత్తమ చేనేత కార్మికులకు పురస్కారాల కోసం ఉన్నతస్థాయి ఎంపిక కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి చేనేత సంచాలకురాలు ఛైర్మన్‌గా ఉంటారు. అదనపు సంచాలకుడు, టెస్కో ఎండీ, ఇద్దరు సాంకేతిక నిపుణులు, చేనేత సేవా కేంద్రం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కమిటీలో ఉంటారు.

పునరుజ్జీవన సభకు భారీగా తరలిరండి

నిజామాబాద్ ఎంపీ కవిత పిలుపు

పోచంపాడులో ఈ నెల 10న జరిగే ఎస్సారెస్పీ పునరుజ్జీవన సభకు నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి భారీగా రైతులు, ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపీ కవిత పిలుపునిచ్చారు. జగిత్యాల శాసనసభ నియోజకవర్గ నేతలతో మంగళవారం ఆమె సమావేశమై అక్కడి నుంచి లక్ష మందిని సమీకరించాలని నిర్ణయించారు. మిగిలిన నియోజకవర్గాల నుంచి జనసమీకరణ భారీఎత్తున జరపాలని సూచించారు.

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్యం

- గైనకాలజీ, అనస్థీషియా, పిల్లల వైద్యనిపుణులకు ప్రాధాన్యం
- 'ఏడాది తప్పనిసరి' సేవల్లో భాగంగా నియామకం
- ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో వీరికి రెట్టింపు వేతనాలు
- మాతాశిశు సంరక్షణే లక్ష్యంగా భర్తీ
- ఈ ఏడాది 'తప్పనిసరి' సేవల కౌన్సెలింగ్ పూర్తి
- మొత్తంగా 870 మంది స్పెషలిస్టుల కేటాయింపు

ఈనాడు - హైదరాబాద్

మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం 'తప్పనిసరి' వైద్యుల కేటాయింపుపై దృష్టిసారించింది. ఏడాది పాటు ప్రభుత్వ వైద్యంలో తప్పనిసరిగా సేవలందించాలనే నిబంధనపై ఏటా జరుపుతున్న నియామకాల ప్రక్రియ ఇటీవలే ముగిసింది. సుమారు 650మంది పీజీ డిగ్రీ వైద్యులను,



సుమారు 220మంది పీజీ డిప్లొమా వైద్యులను మొత్తంగా 870మంది స్పెషలిస్టు వైద్యులను ఈ కేటాయింపుల్లో వేర్వేరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో భర్తీచేశారు. ఎంపిక చేసిన గ్రామీణ, మారుమూల ఆసుపత్రుల్లో సేవలందించడానికి ముందుకొచ్చే గైనకాలజిస్టులు, పిల్లల వైద్యనిపుణులు, అనస్థీషియా నిపుణులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనాన్ని రెట్టింపు చేసి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ప్రతిపాదనకు ముందుకొచ్చిన స్పెషలిస్టు వైద్యులను సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏడాది తప్పనిసరి సేవల్లో భాగంగా భర్తీచేశారు.

కేసీఆర్ కిట్‌లో భాగంగానే

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం 'కేసీఆర్ కిట్' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద పెద్దఎత్తున గర్భిణులు తమ వివరాలను నమోదు చేసుకుంటున్నారు. అందుకనుగుణంగా మానవ వనరులను నియమించాల్సిన అవసరం ఏర్పడింది. నేరుగా నియామకాలు జరిపే ప్రక్రియ ఆలస్యమవుతుండడంతో స్పెషలిస్టు వైద్యుల కోసం 'తప్పనిసరి' నియామకాలపై దృష్టిసారించారు. కాన్పుగదులను ఆధునీకరించారు. అధునాతన అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరాలను అమర్చారు. వీటిని వినియోగించుకొని సుఖప్రసవాలు జరిపేందుకు స్పెషలిస్టు వైద్యుల నియామకాలు చేపట్టారు. తక్కువ వేతనంతో గిరిజన, మారుమూల ప్రాంతాల్లో పని చేయడానికి ఎక్కువమంది వైద్యులు అనాసక్తిగా ఉండడంతో వేతనాలను పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ పనిచేసినా పీజీ తప్పనిసరి వైద్యులకు నెలకు రూ.40వేలు చెల్లిస్తున్నారు. ఈవేతనాన్ని గిరిజన ప్రాంతాల్లో చేసే స్పెషలిస్టు వైద్యులకు రెట్టింపుగా రూ.80వేలు చొప్పున చెల్లించనున్నారు. దీంతో ప్రభుత్వం ఆశించినట్లుగానే ఎంపిక చేసిన 29 ఆసుపత్రుల్లో ఏడాది పాటు సేవలందించడానికి స్పెషలిస్టు వైద్యులు ముందుకొచ్చారని వైద్యవర్గాలు తెలిపాయి.

గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 4 నెలలు

ఎంపిక చేసిన ఆసుపత్రులుపోనూ మిగిలిన ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల్లో పనిచేయడానికి ముందుకొచ్చిన వైద్యులకూ ఈఏడాది నుంచి కొత్త నిబంధన ప్రవేశపెట్టారు. కౌన్సెలింగ్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో 'తప్పనిసరి' సేవల్లో చేరితే ఇక్కడ 8నెలలు పని చేసి జిల్లా, ప్రాంతీయాసుపత్రుల్లో నాలుగు నెలలు పనిచేయాల్సి ఉంటుంది. జిల్లా, ప్రాంతీయాస్పత్రుల్లో తొలుత చేరినవారు అక్కడ 8నెలలు పనిచేసి హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో 4నెలలు సేవలందించాలి. ఈవిధానం వల్ల తప్పనిసరి పీజీ వైద్యులందరూ నగర, పట్టణాల్లోనూ పని చేసినట్లు అవుతుందని వైద్యవర్గాలు తెలిపాయి.

అయితే నియామకాలు జరిగి ఒక్కరోజు కూడా పూర్తి కాకుండానే అప్పుడే స్థానచలనం కోసం పైరవీలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ పరిసరాల్లోనే తమకు కేటాయింపులు జరపాలని ఉన్నతాధికారులపై పలువురు రాజకీయనేతలతో ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఒత్తిడికి తలొగ్గితే జిల్లా, ప్రాంతీయాసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యసేవలందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయే అవకాశాలున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'తప్పనిసరి' పీజీ వైద్యులకు రెట్టింపు వేతనమిచ్చే ఆసుపత్రులు

సామాజిక ఆరోగ్య కేంద్రాలు: ఉట్నూరు, బెల్లంపల్లి, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్, మంథని, పెనుబల్లి, చిట్యాల, ఏటూరునాగారం, మహదేవపూర్, అశ్వారావుపేట, అలంపూర్, దేవరకొండ, నారాయణఖేడ్, కల్వకుర్తి, చేర్యాల, ఆలేరు, ఎల్లారెడ్డి, మద్నూర్, దోమకొండ, పరకాల, మారిపల్లి.

ప్రాంతీయ ఆసుపత్రులు: భైంసా, గద్వాల, నాగర్‌కర్నూలు, నాగార్జునసాగర్, బోధన్, నారాయణపేట, సిరిసిల్ల.

తెలంగాణకు రూ.1,287 కోట్లు విడుదల

రాజ్యసభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి వెల్లడి

ఈనాడు, దిల్లీ: తెలంగాణకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు వరకు రూ.1,287.04కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో తెరాస సభ్యుడు డి.శ్రీనివాస్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం సంబంధితనోడల్ మంత్రిత్వ శాఖల ద్వారా విడుదల చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ఖర్చుల ఆధారంగా ఈ మొత్తాలను విడుదల చేస్తూ పోతారని తెలిపారు.

ఆగస్టు 3 వరకు తెలంగాణకు విడుదల చేసిన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి

వివరాలు	రూ.కోట్లు
ప్రత్యేకసాయం	450.00
ఈఏపీ రుణం	314.30
స్థానిక సంస్థలకు	464.24
ఎన్‌డీఆర్‌ఎఫ్	58.40

మరో రెండేళ్లు గరిష్ఠ వయోపరిమితి పెంపుదల

ఈనాడు, హైదరాబాద్: పబ్లిక్ సర్వీసు కమిషన్, ఇతర నియామక సంస్థల ద్వారా భర్తీ అయ్యే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి పెంపుదలను మరో రెండేళ్లు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. సాధారణ నియామకాలకు మాత్రమే పెంపుదల అమలవుతుందని పోలీసు, ఆబ్కారీ, అటవీ, అగ్నిమాపక, జైళ్లశాఖ వంటి యూనిఫాం సర్వీసులకు వర్తించదంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత నిరుద్యోగుల వినతి మేరకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 34 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లకు పెంచుతూ 2015 జులై 27న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఈ ఉత్తర్వులను పొడిగించింది. ఆ గడువు గతనెల 26తో ముగిసింది. పదేళ్ల వయోపరిమితి పెంపును కొనసాగించాలని వినతులు వచ్చాయి. దీనికి అనుగుణంగా వయోపరిమితి పెంపుదలను మరో రెండేళ్ల పాటు అంటే 2019 జులై 26 వరకు అమలు చేసేందుకు తాజాగా ఆదేశాలిచ్చింది.

ట్రీ గార్డులు చోరీ చేస్తే కఠిన చర్యలు

మొక్కలను రక్షించేందుకు ఏర్పాటు చేసిన ట్రీ గార్డులను చోరీ చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ హోంశాఖను ఆదేశించారు. హరితహారం పురోగతిపై మంగళవారం ఆయన జిల్లాల కలెక్టర్లు, సంబంధితశాఖల ఉన్నతాధికారులతో దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు నాటిన మొక్కలు, వాటి పరిస్థితి, జియో ట్యాగింగ్, హరితసైన్యాల ఏర్పాటుపై సమీక్షించారు. మూడు, నాలుగు రోజుల్లో వర్షాలు కురవనున్నందున సన్నద్ధం కావాలని అధికారులకు సూచించారు. మొక్కలకు ఏర్పాటు చేసిన ట్రీగార్డుల చోరీపై చర్చ జరిగింది. ఇలాంటి చర్యలకు పాల్పడేవారిపై కేసులు పెట్టి, వారిని జైలుకు పంపాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్‌త్రివేదిని సీఎస్ ఆదేశించారు.

భూ రికార్డులపై ప్రత్యేక సదస్సు నిర్వహించండి: చాడ

ఈనాడు, హైదరాబాద్: భూ రికార్డుల ప్రక్షాళనకు ప్రత్యేక కార్యాచరణ చేయడానికి ముందు రాష్ట్రస్థాయిలో రెవెన్యూ నిపుణులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలతో సదస్సు నిర్వహించాలని సీపీఐ తెలంగాణ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో అమలుకు అనుకూలంగా ఉన్న సూచనలతో కార్యాచరణ రూపొందించాలన్నారు. భూ రికార్డులపై జిల్లా, మండల స్థాయుల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేయాలని, రెవెన్యూ అధికారితో పాటు వ్యవసాయ, పంచాయతీరాజ్ అధికారిని భాగస్తుల్ని చేయాలని సూచించారు.

చట్టసభల్లో రిజర్వేషన్లే లక్ష్యం: ఆర్.కృష్ణయ్య

ఈనాడు, దిల్లీ: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించడమే అంతిమ లక్ష్యమని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల కోసం జాతీయ స్థాయిలో బలమైన ఉద్యమాలు చేస్తామని ఆయన తెలిపారు. మంగళవారం ఏపీ భవన్‌లో ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన బీసీల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన కేంద్రమంత్రి దత్తాత్రేయ, కేంద్ర సహాయమంత్రి రాందాస్ అథవాలేలు మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి ప్రధాని చర్యలు తీసుకుంటుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయన్నారు. బీసీ కులాలను దేశవ్యాప్తంగా ఆరు గ్రూపులుగా వర్గీకరించాలని, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని సమావేశం డిమాండు చేసింది.



జంతర్‌మంతర్ వద్ద ప్రసంగిస్తున్న కేంద్ర కార్మికమంత్రి దత్తాత్రేయ. చిత్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, తెరాస ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీసీ సంఘాధ్యక్షుడు జి.శ్రీనివాస్‌గౌడ్

భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు కరవు

- లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ సహాయ నిరాకరణ
- పురపాలక నిబంధనలు మార్చాలని డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు స్తంభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ) సమ్మెలో ఉండటంతో భవన నిర్మాణానికి దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో భవన నిర్మాణాలకు కొత్తగా దరఖాస్తులు అప్‌లోడ్ చేయడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం భవన నిర్మాణ అనుమతులకు వందల దరఖాస్తులు వచ్చేవి. భవనానికి అనుమతించిన ఆకృతి (డిజైన్) మేరకు ఎలాంటి అతిక్రమణలు లేకుండా భవనాన్ని నిర్మాణం చేయిస్తామని ఒప్పందం(అగ్రిమెంట్)లో భవన యజమాని, స్ట్రక్చరల్ ఇంజినీర్‌తోపాటు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)కూడా అంగీకరిస్తూ అగ్రిమెంట్ దాఖలు చేయాలనే అంశంపై ఎల్‌టీపీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భవనానికి ప్రణాళిక ఇవ్వడం వరకే తమది బాధ్యత అని నిబంధనల మేరకు నిర్మించడంలో తాము పర్యవేక్షించలేమని పేర్కొంటూ దీన్ని ఉపసంహరించాలని కోరుతూ ఇటీవల ఎల్‌టీపీలు ప్రభుత్వాన్ని కోరారు. నిబంధనలు ఉపసంహరించుకునే వరకూ తాము భవన నిర్మాణ ప్రణాళికలు ఇవ్వబోమని ప్రకటించారు. ఈ మేరకు గత 5 రోజులనుంచి రాష్ట్రవ్యాప్తంగా అనుమతులకోసం దరఖాస్తులునిలిపివేశారు.

నిబంధనలు కఠినతరం

భవననిర్మాణ నిబంధనల్ని కఠినం తరం చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. భవన నిర్మాణ ప్రణాళికకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి తప్పించుకునేందుకు వీల్లేకుండా ఒప్పంద పత్రం ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. భవన యజమానితో పాటు భవన ప్రణాళిక ఇచ్చిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్, స్ట్రక్చరల్ ఇంజినీరు అందరూ బాధ్యత తీసుకోవాల్సిందేనని పేర్కొంటూ పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ముగ్గురు నగరపాలక, పురపాలక కమిషనర్లకు హామీపత్రం ఇవ్వాలని పేర్కొంది. అనుమతి మేరకు నిర్మాణం జరిగిందంటూ ఆర్కిటెక్, స్ట్రక్చరల్ ఇంజినీర్లు ధ్రువీకరించాలి. అప్పుడే నివాస యోగ్యత పత్రం లభిస్తుంది. అగ్రిమెంట్‌లో ఎల్‌టీపీలు సంతకం చేయాలనడం సరికాదని పేర్కొంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకునే వరకూ ఎటువంటి భవన ప్రణాళికలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయబోమని వారు స్పష్టం చేస్తున్నారు.

వర్షాలు పడితేనే పంటలకు మేలు

- వర్షాభావంపై డీఏఓలతో సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ఇకనుంచయినా వర్షాలు పడితేనే పంటలు కోలుకుంటాయని జిల్లా వ్యవసాయాధికారులు(డీఏఓ) తెలిపారు. తెలంగాణలో వర్షాభావంపై డీఏఓలతో రాష్ట్రస్థాయి సమావేశాన్ని మంగళవారం 'కేంద్రీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం'(క్రిడా)లో నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ ఎం.జగన్మోహన్, క్రిడా సంచాలకుడు సమ్మిరెడ్డి పాల్గొని పంటలపై చర్చించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, సోయా, పత్తి పంటలు ఎండుతున్నాయని, బీటీ పత్తిపై గులాబీ రంగు పురుగు దాడి ఉద్ధృతంగా ఉందని తెలిపారు. సమ్మిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి వర్షాలు పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతున్నందున పైర్లకు మేలు జరుగుతుందన్నారు. ఈ వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో తెలంగాణలో వర్షాలు బాగా తగ్గినందున ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక తయారీకి అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 623 జిల్లాలకు ఈ ప్రణాళికలు తయారు చేశామని వెల్లడించారు. పార్థసారథి మాట్లాడుతూ పంటల రక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లావారీగా పంటల సాగు, వర్షాభావం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెగుళ్ల నివారణకు రైతుల వద్దకెళ్లి పురుగు మందులు వాడకంపై అవగాహన కల్పించాలని చెప్పారు. జగన్మోహన్ మాట్లాడుతూ ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) ఉండే కేంద్ర గ్రామంలో 'రైతువేదిక' పేరుతో సమావేశ మందిరం, గోదాం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రతి పథకంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు నిర్ణీత శాతం మేర నిధులు ఖర్చవుతున్నాయా లేదా అన్నదానిపై ఆయన సమీక్ష జరిపారు.

6 వారాల్లోగా సమాచార కమిషనర్లను నియమించండి

- తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సమాచార కమిషన్‌లలో ఆరు వారాల్లోగా ప్రధాన కమిషనర్‌తోపాటు కమిషనర్లను నియమించాలని మంగళవారం ఉమ్మడి హైకోర్టు ఇరు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల అమలు నివేదికను సమర్పించాలంటూ తదుపరి విచారణను సెప్టెంబరు 21కి వాయిదా వేసింది. సమాచార కమిషన్‌లలో ప్రధాన కమిషనర్‌తోపాటు ఇతర కమిషనర్ల పోస్టులు ఖాళీ అయినప్పటికీ భర్తీ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రధాన కార్యదర్శి ఎం.పద్మనాభయ్య వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. తెలంగాణలో ప్రధాన కమిషనర్‌తోపాటు కమిషనర్ పోస్టులను ఆరు వారాల్లో నియమిస్తామని అడ్వొకేట్ జనరల్ డి.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సంగతేమిటని ధర్మాసనం ప్రశ్నించగా మరికొంత గడువు అవసరమని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది డి.రమేశ్ కోరారు. ఆరువారాల్లో తెలంగాణ నియామకాలు పూర్తి చేస్తుండగా మీకేమి ఇబ్బందని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సమాధానమిస్తూ తెలంగాణలో మౌలిక వసతులున్నాయని, తాము కొత్తగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసుకోవడానికి గడువు అవసరమన్నారు. గడువు పొడిగించడానికి ధర్మాసనం నిరాకరిస్తూ 6 వారాల్లోగా నియామక ప్రక్రియ పూర్తి చేయాలని రెండు రాష్ట్రాలను ఆదేశించింది.

రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు ఏమైంది?

- తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర స్థాయిలో రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటుకు తీసుకున్న చర్యలేమిటో వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి మంగళవారం ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2016లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం రాష్ట్ర కమిషన్ ఏర్పాటుకు సంబంధించి నిర్ణయమేంటో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. రైతు రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ భాజపా మాజీ ఎమ్మెల్యే ఎన్.ఇంద్రసేనారెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. ఈ పిటిషన్‌పై మగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వై.బాలాజీ వాదనలు వినిపిస్తూ గత కొన్నేళ్లలో సుమారు 2 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు రైతులు, ఇతర రంగాల నిపుణులతో ప్రభుత్వం సమావేశం నిర్వహించిందన్నారు. రాష్ట్రస్థాయిలో కమిషన్ ఏర్పాటు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గత ఏడాది మే 27న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ (సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ చేతివృత్తి నిపుణులు) చట్టం తీసుకొచ్చిందన్నారు. ఇందులో సెక్షన్ 3 ప్రకారం హైకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఐదుగురితో కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రైతుల రుణ సమస్యల పరిష్కారానికి దీన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటికీ ఏర్పాటుచేయలేదన్నారు. రాష్ట్ర కమిషన్ ఏర్పాటుకు సంబంధించి వివరణ ఇవ్వాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది.

జీవో 13 అమలు నిలిపివేతకు నిరాకరించిన హైకోర్టు

ప్రైవేటు అన్‌ఎయిడెడ్ వృత్తి విద్యాసంస్థల్లో బి-కేటగిరీ సీట్ల భర్తీలో భాగంగా ఎంపికైన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసే అవకాశాన్ని కాలేజీ యాజమాన్యాలకు కల్పిస్తూ ప్రభుత్వం 2014 ఆగస్టు 14న జారీ చేసిన జీవో 13 అమలును నిలిపివేయడానికి ఉమ్మడి హైకోర్టు నిరాకరించింది. జీవో వచ్చిన మూడేళ్లకు పిటిషన్ దాఖలు చేసి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలంటే ఇవ్వలేమంది. జీవో చట్టబద్ధతకు సంబంధించి కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వంతోపాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బి.రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ ఇంటర్వ్యూ నిర్వహించవచ్చన్న నిబంధన వల్ల యాజమాన్యం అభ్యర్థుల నుంచి క్యాపిటేషన్ ఫీజు, డొనేషన్ వసూలు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. జీవో అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు. ధర్మాసనం నిరాకరిస్తూ ఈనెల 29కి వాయిదా వేసింది.

మల్లన్నసాగర్ టెండర్ నోటిఫికేషన్ జారీపై వివరణ ఇవ్వండి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణం నిమిత్తం జారీ చేసిన టెండరు నోటిఫికేషన్లపై



హైకోర్టు ప్రభుత్వ వివరణ కోరింది. పర్యావరణ అనుమతుల్లేకుండా మల్లన్నసాగర్ రిజర్వాయర్ పనుల నిమిత్తం గత నెల 20న జారీ చేసిన టెండరు నోటిఫికేషన్లు, భూసేకరణ నిమిత్తం 29న జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్లను రద్దు చేయాలని కోరుతూ సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్‌కు చెందిన గండ్ల లక్ష్మి మరో ఐదుగురు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీహెచ్.రవికుమార్ వాదనలు వినిపిస్తూ పర్యావరణ అనుమతులు లేకుండా టెండరు నోటిపికేషన్ జారీచేయడం చట్టవిరుద్ధమన్నారు. టెండరు, భూసేకరణ నోటిఫికేషన్లు పర్యావరణ చట్టంతోపాటు కేంద్ర భూసేకరణ చట్టాలతోపాటు తెలంగాణ ప్రభుత్వం మార్చి 8న జారీచేసిన జీవో 185కు విరుద్ధమన్నారు. న్యాయమూర్తి అనుమతుల్లేకుండా టెండరు నోటిఫికేషన్ జారీపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను గురువారానికి కోర్టు వాయిదా వేసింది.

రంగారెడ్డి జిల్లా కోర్టు పరిధిలో ఏపీపీ నియామకాల ప్రక్రియ నిలుపుదల

రంగారెడ్డి జిల్లా కోర్టు పరిధిలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల(ఏపీపీ) నియామకాల ప్రక్రియను హైకోర్టు నిలుపుదల చేసింది. ఇప్పటికే నియమితులైన ఇద్దరు ఏపీపీల నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని విచారణను 2వారాలకు వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లాకోర్టు పరిధిలో 13 ఏపీపీ పోస్టుల నియామకానికి జరుగుతున్న ప్రక్రియను సవాల్జేస్తూ మూడు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకు నియామకాలు చేపట్టవద్దని హోంశాఖను ధర్మాసనం ఆదేశించింది.

ఎన్‌డీపీఎస్ కింద దర్యాప్తు అధికారం ఎవరిదో చెప్పండి

మత్తు మందుల కేసు దర్యాప్తు చేసే అధికారం ఎన్‌డీపీఎస్ (మాదక ద్రవ్యాల నిరోధకచట్టం) కింద ఎవరికి ఉందో చెప్పాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని వివరణ కోరింది. మత్తు మందుల కేసు దర్యాప్తు బాధ్యతను ప్రత్యేక విచారణ బృందానికి(సిట్) అప్పగించడానికి అనుమతించిన చట్టం వివరాలను సమర్పించాలంటూ విచారణను వారానికి వాయిదా వేసింది. డ్రగ్స్ వ్యవహారంపై దర్యాప్తు చేసే నైపుణ్యం సిట్‌కు లేదని, నైపుణ్యం ఉన్న కేంద్ర సంస్థల పర్యవేక్షణలో జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలనితెదేపా ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది బి.రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ కేంద్ర సంస్థలైన నార్కోటిక్స్ నియంత్రణ బ్యూరో, రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్, కేంద్ర ఆర్థిక ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐలతో సంప్రదించకుండా దర్యాప్తు కొనసాగిస్తోందన్నారు. మత్తు మందులకు సంబంధించిన వ్యవహారం కేవలం రాష్ట్రానికి పరిమితం కాలేదన్నారు. సరిహద్దులు దాటిన అంశంపై దర్యాప్తునకు ఆదేశించే అధికారం రాష్ట్రానికి లేదని చెప్పారు.

బోరుబావుల వ్యవహారంపై రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శికి నోటీసులు

బోరు బావుల ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలపై తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన నివేదికపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల మధ్య అంతర్గతంగా జరిగిన సంప్రదింపుల వివరాలను నివేదికగా సమర్పించడంపై అసంతృప్తి తెలిపింది. బావుల బారినుంచి చిన్నారుల రక్షణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేసేలా ఆదేశించాలని రంగారెడ్డి జిల్లాకు చెందిన బి.ప్రకాశ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. చేవెళ్లలో ఓ చిన్నారి మృతి చెందిందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక సమర్పించాలని గత విచారణలో హైకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిల ధర్మాసనం మంగళవారం పునర్విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం తరఫున రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నివేదిక సమర్పించాల్సి ఉండగా.. విపత్తు నిర్వహణల విభాగం కమిషనర్‌కు కలెక్టర్ సమర్పించిన నివేదికనే కోర్టుకు అందజేశారన్నారు. ఇది కోర్టు ధిక్కరణ అవుతుందన్నారు. దీనిపై వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ అయన్ను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేసింది.

ఆయేషా కేసులో సిట్ సభ్యులెవరో చెప్పాలి

ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరా హత్య కేసును పునర్విచారించేందుకు ఏపీ సర్కారు ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో సభ్యులెవరు? ఎవరి పర్యవేక్షణలో ఆ బృందం పనిచేస్తుందని ఏపీ హోంశాఖ ప్రభుత్వ న్యాయవాది పద్మావతిని హైకోర్టు ప్రశ్నించింది. వివరాలు సమర్పించేందుకు న్యాయవాది గడువు కోరడంతో విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది.

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లకు సీఎం ప్రయత్నం: మహమూద్ అలీ

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: గిరిజనుల అభివృద్ధిని కాంక్షించి 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం(టీజీఎస్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలను అందించిన గిరిజన యువత, ప్రముఖులకు కొమురం భీమ్ పురస్కారాలతో సత్కరించారు. ముఖ్యఅతిథి మహమూద్ అలీ మాట్లాడుతూ.. బంజారాహిల్స్‌లో నిర్మించతలపెట్టిన ఆదివాసీ భవనం కోర్టు కేసుల వల్ల ఆగిపోయిందని, వచ్చే ఏడాది ఉత్సవాలు అందులోనే చేసుకునేలా నిర్మాణం పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హోంశాఖ మంత్రి నాయిని మాట్లాడుతూ.. ఇప్పటికే రిజర్వేషన్ల విషయమై సీఎం.. ప్రధానితో మాట్లాడినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, శాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.లక్ష్మణ్, ఆదివాసీల గురువు జయరామ్‌స్వామిజీ తదితరులు పాల్గొన్నారు. సత్కారాలు పొందిన వారిలో పర్వతారోహకురాలు పూర్ణ, ఢిల్లీలో తొలి మహిళా ఆర్టీసీ డ్రైవర్ సరిత, కళాకారులు రవి నాయక్, మహేశ్ నాయక్, భీమ్‌రావు రాథోడ్, కనకరాజు గోండు తదితరులున్నారు.

భారీగా తగ్గిన మదర్సాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బోగస్ మదర్సాలకు ముకుతాడు పడింది. విద్యార్థులకు, ఆధార్ సంఖ్య అనుసంధానం చేయడంతో భారీసంఖ్యలో మదర్సాల సంఖ్య తగ్గిపోయింది. రాష్ట్రంలో 2015-16 విద్యాసంవత్సరంలో 511 మదర్సాలు ఉన్నాయి. విద్యావాలంటీర్లు లేకున్నా బోగస్ సిబ్బంది పేరుతో వేతనాలు ఇచ్చినట్లు ఆ ఏడాది వెలుగుచూసింది. దీంతో 2016-17లో ఆధార్ సంఖ్యను అనుసంధానం చేశారు. ఫలితంగా మదర్సాల సంఖ్య 129కి తగ్గిపోయింది.

'సహకారం' అంటే.. వ్యాపారం కాదు!

- ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టొద్దు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- బహుళ రాష్ట్రాల సహకార సంఘాలకు కేంద్రం హెచ్చరిక

ఈనాడు - హైదరాబాద్

బహుళ రాష్ట్రాల సహకార సంఘాల(ఎంఎస్‌సీఎస్)ల పేరుతో రిజిస్టరైన సంఘాలు సహకార స్ఫూర్తికి విరుద్ధంగా పెద్ద ఎత్తున వ్యాపారాలు చేయడం తగదని కేంద్ర ప్రభుత్వం తాజాగా హెచ్చరించింది. ఒక రాష్ట్రంలో ఎంఎస్‌సీఎస్‌గా నమోదై మరో రాష్ట్రానికెళ్లి పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్న వాటిపై ఆరా తీస్తోంది. పలు రాష్ట్రాల్లో ఇలా వ్యాపారాలు చేస్తూ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించడం, చిట్టీలు, స్థిరాస్తి వ్యాపారాలు చేస్తున్న ఈ సంఘాలపై సరిగా తనిఖీలు చేయకపోవడంతో ఆడిందే ఆటగా సాగుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న 1,265 ఎంఎస్‌సీఎస్‌లు పలు వ్యాపారాల్లో రూ.కోట్లలో పెట్టుబడులు పెడుతున్నాయని ఇటీవల కేంద్రం దృష్టికి వచ్చింది. పాత నోట్ల రద్దు తరవాత ఈ సంఘాల పాలకవర్గాల్లోని సంచాలకుల వ్యాపారాలపైనా కేంద్రం ఆరా తీస్తోంది. సాధారణంగా రాష్ట్ర సహకార చట్టం కింద నమోదైన సహకార సంఘంపై రాష్ట్ర సహకార శాఖ తనిఖీలు, పర్యవేక్షణ ఉంటాయి. ఇవి ఏమైనా తప్పులు చేసినట్లు ఫిర్యాదులొస్తే తక్షణం జిల్లా సహకార అధికారి(డీసీఓ) విచారణ జరిపి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు. అవసరమైతే సంఘం పాలకవర్గాన్ని రద్దు చేస్తారు. కానీ ఎంఎస్‌సీఎస్‌లపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర సహకార అధికారులకు లేదు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లోనే అధికంగా ఎంఎస్‌సీఎస్‌లు రిజిస్టర్ కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా 1,265 ఉంటే వాటిలో సగానికి పైగా కేవలం రెండు రాష్ట్రాల్లో అవీ..మహారాష్ట్రలోనే 569, దిల్లీలో 146 ఉన్నాయి. ఏపీలో 19, తెలంగాణలో 3 నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం(2016-17) ముగిసి నాలుగున్నర నెలలవుతున్నా ఇంతవరకూ కేవలం 84 ఎంఎస్‌సీఎస్‌లే ఆడిట్ నివేదికలిచ్చినట్లు కేంద్రం తెలిపింది. అంతకుముందు సంవత్సరాల్లో సైతం సగానికి పైగా సంఘాలు నివేదికలే ఇవ్వలేదని తెలుస్తోంది.

సహకార బ్యాంకులపైనే ఫిర్యాదులు: ఎంఎస్‌సీఎస్‌ల పేరుతో నమోదైన సంఘాలు పలు రాష్ట్రాల్లో సహకార బ్యాంకుల పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రజల నుంచి డిపాజిట్ల సేకరణ, రుణాల పంపిణీ చేస్తున్నాయి. బ్యాంకుగా ఉన్నప్పుడు బ్యాంకింగ్ కార్యకలాపాలు మాత్రమే నిర్వహించాలి. కానీ వీటి పాలకవర్గాల్లోని సంచాలకులు భారీ పెట్టుబడులతో ఇతర వ్యాపారాలెలా చేస్తున్నారని కేంద్రం ఆరా తీస్తోంది. పైగా ఒక సొసైటీ చేస్తున్న వ్యాపారాలనే దాని పాలకవర్గం సభ్యులు విడిగా ప్రైవేటుగా చేస్తున్నట్లు సైతం ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలాంటి వారిని గుర్తించి తక్షణం పాలకవర్గాల నుంచి తొలగించాలని కేంద్రం ఆదేశించింది. కొన్ని ఎంఎస్‌సీఎస్‌లు తమ ఏజెంట్లను ఇతర రాష్ట్రాలకు పంపి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ అక్కడ డిపాజిట్లను సేకరిస్తున్నాయి. వివిధ రకాలుగా డబ్బు లావాదేవీలు జరుపుతున్నాయి. ఎంఎస్‌సీఎస్‌లు వాటి పరిధి దాటి ఇతర వ్యాపారాలు చేయకూడదని కేంద్రం ఆదేశించినమాట వాస్తవమేనని తెలంగాణ సహకార శాఖ అధికారులు 'ఈనాడు'కు చెప్పారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని, దిల్లీ, యూపీ తదితర ప్రాంతాల చిరునామాలతో ఉండే సొసైటీల్లో పెట్టుబడులు పెట్టేముందు క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రజలకు సహకార శాఖ సూచించింది. కొన్ని రాష్ట్రాలకు చెందిన సంఘాలు సరిగా పనిచేయనందున ఇప్పటికే మూసివేతకు విచారణ అధికారులను సైతం కేంద్రం నియమించింది. ఇలాంటి సమాచారం తెలియక ప్రజలు వాటితో వ్యాపారం చేయకూడదని చెప్పింది.

ప్రధాన రాష్ట్రాల్లో ఎంఎస్‌సీఎస్‌లు

రాష్ట్రం	ఎన్ని
మహారాష్ట్ర	569
దిల్లీ	146
ఉత్తరప్రదేశ్	135
తమిళనాడు	92
రాజస్థాన్	72
పశ్చిమబెంగాల్	48
గుజరాత్	37
కర్ణాటక	26
కేరళ	20
మధ్యప్రదేశ్	26
ఏపీ	19
బిహార్	17
తెలంగాణ	3

తుది ఆడిట్ నివేదికలు అందజేసిన ఎంఎస్‌సీఎస్‌లు

సంవత్సరం	ఎన్ని
2011-12	8
2012-13	54
2013-14	110
2014-15	424
2015-16	570
2016-17	84

(గమనిక: దేశవ్యాప్తంగా మొత్తం సంఘాలు 1265)

ఔషధనగరిని అడ్డుకుంటాం

- కాంగ్రెస్ నేతలు

యాచారం, న్యూస్‌టుడే: శాస్త్ర, సాంకేతిక రంగాలు ఎంత అభివృద్ధి చెందుతున్నా.. కాలుష్య భూతాన్ని అంతమొందించే విధానాలు ఆచరణకు నోచుకోవడం లేదని, ఔషధ నగరి ఏర్పాటు ద్వారా వెలువడే కాలుష్యంతో పరిసరాలు ఎడారిగా మారే ప్రమాదముందని తెలంగాణ కాంగ్రెస్ సమన్వయ కమిటీ ఛైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాచారంలో 'ముచ్చర్ల ఔషధనగరి నిర్వాసితులు-కాలుష్యం' పేరిట ఏర్పాటు చేసిన ఇష్టాగోష్ఠిలో కాంగ్రెస్ నాయకులు, కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మదిరెడ్డి కోదండరెడ్డి, పర్యావరణవేత్తలు పుట్టం పురుషోత్తంరావు, నర్సింహారెడ్డి తదితరులతో



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

కలిసి ఆయన మాట్లాడారు. జడ్చర్ల సమీపంలోని పోలేపల్లిలో నాలుగు ఔషధ పరిశ్రమలుంటేనే పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు కలుషితమై అక్కడి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వందల సంఖ్యలో ఔషధ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమవడం సరికాదన్నారు. హుస్సేన్‌సాగర్‌ను శుద్ధి చేయడానికి తాను మంత్రిగా ఉన్నప్పుడు అధికారుల మాటలు నమ్మి రూ.20 కోట్లు ఖర్చు చేసినా ఎలాంటి ఫలితం సాధించలేకపోయామని.. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం రూ.350కోట్లు ఖర్చు చేసినా ఉపయోగం లేదన్నారు. వివిధ ప్రాంతాల్లో రసాయన పరిశ్రమల ద్వారా ఏర్పడిన ఇబ్బందులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలువురు పర్యావరణవేత్తలు వివరించారు. ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు క్యామ మల్లేశ్ మాట్లాడుతూ ఔషధనగరిని అడ్డుకోవడంపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

100 శాతం హాజరుంటే నెలకు రూ.500

- పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రోత్సాహం
- పరీక్ష, సర్టిఫికెట్ రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పలు వరాలు ప్రకటించింది. రోజూ తరగతులకు హాజరయ్యేలా చేయడంతోపాటు వారి కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ప్రోత్సాహకాలు అందించనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 5,736మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి అన్ని విధాలా చేయూత ఇచ్చేందుకు తాజాగా పలు నిర్ణయాలు తీసుకుంది. ప్రతినెలా 100శాతం హాజరుంటే వారికి ప్రోత్సాహం కింద రూ.500చొప్పున నగదు అందజేస్తారు. నెలలో ఎన్ని రోజులు కళాశాల పనిచేస్తే అన్నిరోజుల తరగతులకు హాజరుకావాలి. మూడేళ్లలో ఒక్కోవిద్యార్థి పరీక్ష రుసుంతోపాటు పాసైన తర్వాత సర్టిఫికెట్ ఫీజు కోసం మొత్తం రూ.2,850 చెల్లించాల్సి ఉంటుంది. దాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖే.. పరీక్షలు నిర్వహించే రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి(ఎస్‌బీటీఈటీ)కి చెల్లిస్తుంది. చివరి సంవత్సరం విద్యార్థులకు ఒక కోటు, రెండు జతల ఏకరూప దుస్తులు, బూట్ల జత కలిపి రూ.1850 విలువజేసే కిట్‌ను అందజేస్తారు. ఉద్యోగ ముఖాముఖీలకు హాజరు కావాలన్నా, ఏదైనా శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలన్నా కోటు, బూట్లు ధరించి వెళ్లేందుకు వీటిని అందించనున్నారు. వీటికి అవసరమైన నిధులను ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక బడ్జెట్ నుంచి కేటాయిస్తారు. గతేడాది ప్రకటించిన మేరకు చివరి సంవత్సరం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.35వేల విలువైన ల్యాప్‌టాప్‌తోపాటు కాలుక్యులేటర్ ఇస్తారు.

త్వరలోనే నయీం కేసు కొలిక్కి: అంజనీకుమార్

ఈనాడు, హైదరాబాద్: కరుడుగట్టిన నేరగాడు నయీం కేసుల దర్యాప్తు మరో రెండుమూడు నెలల్లో పూర్తి చేస్తామని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇన్‌ఛార్జి, శాంతిభద్రతల అదనపు డీజీ అంజనీకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ కేసులో ఆధారాలు లభించిన వారందరిపైనా చర్యలు తీసుకున్నామని, భవిష్యత్తులో జరగబోయే దర్యాప్తులో సాక్ష్యాధారాలు లభించిన ఎవర్నీ వదలబోమన్నారు. పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నామని, రాజకీయ నాయకులపై ఆధారాలు లభిస్తే వారిపైనా తీసుకుంటామన్నారు. 9 కేసుల్లో అభియోగపత్రాలు దాఖలు చేయగా మిగతా వాటిలోనూ త్వరలోనూ పూర్తిచేస్తామన్నారు. ఆధారాలు సేకరించాల్సి ఉన్నందునే ఈ ప్రక్రియ ఆలస్యమవుతుందని తెలిపారు.

'పంచాయతీ యూనిట్‌గా సర్వే నిర్వహించాలి'

ఈనాడు, హైదరాబాద్ : రాష్ట్రంలో 8,695 గ్రామపంచాయతీలుండగా వీటిల్లో ఒకే రెవెన్యూ గ్రామంలో రెండుకు మించి పంచాయతీలు కూడా ఏర్పడినవి అనేకమున్నాయనీ, అందుకే పంచాయతీ యూనిట్‌గా సమగ్ర భూసర్వే నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం కోరింది. ఒకే సర్వే నెంబరులో ఉమ్మడి కుటుంబం విభాగాలు చేసుకొని సాగు చేసుకుంటున్నారనీ, ఏ రైతు భూమి ఏ సర్వేనెంబరులో ఉన్నదో నమోదు కాకపోవడంతో భూతగాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపింది. సమగ్ర భూసర్వే ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలని రైతు సంఘం అధ్యక్షుడు పి.జంగారెడ్డి, ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి, కార్యదర్శి టి.సాగర్‌లు మంగళవవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు.

సీఎం గారూ.. మీ వ్యాఖ్యలు అభ్యంతరకరం: సురవరం

ఈనాడు, హైదరాబాద్ : తనని ఉద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. తాను చేసిన విమర్శల్లో అవాస్తవాలుంటే వాటిని సరిచేసుకోవడానికి సిద్ధమనీ, అయితే ముందుగా తాను లేవనెత్తిన అంశాలకు సమాధానాలు చెప్పాలని ఆయన సీఎంకు బహిరంగ లేఖ రాశారు. ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఏమైంది?.. రెండు పడకల ఇళ్ల పథకం ఎందుకు ముందుకు సాగడం లేదు..అని లేఖలో ప్రశ్నించారు. వాగ్దానాల అమలుకు ఆర్థిక స్థితి అడ్డంకిగా భావిస్తే.. కొత్త సచివాలయం, శాసనసభ మందిరాలు, నూతన కార్యాలయాలు, నూతన నివాస భవనాల నిర్మాణాలకు డబ్బులెక్కడి నుంచి వస్తున్నాయో సమాధానం చెప్పాలన్నారు.

జనవరి 3నుంచి మెట్రో పరుగులు

ఈనాడు–సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు ప్రారంభానికి ముహూర్తం కుదిరింది. అన్నీసవ్యంగా జరిగితే వచ్చే ఏడాది జనవరి 3వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు అనుగుణంగా రెండు కారిడార్లలో ప్రారంభోత్సవానికి అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. అమీర్‌పేటలో, సికింద్రాబాద్ ఒలిఫెంటా వంతెన వద్ద ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపేసి పగలూరాత్రి పనులు నిర్వహిస్తున్నారు. రాజధాని నగరంలో 72 కి.మీ. పొడవున మెట్రో రైలు నిర్మాణం చేపట్టాలని కొన్నేళ్ల కిందట ప్రభుత్వం తలపెట్టింది. వివిధ కారణాల వల్ల పాతబస్తీలో పనులు మొదలుకాలేదు. ప్రస్తుతం 66 కి.మీ. మేర పనులు జరుగుతున్నాయి. ఏడాది క్రితమే నాగోలు నుంచి మెట్టుగూడ వరకు 8 కి.మీ. నిర్మాణం పనులు పూర్తయ్యాయి. భద్రతా తనిఖీలనూ పూర్తి చేశారు. ఈ మొత్తం దూరంలో ఏడు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. మియాపూర్ నుంచి ఎస్‌ఆర్‌నగర్ వరకు 12 కి.మీ. మేర పనులు కూడా ఎనిమిది నెలల క్రితమే పూర్తయ్యాయి. దీని పరిధిలో 10 స్టేషన్లు ఉన్నాయి. పూర్తిస్థాయి అనుసంధానత లేకపోడం వల్ల ఈ రెండు కారిడార్లలో మెట్రో రైలు సేవలను ప్రారంభించినా పెద్దగా ప్రయోజనం ఉండదన్న ఉద్దేశంతో ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖత చూపలేదు. మెట్టుగూడ నుంచి బేగంపేట వరకు



నిర్మాణం పనులు చాలా వరకు కొలిక్కి వచ్చాయి. ఒలిఫెంటా వంతెన వద్ద అతి పెద్ద ఉక్కు వంతెన ఏర్పాటైతేనే ఈ మార్గంలో బేగంపేట వరకు రైలు నడిపేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశం మేరకు గత రెండు రోజుల నుంచి ఈ వంతెన ఏర్పాటు పనులను ఎల్‌అండ్‌టీ అధికారులు మొదలుపెట్టారు. మంగళవారం నుంచి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో వంతెనను ఏర్పాటు చేసి మిగిలిన పనులను నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలనీ, డిసెంబరు ఆఖరుకల్లా ప్రయోగ పరీక్ష పూర్తి చేయాలని అనుకుంటున్నారు. దీనివల్ల బేగంపేట వరకు రైలును నడిపేందుకు వీలవుతుంది. బేగంపేట నుంచి అమీర్‌పేట వరకు లైను నిర్మాణం వేగంగా జరుగుతోంది. రెండోదశ కింద బేగంపేట నుంచి అమీర్‌పేట వరకు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇక మియాపూర్ నుంచి ఎస్‌ఆర్ నగర్ వరకు కాకుండా అమీర్‌పేట వరకు మెట్రో రైలు నడిపితే మేలని ప్రభుత్వం భావిస్తోంది. అమీర్‌పేట వద్ద మార్పిడి స్టేషన్‌ను నిర్మించాల్సి ఉంది. దీనికి కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. దీని నిర్మాణాన్ని కొనసాగిస్తునే అమీర్‌పేట వరకు రైలు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అమీర్‌పేట నుంచి నాంపల్లి వరకు కూడా దాదాపు పనులు చివరి దశకు వచ్చాయి. రెండోదశలో అమీర్‌పేట నుంచి నాంపల్లి వరకు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇమ్లిబన్ వద్ద మూసీనదిపై భారీ మార్పిడి స్టేషన్ నిర్మాణంలో ఉంది. ఇది పూర్తయ్యేందుకు మరో ఏడెనిమిది నెలలు పట్టేలా ఉంది. ప్రస్తుతం మూడు కోచ్‌లతో ఉన్న 53 మెట్రో రైళ్లు నగరానికి చేరాయి. హైదరాబాద్‌లో వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జాతీయ సైన్సు కాంగ్రెస్ సదస్సు జరగనుంది. 3న సదస్సు ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరవనున్నారు. ప్రధాని కార్యక్రమం అధికారికంగా ఖరారు కాకపోయినా ఆయన హాజరవుతారనే ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యఅతిథిగా హాజరవ్వాలంటూ సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రధానమంత్రిని కోరగా, సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ రెండు కారిడార్లలో మెట్రోనూ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు పోలీసులు కూడా ప్రధాని కార్యక్రమ రక్షణ ఏర్పాట్లపై ఇప్పట్నుంచే కసరత్తు చేపట్టారు.

హెచ్4 వీసాదారులు చదువుకోవచ్చు!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికా యానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

హెచ్–4 వీసాపై అమెరికాలో ఉంటున్నాను. ప్రస్తుత వీసాపై నేను మాస్టర్స్ చేయవచ్చా? ఎఫ్–1 వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలా? వీసా అవసరమైతే అమెరికాలో దరఖాస్తు చేసుకోవచ్చా? *- ప్రశాంతి వరగాని*

హెచ్-4 వీసా హోదాలో ఉన్న వారు వీసా హోదాను మార్చుకోకుండానే చదువుకోవచ్చు. అయితే, పీహెచ్‌డీ కార్యక్రమంలో భాగంగా అసిస్టెన్స్‌షిప్ విధానం ఉంటే ఎఫ్-1 వీసా తీసుకోవాల్సి ఉంటుంది. అమెరికాలో ఉండగా మీ పర్యాటక లేదా నివాస కాలంలో వీసా స్థాయిని మార్చుకోవాలంటే కాలపరిమితి తీరకముందే యూఎస్ సిటిజన్‌షిప్‌అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్ (యూఎస్‌సీఐఎస్) వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎలా మార్చుకోవాలి తదితర సమాచారం కోసం https:www.uscis.gov వెబ్‌సైట్‌ను చూడండి. ఎఫ్-1 వీసా అపాయింటుమెంటు షెడ్యూల్, దరఖాస్తు విధానం సమాచారం కోసం https://www.ustraveldocs.com/ in ను చూడండి.

ఈ ఏడాది అక్టోబరులో నా బి1/బి2 వీసా కాలం తీరనుంది. వీసాను పునరుద్ధరించుకుందామనుకుంటున్నాను. డ్రాప్‌బాక్స్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చా? *- సీహెచ్. రామచంద్రయ్య*

వీసాను ఎప్పుడైనా పునరుద్ధరించుకోవచ్చు. మీరు అర్హులా? కాదా? అన్నది తెలుసుకునేందుకు https://www.ustraveldocs.com/ inను చూడండి. ఇంటర్వ్యూ మినహాయింపు పథకం(ఐడబ్ల్యూపీ) అనేది ఇంటర్వ్యూ ఇబ్బందిని తగ్గించేందుకు ఉపకరిస్తుంది. దరఖాస్తును మాత్రం వ్యక్తిగతంగానే ఇవ్వాల్సి ఉంటుంది. ఐడబ్ల్యూపీకి అర్హులు కాకపోతే వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

భారతదేశంలో మాస్టర్స్ చేశాను. అమెరికాలో పీహెచ్‌డీ చేయాలనుకుంటున్నాను. నా విద్యార్హతలన్నీ బాగున్నాయి. బ్యాంకు నుంచి విద్యారుణం తీసుకుంటున్నాను. విశ్వవిద్యాలయం నుంచి ఉపకార వేతనం పొందవచ్చా? *- శారదారాణి మల్లేపల్లి*

అమెరికాలో విద్యాభ్యాసం, ఉపకార వేతనాలు తదితర సమాచారానికి https://educationusa.state.govను చూడండి. అమెరికాలోని మరికొన్ని విశ్వవిద్యాలయాలు కూడా ఉపకారవేతనాలను అందజేస్తాయి. ఆయా వర్సిటీల ఆర్థికసహాయ విభాగాలను నేరుగా సంప్రదించి సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

ఎఫ్–1 వీసా కోసం అపాయింటుమెంటు తీసుకున్నాను. అత్యవసర పనుల కారణంగా ఆ రోజు ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. ఫీజు చెల్లించకుండా మరో తేదీన అపాయింటుమెంటు తీసుకోవచ్చా? ఎంత కాలం వేచి ఉండాలి? *- కె.నాగరాజుకుమార్*

వీసా ఇంటర్వ్యూకు మీరు హాజరు కాకపోతే కంప్యూటర్‌లో మీ వివరాల వద్ద హాజరుకాలేదు(నో షో) అని నమోదవుతుంది. మీ అపాయింటుమెంటును రీ-షెడ్యూల్ చేసుకునేందుకు, మీ ఫీజు రశీదును తిరిగి పునరుద్ధరణ(రీయాక్టివేట్) చేసుకునేందుకు https://www.ustraveldocs.com/ in వెబ్‌సైట్‌లో పేర్కొన్న కాల్‌సెంటర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

- వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support–india@ustraveldocs.comకు ఈ-మెయిల్ చేయండి.
- మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.govను సంప్రదించవచ్చు.
- హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.netకు పంపగలరు.

గురుకుల పరీక్షల షెడ్యూల్ ఖరారు

ఈనాడు, హైదరాబాద్: హైకోర్టు తీర్పు నేపథ్యంలో వాయిదా పడిన గురుకుల ఉద్యోగ నియామక పరీక్షలకు సవరించిన తేదీలను మంగళవారం టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 18తేదీల మధ్య ఈ పరీక్షలన్నీ జరగనున్నాయి. పీజీటీ లాంగ్వేజ్ ప్రధాన పరీక్షలు గతంలో ప్రకటించిన మేరకే ఈ నెల 27, 28న, టీజీటీ లాంగ్వేజ్ ప్రధాన పరీక్షలు సెప్టెంబరు 3, 4 తేదీల్లోనే జరుగుతాయని కమిషన్ పేర్కొంది.

పరీక్షల షెడ్యూల్ ఇదీ...

పరీక్ష తేదీ	సబ్జెక్టులు	హాల్‌టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం
ఆగస్టు 31	ఆర్ట్, క్రాఫ్ట్	ఈ నెల 26 నుంచి
సెప్టెంబరు 1	మ్యూజిక్ టీచర్	ఈ నెల 26 నుంచి
సెప్టెంబరు 17	లైబ్రేరియన్(పాఠశాలలు)	సెప్టెంబరు 11 నుంచి
సెప్టెంబరు 17, 18	స్టాఫ్ నర్సు, పీఈటీ	సెప్టెంబరు 11 నుంచి
సెప్టెంబరు 10న	డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, పీడీ, లైబ్రేరియన్లు, జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, ప్రిన్సిపాల్, పీడీ, లైబ్రేరియన్లు, పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లు	సెప్టెంబరు 4 నుంచి
ఆగస్టు 29	భౌతికశాస్త్రం, సోషల్ టీజీటీ మెయిన్	ఈ నెల 26 నుంచి
ఆగస్టు 30	సైన్స్ టీజీటీ మెయిన్	ఈ నెల 26 నుంచి

డీఫార్మసీ సీట్లు కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ చదివి డీఫార్మసీ కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మంగళవారం రాత్రి సీట్లు కేటాయించింది. మొత్తం 830 సీట్లు అందుబాటులో ఉండగా కౌన్సెలింగ్‌కు 246 మంది హాజరయ్యారు. వారిలో 236 మంది ఆప్షన్లు ఇచ్చుకోగా 235 మందికి సీట్లు దక్కాయి. సీట్లు పొందినవారు ఈనెల 11వ తేదీలోపు రుసుం చెల్లించడంతోపాటు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని అధికారులు తెలిపారు. సీటు రద్దు చేసుకోవాలనుకునేవారు ఈనెల 16వ తేదీలోపు సాంకేతిక విద్యా భవన్‌లోని కన్వీనర్‌ను సంప్రదించాలని సూచించారు.

కేసీఆర్ కుటుంబ పాలనను కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ముషీరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ సీఎం కేసీఆర్ కుటుంబ పాలనను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని, ఇందుకోసం ఈ నెల 21న దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా తాళ్లపల్లిలో రైతుకూలీ పోరాట సమితి నేత మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు యాదగిరిరెడ్డి, వసంత్‌లపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జీవన్‌కుమార్, విమలక్క మాట్లాడారు.

జీఎస్టీపై అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

ఈనాడు, హైదరాబాద్ : జీఎస్టీ వల్ల రాష్ట్ర ప్రజలపై పడుతున్న భారాలను తగ్గించడానికి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లాలని సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం ముఖ్యమంత్రిని కోరారు. ఎంబీ భవన్‌లో మంగళవారం జరిగిన పార్టీ రాష్ట్ర కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు.

★ రాష్ట్రంలో కూరగాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో కోరారు.

సహోద్యోగిగానూ పనికిరామా?

మనదేశంలో ఇదో విచిత్రం. ఇప్పుడు మన భారతీయ కంపెనీలన్నీ తమ సంస్థల్లో ఆడా, మగా తేడాలేని సమానత్వాన్ని ఆశిస్తున్నామని చెబుతున్నాయి. అందుకోసం చర్యలు తీసుకుంటున్నామంటున్నాయి. ప్రభుత్వాలూ ఇందుకోసం ప్రత్యేక రిజర్వేషన్‌లూ కేటాయిస్తామనీ చెబుతున్నాయి. కానీ ఇవన్నీ ఆదర్శాలుగా, ఇంకా చెప్పాలంటే వట్టిమాటలుగా మిగిలిపోతాయేమో అనే సందేహం రేకెత్తిస్తోంది ఈ అధ్యయనం. ప్రముఖ హెచ్‌ఆర్ సేవల సంస్థ రాన్‌స్టాడ్ ఇండియా దీన్ని నిర్వహించింది. 'మీ కార్యాలయంలో ఖాళీ అయిన ఓ ఉద్యోగానికి ఓ



అమ్మాయీ, అబ్బాయీ పోటీపడుతున్నారు అనుకుందాం. ఇద్దరి అర్హతలూ సమానమే. మీరు ఎవర్ని ఎంచుకుంటారు?' అని ప్రశ్నించారు. దానికి 55 శాతం మంది అబ్బాయినే అని చెప్పారట. అందులోనూ 61 శాతం మంది మగవారు అబ్బాయే సహోద్యోగిగా ఉండాలని చెప్పారట. స్త్రీలు కాస్త మేలు.. 47 శాతం మంది మాత్రమే ఈ మాట అన్నారట. 'మరి మీపై అధికారిగా ఎవర్ని ఎంచుకుంటారు?' అని అడిగితే 70 శాతం మంది మగవారు అనే చెప్పారట. స్త్రీలలో ఇలా కోరుకున్నవారు కేవలం 41 శాతం మాత్రమేనట! లింగ వివక్షపై మన మనఃస్థితి ఏమాత్రం మారలేదు అనడానికి ఇదో ఉదాహరణ అంటోంది రాన్‌స్టాడ్ సంస్థ. మానసికంగా ఇలాంటి భావనలు మారనిదే సంస్థలు మానవ వనరుల పరంగా వైవిధ్యాన్ని అందుకోలేవని చెబుతోంది!

ఒంటరిగా చలో చలో!

కొందరు ఇతరులపై అదేపనిగా ఆధారపడుతుంటారు. ఇతరుల సాయం లేకుండా ఏపనీ చేయలేరు. మీరూ అలాంటి వారి జాబితాలో ఉంటే గనుక.. ఆ తీరును కొంత మార్చుకోవడం మంచిది. అంటే కొన్ని పనులు ఎవరి సాయం లేకుండా మీకు మీరే చేసుకుని చూడండి. దానివల్ల ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది.

◆ ఈసారి కొనుగోళ్లకు వెళ్లినప్పుడు మీ స్నేహితురాలిని తోడు తీసుకెళ్లకండి. ఒక్కరే వెళ్లి చూడండి. దానివల్ల మీరు సొంత నిర్ణయాలు తీసుకోగలరన్న ధైర్యం మీలో ఏర్పడుతుంది. సినిమాకైనా అంతే. కుదిరితే ఈసారి ఒక్కరే వెళ్లి చూడండి.



◆ ఒంటరి ప్రయాణాలు కాస్త బోర్‌గా ఉన్నా అవి మీ గురించి మీరు ఆలోచించుకోవడానికి సమయాన్ని కల్పిస్తాయి. కాబట్టి ఒకటిరెండురోజులయినా సరే.. మీరొక్కరే ఎక్కడికైనా వెళ్లిరండి.

◆ ఇతరుల అభిప్రాయం తీసుకోవడం మంచిదే కానీ, ప్రతి దానికీ అలా అడిగితే మీకంటూ ఒక ఆలోచన ఉండదు.. పక్కవాళ్లు చెప్పిన సలహాను తీసుకున్నా మీరు ఒకసారి ఆలోచించి.. తరవాతే నిర్ణయం తీసుకోవాలి.

◆ సొంతంగా బ్యాంకు లావాదేవీలు ఒకటిరెండుసార్లు చేసి చూడండి. దానివల్ల మీపై మీకు ధైర్యం వస్తుంది. ఆన్‌లైన్ షాపింగ్ విషయంలోనూ అంతే..!

వసుంధర

కుర్తాపై జాకెట్టు అదిరేట్టు!

జాకెట్... ఈ పేరు వినడానికి పాశ్చాత్యంగా ఉన్నా.. మన భారతీయ వస్త్రశైలిలో దీనికీ ప్రాధాన్యం ఎక్కువే. కాలంతో పాటు ఆధునిక హంగులూ, ఇతర సొబగులూ అద్దుకుని సరికొత్త రకాల్లో వస్త్రశైలి మీదకూ నప్పుతుంది జాకెట్. అసలు వేటిమీదకు ఎలాంటి జాకెట్లు ఎంచుకోవచ్చో చెబుతున్నారు డిజైనర్ కీర్తనా సునీల్...















దుపట్టా వద్దనుకునేవారు ప్రత్యామ్నాయంగా జాకెట్‌ని ఎంచుకోవచ్చు. నిజానికి ఒకప్పుడు జాకెట్ అంటే డెనిమ్, లెదర్‌లు మాత్రమే. ఇప్పుడు వీటిల్లో ఇకత్, కలంకారీ, కచ్, లక్నో చికెన్ వర్క్‌తోపాటూ నెట్, బెనారస్, షిఫాన్, పట్టు వంటి వస్త్రాల్లోనూ వస్తున్నాయి. అయితే జాకెట్‌ని ఎంచుకున్నప్పుడు మన వ్యక్తిత్వం, ఏ తరహా దుస్తులకు దీన్ని జత చేస్తున్నాం అనేది గుర్తుంచుకోవాలి.

● **డెనిమ్...** ఎన్ని ఫ్యాషన్‌లు వచ్చినా డెనిమ్‌కి ఉండే ప్రత్యేకతే వేరు. ఫ్లోరల్ గౌను మీదకు డెనిమ్ జాకెట్ మీకంటూ లుక్‌ని తెస్తుంది. అలానే జీన్స్, టీషర్ట్‌లకు జతగా లెదర్ జాకెట్ వేసుకోవచ్చు. తెలుపు రంగు చొక్కామీదకు జతగా డెనిమ్ జాకెట్‌ని ప్రయత్నిస్తే ఆకట్టుకునేలా కనిపిస్తారు. దాంతో పాటూ మెటాలిక్ శాండిళ్లు, ఫంకీ యాక్సెసరీలను ఎంచుకుంటే ఆ అందమే వేరు. డెనిమ్స్ మీదకు ఎంచుకునే జాకెట్‌లు కాస్త దళసరిగా ఉండేలా చూసుకోవాలి. అంటే కలంకారీ, ఇకత్, హ్యాండ్‌లూమ్ జ్యూట్‌ని కూడా ప్రయత్నించొచ్చు.

● కాస్త లావుగా ఉన్నవారు నడుము కిందదాకా లేదా మరీ పొడవుగా ఉండేలా చూసుకోవాలి. అదే సన్నగా ఉన్నవారు పొడుగు జాకెట్ వేసుకుంటున్నట్లయితే అదనంగా బెల్టు పెట్టుకోవాల్సి ఉంటుంది. లేదంటే మ్యాక్సీలా కనిపిస్తుంది.

● స్కర్ట్‌లతోపాటు క్రాప్‌టాప్‌లు ఇప్పుడు ట్రెండ్. వాటిల్లో ఆఫ్‌షోల్డర్స్, కోల్డ్ షోల్డర్స్ వంటివి ఎంచుకుంటున్నారు. ఇలాంటప్పుడు వాటి మీదకు బొలెరో జాకెట్లని ఎంచుకుంటే బాగుంటుంది. ఇది సాధారణంగా ఛాతీవరకూ ఉంటుంది. దీనికి బకెల్స్ హుక్కులు మూసినట్టుగా ఉండేలా చూసుకోవాలి. అదే పొడవు స్కర్ట్‌లను ఎంచుకునేటప్పుడు మాత్రం దాని మీదకు జతగా షిఫాన్, నెట్ వంటి వస్త్రాలను ఎంచుకోవాలి. అదే భారీపనితనం ఉన్న స్కర్ట్‌లను ఎంచుకునేటప్పుడు వాటిమీదకు కాస్త తక్కువ ఎంబ్రాయిడరీ ఉండే జాకెట్‌లు బాగుంటాయి.

● నడుము భాగం కాస్త ఎక్కువగా ఉన్నవారు జాకెట్‌లను ఎంచుకునేటప్పుడు పొడవాటివి ప్రయత్నించాలి. దుస్తులు ఏవయినా ఆఫ్‌షోల్డర్, బ్యాక్‌లెస్ వంటి డిజైన్‌లలో ఎంచుకున్నప్పుడు సీత్రూ జాకెట్లను ప్రయత్నిస్తే బాగుంటుంది. ఇప్పుడు పెళ్లి, సంగీత్ వంటి వేడుకలకోసం స్కర్టులు, గౌన్ల వాడకం పెరిగింది. వాటి మీదకు పట్టూ, బెనారసీ, జాకెట్లు ప్రయత్నించొచ్చు. అలాగే కోరాసిల్క్, సిల్క్, వంటి వస్త్రాల మీదకు మగ్గం వర్క్, కచ్‌వర్క్, లక్నో చికెన్ వర్క్ వంటివి ఎంబ్రాయిడరీలతో జాకెట్ చేయించుకుంటే చూడ్డానికి బాగుంటుంది.

● **కుర్తీ- కుర్తా:** ఇది మోకాలివరకూ ఉన్నప్పుడు ష్రగ్ తరహా జాకెట్‌ని వాడుకోవచ్చు. షిఫాన్లూ, జార్జెట్లూ, సిల్క్ వంటి లైట్ వెయిట్ వస్త్రాలమీదకూ ఇదే బాగుంటుంది. అనార్కలీలు వాడినప్పుడు ఫిట్టెడ్, లైట్‌వెయిట్ వంటి జాకెట్ ప్రింట్లు ఉండేలా చూసుకోవాలి. తక్కువ బరువున్న జాకెట్ కుర్తీకి చక్కగా నప్పుతుంది.

● అనార్కలీలు వేసుకుంటున్నప్పుడు ఒంటికి అతుక్కున్నట్టు ఉండే జాకెట్లు బాగుంటాయి. పొడవు చేతులు ఉండేలా చూసుకుంటే మరీ మంచిది. పొడవాటి కుర్తీకి సింగిల్ షోల్డర్ జాకెట్స్ వేసుకోవచ్చు. లేదా ఒకవైపు డోరీ ఉండేలా చూసుకున్నా మంచిదే.

● ఇప్పుడు జీన్స్, కుర్తీ ఏదయినా సరే పొడవాటి జాకెట్‌లు బాగుంటాయి. అయితే అవి మ్యాక్సీల్లా కనిపించకుండా సింగిల్ హుక్ పెట్టుకోవచ్చు. అలానే దళసరిగా ఉండే లెదర్ బెల్ట్‌ని తాడులా ఓ వైపు ముడి వేసినా బాగుంటుంది. అయితే నడుమువరకూ ఎంచుకునేప్పుడు చక్కగా జిప్‌లూ, డోరీలతో ఎంచుకోవచ్చు.

● సంప్రదాయ వేడుకలకోసం ప్రత్యేకించి బెనారస్, సిల్క్, కంచిపట్టు బ్లవుజును ఎంచుకోవచ్చు. కావాలనుకుంటే వాటిపై ఎంబ్రాయిడరీ కూడా చేయించుకోవచ్చు.

– స్వాతి కొరపాటి

ఇప్పుడే ఆంక్షలంటే ఎలా?

నాకు మా బావతో ఆరునెలల కిందట పెళ్లి నిశ్చయమైంది. వాళ్లు అమెరికాలో ఉంటారు. నిజానికి, చిన్నప్పటి నుంచీ నాకు అతడినే చేసుకోవాలనేమీ లేదు. నా బీటెక్ అయి ఉద్యోగం వచ్చాక అత్తమ్మవాళ్లే పెళ్లి ప్రస్తావన తెచ్చారు. సొంతవాళ్లే కాబట్టి మెట్టింట్లో ఇట్టే ఇమిడిపోవచ్చని అనుకున్నా. బావ గురించి కొత్తగా తెలుసుకోవాల్సిన అవసరం లేదని.. ఆయనతో ఇట్టే కలిసిపోవచ్చనీ భావించా. కానీ నిశ్చయమయ్యాకే తెలుస్తోంది.. ఎంత తప్పు చేశానో! ప్రతిదానికీ ఆంక్షలు పెడుతున్నారు వాళ్లు. ఉద్యోగానికి వెళ్లే టైమెంటి? వీకెండ్స్‌లో బయటకు ఎందుకు వెళుతున్నావు? వాట్సాప్‌లో అంతంతసేపు ఎందుక ఆన్‌లైన్‌లో ఉంటున్నావు.. ఇలా! అమెరికాలో ఉంటున్నా వాళ్ల మనసుల్లో ఈ సంకుచితత్వం ఏమిటో అర్థం కాలేదు! ఇంట్లో చెబితే వాళ్లు అడగడంలో తప్పేమిటీ అని అంటున్నారు! కానీ పెళ్లి తర్వాత నా జీవితం ఎలా ఉంటుందోనని భయంగా ఉంది. ఏం చేయను?

- ఓ సోదరి



డియర్ వసుంధర

డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

పెళ్లి కాక ముందు పరస్పరం ఇష్టాయిష్టాలు పంచుకోవడం ఈ కాలంలో చాలా సర్వసాధారణ విషయమైపోయింది. ఓ రకంగా ఇది తప్పనిసరి కూడా! ఇది గమనించే 'మ్యారేజ్ కాంపాటబులిటీ కౌన్సెలింగ్' కూడా చేస్తున్నారు. మీరు పెళ్లి చేసుకోబోయే వ్యక్తి సొంత బావే అయినంత మాత్రాన ఇలాంటివన్నీ అక్కర్లేదని అనుకోకూడదు. మీరు అక్కడే పొరబాటు చేసినట్టున్నారు. అందువల్లే మీ జీవనశైలీ, వ్యవహారశైలీ వంటి విషయాలూ, ఇప్పటిదాకా మీకున్న పద్ధతుల గురించి వాళ్లకి తెలియవు. దానిపై చర్చించడం కాకుండా వాళ్లు మీపై ఆదేశాలు గుప్పించడం.. మిమ్మల్నిప్పుడు ఇబ్బంది పెడుతోంది. సాధారణంగా మీ స్థితిలో ఉన్న అమ్మాయిలు పెళ్లయ్యాక జీవితంలో ఎలాంటి మార్పులు చేసుకోవాలో ఆలోచిస్తుంటారు. వాళ్లు మీపై పెడుతున్న ఒత్తిడి కారణంగా మీలో అలాంటి ప్రణాళికలకంటే భయమే ఎక్కువగా కనిపిస్తోంది. అది పోగొట్టుకుంటే కానీ.. మీరు పెళ్లికి మానసికంగా సిద్ధం కాలేరు. కాబట్టి ముందు మీ తల్లిదండ్రులతో మాట్లాడండి. మీ తల్లిదండ్రులకీ మీ అంతర్జాలం అలవాట్లపై ఎంతోకొంత అభ్యంతరాలు ఉన్నట్టున్నాయి. అందుకే 'ఇందులో తప్పేముంది?' అని అంటున్నారు. కానీ మీరు అమ్మానాన్నలతో ఆ విషయాలకన్నా మీ కాబోయే అత్తింటివాళ్ల ఆధిపత్య ధోరణి గురించే ఎక్కువ ప్రస్తావించండి. మీ విషయాలని వాళ్లతో సున్నితంగా మాట్లాడమనండి. అత్తవాళ్లతో మీరూ ఈ విషయాలపై మాట్లాడుకునే అవకాశాలు పెంచుకోండి. వాళ్లు 'స్కైప్'లోకి వచ్చిన ప్రతిసారీ వీటినీ ప్రధానంగా చర్చించండి. ఇష్టాయిష్టాలూ, అభిరుచుల్ని చెబుతూ చేసుకోవాల్సిన సర్దుబాట్లపైనా ఏకాభిప్రాయానికి రండి. ఇద్దరూ పెళ్లయ్యాక మీరు కోరుకునే కలల జీవితంలో మీ స్వేచ్ఛ కూడా భాగమేననే విషయం వాళ్లకి తెలియాలి. ఎంత ప్రయత్నించినా మార్పు రాకపోతే అప్పుడు మీ నిర్ణయాలు ఎలా ఉండాలో మీ పరిస్థితులే చెబుతాయి!

- gpadmaja2008@gmail.com



బంగారం-వెండి

8న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	29,400	29,350
ఆర్నమెంట్	-------	-------	27,300	27,300
వెండి (కిలో)	-------	-------	38,600	38,600

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	29,500	29,450	29,060	29,010
ఆర్నమెంట్	27,280	27,230	27,170	27,110
వెండి (కిలో)	38,500	38,500	38,400	37,350

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	29,460	29,460	-------	-------
ఆర్నమెంట్	27,100	27,100	2,717	2,711 గ్రా
వెండి (కిలో)	39,500	39,500	40.00	39.90 గ్రా

పాదాలకు ముల్తానీ పూత!

చాలామంది కాళ్లపై శ్రద్ధ చూపరు. కానీ వాటి కోసం కూడా కాస్త సమయాన్ని కేటాయించుకుంటే పాదాలు అందంగా మారతాయి.





పాదాల్లోనూ మృతకణాలు పేరుకుంటాయి. అవి పోవాలంటే.. కనీసం వారానికోసారి పాదాల్ని కాస్త సబ్బు నురగ, ఉప్పు కలిపిన గోరువెచ్చనినీటిలో ఉంచాలి.

◆ రెండుమూడు చెంచాల ముల్తానీ మట్టిలో కాస్త గులాబీనీరు కలిపి పాదాలకు పూతలా రాసుకోవాలి. అది పూర్తిగా ఆరాక కడిగేసి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఆరోగ్యంగా, అందంగా కనిపిస్తాయి.

◆ ఉప్పులో కొద్దిగా నిమ్మరసం వేసి..దాన్ని పాదాలకు రాసుకోవాలి. బాగా ఆరాక కడిగేయడం వల్ల మృతకణాలు పోవడంతోపాటూ పాదాలు తాజాగా మారతాయి.

◆ పాదాలు పొడిబారి కనిపిస్తున్నప్పుడు రాత్రిళ్లు కొబ్బరినూనెను రాసుకుని మర్దన చేసి సాక్సులు వేసుకోవాలి. ఇలా కొన్నిరోజులపాటు చేయడం వల్ల పొడిబారే సమస్య తగ్గడంతోపాటూ మృదువుగానూ మారతాయి.

◆ కొన్నిసార్లు గోళ్లకు అదేపనిగా రంగు వేయడం వల్ల అవి పసుపచ్చగా మారతాయి. అందుకే అప్పుడప్పుడూ రంగు వేయడం మానేయాలి. దానివల్ల గోళ్లకు గాలి తగిలి తాజాగా కనిపిస్తాయి.

పాత స్నేహానికి మళ్లీ హాయ్...

పాఠశాలలోనో, కాలేజీలోనో చదువుకునేటప్పుడు చాలా మంది స్నేహితులవుతారు. అక్కడి నుంచి బయటకొచ్చాక కొత్త స్నేహితులు పెరిగేకొద్దీ పాతవాళ్లని మర్చిపోతుంటాం. ఆ స్నేహాలు కేవలం ఓ మధురజ్ఞాపకంగానే మిగిలిపోతుంటాయి. అలాకాకుండా వాళ్లతోనూ స్నేహం కొనసాగించాలంటే ఇలా చేయండి..

● మనం ఇంతకముందు చదువుకున్న ప్రాంతాల్లో మనతో సన్నిహితంగా ఉండే ఒక్క స్నేహితురాలైనా తప్పక ఉండే ఉంటుంది. అలాంటి వారిని ఒకసారి గుర్తుచేసుకోండి. ఫోను నంబరు సంపాదించి వారిని కలిసి మాట్లాడేందుకు ప్రయత్నంచండి. ఫేస్‌బుక్, వాట్సాప్‌ద్వారా తరచూ మాట్లాడండి. వాళ్లు దగ్గర్లోనే ఉన్నారని తెలిస్తే కలవండి. ప్రయత్నించకుండానే వెనకడుగు మాత్రం వేయకండి. ఫలితం లేకపోతే కనీసం ప్రయత్నించామన్న సంతృప్తి అయినా మిగులుతుంది.

● మీకు ఇష్టమైన వారితో ఏదైనా గొడవ జరిగి మాట్లాడకపోతే వెంటనే దానికి ముగింపు పలకండి. మీ తప్పుంటే ఒప్పుకోండి. వారి నుంచి పొరపాటు జరిగితే ఏ మాత్రం ఆలోచించకుండా క్షమించేందుకు ప్రయత్నించండి. ఈ చిన్న సర్దుబాటుతో మీ స్నేహబంధం బలపడుతుంది.

● మీ పాత స్నేహితులు ఏవైనా వేడుకలు ఏర్పాటు చేసి ఆహ్వానిస్తే వీలైనంతవరకూ వెళ్లే ప్రయత్నం చేయండి. అక్కడ మరికొందరు పాత స్నేహితులు కలవొచ్చు.



● కనీసం నెలకోసారయినా స్నేహితులంతా కలిసి సరదాగా గడిపేలా చూసుకోండి. చక్కటి విహారయాత్రకు ఏర్పాటుచేసుకోవచ్చు. ప్రయాణాలు చేయడం వీలుకాకపోతే స్నేహితులంతా కలిసి దగ్గర్లో ఉన్న పార్క్ లేదా హోటల్‌లో అయినా.. కాసేపు గడపొచ్చు.

● దూరంగా ఉన్న స్నేహితులతో వీడియో కాలింగ్ ద్వారా మాట్లాడండి. వీలైతే పాత స్నేహితులంతా కలిసి గ్రూప్ కాల్ చేసుకునే ఏర్పాట్లూ ఇప్పుడు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే తిరుగుండదు.

● కేవలం సంతోషాల్లోనే కాదు.. బాధల్లోనూ పాలుపంచుకునేందుకు ముందుండండి. అది వారికి ధైర్యాన్నిస్తుంది.

అప్పుడు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా!

రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసింది సమిత. కారణం తీవ్రమైన ఒత్తిడి. కానీ అందులోనే పడి కొట్టుకుపోలేదామె. దాన్నుంచి బయటపడటానికి గ్రాఫాలజీని నేర్చుకుంది. డాక్టర్ సమితగా మారి వేలమందికి మెరుగైన చేతిరాతలో శిక్షణ అందిస్తోంది. తాజాగా ఆహా (అమెరికన్ అసోషియేషన్ ఆఫ్ హ్యాండ్‌రైటింగ్ అనలిస్ట్)లో సభ్యురాలిగా మారడంతోపాటూ, న్యూస్టెప్స్ ఫౌండేషన్ అనే ఎన్జీఓనూ ప్రారంభించింది.



నేను పుట్టి, పెరిగిందీ... మెట్టినింట్లో అడుగుపెట్టిందీ అంతా హైదరాబాద్‌లోనే. నిజానికి నా సొంతూరు గుజరాత్. చదువుల్లో, ఆటపాటల్లో నేను చాలా చురుగ్గా ఉండేదాన్ని. యూనివర్సిటీ స్థాయిలో బాస్కెట్‌బాల్ క్రీడాకారిణిని. స్నేహితురాళ్లతో కలిసి సేవ చేయడం అంటే ఇష్టం.. తీరిక దొరికితే పేద పిల్లలకు ట్యూషన్లు చెప్పేదాన్ని. అంత హుషారుగా ఉండే నాకు డిగ్రీ రెండో సంవత్సరంలో ఉండగానే పెళ్లిచేశారు. ఆ వెంటనే ఇద్దరు అబ్బాయిలు. దాంతో మధ్యలోనే ఆగిపోయిన నా చదువుని పూర్తిచేద్దామని ఎంతగా ప్రయత్నించినా వీలుపడలేదు. ఆరేళ్ల వరకూ ఇంట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. అంతవరకూ కాలేజీలో స్వచ్ఛంద సంస్థలనీ, ఆటపాటలనీ క్షణం తీరిక లేకుండా గడిపిన నాకు ఇలా ఇంటికే పరిమితం అయిపోవడం కష్టంగా అనిపించింది. మధ్యలో ఉద్యోగం చేద్దామని అనుకున్నా ఏవో కారణాల వల్ల కుదరలేదు. ఒకప్పుడు ఎంతో హుషారుగా ఉన్న నేను ఏం చేయలేకపోతున్నానని రోజూ బాధపడేదాన్ని. ఆ ఆందోళన నాలో రోజురోజుకీ పెరిగింది. అది ఏ స్థాయికి వెళ్లిందంటే... రెండు సార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేశా. ఆ తరవాత మా పెద్దవాడు చదువుల్లో వెనకబడుతుంటే... డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లా. పరీక్షలు చేసి చివరకు డిస్లెక్సియా ఉందని చెప్పారు. ఇది ఉన్న పిల్లలు ఏ విషయాన్నైనా తక్కిన పిల్లలతో సమానంగా నేర్చుకోలేరు. వాడిచేతిరాత బాగాలేదని టీచర్లు పదేపదే పిలిచి నన్నూ, వాడినీ కలిపి తిడుతుంటే అక్కడ వాళ్ల ముందు దోషిలా నిలబడేదాన్ని. ఈ సమస్యల నుంచి బయటపడేందుకే ఏదో ఒక వ్యాపకం ఉండాలని 2006లో గ్రాఫాలజీ నేర్చుకోవడం మొదలుపెట్టా.

పదిహేను వేలమందికి శిక్షణ.. గ్రాఫాలజీ అనేది చేతిరాతని అధ్యయనం చేసే శాస్త్రం. విదేశాల్లో అయితే నేరవిచారణతో పాటూ అనేక రంగాల్లో చేతిరాత నిపుణుల ప్రాధాన్యం ఉంటుంది. కానీ ఇక్కడ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందీ రంగం. గ్రాఫాలజీలో దూరవిద్యలో మదురై కామరాజ్ యూనివర్సిటీ నుంచి సైకాలజీలో రెండు పీజీలు చేశాను. ఇంకో పక్క గ్రాఫాలజీలో నా ఆసక్తిని పెంచుకున్నా. అమెరికా ప్రభుత్వం ఏటా నిర్వహించే గ్రాఫాలజీ ప్రవేశ పరీక్ష రాసి.. అక్కడ ఏటా జరిగే సమావేశాల్లో భారత్ తరపున ప్రతినిధిగా పాల్గొనేదాన్ని. ముఖ్యంగా ఒత్తిడికీ, చేతిరాతకీ ఉండే సంబంధాన్ని విశ్లేషించడం మొదలుపెట్టాను. నిజానికి చేతిరాతని విశ్లేషించడం ద్వారా ఒత్తిడిని ఇట్టే పసికట్టవచ్చు. నేనూ అదే పని చేస్తున్నా. వివిధ కాలేజీల నుంచి వచ్చిన పదిహేడు నుంచి ఇరవైరెండేళ్ల వయసు వారి చేతి రాతను విశ్లేషించడం మొదలుపెట్టా. చాలామంది ఒత్తిడితో కొట్టుమిట్టాడుతున్నవారే. అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సానుకూల దృక్పథం పెంచడం మొదలుపెట్టాను. దీన్నే గ్రాఫోథెరపీ అంటారు. ఆన్‌లైన్‌లో తమ చేతి రాతని విశ్లేషించమని కోరుతుంటారు చాలామంది. జపాన్, అమెరికా, సౌదీ ఇలా ఎన్నో దేశాలకు చెందిన వారి రాతనీ విశ్లేషిస్తుంటాను. ఈ కృషిని గుర్తించిన ఆహా (అమెరికన్ అసోషియేషన్ ఆఫ్ హ్యాండ్‌రైటింగ్ ఎనలిస్ట్) నాకు సభ్యత్వం ఇచ్చింది. ఆహాలో మొత్తం మూడు దశలు ఉంటే నేను రెండో దశలో ఉన్నాను. ఒక్కో దశని దాటడానికి కొన్ని పరీక్షలు ఉంటాయి వాటిలో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే ఈ సభ్యత్వం దక్కుతుంది. ఇప్పటిదాకా నేను మెరుగైన చేతిరాత కోసం దేశవ్యాప్తంగా పదిహేనువేల మందికి శిక్షణ ఇచ్చాను. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకూ, విద్యార్థులకు గ్రాఫాలజీలో శిక్షణ ఇస్తున్నాను. ఈ మధ్యే నా స్నేహితురాలు కవితాజైన్‌తో కలిసి న్యూస్టెప్స్ ఫౌండేషన్‌ని పెట్టా. హైదరాబాద్ రాణిగంజ్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలని దత్తత తీసుకున్నా. ఆ పిల్లలకు పుస్తకాలు అందించడంతోపాటూ... టాయిలెట్లని కట్టించి ఇచ్చా. వారికి ఏ అనారోగ్యం వచ్చినా ఆ బాధ్యత మొత్తం నాదే. ఇంత చేస్తున్నా చదువుని మాత్రం ఆపలేదు. కాలిఫోర్నియా బర్కలీ యూనివర్సిటీ నుంచి థియరిటికల్ సైన్సెస్ ఇన్ సోషల్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ పూర్తిచేశాను.

సెన్సెక్స్ ▼ 259 **32014**

నిఫ్టీ ▼ 79 **9979**

రూపాయి 63.63 ▲ 17 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

బంగారం 28,590 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 70

వెండి 37,275 ▲ ముంబయిలో కిలో రూ.లలో 215

ముడి చమురు 52.15 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	22,124	+06
నాస్‌డాక్	6,398	+14
నిక్కీ 225 (జపాన్)	19,996	−60
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,318	−03
షాంఘై(చైనా)	3,283	+03
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,542	+10
డాక్స్ (జర్మనీ)	12,292	+34

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.01	67.27
పౌండ్ స్టెర్లింగ్	75.68	87.76
యూరో	68.50	79.45
జపనీస్ యెన్/100	52.43	60.82
ఆస్ట్రేలియా డాలరు	45.91	53.15
సింగపూర్ డాలరు	42.61	50.48
థాయ్ బాత్/100	174.37	208.55
బహ్రెయిన్ దీనార్	157.19	180.04
కువైట్ దీనార్	174.55	217.44
ఒమన్ రియాల్	153.80	176.01
యూఏఈ దిర్హమ్	15.79	18.46
మలేషియా రింగిట్	13.26	16.30
చైనీస్ యువాన్	06.73	10.92

మంగళవారం నిఫ్టీ కదలికలు



కావేరీ సీడ్ డివిడెండు 150%

త్రైమాసిక లాభం రూ.202 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కావేరీ సీడ్ మధ్యంతర డివిడెండును ప్రకటించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.3 (150%) డివిడెండు చెల్లించాలని బోర్డు నిర్ణయించింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కార్యకలాపాలకు, భవిష్యత్తు విస్తరణ కోసం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లిలో 24.25 ఎకరాల స్థలాన్ని రూ.15 కోట్లకు కంపెనీ కొనుగోలు చేసింది. ప్రత్యేక బ్రాండుతో వివిధ విభాగాల్లో విత్తనాలు విక్రయించడానికి నూరు శాతం అనుబంధ సంస్థ ఏర్పాటు చేయాలనీ కావేరీ సీడ్ బోర్డు నిర్ణయించింది. ఏప్రిల్-జూన్‌లో కావేరీ సీడ్ నికర లాభం 31.1% వృద్ధితో రూ.154.36 కోట్ల నుంచి రూ.202.37 కోట్లకు చేరింది. నికర అమ్మకాలు 19.55 శాతం పెరిగి రూ.590.55 కోట్లుగా నమోదయ్యాయి. లాభాల మార్జిన్ 31.25 శాతం నుంచి 34.27 శాతానికి చేరింది. ప్రమాణాలకు అనుగుణంగా లేని, మొలకెత్తడానికి వీలు లేని రూ.19.2 కోట్ల విలువైన విత్తన నిల్వలను పక్కన పెట్టడం లాభదాయకతపై ప్రభావం చూపిందని పేర్కొంది.

ఎన్‌సీసీ లాభం రూ.63 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి ఎన్‌సీసీ రూ.63.4 కోట్ల స్టాండ్‌అలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.52.3 కోట్లతో పోలిస్తే ఈసారి 21.22% పెరిగింది. టర్నోవరు 5% వృద్ధితో రూ.1,929.7 కోట్ల నుంచి రూ.2,034.6 కోట్లకు చేరింది. ఎబిటా కూడా రూ.165.7 కోట్ల నుంచి రూ.170.9 కోట్లకు పెరిగింది. షేరుకు ఆర్జన (ఈపీఎస్) 2016 జూన్‌తో ముగిసిన మూడు నెలల్లో రూ.0.94 ఉండగా, ఈ ఏడాది ఇదే కాలానికి రూ.1.14 చేరిందని ఎన్‌సీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వై.డి.మూర్తి చెప్పారు. 2017-18 తొలి త్రైమాసికానికి రూ.6,051 కోట్ల ఆర్డర్లను కంపెనీ సంపాదించింది. దీంతో 2017 జూన్ చివరి నాటికి కంపెనీ చేతిలో రూ.22,009 కోట్ల విలువైన పనులు ఉన్నాయని మూర్తి వివరించారు. తొలి త్రైమాసికంలో ఆర్డర్ల పుస్తకం 22 శాతం పెరిగినట్లు చెప్పారు.

నేటి బోర్డు సమావేశాలు

★ అరబిందో ఫార్మా ★ అజంతా ఫార్మా ★ టాటా మోటార్స్ ★ ఎన్‌హెచ్‌పీసీ ★ సిటీ యూనియన్ బ్యాంక్ ★ ఎన్ఎండీసీ ★ ఐషర్ ★ నాగార్జునా ఫెర్టిలైజర్స్ ★ ఇంజినీర్స్ ఇండియా ★ వీల్స్ ★ హనీవెల్ ఆటోమేషన్ ★ పీటీసీ ఇండియా ★ అజంతా పోర్ట్‌ల్యాండ్ సిమెంట్ ★ యునికెమ్ ల్యాబ్స్ ★ అశోకా బిల్డ్‌కాన్ ★ మహానగర్ గ్యాస్ ★ ఎంఎంటీసీ ★ ఐనాక్స్ విండ్ ★ అడ్వాన్స్‌డ్ ఎంజైమ్ ★ బ్యాంక్ ఆఫ్ ఇండియా ★ థామస్ కుక్ ★ ఫినోలెక్స్ కేబుల్స్

డొల్ల జాబితాలో పెద్ద కంపెనీల పేర్లు

● ఎలాంటి తప్పూ చేయలేదంటున్న సంస్థలు



దిల్లీ: అనుమానిత డొల్ల కంపెనీల జాబితాలో పార్శ్వనాథ్ డెవలపర్స్, ఎస్క్యూఎస్ ఇండియా, జె కుమార్ ఇన్‌ఫ్రా, ప్రకాశ్ ఇండస్ట్రీస్ వంటి పెద్ద కంపెనీలు చోటు చేసుకోవడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. పన్ను ఎగవేతలు, ఇతరత్రా మోసాలు చేసినట్లుగా ఆరోపణలు చేస్తూ వీటిపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వం సెబీకి 331 కంపెనీల జాబితాను పంపింది. అయితే ఆయా కంపెనీలు తామెలాంటి తప్పూ చేయలేదని అంటున్నాయి. మరో పక్క ఈ 331 కంపెనీలపై ట్రేడింగ్ పరంగా పరిమితులు విధించమంటూ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెబీ సూచించింది. ఇప్పటికే జాబితాలోని 162 కంపెనీలపై ట్రేడింగ్ పరిమితులు విధించారు. నెలలో కేవలం ఒక రోజు మాత్రమే ట్రేడింగ్‌కు అనుమతిస్తూ, ఎక్స్ఛేంజీలు నిర్ణయం తీసుకున్నాయి. మిగతా కంపెనీలపైనా ఇవే తరహా ఆంక్షలు కొనసాగొచ్చు. కాగా, ఈ కంపెనీల్లో పలు ప్రముఖ దేశీయ, విదేశీ మదుపర్లు పెట్టుబడులు పెట్టడం గమనార్హం.

ఆదాయ పన్ను విభాగం, తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయం(ఎస్ఎఫ్ఐఓ), ఇతర ఏజెన్సీలు చేపట్టే దర్యాప్తుల ఆధారంగా ఈ కంపెనీలపై మరిన్ని చర్యలూ తీసుకునే అవకాశం లేకపోలేదు. 37,000 డొల్ల కంపెనీలు పన్ను ఎగవేసినట్లు గత నెలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

పశ్చిమ బంగలో ఎక్కువ: అనుమానిత కంపెనీల జాబితాలో ఒడిశా స్పాంజ్ ఐరన్ అండ్ స్టీల్, బిర్లా కాట్‌సింక్, ప్రకాశ్ ఇండస్ట్రీస్, ఎస్క్యూఎస్ ఇండియా బీఎఫ్ఎస్ఐ, పిన్‌కాయిన్ స్పిరిట్ తదితరాలున్నాయి. జాబితాలో కనీసం 127 కంపెనీలు పశ్చిమ బంగకు చెందినవని తెలుస్తోంది. మిగతా 50 మహారాష్ట్ర; గుజరాత్, దిల్లీకి చెందినవి చెరో 30కి పైగా ఉన్నట్లు సమాచారం. ఒడిశా, అసోం, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందినవి కూడా ఉన్నాయి.

అనుమానిత డొల్ల కంపెనీల జాబితాలో తమ పేర్లు ఉండడంపై దిగ్భ్రాంతికి గురైనట్లు పార్శ్వనాథ్ డెవలపర్స్, ఎస్క్యూఎస్ ఇండియా బీఎఫ్ఎస్ఐలు పేర్కొన్నాయి. జాబితాలోని మరికొన్ని కంపెనీలు కూడా తాము ఎటువంటి తప్పూ చేయలేదని ప్రకటనలు ఇచ్చాయి. తాము ఎటువంటి మోసాలకూ పాల్పడలేదని స్పష్టం చేశాయి.

1.62 లక్షల కంపెనీల నమోదు రద్దు

మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

దిల్లీ: చాలా ఏళ్ల పాటు ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకుండా ఉన్న 1.62 లక్షలకు పైగా కంపెనీల నమోదును రద్దు చేశారు. ఇందులో సగం ముంబయి, దిల్లీ, హైదరాబాద్‌వే కావడం విశేషం. 'కంపెనీల చట్టం 2013 సెక్షన్ 248 కింద 2017 జులై 12 నాటికి 1,62,618 కంపెనీలను రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్(ఆర్‌ఓసీ) నుంచి తొలగించిన'ట్లు రాజ్యసభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ మేఘ్వాల్ తెలిపారు. రెండు ఆర్థిక సంవత్సరాల పాటు ఎటువంటి వ్యాపారమూ నడపని సంస్థలను, ఇతరత్రా నిబంధనలు పాటించని కంపెనీలను తొలగించడానికి ఆర్‌ఓసీలకు సెక్షన్ 248 కింద అధికారం ఉంటుంది. నమోదు ఉపసంహరణకు గురైన 1,62,618 కంపెనీల్లో ముంబయి, దిల్లీ, హైదరాబాద్ ఆర్‌ఓసీల నుంచి రద్దయిన కంపెనీల సంఖ్యే 76,451గా ఉంది. ఆర్‌ఓసీ ముంబయి 33,000; ఆర్‌ఓసీ దిల్లీ 22,863; ఆర్‌ఓసీ హైదరాబాద్ 20,588 చొప్పున కంపెనీలను తొలగించినట్లు మేఘ్వాల్ పేర్కొన్నారు.

ఉక్కు రంగంలో ఏటా 6-7% వృద్ధి

● టాటా స్టీల్ ఛైర్మన్ చంద్రశేఖరన్



ముంబయి: దేశీయ ఉక్కు రంగ భవితపై ఆశావహ దృక్పథంతో ఉన్నట్లు టాటా స్టీల్ వెల్లడించింది. ఇందుకోసమే కళింగనగర్ ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే యోచనలో ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయంగా ఉక్కు డిమాండు 2017లో 1.3%, 2018లో 0.9% పెరిగే అవకాశం ఉందని టాటా స్టీల్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తెలిపారు. చైనాలో ఉక్కుకు గిరాకీ స్తబ్దుగా ఉంది. ఐరోపాలో కాస్త సానుకూల పరిస్థితులున్నాయి. భారత్ విషయానికొస్తే వచ్చే రెండేళ్లలో ఉక్కు గిరాకీ ఏటా 6-7 శాతం పెరిగే అవకాశం ఉంద'ని కంపెనీ 110వ వార్షిక సమావేశంలో వాటాదార్లనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన చెప్పారు. కంపెనీ వృద్ధికి కళింగనగర్ ప్లాంటే అత్యంత కీలకమని ఆయన అన్నారు. కంపెనీకి ఉన్న రూ.83,104 కోట్ల ఏకీకృత రుణాన్ని దీర్ఘకాలిక ప్రాతిపదికన తగ్గించుకుంటూ రావాలని తెలిపారు. బ్రిటన్‌లోని కోరస్ స్టీల్‌ను టాటా స్టీల్ కొనుగోలు చేయడాన్ని చంద్రశేఖర్ సమర్థించుకున్నారు. అంతర్జాతీయ వ్యాపార వృద్ధికి సంబంధించి దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కోరస్ స్టీల్ కొనుగోలుపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని చెప్పారు.

మార్కెట్ కబుర్లు

✦ బ్లూఓ ఎంటర్‌టైన్‌మెంట్‌ను స్మాష్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు విక్రయించినట్లు **పీవీఆర్ లిమిటెడ్** తెలిపింది. లావాదేవీ విలువ రూ.86 కోట్లు. కీలకమైన సినిమా వ్యాపారంపైనే దృష్టి కేంద్రీకరించేందుకు ఈ విక్రయాన్ని పీవీఆర్ చేపట్టింది.

✦ **వొడాఫోన్ ఇండియాలో** తన కార్యకలాపాల విలీనం నిమిత్తం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అనుమతి కోరినట్లు **ఐడియా సెల్యులార్** తెలిపింది.

✦ **భారతీ ఇన్‌ఫ్రాటెల్‌లో** 3.65 శాతానికి సమానమైన 6.75 కోట్ల షేర్ల విక్రయాన్ని పూర్తి చేసినట్లు భారతీ ఎయిర్‌టెల్ తెలిపింది. లావాదేవీ విలువ రూ.2,570 కోట్లు.

✦ భారత విపణిలో హెచ్ఐవీ ఔషధం యావోంజాను విక్రయించే నిమిత్తం డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) నుంచి అనుమతులు లభించాయని **మైలాన్** తెలిపింది.

✦ తొమ్మిది పెద్ద మొండి బకాయిల ఖాతాలను దివాలా స్మృతి పరిధిలోకి తెస్తున్నట్లు **పంజాబ్ నేషనల్ బ్యాంక్** తెలిపింది.

మార్కెట్లకు సెబీ షాక్

సమీక్ష

మార్కెట్లకు సెబీ షాక్ తగిలింది. ఎక్స్ఛేంజీల్లో నమోదైన 331 కంపెనీలను డొల్ల సంస్థలుగా అనుమానిస్తూ, వాటి లావాదేవీలు నిలిపివేయాలని సెబీ ఆదేశించడంతో ట్రేడింగ్‌పై ప్రభావం పడింది. అందువల్లే సూచీలు లాభాల్లోనే ప్రారంభమైనప్పటికీ, వరుసగా రెండో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ కీలక 10000 దిగువకు చేరగా.. సెన్సెక్స్ సైతం 32,000 కిందకు వచ్చింది. లోహ షేర్లు మాత్రం కళకళలాడాయి.

సెన్సెక్స్ ఉదయం 32341.05 పాయింట్ల వద్ద మెరుగ్గా ప్రారంభమైంది. అదే జోరులో 32354.77 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. అనంతరం అమ్మకాలు వెల్లువెత్తడంతో నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఏదశలోను కోలుకోలేదు. 31915.20 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయినా, చివరకు 259.48 పాయింట్ల నష్టంతో 32,014.19 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ సైతం 78.55 పాయింట్లు కోల్పోయి 9,978.55 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 9,947- 10,083.80 పాయింట్ల మధ్య కదలాడింది.

సత్తా చాటిన టాటా స్టీల్: ఆకర్షణీయ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో టాటా స్టీల్ షేరు ఉరకలేసింది. ఒకానొకదశలో 4.15 శాతం పెరిగి రూ.624.95 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2.63 శాతం లాభంతో రూ.615.75 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,530.62 కోట్లు పెరిగి రూ.59,802.62 కోట్లకు చేరింది

✦ అమెరికా అనుబంధ సంస్థ నోవెలిస్ మెరుగైన ఫలితాలు నమోదు చేయడంతో.. హిందాల్కో షేరు ఆరేళ్ల గరిష్ఠానికి చేరింది. బీఎస్ఈలో 3.25 శాతం పెరిగిన షేరు రూ.235.05 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 డీలాపడ్డాయి. డాక్టర్ రెడ్డీస్ 4.91%, కోల్ ఇండియా 2.67%, ఎస్‌బీఐ 2.33%, ఐటీసీ 2.07%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.70%, ఎన్‌టీపీసీ 1.69%, పవర్‌గ్రిడ్ 1.64%, యాక్సిస్ బ్యాంక్ 1.32%, ఓఎన్‌జీసీ 1.29%, సన్‌ఫార్మా 1.10%, మారుతీ సుజుకీ 1.06%, హీరో మోటోకార్ప్ 1.03% చొప్పున నష్టపోయాయి. మరోవైపు సిప్లా షేరు 2.32 శాతం పెరగ్గా, బజాజ్ ఆటో 0.82%, హిందుస్థాన్ యునిలీవర్ 0.17%లు రాణించిన వాటిలో ఉన్నాయి.

నేటి మార్కెట్

నేడు సూచీలు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. ఇటీవల పెరిగిన షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరించే అవకాశం ఉందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రధాన పరిణామాలేవీ లేకపోవడంతో మరో వారం రోజులు మార్కెట్లలో ఇదే ధోరణి కొనసాగొచ్చని అంటున్నారు. అనుమానిత డొల్ల కంపెనీలపై సెబీ చర్యల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించొచ్చని భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ నేపథ్యంలో షేరు ఆధారిత కదలికలు కనిపించొచ్చు. నేడు నిఫ్టీకి 10114- 10150 పాయింట్ల శ్రేణిలో నిరోధం ఎదురుకావొచ్చు. 9900- 9950 పాయింట్ల శ్రేణిలో మద్దతు లభించొచ్చని అంటున్నారు. నిఫ్టీ 10114 పాయింట్లు అధిగమిస్తే మినహా, చెప్పుకోదగ్గ లాభాలు ఉండకపోవచ్చు. విశ్లేషకులు బ్యాంకింగ్ షేర్లపై సానుకూల వైఖరి ప్రదర్శిస్తున్నారు. మెరుగైన వర్షపాతం కారణంగా గిరాకీ పెరిగి వాహన, ఎఫ్ఎంసీజీ షేర్లు రాణించొచ్చని ట్రేడర్లు భావిస్తున్నారు. త్రైమాసిక ఫలితాలు వెలువరించనుండటంతో టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్, అరబిందో ఫార్మా షేర్లపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు.

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(కోట్ల రూపాయల్లో)


కంపెనీ	నికర లాభం/(నష్టం) 2017–18	నికర లాభం/(నష్టం) 2016–17	మొత్తం ఆదాయం 2017–18	మొత్తం ఆదాయం 2016–17
థెర్మాక్స్ (కన్సా)	40	48.96	916.62	1,025.19
టాటా టెలీసర్వీసెస్	(506)*	554.15	745.40	
ఫస్ట్‌సోర్స్ సొల్యూషన్స్	65.40	73.30	877.70	893.50
ఎస్ఆర్ఎఫ్ (కన్సా)	103.81	154.56	1,408.74	1,305.51
టాటా కెమికల్స్ (కన్సా)	298.23	640	2,667.33	3,340.13
ముత్తూట్ ఫైనాన్స్	351	270	1,399	1,301
జాగరణ్ ప్రకాశన్ (కన్సా)	88.70	84.09	603.35	573.77
సెంచురీ టెక్స్‌టైల్స్	120.24	6.46	2,342.76	2,320.34
అబాట్ ఇండియా	48.25	74.01	714.73	738.12
ధాంపూర్ షుగర్ (కన్సా)	62.63	31.30	896.61	524.46
టీమ్‌లీజ్ సర్వీసెస్	16.42	6.40	852.96	687.53
ఫ్యూచర్ రిటైల్	147.85	70.55	4,707.44	3,985.22
జిందాల్ స్టీల్	(420.40)	(1,238)	6,156.60	---

వేదాంతా



రూ.290.90 వద్ద ప్రారంభమై రూ.290.90-301.70 మధ్య కదలాడి, క్రితం ముగింపు రూ.287.70తో పోలిస్తే రూ.10 (3.48%) లాభంతో రూ.297.70 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 18,77,796.

డాక్టర్ రెడ్డీస్



రూ.2205.80 వద్ద మొదలై రూ.2084.85-2206.95 మధ్య చలించి, క్రితం ముగింపు రూ.2206.95తో పోలిస్తే రూ.111.30(5.04%) నష్టంతో రూ.2095.65 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో చేతులు మారిన షేర్లు 13,60,991.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
ఐషర్ మోటార్స్	32,449.35	అజంతా ఫార్మా	1,290.00
బజాజ్ ఫైనాన్స్	1,829.50	డాక్టర్ రెడ్డీస్	2,084.85
బజాజ్ హోల్డింగ్స్	2,660.00	బ్లూ డార్ట్ ఎక్స్‌ప్రెస్	4,078.00
సెంచురీ టెక్స్‌టైల్స్	1,292.85	ఎరిస్ లైఫ్‌సైన్సెస్	545.00
ఏసీసీ	1,837.55	ఆస్ట్రాజెనికా ఫార్మా	891.25
దిలీప్ బిల్డ్‌కాన్	594.90	కేంబ్రిడ్జ్ టెక్నాలజీ	70.60

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

తేదీ	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	దేశీయ మదుపర్లు (డీఐఐలు) కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
08/08	6,246	4,706	1,540	3,152	2,353	799
07/08	3,790	3,989	−199	2,572	2,264	308
03/08	5,534	5,510	24	3,069	3,458	−389
02/08	4,062	3,588	474	2,671	2,904	−233
01/08	4,516	5,461	−946	4,313	2,923	1,391

కోడిగుడ్లు



8వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	324	విశాఖపట్నం	340
చిల్లరగా(ఒక గుడ్డు)	3.95	వరంగల్	326
బెంగళూరు	365	చిత్తూరు	365
9న		చెన్నై	372
విజయవాడ/గోదావరి	335	నమక్కల్	365

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1812.15 (1817.35) 384643
ADANI PORT & 414.80 (414.25) 2154068
AMBUJA CEMEN 274.15 (279.50) 921821
ASIAN PAINTS 1147.35 (1149.65) 600256
AUROBIND PHA 726.30 (724.45) 1707458
AXIS BANK LT 499.45 (505.80) 8898560
BAJAJ AUTO L 2911.60 (2889.25) 763401
BANK OFBAROD 156.55 (160.05) 5960785
BHARTI AIRTE 417.80 (417.45) 1797460
BHARTI INFRA 383.60 (397.85) 12856633
BOSCH LTD 24189.40 (24353.85) 10131
BPCL 505.05 (527.70) 4298541
CIPLA 578.60 (566.50) 1367344
COAL INDIA L 245.05 (251.50) 3335671
DR. REDDYS 2095.65 (2206.95) 1360991
EICHER MOTOR 32120.85 (31969.85) 47878
GAIL 386.75 (381.60) 3235669
HCL TECH 882.00 (886.00) 865948
HDFC 1719.90 (1725.40) 2915229
HDFC BANK 1777.90 (1788.55) 1008843
HERO MOTOCOR 3913.40 (3952.70) 253242
HINDALCO IND 234.90 (227.65) 24897407
HINDUSTAN UN 1191.00 (1186.30) 1329938
ICICI BANK 295.50 (300.15) 10288608
INDIABULLS H 1195.80 (1199.50) 1393086
INDIAN OIL 413.25 (431.20) 5164968
INDUSINDBANK 1638.65 (1650.50) 717420
INFOSYS LTD 963.85 (968.25) 3002324
ITC 274.15 (279.85) 12741118
KOTAK MAHIND 987.70 (997.90) 1222642
LARSEN & TOU 1171.20 (1179.95) 1531255
LUPIN 974.50 (985.05) 1097894
M&M 1400.00 (1400.75) 852827
MARUTI SUZIK 7755.90 (7838.65) 319951
NTPC LTD 171.15 (174.45) 3757008
ONGC 164.00 (165.90) 5981069
POWER GRID C 222.90 (225.95) 1816691
RELIANCE IND 1602.55 (1616.35) 2505568
SBI 303.65 (311.20) 13578680
SUN PHARMA 500.35 (505.55) 3042569
TATA CONSULT 2503.05 (2503.45) 536979
TATA MOT DVR 248.45 (250.35) 1817694
TATA MOTORS 430.00 (430.00) 7134979
TATA POWER 78.25 (80.00) 1840878
TATA STEEL L 616.45 (600.05) 20046119
TECH MAHINDR 398.25 (406.35) 2108254
ULTRATECH 4056.70 (4049.95) 236701
VEDANTA LIMI 297.70 (287.70) 18777967
WIPRO 287.40 (287.75) 2729913
YES BANK LTD 1763.55 (1799.85) 2329546
ZEE ENTERTAI 539.95 (540.65) 2100718

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1391.75 (1405.90) 29205
ASHOK LEYLAN 112.10 (111.20) 18644815
BAJAJ FINANC 1779.80 (1798.15) 1761065
BAJAJ FINSER 5336.10 (5433.05) 257108
BEL 181.85 (181.80) 3253870
BHEL 134.65 (138.90) 4737705
BRITANNIA 4072.35 (4107.80) 375176
CADILA HEALT 530.00 (533.05) 434232
COLGATE PALM 1066.85 (1071.85) 163103
CONTAINER 1168.55 (1184.40) 267317
CUMMINS INDI 936.30 (946.15) 400944
DABUR INDIA 314.95 (319.45) 1102440
DIVIS LAB 673.70 (684.05) 360022
DLF LIMITED 178.60 (191.35) 11942033
EMAMI LIMITE 1150.25 (1150.25) 165268
GLAXOSMI CON 5541.50 (5458.00) 19219
GLAXOSMI PHA 2380.00 (2399.80) 5133
GLENMARK PHA 668.25 (688.75) 677737
GODREJ CONSU 946.80 (967.20) 644518
HAVELLS INDI 485.15 (494.90) 571107
HINDUSTAN ZI 284.65 (285.15) 2504439
HPCL 436.15 (458.10) 7683762
ICICI PRU LI 433.65 (437.40) 975484
IDEA CELLULR 91.65 (93.05) 13411250
INTERGLOBE A 1295.50 (1287.65) 657078
JSW STEEL LT 230.85 (229.05) 4253146
LIC HOUS.FIN 681.10 (687.55) 2015826
MARICO LIMIT 333.95 (334.25) 2835258
MCDOWELL 2548.20 (2573.20) 250284
MOTHERSON 336.65 (339.55) 1695415
NHPC LTD 31.25 (31.00) 6212872
NMDC LTD 127.65 (125.75) 4380825
OIL INDIA 282.35 (287.25) 392815
ORACLE FIN S 3568.60 (3595.25) 17425
P&G HYG&HEAL 8087.05 (8099.25) 463
PETRONET LNG 211.35 (213.00) 5412245
PIDILITE IND 810.30 (813.55) 316684
PIRAMAL ENTE 2919.15 (2963.50) 97918
PNB 148.80 (152.10) 11529949
POWER FIN CO 135.65 (136.70) 7920726
RURAL ELEC C 179.05 (181.30) 7613532
SAIL 62.95 (62.40) 12125094
SHREE CEMENT 17767.65 (18122.85) 28680
SHRIRAM TRAN 970.85 (988.10) 1052560
SIEMENS 1344.45 (1359.55) 98766
SUN TV LTD 725.60 (754.60) 1470821
TITAN IND 609.40 (614.85) 1891037
TORRENT PHAR 1270.20 (1290.00) 59025
UNITED BREWE 820.95 (823.05) 172012
UPL LIMITED 863.35 (877.65) 660740

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 179.50 (178.15) 912330
ADANI ENTERP 137.35 (140.10) 2862404
ADANI POWER 31.60 (32.90) 5488733
ALL BANK 69.85 (71.85) 2543034
AMARA RAJA 800.95 (821.25) 575935
ANANT RAJIND 57.10 (60.80) 1367883
ANDHRA BANK 54.25 (55.65) 1869769
APOLLO HOSPI 1251.05 (1268.05) 182983
APOLLO TYRES 280.45 (285.50) 8342293
APTECH 213.25 (215.50) 345247
BAJAJ ELECT. 329.85 (331.95) 162378
BAJAJ HIND 15.30 (16.05) 5745999
BAJAJ HOLDIN 2540.20 (2562.30) 49360
BALAJI TELE 159.60 (164.15) 576204
BALLARPUR IN 15.80 (16.15) 2109933
BALRAMPUR CH 170.10 (178.95) 2826861
BANK OF MAHA 27.05 (27.70) 137884
BANK OFINDIA 152.55 (158.05) 5572082
BATA INDIA 634.25 (641.30) 697665
BGR ENERGY S 140.45 (142.95) 76901
BHARAT FORGE 1188.65 (1161.55) 1150152
BHUSHAN STEE 68.95 (72.50) 783373
BIOCON LTD 349.95 (354.25) 2005421
BOMBAY DYE 80.30 (82.90) 897409
CANARA BANK 346.65 (352.55) 1282187
CEAT LIMITED 1765.00 (1814.35) 681375
CENTRAL BANK 85.90 (86.70) 424835
CHAMBAL FERT 139.75 (141.50) 1576241
CHENNAI PETR 412.05 (417.85) 1166755
CITY UNIBANK 168.25 (171.10) 307813
CORPO BANK 48.55 (48.70) 418955
COX & KINGS 271.35 (275.65) 190003
D B REALTY L 38.25 (40.85) 1201926
DELTA CORP L 168.30 (175.60) 3003838
DENA BANK 32.70 (33.35) 484716
DHANALAKBANK 36.75 (38.05) 692136
EDELWEISS CA 238.15 (229.20) 7981037
EDUCOMP SOLU 8.35 (8.85) 337767
EID PARRY 312.70 (314.50) 178806
EIH 132.95 (131.05) 50506
ESSAR SHIPPI 26.55 (27.05) 22004
ESTER INDUST 35.35 (36.25) 184232
EXIDE INDUST 214.25 (215.70) 2235121
FEDERAL BANK 112.30 (114.50) 9187466
FINOLEX CABL 489.20 (492.65) 39763
G E SHIP LTD 387.70 (385.20) 66549
GAMMON INDIA 9.45 (9.35) 1188220
GAMMON INFRA 5.00 (4.95) 132586779
GATI LIMITED 117.55 (119.65) 352481
GAYATRI PROJ 163.90 (167.75) 66988
GITANJALIGEM 60.90 (62.80) 329114
GMR INFRASTR 17.70 (18.55) 25226585
GODREJ IND 629.25 (638.00) 429399
GRASIM IND 1108.65 (1125.10) 652914
GUJ ALK&CHEM 400.15 (399.70) 93140
HCL INFOSYS 45.95 (47.10) 634781
HDFC BANK 1810.00 (1810.00) 148090
HEXA TECH 261.40 (253.55) 1856992
HIMACHAL FUT 17.40 (18.20) 14738802
HINDU MOTORS 8.00 (8.25) 256032
HOUSING DEV 56.40 (69.25) 65274399
IDBI 55.75 (57.15) 2974699
IDFC 56.90 (58.55) 3164313
IFCI 25.25 (26.00) 4664348
IL&FS TRANS 86.50 (88.95) 320906
IND SWIFTLAB 35.75 (36.10) 10884
INDBULLS REL 253.70 (266.15) 25353284
INDIA CEM 193.20 (200.05) 2853067
INDIAN BANK 300.40 (304.80) 547721
INDO RAMA SY 29.75 (30.85) 59636
INDRAPRASTHA 1225.10 (1196.40) 464506
IND-SWIFTLTD 8.65 (9.10) 22719
INGERSOLL-R 815.20 (830.80) 8467
IOB 24.20 (24.65) 857719
IPCA LAB 454.05 (464.00) 35419
IRB INFRA DE 219.45 (225.00) 1982424
J&K BANK 79.95 (81.20) 121890
JAI CORP 79.20 (82.30) 625886
JAIN IRRIGAT 103.15 (101.35) 6957672
JAYPEE INFRA 20.80 (21.85) 1577616
JAYSHREE TEA 101.25 (102.30) 85063
JET AIRWAYS 630.20 (633.90) 2991187
JINDAL SAW 93.10 (96.20) 986704
JINDAL STEEL 139.50 (143.55) 21958214
JK LAKSHMI C 440.30 (446.10) 85763
JK PAPER LIM 95.30 (95.45) 876077
JM FINANCIAL 123.40 (123.95) 5010681
JP ASSOCIATS 26.20 (28.95) 160897238
JSW ENERGY L 70.95 (69.00) 16777385
JUBILANT FOO 1330.80 (1264.55) 1674075
JUBILANT ORG 688.10 (699.85) 169371

ఘనం (+)

నిఫ్టీ	8న	మార్పు %
VEDANTA	297.70	3.48
HINDALCO	234.90	3.18
TATA STEEL	616.45	2.73
CIPLA	578.60	2.14
GAIL	386.75	1.35
BAJAJ AUTO	2911.60	0.77
EICHER MOTORS	32120.85	0.47

గ్రహణం (-)

నిఫ్టీ	8న	మార్పు %
DR. REDDYS LAB	2095.65	-5.04
BPCL	505.05	-4.29
INDIAN OIL CORP	413.25	-4.16
BHARTI INFRATEL	383.60	-3.58
COAL INDIA	245.05	-2.56
SBI	303.65	-2.43
TATA POWER	78.25	-2.19

JYOTHY LABS 382.20 (384.55) 47939
KARNATA BANK 150.75 (154.90) 2154136
KEC INTL LTD 297.05 (298.85) 624079
KOLTE PATIL 158.65 (160.10) 44048
KPIT CUMMINS 120.70 (123.30) 761781
L&TFIN.HOLD 175.40 (176.40) 6120329
LAK VIL BANK 174.45 (176.75) 635469
M & M FINANC 425.55 (424.35) 2420788
MANAPPURAM G 104.35 (106.30) 4425570
MMTC LIMITED 57.80 (58.10) 584148
MOSER-BEAR 4.95 (5.10) 449017
MPHASIS LTD 581.50 (599.20) 150935
MRPL 139.00 (132.20) 7887620
MTNL 18.90 (19.45) 654938
NCC LIMITED 89.20 (90.15) 7682512
NETWORK18 FI 53.20 (54.80) 422197
NEULAND LAB 1389.75 (1381.65) 4904
NIIT LTD 88.20 (91.25) 454482
NIIT TECHNOL 489.20 (499.60) 243121
OMAXE LTD 202.25 (204.30) 530648
ONMOBILE GLO 61.30 (63.55) 203116
ORIENT PAPER 96.65 (97.60) 228173
ORIENTALBANK 136.45 (139.85) 2058099
PATEL ENGG 78.80 (81.35) 144718
PFIZER 1808.95 (1798.35) 13766
POLARIS SOFT 229.90 (240.25) 136754
POWERTRADING 118.65 (123.35) 2539639
PRAJ IND 74.30 (75.45) 171205
PRISM CEMENT 121.05 (118.25) 775251
PROVOGUE (IN 4.10 (4.30) 100367
PUNJ LLOYD 20.50 (21.45) 1967754
PUNJAB & SIN 51.25 (52.45) 80640
PURAVANKARA 74.20 (77.15) 186644
PVP VENTURES 5.10 (5.05) 240618
PVR LIMITED 1409.65 (1430.45) 293605
RADICO KHAIT 147.70 (151.45) 978200
RAJ OIL MILL 1.35 (1.45) 125905
RAJESH EXPOR 738.30 (739.35) 232250
RALLIS INDIA 239.60 (242.50) 98336
RAMCO IND 237.75 (225.85) 395894
RAMCO SYS 380.70 (386.25) 44817
RAMKY INFRA 92.15 (95.90) 155280
RAYMOND 775.80 (776.95) 427828
RELIANCE CAP 786.05 (781.40) 7306516
RELIANCE COM 22.90 (23.90) 13995098
RELIANCE INF 528.30 (542.20) 2040973
RELIANCE POW 41.80 (42.85) 2513948
ROLTA INDIA 55.15 (56.50) 324086
SAGAR CEMENT 830.55 (819.90) 4263
SAREGAMA 379.10 (411.40) 174966
SHANTHI GEAR 133.30 (136.90) 24795
SHIPPNG CORP 88.35 (88.75) 1127761
SHREE RENUKA 18.60 (19.30) 6208375
SINTEX IND 31.75 (36.10) 58120356
SOBHA DEVELO 378.40 (384.20) 772857
SOUTHINDBANK 28.55 (29.25) 7615591
STERLITE TEC 241.10 (238.00) 4330147
SUJANA METAL 1.90 (2.00) 99576
SUN PHARMA 368.10 (382.65) 677305
SUND FASTNER 391.65 (390.30) 113871
SUZLON ENERG 16.65 (17.30) 56665443
SYND. BANK 69.70 (71.65) 3406385
TATA CHEM 596.05 (607.00) 545816
TATA COFFEE 126.00 (127.80) 126085
TATA COMMUN 628.80 (651.30) 269887
TATA GLOBAL 166.00 (170.45) 2372930
TATA METALIK 671.45 (665.30) 312828
TATA TELESER 7.25 (7.55) 4541734
THE INDIAN H 129.95 (129.05) 274075
TORRENT POWE 197.90 (201.60) 2375567
TRIVENI ENGG 97.30 (106.75) 7977008
TTK PRESTIGE 6318.05 (6296.65) 4500
TV TODAY NET 234.75 (237.50) 32263
TV18 BROADCA 37.80 (38.65) 4811801
TVS MOTOR 595.30 (602.90) 568562
UCO BANK 31.95 (32.55) 398872
UNION BANK 142.40 (146.35) 3324166
UNITECH 8.05 (8.80) 59713248
UNITED BANK 19.05 (19.15) 387914
USHA MARTIN 21.50 (22.35) 1655150
VADILAL INDU 906.75 (914.50) 414758
VENKYS 2127.90 (2187.50) 113674
V-GUARD IND 181.35 (185.15) 673514
VIJAYA BANK 67.00 (67.35) 770344
VIP 191.85 (199.60) 223877
VOLTAS 537.45 (536.85) 878858
ZEE LEARN LI 42.90 (43.95) 183501
ZUARI GLOBAL 128.45 (131.65) 5682
ZYDUS WELLNE 885.30 (892.15) 4769

ALPHAGEO 827.20 (839.55) 7481
AMAR RAJA BA 801.20 (822.55) 25960
ANDHRA BANK 54.20 (55.70) 139210
ANDHRA CEMEN 9.53 (9.97) 24518
ANDHRA PAPER 300.20 (307.80) 9321
ANDHRA PETRO 26.50 (26.75) 70513
ANDHRA SUGAR 338.50 (352.70) 5746
ASTRA MICROW 129.25 (131) 23945
AUROBINDO PH 726.55 (724.15) 235625
AVANTEL SOFT 235.80 (238.30) 4766
AVANTI FEEDS 1760.20 (1803.20) 14609
BALAJI AMIN 328.20 (323.95) 1962
BARTRONICS 14.75 (15.05) 14470
BHAGYA NAG 23.10 (23.50) 9373
BN RATHI SEC 33.20 (33.65) 6513
BRILLIANT SE 7.79 (7.72) 54316
CAMBRIDGE TE 69.95 (71.35) 5371
CONT COFFEE 280.55 (281.85) 14175
COROMAN FERT 437.85 (443.65) 26887
CYIENT LIMIT 527.75 (524.55) 4698
DECCAN CEMEN 1122.60 (1110.05) 106
DIVI'S LAB 673.20 (683.20) 34957
DR REDDY 2101.70 (2210.30) 98832
FOUR SOFT 97.90 (103.15) 4484
GATI CORPN 117.80 (119.95) 73391
GAYATRI PROJ 164.10 (166.85) 5432
GMR INFRASTR 17.70 (18.55) 3441701
GOLDST INFRA 86.85 (87.35) 203342
GOLDSTONE EN 11.91 (10.91) 84619
GRANULES (I) 126.90 (132.30) 85474

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 12.70 (13.48) 4572796
HBL NIFE POW 46.15 (47.60) 27705
HERITAGE FOO 1308.70 (1296.45) 1970
HYD INDUS 1081.20 (1111.70) 3568
ILFS ENGINEE 43.55 (44.65) 22192
INNAREDY COM 2.86 (2.99) 12611
IVRCL INFRAS 5.87 (6.31) 750762
KAKATIYA CEM 374.90 (384.55) 7174
KAVERI SEED 659 (695.25) 213110
KCP LTD 101.40 (103.10) 23126
KNR CONSTRUC 208.25 (208.15) 5722
LANCO INDUS 367.85 (369.35) 18156
LANCO INFRAT 1.10 (1.15) 4267980
LAURUS LABS 573.70 (577.85) 4948
MADHUCON PRO 31 (32.05) 23196
MEGA SOFT 15.10 (15.55) 32088
MIC ELECTRON 7.93 (8.15) 164048
MOLDTK PLA 281.80 (283.70) 6325
MSR INDIA LT 25.05 (23.90) 12170
NAGARJAGRICH 35.40 (35.50) 16617
NATCO PHARMA 925.25 (960.80) 36490
NAVA BH VENT 129.20 (134) 23194
NCC 89.15 (89.95) 1077010
NCL IND 208.60 (213.55) 18630
NETTLINX 108.80 (115.15) 46632
NEULAND LAB 1378.80 (1388.80) 2657
NIHAR INFO 16.50 (16.90) 1113
PANYAM CEMEN 61.45 (63.15) 12581
PENNER IND 53.20 (54.40) 63760
PHYTOCHEM I 58.20 (59.55) 1918
PIONEER DIST 232.35 (227) 3383
PITTI LAMIN 52 (53.60) 7716
PREMIER EXPL 465.45 (466.10) 580
PRISM CEMENT 120.20 (118.45) 99402
PRUDENTL PHA 4.39 (4.52) 99240
RAIN INDUSTR 132.90 (132.65) 282044
SAMKRG PIST 288.05 (291.15) 6530
SATVAH. ISPA 41.80 (43.15) 6689
SPHERE GLOBA 52.35 (54.05) 7690
SREE RAYAL A 29.60 (29.60) 191358
STEEL EXCHAN 84.40 (85.95) 274368
SUJANA METAL 1.85 (1.94) 123429
SUJANA TOWER 4.20 (4.47) 6254
SUJANA UNIVE 1.05 (1.12) 136594
SURYALAKSH.C 104.70 (107.65) 4147
SUVEN PHARMA 165.20 (167.75) 49862
TAJ GVK HOTE 162.85 (164.05) 3892
TANLA 33.90 (34.80) 83833
TERA SOFTWAR 69.65 (70) 5159
VAMSHI RUBB 63.05 (64.55) 2279
VICEROY HOTE 19.25 (19.75) 67131
VIMTA LABS 136.40 (139.75) 10816
VISTA PHARMA 30.80 (31.50) 23082
VIVIMED LABS 118.65 (123.10) 151571
VST INDUS 2931.05 (2906.65) 1108
YBRANT DIGIT 6.97 (7.01) 58945
ZENTECH 55.20 (57.50) 22731

పర్యాటక ఏజెంట్లకే పన్ను వసూలు బాధ్యత

దిల్లీ: ఆన్‌లైన్ ద్వారా టికెట్ల బుకింగ్, ఇతరత్రా సేవలు నిర్వహించే పర్యాటక ఏజెంట్లు మూలం వద్ద 1 శాతం పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. వీళ్లను కూడా ఇ-కామర్స్ నిర్వాహకుల విభాగం కిందకు తీసుకొచ్చినట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సీబీఈసీ) తెలిపింది. జీఎస్‌టీ విధానంలో ఇ-కామర్స్ నిర్వాహకులు సరఫరాలపై 1 శాతం పన్ను వసూలు చేయాలి. దీనినే మూలం వద్ద పన్ను వసూలు (టీసీఎస్)గా వ్యవహరిస్తారు. ఒక వెబ్‌సైట్ ద్వారా సొంత ఉత్పత్తులు విక్రయించేవారికి టీసీఎస్ వర్తించదని సీబీఈసీ పేర్కొంది. ఈ సందర్భంలో జీఎస్‌టీ మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది.





బెంగుళూరులో ఒప్పందం ప్రకటన సందర్భంగా టైటన్ సీఈఓ (వాచీలు, విడిభాగాలు) ఎస్. రవికాంత్, అమెజాన్ ఇండియా డైరెక్టర్, జీఎం గోపాల్ పిళ్లై

అమెరికా మార్కెట్‌లోకి టైటన్

అమెజాన్‌తో ఒప్పందం

దిల్లీ: భారత్ దిగ్గజ చేతి గడియారాల కంపెనీ టైటన్ అమెరికా మార్కెట్‌లో అడుగు పెట్టనుంది. ఇందుకోసం అమెజాన్‌తో ఒప్పందం చేసుకుంది. తాము 2015 లో ప్రవేశపెట్టిన 'అంతర్జాతీయ విక్రయ విధానం'లో భాగంగా టైటాన్‌ను అమెరికా విపణిలో ప్రవేశపెడుతున్నామని, తమ ప్లాట్‌ఫామ్‌పై టైటాన్ ఉత్పత్తులు లభిస్తాయని అమెజాన్ ఇండియా డైరెక్టర్, విక్రయ సేవల జీఎం గోపాల్ పిళ్లై పేర్కొన్నారు. ఇరు సంస్థల భాగస్వామ్యాన్ని బ్రిటన్, జర్మనీ, జపాన్, మరిన్ని ఐరోపా దేశాలకు విస్తరించే యోచనలో ఉన్నామన్నారు. టైటన్ ఇండియా లిమిటెడ్ సీఈఓ (చేతిగడియారాల విభాగం) ఎస్. రవికాంత్ మాట్లాడుతూ 'తొలివిడతగా అమెరికాలో టైటాన్, ఫాస్ట్‌ట్రాక్ బ్రాండ్‌లకు చెందిన సుమారు 500 రకాల వాచ్ మోడళ్లను అందుబాటులో ఉంచనున్నాం. వీటి ధర 30- 300 డాలర్ల వరకూ ఉంటుంది. మార్కెట్ తీరు తెన్నులను అధ్యయనం చేశాక బంగారు ఆభరణాల విక్రయాలను ప్రారంభించే యోచనలో ఉన్నామని' అన్నారు.

టీవీఎస్ జూపిటర్ క్లాసిక్ స్కూటర్

ధర రూ.55,266



చెన్నై: టీవీఎస్ మోటార్ సరికొత్త జూపిటర్ స్కూటర్‌ను విడుదల చేసింది. 'క్లాసిక్ ఎడిషన్'గా పిలిచే ఈ వాహన ఇంజిన్ సామర్థ్యం 110 సీసీ. దీని ధరను రూ. 55,266 (ఎక్స్ షోరూం)గా నిర్ణయించినట్లు సంస్థ వెల్లడించింది. గుండ్రంగా ఉండే అద్దాలు, యూఎస్‌బీ ఛార్జర్, విండ్ షీల్డ్, డిస్క్ బ్రేకుల వంటి ప్రత్యేకతలు ఈ బైక్‌కు అమర్చినట్లు తెలిపింది. జూపిటర్‌ను తొలిసారిగా 2013లో సంస్థ తీసుకొచ్చింది. ఇప్పటి వరకు 15 లక్షలకు పైగా జూపిటర్ స్కూటర్లు అమ్ముడు పోయినట్లు సంస్థ పేర్కొంది.

డొమినోస్ పిజ్జాలో కొత్త రుచులు!

- రూ.100 కోట్ల పెట్టుబడులు
- ఈ ఏడాది 40-50 కొత్త విక్రయశాలలు
- జుబిలెంట్ ఫుడ్ నిర్ణయం



దిల్లీ: డొమినోస్ పిజ్జా, డంకిన్ డోనట్స్ రెస్టారెంట్లను నడుపుతున్న జుబిలెంట్ ఫుడ్‌వర్క్స్ తన డొమినోస్ పిజ్జా ఉత్పత్తుల్లో కొన్ని మార్పులు చేపట్టనుంది. ఇందు కోసం రూ. 100 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. నవీకరణ చేసినప్పటికీ.. ఉత్పత్తుల ధరల్లో మార్పు ఉండదని కంపెనీ తెలిపింది. కంపెనీ చేపడుతున్న వ్యయ నియంత్రణ చర్యలకు తోడు పూర్తి సామర్థ్యంతో పనిచేయడం; జీఎస్‌టీ నుంచి వస్తున్న ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ వల్ల ఈ పెట్టుబడులు పెట్టగలమని భావిస్తోంది. అందువల్ల మార్జిన్లపై ప్రభావం పడదని అంచనా వేస్తోంది. నవీకరణలో భాగంగా క్రస్ట్, టాపింగ్స్, చీజ్, సాస్‌లలో మార్పులు చేస్తున్నట్లు జుబిలెంట్ ఫుడ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) ప్రతీక్ పోతా పేర్కొన్నారు. కొత్త, ప్రస్తుత వినియోగదార్లను ఆకట్టుకునేందుకు భారీ ఎత్తున వ్యాపార ప్రకటనలను ఇవ్వనున్నట్లు తెలిపింది. 2017-18లో 40-50 కొత్త విక్రయశాలలు ప్రారంభించడానికి డొమినోస్ పిజ్జా కట్టుబడి ఉన్నట్లు ప్రతీక్ వెల్లడించారు.

విజయా బ్యాంక్

రుణ రేట్ల కోత

ముంబయి: విజయా బ్యాంక్ నిధుల వ్యయం ఆధారిత రుణ రేటును (ఎంసీఎల్‌ఆర్) 25-30 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. ఈ రేట్ల కోతను ఓవర్‌నైట్, నెల, మూడు నెలల కాలపరిమితులకు మాత్రమే వర్తింపజేసింది. మిగిలిన కాలపరిమితుల విషయంలో ఎంసీఎల్‌ఆర్‌ను యథాతథంగా ఉంచింది. తాజా కోతతో విజయా బ్యాంక్ ఎంసీఎల్‌ఆర్ 8.10- 8.75% మధ్య ఉండనుంది. ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణ రేట్ల వివరాలను ప్రతి నెలా వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించిన సంగతి తెలిసిందే.

యాక్సిస్ బ్యాంక్

పొదుపు రేట్ల తగ్గింపు

ముంబయి: ప్రైవేటురంగ యాక్సిస్ బ్యాంక్ పొదుపు ఖాతాలలోని నిల్వలపై వడ్డీ రేటును తగ్గించింది. రూ. 50 లక్షలలోపు నగదు నిల్వలపై వడ్డీ రేటును 0.50 శాతం తగ్గించినట్లు బ్యాంకు వెల్లడించింది. అంటే ఇకపై 3.50 శాతం వడ్డీ మాత్రమే లభిస్తుంది. రూ. 50 లక్షలపైన నగదు నిల్వలు ఉన్న ఖాతాలకు యథాతథంగా 4 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపింది. సవరించిన వడ్డీ రేట్లు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చినట్లు బ్యాంకు వివరించింది.

జీఎస్‌టీఎన్ పోర్టల్

రిటర్న్‌ల దాఖలుకు సిద్ధం

దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం కింద వ్యాపారులు తమ తొలి పన్ను రిటర్న్‌లను జీఎస్‌టీఎన్ పోర్టల్‌లో దాఖలు చేసుకోవచ్చు. ఇందుకు జీఎస్‌టీఆర్-3బీ విండోను ఈనెల 5న ప్రారంభించినట్లు జీఎస్‌టీఎన్ ఛైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఇది పూర్తి స్థాయిలో పని చేస్తోందని తెలిపారు. పన్ను చెల్లింపుదార్లు జీఎస్‌టీ పోర్టల్‌కు లాగిన్ అవ్వడం ద్వారా ఎప్పుడు కావాలంటే అప్పుడు రిటర్న్‌లు దాఖలు చేసుకోవచ్చని వివరించారు. జులై, ఆగస్టుకు సంబంధించి పన్ను రిటర్న్‌లను సరఫరా, ఇన్‌పుట్ క్రెడిట్ వివరాలతో జీఎస్‌టీఆర్ 3బీ ఫారం పూర్తి చేసి జీఎస్‌టీఎన్ పోర్టల్ ద్వారా దాఖలు చేయవచ్చు. జులై పన్ను రిటర్న్‌ల దాఖలుకు ఈనెల 20 ఆఖరు తేదీ కాగా.. ఆగస్టు నెల రిటర్న్‌లకు సెప్టెంబరు 20 చివరి తేదీ.

మూడు విభాగాల్లో..: జీఎస్‌టీఆర్-3బీ ఫారానికి సంబంధించి మూడు విభాగాల్లో వివరాలను పన్ను చెల్లింపుదార్లు పూర్తి చేయాల్సి ఉంటుందని జీఎస్‌టీఎన్ తెలిపింది. తొలి విభాగంలో సరఫరా, రెండో విభాగంలో ఐటీసీ, మూడో విభాగంలో పన్ను చెల్లింపులకు సంబంధించిన వివరాలను పొందుపర్చాల్సి ఉంటుందని పేర్కొంది. డిజిటల్ సంతకం లేదా గుర్తింపు మొబైల్ నెంబరుకు వచ్చిన వెరిఫికేషన్ కోడ్ ఆధారంగా పన్ను చెల్లింపుదార్లు రిటర్న్‌లు దాఖలు చేయాల్సి ఉంటుందని వివరించింది.



కార్డు కష్టాల్.. నష్టాల్



● కార్డు ఇక్కడ.. కొనుగోళ్లు విదేశాల్లో ● క్రెడిట్ కార్డుదారులకు తలనొప్పులు

● అంతర్జాతీయ వినియోగం ఆపుకోవాలి ● అవసరమైనపుడు యాక్టివేట్ చేసుకోవచ్చు ● కార్డు సంస్థలు, బ్యాంకులు దృష్టి సారించాలి

ఈనాడు - హైదరాబాద్

క్రెడిట్ కార్డు మోసాలు కొత్తేమీ కాదు.. కానీ కార్డు ఇక్కడ ఉండగా, ఒకే సమయంలో వివిధ దేశాల నుంచి ఆ కార్డు ఆధారంగా కొనుగోళ్లు జరగడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయంగా వినియోగించుకునేందుకు వీలున్న కార్డుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

✦ ఇవీ.. తాజా ఘటనలు

నర్సారావుపేటకు చెందిన దుర్గాప్రసాద్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వాడుతున్నారు. పరిమితి రూ. 1,50,000 వరకు ఉంది. ఆదివారం రాత్రి ఆయనకు కార్డు వాడకానికి సంబంధించి, మొబైల్‌కు సందేశాలు రావడం ప్రారంభమయ్యాయి. డాలర్లు, పౌండ్లు, న్యూజిలాండ్ డాలర్లు తదితర కరెన్సీల రూపంలో కొనుగోళ్లు జరిగినట్లు సందేశాలు వచ్చాయి. ఇలా మొత్తం 50 లావాదేవీలు జరగ్గా, వాటి విలువ దాదాపు రూ. 1,84,060 వరకు ఉంది. క్రెడిట్‌కార్డు పరిమితి కంటే కాస్త అధికంగా వెచ్చించుకునేందుకు సంస్థలు అనుమతించడంతో, ఇది సాధ్యమైంది. హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచీ ఇలాగే రూ. 1,05,000 వరకు ఖర్చయ్యాయి. క్రెడిట్ కార్డు ద్వారా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న మోసాలకు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలు.

✦ ఎలా జరిగి ఉంటుంది?

కార్డు మన దగ్గరే ఉండగా.. అమెరికా, ఫ్రాన్స్, న్యూజిలాండ్ తదితర దేశాల్లో ఉపయోగించడం ఎలా సాధ్యం అనే సందేహం రావడం సహజమే. అలా జరిగేందుకు ఉన్న అవకాశాలను బ్యాంకింగ్ నిపుణులు వెల్లడిస్తున్నారు. చాలా దేశాల్లో కార్డు వినియోగానికి సంబంధించి రెండంచెల భద్రత లేదు. కేవలం క్రెడిట్‌కార్డు సంఖ్య, గడువు తేదీ, సీవీవీ సంఖ్య తెలిస్తే చాలు.. లావాదేవీ పూర్తి చేసుకోవచ్చు. ఈ వెసులుబాటును ఉపయోగించుకునే మోసగాళ్లు ఎంతో తెలివితో వ్యవహరిస్తున్నారు. కార్డు పరిమితి మొత్తాన్ని ఒకే దేశంలో ఉపయోగించడం లేదు. వివిధ దేశాల్లో కొనుగోళ్లు జరపడం ద్వారా తప్పించుకునే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. దొంగిలించిన కార్డు వివరాలను తమ నెట్‌వర్క్‌తో పంచుకొని, సులువుగా పని కానిస్తుండొచ్చని బ్యాంకింగ్ నిపుణులు పేర్కొన్నారు.

✦ జాగ్రత్త పడాలి

'క్రెడిట్ కార్డులను ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా వాడుకునే వీలుంటుంది. గతంలో కార్డులను జారీ చేసేప్పుడు ఈ వెసులుబాటును 'యాక్టివేట్' చేసి ఇచ్చేవి. కార్డుదారుడు, కార్డు ఆన్‌లైన్ ఖాతాలోకి వెళ్లి దీన్ని 'డీయాక్టివేట్' చేసుకోవాల్సిన అవసరం ఉండేది. చాలామంది ఖాతాదారులు దీన్ని పట్టించుకోరు. ఇలాంటి కార్డులకు ఈ సమస్య వచ్చే అవకాశం కొట్టిపారేయలేమ'ని బ్యాంకింగ్ నిపుణులు తెలిపారు. గత ఏడెనిమిది నెలలుగా క్రెడిట్ కార్డులను ఇచ్చేప్పుడు కార్డు సంస్థలు నేరుగా అంతర్జాతీయ వెసులుబాటును ఇవ్వడం లేదనీ, అవసరం ఉన్నప్పుడే 'యాక్టివేట్' చేసుకోమని సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

బ్యాంకులు సమాచారం కోరవు

బ్యాంకు అధికారులు ఎప్పుడూ మీ కార్డు నెంబరు, ఇతర వివరాలు అడగరు. ఎవరైనా ఫోన్ చేసి, ఆ వివరాల గురించి అడిగితే వెంటనే కట్ చేయండి.

- ✦ ఈ వివరాల కోసం ఇ మెయిల్స్ వచ్చినా సమాధానం ఇవ్వొద్దు. ఎందుకంటే, బ్యాంకుల నుంచి వచ్చే మెయిళ్లలో 'రిప్లై' ఇవ్వకండి.. అని స్పష్టంగా పేర్కొంటారు. దీనికి భిన్నంగా రిప్లై ఇవ్వమంటున్నారంటే.. అది మోసమే.
- ✦ కార్డు లావాదేవీలకు సంబంధించిన ప్రతి సమాచారాన్నీ భద్రం చేసుకోండి. బిల్లులో తేడా వస్తే బ్యాంకు దృష్టికి తీసుకెళ్లండి. ఎప్పటికప్పుడు పిన్‌ను మార్చండి.
- ✦ మీరు చేయని లావాదేవీకి సంబంధించి ఎస్ఎంఎస్, మెయిల్ వస్తే వెంటనే బ్యాంకు వినియోగదారుల కేంద్రానికి ఫోన్ చేయండి. ఆన్‌లైన్ ఖాతాలోకి ప్రవేశించి, కార్డును తాత్కాలికంగా నిలిపి వేయండి.
- ✦ అంతర్జాతీయ వినియోగానికి సంబంధించిన ఆప్షన్‌ను వెంటనే 'డీయాక్టివేట్' చేయండి. అవసరమైతే పాత కార్డు రద్దు చేసి, కొత్త కార్డు పంపించాల్సిందిగా కార్డు సంస్థను కోరండి.
- ✦ అనధికార వ్యవహారాన్ని గుర్తిస్తే బ్యాంకు దృష్టికి తీసుకెళ్లడంలో ఆలస్యం చేయకండి. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయండి.

✦ తేడా ఇదీ

మన దేశంలో క్రెడిట్ కార్డు ఉపయోగించే విషయంలో రెండంచెల భద్రత ఉంటుంది. ఆర్‌బీఐ నిబంధనల మేరకు నమోదిత మొబైల్ నెంబరుకు కచ్చితంగా వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. దాన్ని నమోదు చేస్తేనే లావాదేవీ పూర్తవుతుంది. అయినా కూడా మోసగాళ్లు.. కార్డుదారుడికి ఫోన్ చేసి, కార్డుకు సంబంధించిన కొన్ని వివరాలు చెప్పి, కార్డు బ్లాక్ అవుతుందనో, మరే కారణాలో చెబుతూ.. మిగతా వివరాలు రాబడతారు. అదే సమయంలో ఓటీపీ వస్తుందని చెప్పి, దాన్ని తెలుసుకొని, తమకు కావాల్సిన లావాదేవీలను పూర్తి చేసుకుంటున్నారు. కొన్నిదేశాల్లో ఓటీపీ లాంటి రెండంచెల భద్రత లేకపోవడం, మోసగాళ్లకు వరం అవుతోంది. ఆయా దేశాల్లోని సర్వర్లను ఉపయోగించుకొని, ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేయడానికి మన కార్డులు వాడుతున్నారు. 'ఇక్కడా వారు జాగ్రత్త తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది.. ఒకే వెబ్‌సైట్‌లో మొదటి సారి లావాదేవీ విషయంలో ఏ ఇబ్బందీ ఉండదు. కానీ, వెంటవెంటనే అదే సైట్‌లో కొనుగోళ్లు చేసినప్పుడు కొన్ని ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుంది. దీన్ని తప్పించుకోవడం కోసం.. వేర్వేరు వెబ్‌సైట్లు, సర్వర్లు, దేశాల నుంచి కార్డును వాడుతున్నారేమో' అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు బ్యాంకింగ్ నిపుణులు.

✦ వివరాలు ఎలా తెలుస్తాయి?

ఏ మాత్రం సురక్షితం కాని చోట కార్డులను వాడినపుడు, సమాచారాన్ని దొంగిలించి, మరో క్రెడిట్ కార్డు తయారు చేయడం (క్లోనింగ్) ఏమంత కష్టం కాదు. కార్డుల సమాచారాన్ని భద్రపరిచే కొన్ని ఏజెన్సీలు కూడా సున్నిత సమాచారాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని వెబ్‌సైట్లలో కార్డులను వినియోగించినప్పుడు కూడా ఈ సమాచారం తస్కరిస్తున్నారు. ఫోన్లు చేసి, మాయమాటలతో క్రెడిట్ కార్డుల సమాచారాన్ని తెలుసుకున్న ఉదంతాలు ఎన్నో.

✦ కార్డు సంస్థకూ బాధ్యత ఉంది

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిబంధనల ప్రకారం ప్రతి లావాదేవీకి సంబంధించి ఎస్ఎంఎస్, ఇ మెయిల్ రూపంలో కార్డుదారుడికి సమాచారం రావాలి. ఇలా జరగనపుడు, ఏదైనా అనధికార లావాదేవీ జరిగితే, కార్డు సంస్థే దానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. మన దేశంలో జరిగే లావాదేవీల వరకు ఈ నిబంధన ఖాతాదారులకు ఉపయోగ పడుతోంది. కానీ, అంతర్జాతీయంగా జరిగే మోసాలు ఎలా నివారించాలన్నది సమస్యే. బ్యాంకులు ఈ విషయంలో దృష్టి సారించాలి.

- ✦ ఖాతాదారులు స్వయంగా పిన్ నమోదు చేయాలి. పీఓఎస్ యంత్రాలను మన దగ్గరికే తీసుకురమ్మనడం శ్రేయస్కరం.

కొత్త విపణుల కోసం

ట్రయంఫ్ బజాజ్ ఆటో జట్టు

మోటర్‌సైకిళ్ల తయారీ, సరఫరాలో సహకారం

దిల్లీ: కలిసికట్టుగా కొత్త విపణుల్లోకి అడుగు పెట్టే లక్ష్యంతో బ్రిటన్‌కు చెందిన బైక్‌ల తయారీ సంస్థ ట్రయంఫ్, దేశీయ ఆటో దిగ్గజం బజాజ్ ఆటో జట్టుకట్టాయి. మధ్య శ్రేణి మోటార్‌సైకిళ్ల రూపకల్పన, అభివృద్ధి, సాంకేతికత, నాణ్యత, ప్రపంచవ్యాప్త సరఫరా తదితరాల విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. ఇదే విషయాన్ని బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టరు రాజీవ్ బజాజ్, ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) నిక్ బ్లూర్ సంయుక్తంగా తెలియజేశారు. అమ్మకాల వృద్ధికి అవకాశాలుండే కొత్త వ్యాపార విపణుల్లోకి అడుగుపెట్టేందుకు, వర్ధమాన విపణుల్లో తన ఉనికి విస్తరించుకునేందుకు ట్రయంఫ్‌నకు ఈ ఒప్పందం ఉపకరిస్తుంది. ట్రయంఫ్ బ్రాండు, మోటార్‌సైకిళ్లను ఉపయోగించుకోవడం ద్వారా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరిన్ని మోటార్‌సైకిళ్లను బజాజ్ ఆటో అందుబాటులోకి తెచ్చేందుకు వీలు కలుగుతుందని పేర్కొంది. ప్రస్తుతం సీటీ 100 (110 సీసీ) నుంచి డామినర్ (372 సీసీ) వరకు వివిధ శ్రేణుల్లో బైక్‌లను బజాజ్ ఆటో విక్రయిస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన కేటీఎం భాగస్వామ్యంతో మరికొన్ని అధిక సీసీ బైక్‌లను కూడా అమ్ముతోంది. ట్రయంఫ్ పోర్ట్‌ఫోలియోలో రాకెట్ 3, స్పీడ్ ట్రిపుల్, డేటోనా 200, స్పోర్ట్స్ డేటోనా 675ఆర్, టైగర్ 800 లాంటి అధిక సీసీ బైకులు ఉన్నాయి.

మొబైల్ యాప్‌లకోసం

ఎన్ఎస్‌డీసీ, గూగుల్ శిక్షణ

దిల్లీ: మొబైల్ యాప్ డెవలపర్లకు శిక్షణ ఇచ్చేందుకు జాతీయ నైపుణ్య, శిక్షణాభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌డీసీ), గూగుల్ ఇండియా కలిసి వస్తున్నాయి. ఆండ్రాయిడ్, వెబ్ ప్లాట్‌ఫాంలలో నడిచే ఫోన్లలో అప్లికేషన్ల(యాప్స్)ను అభివృద్ధి చేయడంలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రారంభ దశలో ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లకు అప్లికేషన్లను అభివృద్ధి చేసేందుకు శిక్షణ ఇస్తారు. వంద గంటల పాటు ఉండే ఈ కోర్సును ఎన్ఎస్‌డీసీ భాగస్వామ్య ఏజెన్సీలు రూపొందిస్తాయి. మొబైల్ రంగంలో శిక్షణనిచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎన్ఎస్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్, కార్యనిర్వహణాధికారి మనీష్ కుమార్ అన్నారు.

తొలి త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం

రూ.6.50 లక్షల కోట్లు

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో ప్రభుత్వ వ్యయం 27 శాతం పెరిగి రూ. 6.50 లక్షల కోట్లకు చేరిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. బడ్జెట్‌ను ఒక నెల ముందుకు జరపడమే ఇందుకు కారణమని అన్నారు. ప్రభుత్వ వ్యయాలు పెంచేందుకు తీసుకున్న ఈ నిర్ణయం సత్ఫలితాన్ని ఇచ్చిందని రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో జైట్లీ తెలిపారు. గతంలో బడ్జెట్‌కు మే నెల మధ్యలో పార్లమెంట్ ఆమోదం తెలిపేది. దీని వల్ల ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి ప్రభుత్వ వ్యయాలు ప్రారంభమయ్యేవి. ఈ జాప్యాన్ని అరికట్టేందుకు బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం నెల రోజుల ముందే ప్రవేశపెట్టిన సంగతి విదితమే. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ప్రభుత్వం రూ. 6,50,731 కోట్లు ఖర్చు చేసింది. 2017-18 బడ్జెట్ అంచనాల్లో ఇది 30.3 శాతానికి సమానం. 2016-17 ఇదే త్రైమాసికంలో ఇవి రూ. 5,11,833 కోట్లు (బడ్జెట్ అంచనాల్లో 25.9 శాతం)గా నమోదైందని జైట్లీ చెప్పారు.

ఉద్దేశపూర్వకంగా రూ.92,400 కోట్ల ఎగవేత: ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఉద్దేశపూర్వక ఎగవేతదార్లు మొత్తం రూ. 92,400 కోట్ల బకాయిలు పడ్డట్లు ఆర్థిక సహాయ మంత్రి సంతోశ్ కుమార్ గంగ్వార్ రాజ్యసభకు తెలిపారు. మొత్తం 8915 ఎగవేతలు చోటు చేసుకోగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 కింద 5,954 కేసుల్లో విషయంలో బ్యాంకులు చర్యలు మొదలుపెట్టినట్లు ఆయన తెలిపారు.

ఆధునిక సాంకేతికతతో అపర్ణా టైల్స్

సంస్థ డైరెక్టర్ డి.ఎస్.ప్రసాద్


ఈనాడు, కాకినాడ: తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం వద్ద 12 నెలల వ్యవధిలో నెలకొల్పిన పరిశ్రమలో ప్రీమియమ్ టైల్స్ తయారీ చేపడతామని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ డి.ఎస్.ప్రసాద్ ఇక్కడ తెలిపారు. రోజుకు 15,000 చదరపు మీటర్ల టైల్స్ ఈ పరిశ్రమలో తయారవుతాయని వివరించారు. దక్షిణాదిలో భారీ టైల్స్ తయారీ కర్మాగారం తమదేనన్నారు. టైల్స్ తయారీకి నాణ్యమైన ముడి సరకు వినియోగిస్తామని చెప్పారు. దేశంలోనే అతి పెద్దదైన 265 మీటర్ల పొడవు బట్టీ ద్వారా కిల్న్‌శాక్‌మి ఇటలీ సాంకేతిక పరిజ్ఞానంతో టైల్స్ తయారీ చేపడుతున్నామన్నారు. తమకు 110 మంది డీలర్లు ఉన్నారని వివరించారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సేల్స్, మార్కెటింగ్ ఎ.కె.రవీంద్రన్ మాట్లాడుతూ నాలుగు రకాల సైజుల్లో టైల్స్ అందుబాటులోకి తెస్తున్నామన్నారు. వినియోగదారు కోరిక మేరకు వారు కోరుకున్న సైజుల్లో రెండు రోజుల వ్యవధిలో టైల్స్ డిజైన్ చేసి అందిస్తామని వివరించారు. టెక్నికల్ డైరెక్టర్ టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సెప్టెంబరు నుంచి తమ ఉత్పత్తులు మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తాయన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అపర్ణా టైల్స్ డైరెక్టర్ డి.ఎస్.ప్రసాద్, పక్కన టెక్నికల్ డైరెక్టర్ టి.చంద్రశేఖర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్, మార్కెటింగ్) ఎ.కె.రవీంద్రన్

డేటా విశ్లేషణతో వృద్ధి.. ఉపాధి

- చిన్న తరహా సంస్థల వృద్ధికి ఊతం
- ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకులు నందన్ నీలేకని



బెంగళూరు: ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న చాలా సమస్యలకు డేటా విశ్లేషణ పరిష్కారం చూపుతుందని ఇన్ఫోసిస్ సహ-వ్యవస్థాపకులు నందన్ నీలేకని అన్నారు. భవిష్యత్తులో చిన్న తరహా పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందేందుకు బిగ్ డేటా ఉపయోగపడుతుందని, తద్వారా వృద్ధి రేటు పుంజుకోవడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. 'వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)తో దాదాపు 80 లక్షల చిన్న తరహా సంస్థలు కూడా డిజిటల్ బాట పట్టనున్నాయి. తద్వారా పారదర్శకత పెరగడంతో పాటు వాటి కార్యకలాపాలకు సంబంధించి మరింత కచ్చిత సమాచారం బ్యాంకులకు లభిస్తుంది. ఫలితంగా చిన్న తరహా సంస్థలకు మరిన్ని రుణాలు లభించే అవకాశం ఉంటుంది. రుణాలు లభిస్తే కార్యకలాపాలు విస్తరించడంతో పాటు మరింత మందికి ఉపాధిని కల్పిస్తాయి' అని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సమావేశంలో నీలేకని పేర్కొన్నారు.

భద్రతకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలి.. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరుగుతున్న తరుణంలో డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ సేవలకు గిరాకీ పెరుగుతోంది. అందువల్ల డేటా భద్రత, వ్యక్తిగత సమాచార గోప్యత వంటి వాటికి కోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని నీలేకని అన్నారు. 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకింగ్ రంగంలో డేటాను కొంత మేరకు నియంత్రిస్తోంది. ఆరోగ్య రంగ నియంత్రణ సంస్థ ఆ రంగంలోని డేటాను ఇలాగే నియంత్రిస్తుందా, లేదా అనే విషయమై స్పష్టత లేదు. ఇదే విషయంపై సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'డేటా ప్రొటెక్షన్ కమిటీ' నివేదిక కోసం అందరూ ఎదురు చూస్తున్నట్లు' తెలిపారు. నిరర్థక ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు ఉర్జిత్ పటేల్ నేతృత్వంలోని ఆర్‌బీఐ బాగానే పని చేస్తోందని నీలేకని పేర్కొన్నారు.

ఈనాడు సినిమా



'స్పైడర్'లో మహేష్‌బాబు

బాండ్... జేమ్స్ బాండ్

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'స్పైడర్'. మురుగదాస్ దర్శకుడు. రకుల్‌ప్రీత్ సింగ్ కథానాయిక. ఎన్.వి.ప్రసాద్ నిర్మాత. బుధవారం మహేష్‌బాబు పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు 'స్పైడర్' టీజర్‌ని విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన 'బూమ్ బూమ్' పాటకు వస్తున్న స్పందన పట్ల చిత్రబృందం సంతోషం వ్యక్తం చేసింది. జేమ్స్‌బాండ్ తరహా పాత్రలో మహేష్‌బాబు కనిపించనున్నారు. ఇందులో కథానాయకుడు ఓ రహస్య గూఢచారి అన్నమాట. "ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం డబ్బింగ్, రీ రికార్డింగ్ పనులు జరుగుతున్నాయి. విజయ దశమి సందర్భంగా అక్టోబరు 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామ"న్నారు నిర్మాత. ప్రముఖ దర్శకుడు ఎస్.జె.సూర్య ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హారీశ్ జయరాజ్.

లక్నోలో భరత్: మరోవైపు కొరటాల శివ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు మహేష్. రాజకీయ నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి 'భరత్ అను నేను' అనే పేరు పరిశీలిస్తున్నారు. ఈనెల 11 నుంచి 22 వరకూ లక్నోలో కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తారు. మహేష్, కథానాయిక కైరా అడ్వాణీ, ప్రకాష్‌రాజ్ ఇతర ముఖ్య తారాగణం ఈ షెడ్యూల్‌లో పాలుపంచుకోనున్నారు. పీటర్ హెయిన్స్ నేతృత్వంలో ఓ పోరాట సన్నివేశాన్ని కూడా చిత్రీకరిస్తారు.



దేవిశ్రీ ప్రసాద్... ఈ పేరు చాలు పూనకంతో ఊగిపోవడానికి. మాస్‌తో దరువేయించే పాట దేవి సొంతం. ప్రేమికుల మధ్య మూగ బాసలకు భావాలు అద్ది, వాళ్ల హృదయాల్లో చొరబడే ప్రణయ గీతాలకు దేవి కేరాఫ్ అడ్రస్! ప్రత్యేక గీతాలతో తీన్ మార్ ఆడించే... 'ఐటెమ్ రాజా' దేవిశ్రీ. ప్రేమ, విరహం, స్నేహం.. ఎలాంటి భావనకైనా తన బాణీతో ప్రాణం పోయగలడు. అందుకే మాస్, క్లాస్ అనే తేడా లేకుండా సంగీత అభిమానులందరితోనూ మూకుమ్మడిగా స్టెప్పులు వేయిస్తున్నాడు. ఈనెల 11న విడుదల కాబోతున్న 'జయ జానకి నాయక' చిత్రానికీ తనే సంగీత దర్శకుడు. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పుకొచ్చిన కబుర్లు.

బోయపాటిలో సరికొత్త కోణం చూస్తారు

'జయ జానకి నాయక' కథకి సంగీతం అందించే విషయంలో మిమ్మల్ని ప్రేరేపించిన అంశాలేంటి?

బోయపాటితో ఇది నా నాలుగో సినిమా. ఆయన చిత్రాల్లో కథాబలం ఎక్కువగా కనిపిస్తుంది. అలాంటప్పుడు పాటలకే కాదు, నేపథ్య సంగీతానికీ మంచి అవకాశం దొరుకుతుంది. భావోద్వేగభరితమైన సన్నివేశాలు ఉన్నప్పుడు సహజంగానే సంగీత దర్శకుడికి పని ఎక్కువ ఉంటుంది. అది 'జయ జానకి నాయక'లో కనిపించింది.

బోయపాటి నుంచి ప్రేమకథ విన్నప్పుడు షాక్ అయ్యారా?

షాకింగ్ కాదు, ఆశ్చర్యపోయా. కథ బాగుంది. దీన్ని ఎలా తీస్తారా? అనిపించింది. ఈ కథ నాకెప్పుడో చెప్పారు. బోయపాటి గారు ఎప్పుడు కలిసినా 'ఆ కథ ఎప్పుడు చేస్తారండీ.. ముందు ఆ సినిమా చేయొచ్చు కదా' అనేవాణ్ని. అంత బాగా నచ్చేసింది. ఓ ప్రేమకథని, తనదైన యాక్షన్ శైలిలో తీర్చిదిద్దారు. పాటలు చాలా రిచ్‌గా ఉన్నాయి. కొన్ని పాటలు చూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. బ్రెజిల్, స్పెయిన్ నుంచి డాన్సర్లను తీసుకొచ్చారు. ప్రతీ పాటలోనూ కథ ఉంటుంది. అసలు ఈ సినిమా ప్రారంభ సన్నివేశమే చాలా కొత్తగా ఉంటుంది. ట్విస్టులు కూడా అదిరిపోతాయి.

మాస్ దర్శకులు క్లాస్ టైటిల్స్ వినిపిస్తుంటే ఓ సంగీత దర్శకుడిగా మీ ఆలోచనలు ఎలా ఉంటాయి?

ట్రెండ్ మారిందండీ. ప్రేక్షకులు కొత్తదనాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఓ రోజు త్రివిక్రమ్ గారు ఫోన్ చేసి 'సామీ.. పవన్ కల్యాణ్ సినిమాకి అత్తారింటికి దారేది పేరు ఎలా ఉంటుంది' అని అడిగారు. కాసేపు అర్థం కాలేదు. పవన్ త్రివిక్రమ్‌ల సినిమా అంటే 'జల్సా' లాంటి టైటిళ్లే ఆశిస్తాం. కానీ ట్రెండ్‌ని బ్రేక్ చేశారు. ఆ తరవాత అలాంటి టైటిళ్లు వరుస కట్టాయి. కొరటాల శివ 'శ్రీమంతుడు' టైటిల్ వినిపించినప్పుడు కూడా షాక్ అయ్యా. కానీ ఆ కథకు అది తప్ప మరో టైటిల్ సెట్ అవ్వదేమో అనిపించింది. 'జయ జానకి నాయక' కూడా అంతే. ఈ సినిమాతో బోయపాటిలో సరికొత్త కోణం చూస్తారు.

మీ పాటల్ని తెరపై చూసుకొన్నప్పుడు ఏం అనిపించింది?

కెమెరామెన్ రిషి పంజాబీ చాలా అద్భుతంగా తెరపై తీసుకొచ్చారు. హంసల దీవిలో ఓ యాక్షన్ ఎపిసోడ్ ఉంది. అది చూసి.. 'బోయపాటి గారు ఈ సీన్ ఎలా తీశారో' అనిపించింది. ఆ ఒక్క యాక్షన్‌కీ సౌండ్ ఎఫెక్ట్స్ కోసం చాలా కష్టపడ్డాం.

మీరు చేసే సినిమాల్లో రొటీన్ మాస్ కథలే ఎక్కువ. అలాంటి చోట కూడా పాట కోసం సరైన సందర్భాన్ని ఎంచుకోవడం ఛాలెంజింగ్‌గా అనిపించదా?

నేనెప్పుడూ మాస్, క్లాస్ అనుకోలేదు. కథని కథగానే అనుకొంటా. పైగా దర్శకులు కథ రాసుకొనేటప్పుడే చాలా జాగ్రత్తగా ఉంటారు. కొన్నిసార్లు కథ వింటూ ట్యూన్లు కట్టేస్తుంటా. 'గబ్బర్‌సింగ్' పాటలన్నీ కథ చెబుతున్నప్పుడు పుట్టేసినవే. నా దర్శకులంతా నన్ను, నా అభిప్రాయాల్నీ గౌరవిస్తారు. నేను సంపాదించుకొన్న అతి పెద్ద పురస్కారం ఆ నమ్మకమే. చిరంజీవి లాంటి కథానాయకుడూ 'ఎలాంటి పాటలు ఇస్తావ్' అని అడగరు. 'ఇదబ్బాయ్ కథ... అదరగొట్టేయ్' అంటారంతే. అలా నమ్మినప్పుడు నా బాధ్యత ఇంకా పెరుగుతుంది.

బాలీవుడ్ అయితే ఒక్కో ఆల్బమ్‌లో 9 నుంచి 12 పాటల వరకూ వినిపిస్తాయి. తెలుగు సినిమాలో ఆరు పాటలంటే 'మరీ ఎక్కువేమో' అనిపిస్తుంటుంది. ఈ వ్యత్యాసం ఎందుకు?

ఇక్కడ రూల్స్ అంటూ ఏం లేవండీ. ఏదీ కరెక్ట్ కాదు, అలాగని దేన్నీ తప్పుపట్టలేం. ఇక్కడ పాట అవసరమా, వద్దా? అని ఆలోచించుకొని, సరైన నిర్ణయం తీసుకోవడంలోనే విజయం ఆధారపడి ఉంటుంది. నిజానికి పాటలకు, సంగీతానికి పెద్ద పీట వేసేది మన ప్రేక్షకులే. బాలీవుడ్‌లో ఎక్కువ పాటలు రావొచ్చు. కానీ ఎక్కువ కాలం నిలబడేవి మన పాటలే. పబ్లిసిటీ వల్ల హిట్టైన పాటలే ఎక్కువ కనిపిస్తాయక్కడ. ఓ యేడాది దాటితే ఆ పాట ఎవరికీ గుర్తుండదు. ఇక్కడ అలా కాదు. 'రింగ రింగ' పాట చేసి ఎన్నాళ్లయ్యింది. కానీ ఇప్పటికీ పార్టీ సాంగ్స్‌లో అదే వినిపిస్తుంటుంది.

ఓ సినిమాకి ఇద్దరు ముగ్గురు సంగీత దర్శకులు పనిచేయడం చూస్తున్నాం. ఈ ట్రెండ్‌పై మీ అభిప్రాయం?

ఎవరి వ్యక్తిగత అభిప్రాయం వాళ్లది. నాకైతే ఆ స్కూల్ పడదు. సినిమాని ప్రేమించి పనిచేస్తా. కథ వింటున్నప్పుడే కంపోజింగ్ మొదలైపోతుంది. 'బొమ్మరిల్లు' కథ చెబుతున్నప్పుడు 'హీరో హీరోయిన్లు తొలిసారి కలుసుకొంటున్నప్పుడు ఓ మ్యూజిక్ బిట్ పెడదాం... అది అక్కడక్కడ ప్లే అవ్వాలి' అని సలహా ఇచ్చా. దాంతో సిద్ధార్థ్ - జెనీలియా మధ్య 'పదనిసస' అంటూ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నడుస్తుంటుంది. అది బాగా క్లిక్ అయ్యింది. ఇలాంటి వర్క్ ఇద్దరు ముగ్గురు సంగీత దర్శకులతో పనిచేసినప్పుడు రాదు. ఇప్పటికీ బాలీవుడ్ నుంచి నాకు అవకాశాలొస్తున్నాయి. కానీ ఒకటీ అరా పాటకు పనిచేయడం ఇష్టం లేక ఒప్పుకోవడం లేదు. తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేసి ఎక్కువ డబ్బులు సంపాదించడం నా లక్ష్యం కాదు. నా పనిని ఆస్వాదిస్తూ చేయడం నాకు ఇష్టం.

కథని బట్టి కాకుండా, కథానాయకుడి ఇమేజ్‌కి తగ్గట్టు సంగీతం అందివ్వాల్సివస్తుంటుంది. అలాంటప్పుడు ఏం చేస్తారు?

కథానాయకుడైనా, దర్శకుడైనా, సంగీత దర్శకుడైనా కథకు లోబడే పనిచేయాలి. ఓ కథ నచ్చితేనే హీరో ఒప్పుకొంటాడు. హీరో అంటే కథలో భాగమే కదా? అప్పుడు నేను కథకు పని చేస్తే కథానాయకుడి కోసం పనిచేసినట్టే. ప్రతి కథానాయకుడికీ ఓ సంతకం ఉంటుంది. దాన్ని అన్వయించుకొంటూ పాటలు చేయాలి. 'వన్', 'శ్రీమంతుడు' రెండూ మహేష్‌వే. ఆ రెండింటికీ పనిచేశా. కానీ నేను ఇచ్చిన సంగీతం వేరు.

చిన్న సినిమాలకు దూరం అవుతున్నట్టున్నారు?

'కుమారి 21 ఎఫ్' చేశాను కదా? 'నేను లోకల్' కూడా చిన్న సినిమానే. నా దృష్టిలో చిన్న పెద్ద ఏం లేవు. ఎలాంటి సినిమాకైనా నేను పనిచేసే విధానం ఒక్కటే.

వేటూరి, సీతారామశాస్త్రిలా ఏ పాటైనా రాయగలిగే రచయితలు మనకున్నారా?

ఎందుకు లేరండీ. అందరూ అన్ని రకాల పాటలూ రాస్తారు. రామజోగయ్యశాస్త్రిగారు నాకు అన్ని రకాల పాటలూ రాసిచ్చారు. చంద్రబోస్, శ్రీమణి.. ఇలా చాలామంది ప్రతిభావంతులున్నారు.



రాశీ ఖన్నా

ఇదిగో... ఓ మంచిమాట!

"ఒంటరిగా ఉండడానికి చాలామంది భయపడతారు. కానీ నాకు ఒంటరితనం కూడా ఇష్టమే. అలాంటప్పుడు పుస్తకాలు చదువుతుంటా. అవి నాపై చాలా ప్రభావం చూపించాయి" అంటోంది రాశీ ఖన్నా. తన వ్యక్తిత్వం - అభిరుచుల గురించి రాశీ మాట్లాడుతూ "నేను స్వతహాగా ఎవ్వరితోనూ కలవను. నాకు స్నేహితులు కూడా చాలా తక్కువమంది ఉన్నారు. నా కాలక్షేపం పుస్తకాలతోనే. ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన పుస్తకాలే నా దగ్గర ఎక్కువగా ఉంటాయి. ప్రపంచం గురించి తెలుసుకోవడానికి కాదు.. నన్ను నేను తెలుసుకోవడానికి ఆ పుస్తకాలు ఉపయోగపడ్డాయి. నాతో ఎవరు మాట్లాడినా.. 'వయసుకు మించి మాట్లాడుతోందేంటి' అని ఆశ్చర్యపోతారు. మా అమ్మ కూడా 'నీ వయసేంటి? నువ్వు మాట్లాడుతోందేంటి?' అని చాలాసార్లు అడిగింది. అయితే నా మాటలు కూడా చాలామందిపై ప్రభావం చూపించాయి. అది నా గొప్పదనం కాదు.. మంచి మాటకున్న లక్షణమే" అంటోంది.

"దర్శకుడిగా నేను విఫలమయ్యానో లేదో తెలియదు కానీ... కథల పరంగా మాత్రం నేను తప్పులు చేశా. అందుకే ఈసారి బలమైన కథని తీర్చిదిద్దుకొని సినిమా చేశా" అన్నారు తేజ. ఒకప్పుడు వరుస విజయాలతో తెలుగు చిత్రసీమని కళకళలాడించిన దర్శకుడాయన. కొంతకాలంగా వరుస పరాజయాల్ని ఎదుర్కొంటున్నారు. ఇటీవలే రానా కథానాయకుడిగా 'నేనే రాజు నేనే మంత్రి' తీశారు. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కిన ఆ చిత్రం 11న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా తేజ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఆ విషయాలివీ...



వాళ్లకి పనుంటే... నా గురించి ఎందుకు మాట్లాడతారు?

"నాకు తెలిసింది సినిమానే కాబట్టి విజయాలొచ్చినా, పరాజయాలొచ్చినా అదే చేయాలి. అందుకే 'అహం' పేరుతో కథ రాసుకొని ఒక కథానాయకుడికి చెప్పా. కానీ కొన్ని కారణాలవల్ల ఆయనతో సినిమా చేయడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత సురేష్‌బాబుకి కథ చెప్పా. ఆయన్ని కలిశాక కథలో చాలా మార్పులు చేశాం. ఆయనకీ, రానాకి కథ బాగా నచ్చింది. రాధ పాత్రకి కాజల్ అయితే బాగుంటుందని సురేష్‌బాబు సూచించారు. ఆమెకి కూడా కథ చెప్పేసరికి ఎప్పుడు మొదలుపెడుతున్నారని అడిగింది. 'బాహుబలి2' మొదలయ్యేలోపే ఈ సినిమా చేసేద్దాం అనుకొన్నాం. మేం మొదలుపెట్టేలోపే 'బాహుబలి2' కూడా మొదలైంది. దాంతో మా సినిమా ఆలస్యమైంది. రానా, కాజల్ చాలా బాగా నటించారు".

- "జోగేంద్ర అనే వ్యక్తి జీవితంలో ఐదేళ్లపాటు జరిగిన సంఘటనల సమాహారమే ఈ చిత్రం. ప్రతి మనిషిలోనూ మంచి ఉంటుంది, చెడు ఉంటుంది. మామూలుగా చరిత్ర పురుషుడి కథతో సినిమా చేస్తున్నామంటే అంతా మంచే చెబుతుంటాం. చెడుని వదిలేస్తుంటాం. జోగేంద్ర జీవితంలో చెడు కూడా ఉంటుంది. ఐదేళ్లకి ముందు అతను ఎలా ఉండేవాడు? ఐదేళ్ల తర్వాత ఎలా మారాడనే విషయాలు ఆసక్తిని రేకెత్తిస్తాయి. ట్రైలర్‌ని చూసి ఇది రాజకీయంతో ముడిపడిన కథ అనుకొంటున్నారు. కానీ అది నిజం కాదు. ఇది భార్యాభర్తల కథ. ఆ కథకి నేపథ్యంగా రాజకీయ రంగాన్ని ఎంచుకొన్నామంతే. నిజ జీవితంలో మాత్రం అలాంటి కథల్ని, సంఘటనల్ని చూస్తూనే ఉంటాం కానీ తెరకు మాత్రం కొత్త. నేను తీసిన 'చిత్రం' సినిమానే తీసుకొంటే అందులో పదహారేళ్ల అమ్మాయి గర్భవతి అవుతుంది. అలాంటి సంఘటనలు నిజ జీవితంలో చాలానే జరుగుతుంటాయి. కానీ తెరపై ఎవ్వరూ చూపించలేదు. అది నేను చేయడంతో కొత్త సినిమా అన్నారు. అలాంటి అనుభూతిని 'నేనే రాజు నేనే మంత్రి' పంచుతుంది. ఊహాజనితం, హాస్యంతో నిండిన కథలతో పోలిస్తే సమాజం నుంచి పుట్టిన కథలు ప్రేక్షకులకు తొందరగా చేరువవుతాయి".
- "మనందరికంటే ఎక్కువ రోజులు బతికేది సినిమా. అందుకే తీసే సినిమా బాగుండాలనుకొంటా. డబ్బుతో ముడిపడిన ఓ మంచి కళ సినిమా. జనాల్ని ఉత్తేజితుల్ని చేయొచ్చు, వాళ్లలో ఆలోచనని రేకెత్తించొచ్చు. అందుకే సినిమా బాగా రావాలనే ఓ తపన ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుంది. మంచి నటనని రాబట్టుకొనేందుకు నటుల్ని బతిమాలాలి, అవసరమైతే తిట్టాలి. నేనదే చేస్తుంటా. ఇక్కడ ఏదీ వ్యక్తిగతం కాదు. తేజ ఇప్పుడు మారిపోయాడా అంటే అస్సలు మారలేదనే చెబుతాను. ఈ ప్రపంచంలో ఎవ్వరూ మారరు, మారినట్టు నటిస్తుంటారంతే. నాకు నటించడం కూడా రాదు".
- "దర్శకుడిగా నాకు వరుసగా పరాజయాలు ఎదురయ్యాయంటే అందుకు కారణం అప్‌డేట్ కాలేకపోవడం అని నేననుకోను. ఇక్కడ ఒకసారి తప్పు చేశామంటే, ఆ తప్పులు మళ్లీ మళ్లీ జరిగిపోతుంటాయి. ఈ మధ్యలో తేజ పనైపోయిందని ఎవరైనా మాట్లాడుకొన్నారంటే అర్థం వాళ్లకి పనిలేదనే! నిజంగా వాళ్లకి పనుంటే నా గురించి ఎందుకు మాట్లాడుకొంటారు? సినిమా పరాజయాన్ని చవిచూస్తుందనే వాస్తవం కొన్నిసార్లు తెలిసినా... ఆడుతుందనే ఆశ వాస్తవాన్ని కూడా డామినేట్ చేస్తుంటుంది. నిజానికి నాకు ఎదురైన పరాజయాలన్నీ నేను ఊహించినవే".
- "మొన్నటిదాకా నేను కనిపించగానే తలుపులు వేసుకొని లోపల కూర్చునేవారు. 'నేనే రాజు నేనే మంత్రి' ట్రైలర్‌ని చూశాక జేబుల్లో చేతులు తీసి కంగ్రాట్స్ అంటూ మెచ్చుకొంటున్నారు. కొద్దిమంది సూట్‌కేసులు పట్టుకొని సినిమా తీసిపెట్టండని వచ్చారు. అసలు నేను చూడని విజయాలున్నాయా? రాజకీయ నాయకులనైనా నమ్మొచ్చు, వాళ్లు ఐదేళ్లకోసారే పార్టీ మారుస్తుంటారు. సినిమావాళ్లు మాత్రం ప్రతి శుక్రవారం పార్టీ మార్చేస్తుంటారు (నవ్వుతూ). సినిమా హిట్టయిందంటే 'కంగ్రాట్స్...' అంటూ వెంటబడుతుంటారు. అదే సినిమా పరాజయాన్ని చవిచూసిందంటే మార్నింగ్ షో అవ్వగానే మనల్ని చూసే లుక్కే మారిపోతుంది. కథలు పుట్టించడం సమస్య కాదు కానీ.. ఇకపై విభిన్నమైన సినిమాలే చేస్తా".



నాగ అన్వేష్, హెబ్బాపటేల్

అతిలోక సుందరి

నాగ అన్వేష్, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'ఏంజెల్'. బాహుబలి పళని దర్శకుడు. భువన్ సాగర్ నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్రచార చిత్రాన్ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "స్వర్గం నుంచి భువికి దిగివచ్చిన ఓ అతిలోక సుందరి కథ ఇది. సోషియో ఫాంటసీ నేపథ్యంలో సాగుతుంది. ఏంజెల్ భూమ్మీదకు ఎందుకు వచ్చింది? ఇక్కడ ఆమె చక్కబెట్టిన పని ఏమిటన్నది ఆసక్తికరం. నలభై నిమిషాల పాటు సాగే గ్రాఫిక్స్ ఆకట్టుకొంటాయి. విజువల్ ఎఫెక్ట్స్ కోసం విదేశీ నిపుణులు పనిచేశారు. స్వర్గలోకం సెట్ ఆకట్టుకొంటుంది. తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామ"న్నారు. సంగీతం: భీమ్స్ సెసిరోలియో

పంచ్ డైలాగ్

మనిషి ఆశిస్తాడు...
దేవుడు ఆశీర్వదిస్తాడు!
చిత్రం: మహారథి
- పంపినవారు: పార్సి ప్రభావత్ ఓంప్రకాశ్, సద్దల గుండు, మహబూబ్‌నగర్



'లోక రక్షకుడు'లో ఓ దృశ్యం

శాంతి సందేశం

బ్రహ్మం.సి.హెచ్ దర్శకత్వంలో 15 దేశాల నటీనటులతో తెరకెక్కుతున్న చిత్రం 'లోక రక్షకుడు'. చంద్రశేఖర్ చంద్ర నిర్మిస్తున్నారు. మార్చిలో లండన్‌లో చిత్రీకరణ ప్రారంభమైంది. ప్రస్తుతం చెన్నైలో పాటల రికార్డింగ్ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "ఏసుక్రీస్తు జీవిత చరిత్రతో తెరకెక్కుతున్న చిత్రమిది. వెండితెరపై స్పృశించని కొత్త అంశాలు ఇందులో ఉంటాయి. భారతదేశం ప్రపంచపటంలో ఓ శాంతి చిహ్నం. గౌతమబుద్ధుడు, మహాత్మాగాంధీ తదితరులు ప్రపంచశాంతికి మార్గం చూపారు. ఆ విషయాన్ని చెబుతూనే, ఏసుక్రీస్తు జీవితం, ఆయన సందేశాలతో అన్నివర్గాల్లో శాంతిని నింపేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నాం. ఎ.కె.రిసాల్‌సాయి సంగీత సారథ్యంలో మధుబాల కృష్ణన్, గీతామాధురి, హేమాంబిక గీతాల్ని ఆలపిస్తున్నారు. అభినవ్ శ్రీనివాస్ రాసిన పాట చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈనెల మూడో వారం నుంచి కర్ణాటకలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించనున్నాం" అన్నారు.

సైరట్ దర్శకుడితో...



అమితాబ్‌బచ్చన్

మరాఠీ చిత్రం 'సైరట్' చిన్న సినిమానే అయినా పెద్ద విజయం సాధించింది. కోట్ల రూపాయల వసూళ్లు అందుకొంది. ఈ సినిమా తర్వాత చిత్ర దర్శకుడు నాగరాజ్ మంజులే మరో మరాఠీ చిత్రాన్ని తెరకెక్కించాలి అనుకున్నాడట. కానీ అదే కథని బాలీవుడ్‌కి తీసుకెళితే బాగుంటుందనుకొని మార్పులు చేసి సిద్ధం చేశాడు. ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్‌కు కథ వినిపించడం,. ఆయనకు నచ్చడం అన్నీ చకాచకా జరిగిపోయాయి. "ఈ కథపై సంవత్సరానికి పైగానే కసరత్తు చేశారు నాగరాజ్. ఆ తర్వాతే అమితాబ్‌కు వినిపించార"ని నాగరాజ్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అమితాబ్ ఈ సినిమాలో నటించడం దాదాపు ఖాయమైనట్టు సమాచారం. అమితాబ్‌బచ్చన్‌కు నేను వీరాభిమానిని అని గతంలో ఓసారి తన మనసులో మాట బయటపెట్టాడు నాగరాజ్. 'సైరట్'ను గొప్పగా తెరకెక్కించారంటూ నాగరాజ్‌ను ప్రశంసించారు అమితాబ్.

సల్మాన్ 'రేస్ 3'?



సల్మాన్‌ఖాన్

'రేస్' సిరీస్ చిత్రాలు రెండూ మంచి విజయం సాధించాయి. ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడో చిత్రం తీసుకొచ్చే ఆలోచనలో నిర్మాత రమేష్ తరణి ఉన్నారు. ఈ చిత్రాన్ని సల్మాన్‌ఖాన్‌తో చేయాలని ఆయన ఎప్పటి నుంచో అనుకుంటున్నారట. ఓ షరతుపై ఇందులో నటించడానికి సల్మాన్ ఓకే చెప్పినట్టు సమాచారం. అదేంటంటే ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించాలట. ఇప్పటికే సల్మాన్ - రెమో కలయికలో 'డ్యాన్సింగ్ డాడీ'ని తెరకెక్కించే సన్నాహాలు జరుగుతున్నాయి. ముందు 'రేస్ 3' పూర్తిచేసి తర్వాత 'డ్యాన్సింగ్ డాడీ' తెరకెక్కించే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. 'ట్యూబ్ లైట్' ఫ్లాప్ తర్వాత ఓ కమర్షియల్ విజయం అందుకోవాలని సల్మాన్ ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నాడట.



శతమర్కటం... పితలాటకం

- పల్లెలు, పట్టణాలు, నగరాల్లో వానర సైన్యాల కిష్కింధకాండ
- గుంపులు గుంపులుగా తిరుగుతూ 'దాదాగిరి'
- కూరగాయలు, పండ్లు, మొక్కజొన్న పంటలపై దాడి
- నష్టంతో కొన్నిచోట్ల పంట మార్పిడికి వెళుతున్న రైతులు
- ఇంట్లోకి రాకుండా జాలీలు, గ్రిల్స్ వంటి ప్రత్యేక ఏర్పాట్లు
- కోతుల బెడదతో కొండెంగలను తెప్పిస్తున్న స్థానిక సంస్థలు
- తెలంగాణలో అడవుల బయటే ఉంటున్న 90 శాతం కోతులు
- వనాల్లో ఆహారం దొరక్కే ఊళ్లలోకి!!

సుతారపు సోమశేఖర్

వరంగల్, జనగాం జిల్లాల నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి

- అది మెదక్ జిల్లా గూడూరు గ్రామం. దాదాపు వందమంది రైతులు కూరగాయలు, మొక్కజొన్న సాగుచేసేవారు. కోతులు తరచూ వచ్చి పంటనష్టం చేస్తుండటంతో కూరగాయాల సాగు మానేశారు. వరి వంటి ఇతర పంటలు వేద్దామంటే బోర్లలో నీరు సరిగాలేకపోవడంతో ప్రత్యామ్నాయం వదిలేశారు. ఆ భూములు బీడుపడ్డాయి.
- అది జనగాం జిల్లా రఘునాథపల్లి గ్రామం. దాదాపు ప్రతి ఇంటి పెరట్లో దొండ, టమాట వంటి కూరగాయలు సాగయ్యేవి. ఇంటి ముందు, చుట్టు పక్కల పచ్చని చెట్లతో గ్రామం కళకళలాడేది. తెల్లారిందే ఆలస్యం.. బిల బిలమంటూ వచ్చే కోతులు చేసే అల్లరితో పెరట్లలో కూరగాయల సాగు నిలిచిపోయింది. గ్రామస్తులు చెట్లు చాలా వరకు కొట్టేసుకున్నారు. అయినా ఆ గ్రామంలో కోతుల సమస్య ఆగలేదు.
- ఆయనో వైద్యుడు. నిత్యం ఎంతో మందికి వైద్యసేవలు అందించేవారు. ఓరోజు ఇంటిపైకి వచ్చి మీదకు రాబోతున్న కోతుల్ని తప్పించుకునే క్రమంలో మెట్లపై జారారు. తలకు బలమైన గాయంతో కోమాలోకి వెళ్లారు. వైద్యం కోసం రూ.25 లక్షల వరకు ఖర్చయినా ఆరోగ్యం మెరుగుపడలేదని వైద్యుడి కుటుంబ సభ్యుల ఆవేదన. మంచానికే పరిమితం. అప్పుడప్పుడు చూడటం మినహా ఆ వైద్యుడు మాట్లాటలేని పరిస్థితి.

కోమాలోకి వెళ్లిన డాక్టర్ శ్రీనివాస్



...కోతుల కారణంగా ఎదురవుతున్న సమస్యలకు ఇవి కొన్ని ఉదాహరణలే. పల్లె, పట్టణం, నగరం.. గుడి, బడి, ఇల్లు, పొలం.. అన్న తేడా లేదు. ఎటుచూసినా, ఎక్కడకు వెళ్లినా కోతుల భయమే. ఒకటో రెండో కాదు, గుంపులు గుంపులుగా సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. ఒకప్పుడు తమ చేష్టలతో సరదా కలిగించే కోతులు ఇప్పుడు దాదాగిరితో ఇళ్లలోకి చొరబడి మరీ ఆహార పదార్థాలు, వస్తువుల్ని దర్జాగా ఎత్తుకెళుతున్నాయి. ఇంటిపైన పెంకులు తీసేయడం, దుకాణాల వద్ద, రోడ్లపై నుంచి వెళ్లేవారి చేతుల్లో వస్తువుల్ని లాక్కెళ్లడం, మొక్కల్ని విరిచేయడం.. ఇలా ఒకటేమిటి.. నానా రకాలుగా ఇవి ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నాయి.



చిల్పూరుగుట్టలో మహిళ చీర లాగుతున్న వానరం

మనుషుల్ని కరుస్తున్నాయ్!

రైతులు తమ పంటలను కోతుల నుంచి కాపాడుకునేందుకు కాపలా ఉండటం, దీపావళి బాంబులు పేల్చడం, చేను చుట్టూ వలలు ఏర్పాటుచేయడం వంటి పాట్లు పడుతున్నారు. కోతులు కరవడంతో ఎంతోమంది గాయాలపాలవుతున్నారు. వరంగల్‌లోని ఒక్క ఎంజీఎం ఆసుపత్రికే జనవరి నుంచి జులై నాటికి కోతులు కరిచిన కేసులు రెండు వేలకు పైగా వచ్చాయి. వానరాల భయంతో కొన్ని గ్రామాల్లో నెలవారీ జీతాలు ఇస్తూ కొండ ముచ్చులను తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఇళ్లలో ఉండేవారు, దుకాణాదారులు గ్రిల్స్, జాలీలు ఏర్పాట్లుచేసుకుంటున్నారు. కిరాణా కొట్లకు ప్రత్యేక ఏర్పాట్లు తప్పడం లేదు.

90 శాతం అడవుల బయటే

కోతుల సమస్య తెలంగాణ వ్యాప్తంగా ఉంది. ముఖ్యంగా మెదక్, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్ పాత జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. అటవీశాఖ అంచనా ప్రకారం 90 శాతం కోతులు అడవుల బయటే ఉన్నాయి. తలుపులు తీసి ఉంటే ఇంట్లో చొరబడి ఆహారం ఎత్తుకెళుతున్నాయి. ఏమీ దొరక్కపోతే వస్తువుల్ని చిందరవందర చేసి వెళుతున్నాయి. దీంతో గృహస్తులు ముఖ్యంగా మహిళలు హడలెత్తిపోతున్నారు. కూరగాయలు, పండ్లతోటలు, మొక్కజొన్న తోటలకు ఇవి ఎక్కువగా నష్టం కలిగిస్తున్నాయి. కార్పొరేషన్లలో అప్పుడప్పుడు కోతుల్ని పట్టుకెళ్లి అడవుల్లో వదిలేయడం మినహా సమస్య పరిష్కారం కోసం అటు అటవీశాఖ, ఇటు స్థానిక సంస్థలు చేస్తున్న ప్రయత్నాలేమీ లేవని ప్రజలు విమర్శిస్తున్నారు.

మెదక్ జిల్లా కొల్చారంలో ఓ కిరాణ దుకాణ యజమాని కోతులు రాకుండా కట్టుకున్న వల



కొండముచ్చులే పరార్

కోతుల సమస్యను ఎదుర్కొనేందుకు కొన్ని గ్రామపంచాయతీలు కొండ ముచ్చుల్ని తీసుకువస్తున్నా ఫలితమివ్వడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట శివారు ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద కోతులు, కొండముచ్చులు పక్కపక్కనే ఉంటాయి. జనగాం జిల్లా చిల్పూరుగుట్ట బుగులు వెంకటేశ్వరస్వామి దేవస్థానం వారు కొండెంగలను తెప్పించారు. వందలాదిగా వచ్చే కోతులను చూసి కొండముచ్చులే పరారయ్యేవి. దీంతో ఆ ప్రయోగాన్ని అక్కడ నిలిపేశారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలో కోతుల బెడదతో రైతులు దీపావళి మతాబులు పేల్చడం, పంట చుట్టూ వలల ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సాపూర్ శివారులో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల పక్కన పండ్ల తోట ఉంది. కోతుల బెడదతో మూడు, నాలుగు కొండముచ్చుల్ని తెప్పించుకున్నారు. ఇక కోతుల భయంతో పాఠశాలలు, కొన్నిచోట్ల పోలీసుస్టేషన్లకు సైతం కొండెంగల పెయింట్లు వేయిస్తున్నారు.

హిమాచల్‌లో ఏటా రూ.3 వేల కోట్ల నష్టం!

హిమాచల్‌ప్రదేశ్.. యాపిల్ తోటలకు ప్రసిద్ధి. కోతుల కారణంగా అక్కడి రైతులు భారీగా నష్టపోతున్నారు. ఏటా రూ.3 వేల కోట్ల వరకు నష్టం జరుగుతోందన్నది ఆ రాష్ట్ర అటవీశాఖ వర్గాల సమాచారం. కోతుల సమస్యకు పరిష్కారం లేక వాటిని కాల్చి చంపేందుకు కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అటవీశాఖ అధికారి ఒకరు తెలిపారు. కోతుల జనాభావృద్ధి తగ్గించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటుచేశారు. తొమ్మిదేళ్లుగా ఆపరేషన్లు చేస్తున్నారు. కానీ ఇప్పటివరకు 15 శాతం కోతులకు మించి చేయలేకపోయారని అక్కడి అటవీశాఖ వర్గాల సమాచారం.

20 ఏళ్లు.. ఒక్కో కోతికి 10, 12 సంతానం

తెలంగాణలో కోతుల సంఖ్య ఎంతన్న దానిపై లెక్కల్లేవు. సర్వే కూడా జరగలేదు. అది సాధ్యం కూడా కాదని అటవీశాఖ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కోతుల సంతతి వేగంగా పెరుగుతున్నాయని అటవీ శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒక కోతి జీవితకాలం దాదాపు 20 సంవత్సరాలు. ఆడకోతి సగటున 10-12 కోతులకు జన్మనిస్తుందని ఓ అంచనా.

అడవుల్లో ఆహారం లేకే...

కోతులకు అడవులే ఆధారం. తునికి, రేగి, ఉసిరి, మేడి ఇలా ఎన్నో రకాల జాతుల పండ్లు ఉండేవి. వాటిని తిని వానరాలు కడుపు నింపుకునేవి. అడవుల్లో చెట్లను విచ్చలవిడిగా నరికేస్తున్న కారణంగా పండ్ల చెట్లు తగ్గిపోతున్నాయి. అక్కడక్కడా ఉన్నా.. ఆ పండ్లను స్థానికులు కోసుకెళుతుండటంతో కోతులకు ఆహారం దొరకని పరిస్థితి. దీంతో అడవుల్ని వీడి ఆహారం కోసం కోతులు గ్రామాలు, పట్టణాల బాట పడుతున్నాయి.

పంటల మార్పిడితో రావడం మానేసిన కోతులు!

అది ఖమ్మం జిల్లా వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే). పంటల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఇక్కడ వివిధ రకాల పంటల్ని ప్రయోగాత్మకంగా సాగుచేస్తుంటారు. గతంలో పెసర, మినుములు వంటి పంటలు సాగుచేశారు. కోతుల సమస్యతో ఆ పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కేవీకే శాస్త్రవేత్తలు వాటి స్థానంలో కోతులు తినని కంద, చేమగడ్డ, పసుపు, కాకర, చిక్కుడు వంటి వాటిని గత ఏడాది సాగు చేశారు. ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీంతో ఇక్కడ కోతుల బెడద దాదాపుగా లేదు. అవి ఇటువైపు రావడం మానేశాయి. చుట్టుపక్కల ప్రాంతాల రైతులు వచ్చి చూసి బాగుందని వెళుతున్నట్లు కేవీకే వర్గాలు చెబుతున్నాయి.

కోతుల తినని కరివేపాకు సాగు



పంటలకు నష్టం

"మూడెకరాల కంది పంట వేశా. కోతుల కారణంగా రెండుసార్లు ఏటా రూ.20 వేల వరకు పంటనష్టం వాటిల్లింది. చిరుధాన్యాల సాగు మానేశా. ఇంట్లో ఓ పెద్దచెట్టునూ నరికేయాల్సి వచ్చింది"

–ఇమ్మడిశెట్టి నగేశ్, రఘునాథపల్లి, జనగాం జిల్లా

కూరగాయల సాగు ఆపేశాం

"ఇంటి పెరట్లో చిక్కుడు, వంకాయ, టమాట కూరగాయలు పండించుకునే వాళ్లం. ఇంట్లో ఓ పెద్ద మామిడిచెట్టు ఉండేది. కోతుల సమస్యతో చెట్టును నరికేయడంతో పాటు కూరగాయల సాగు ఆపేశాం. ఇళ్లపై పెంకుల్ని కోతులు తీసేస్తున్నాయి. టార్పాలిన్ కవర్లు కప్పినా వాటినీ చించేస్తుండటంతో వర్షకాలంలో ఇల్లు కురుస్తోంది"


–తిరువర్మారెడ్డి, జవహర్‌పేట, సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం

పత్తి కాయల్నీ వదలట్లేదు

"మూడెకరాల్లో మొక్కజొన్న పంటవేశా. ఒక్క కంకి మిగలకుండా కోతులు తినేశాయి. రూ.50 వేల పంట నష్టం వాటిల్లింది. కోతులకు భయపడి మొక్కజొన్న సాగు ఆపేశా. తర్వాత రెండు ఎకరాల్లో వరి, ఎకరంలో పత్తి పంటవేశా. పత్తికాయల్ని కూడా అవి వదలడం లేదు"

– పాకనాటి నరేష్, గీసుకొండ, వరంగల్ జిల్లా

కింది నుంచే దండం పెట్టి వెళుతున్నారు



వారాంతాల్లో రెండు వేలు, సాధారణ రోజుల్లో ఏడెనిమిది వందల మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. కోతుల బెడద కారణంగా కొంతమంది పైకి రాకుండా మెట్ల కింది నుంచే దేవుడికి దండం పెట్టి వెళుతున్నారు. కొండముచ్చుల్ని తీసుకొచ్చి ఐదారునెలలు ఉంచినా ఫలితం లేకపోయింది. కోతులే వీటిని బెదిరించేవి. ఈ ఆలయం దగ్గర ఏడాదికి వెయ్యి పెళ్లిళ్ల వరకు అవుతుంటాయి. కోతులు భక్తుల చేతుల్లో వస్తువుల్ని లాక్కెళ్లడమే కాదు.. వివాహ సమయంలో వధువరులనూ ఇబ్బంది పెడుతున్నాయి.

–శ్రవణ్‌కుమార్, అర్చకుడు, వెంకటేశ్వరస్వామి ఆలయం, చిల్పూరుగుట్ట

నిర్మల్‌లో ప్రయోగాత్మకంగా ఆపరేషన్ థియేటర్

కోతుల సమస్య తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. వీటిని పట్టుకోవడం అంత సులభం కాదు. సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నాం. నిర్మల్‌లో ప్రయోగాత్మకంగా ఓ ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటుచేయబోతున్నాం. పిల్లలు పుట్టకుండా కోతులకు ఆపరేషన్ చేసి అడవుల్లో విడిచిపెడతాం. ఐతే ఆడ కోతులకు పిల్లలు పుట్టకుండా చేసే పరిజ్ఞానం ఇంకా అందుబాటులోకి రాలేదు. కోతులను పట్టుకునే బాధ్యత గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లదే. సమస్య ఉన్నచోట వాటిని పట్టుకుని, అడవుల్లో విడిచేందుకు శాఖపరంగా అనుమతులు ఇస్తున్నాం.

– ప్రశాంత్‌కుమార్ ఝా, ముఖ్య అటవీ సంరక్షణ అధికారి

కోతుల బాధనూ ఆలోచించాలి

జీవ వైవిధ్యంలో 1.50 కోట్ల రకాల జీవరాశులున్నాయి. అందులో కోతులు ఒకటి. వీటిలో 40కి పైగా రకాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పది, పన్నెండు రకాలు కన్పిస్తాయి. జంతువు ఏదైనా అడవి నుంచి బయటకు వస్తోందంటే ఆహారం దొరక్కపోవడమే కారణం. తిండి దొరక్క కొన్నిసార్లు ఆకులతోనే కోతులు సరిపెట్టుకుంటున్నాయి. శాకాహారాన్ని మాత్రమే తినే కోతులు విధిలేక కొన్నిసార్లు మాంసాహారాన్ని కూడా భుజిస్తున్నాయంటే వాటి బాధను ఆలోచించాలి. వీటి వల్ల ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయన్నది వాస్తవమే. దీనికి పరిష్కారం అడవుల విస్తీర్ణం పెరగాలి. కలప రకాలే కాకుండా పండ్ల రకాల మొక్కలనూ పెద్దసంఖ్యలో పెంచాలి. ఈ పండ్లను ఎవరూ కోసుకెళ్లకుండా కోతులకు ఆహారం కోసం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

–ప్రొఫెసర్ హంపయ్య, జీవ వైవిధ్య బోర్డు మాజీ ఛైర్మన్



దిల్లీలోని ఏపీభవన్ వద్ద ఆందోళన చేస్తున్న జాతీయ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం సభ్యులు, ఆ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు సంఘీభావం తెలుపుతున్న కేంద్రమంత్రి దత్తాత్రేయ తదితరులు

బీసీ బిల్లుపై ప్రధానితో చర్చిస్తా

ఓబీసీ మహాసభలో కేంద్రమంత్రి దత్తాత్రేయ

ఈనాడు, దిల్లీ: పార్లమెంటులో బీసీ బిల్లు, జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధతపై కేంద్రం కట్టుబడి ఉందని కేంద్రకార్మిక మంత్రి దత్తాత్రేయ స్పష్టం చేశారు. వచ్చే సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందేలా ప్రధానితో చర్చిస్తానని ఆయన తెలిపారు. మంగళవారమిక్కడ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ మహాసభలో పలువురు బీసీ నేతలు, వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడారు. బీసీ వ్యతిరేక పార్టీలను ఉపేక్షించేది లేదని ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు తెలిపారు. బీసీల ఆగ్రహాన్ని ప్రభుత్వాలు తట్టుకోలేవని.. మరో మండల్ ఉద్యమం తప్పేలా లేదని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఉద్యమాలతోనే బీసీ వ్యతిరేక పార్టీల మెడలు వంచాలని కాంగ్రెస్ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్ తెలిపారు. సీఎం కేసీఆర్ బీసీలపై ప్రత్యేకంగా దృష్టి సారించారని తెరాస ఎంపీ బూరనర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, ఇ.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రుతుపవనాలు

- అత్యధికంగా అశ్వాపురంలో 10 సెం.మీ.ల వర్షం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో గురువారం వరకూ ఒక మాదిరి వర్షాలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి చెప్పారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున వర్షాలు పెరుగుతున్నట్లు చెప్పారు. సోమ, మంగళవారాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకూ అత్యధికంగా అశ్వాపురంలో 10, గార్ల, కొత్తగూడెం, పాల్వంచ, చంద్రుగొండ, పాలకుర్తి, పర్వతగిరి ప్రాంతాల్లో 6 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. ఇంకా అనేక ప్రాంతాల్లో ఇంతకన్నా తక్కువ స్థాయిలో పడింది. గత పది రోజుల్లో రాష్ట్రంలో 6 నుంచి 10 సెంటీమీటర్ల వర్షం ఒక్కరోజులో కురవడం ఇదే తొలిసారి. రాష్ట్రమంతా ఉష్ణోగ్రతల్లోనూ మార్పులు అధికంగా ఉన్నాయి. భద్రాచలంలో అత్యధికంగా 37 డిగ్రీలు నమోదైంది. ఇది సాధారణంకన్నా 6 డిగ్రీలు అధికం. ఇదే పట్టణంలో రాత్రికల్లా 21 డిగ్రీలకు పడిపోయింది. ఇది సాధారణంకన్నా 3 డిగ్రీలు తక్కువ. ఇలా పగలు, రాత్రి మధ్య ఏకంగా 16 డిగ్రీలు వ్యత్యాసం ఉండటం వర్షాకాలంలో అరుదుగా సంభవిస్తుంది. హైదరాబాద్ నగరంలో పగలు, రాత్రి సాధారణంకన్నా 4 డిగ్రీలు అధికంగా నమోదవడమే కాకుండా ఇక్కడి గాలిలో తేమ సైతం 6 శాతం తగ్గడం వల్ల ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నగరంలో వర్షాలు లేకపోవడం కాలుష్యం కారణంగా గాలిలో తేమ బాగా తగ్గి 76కు చేరగా, శివారులోని హకీంపేటలో ఇందుకు భిన్నంగా తేమ పెరిగి 100 శాతముంది. హకీంపేటలో సాధారణంకన్నా 16 శాతం అధికంగా తేమ ఉంది. ఇంతకాలం రుతుపవనాల కదలికలు పెద్దగా లేనందున ఆకాశంలో మేఘాలు బాగా తగ్గాయి. దీనివల్ల సూర్య కిరణాలు నేరుగా భూమిని తాకడం వల్ల భూవాతావరణం త్వరగా వేడెక్కి తేమ శాతం తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సోమ, మంగళవారాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా ఇవి కొనసాగుతాయని వాతావరణ కేంద్రం భరోసా ఇవ్వలేదు. బుధవారం నుంచి ఒక మాదిరి వర్షాలు పడతాయని మాత్రమే తెలిపింది.

ద్వితీయార్థంలో సాధారణ వర్షపాతం: ఐఎండీ

దిల్లీ: నైరుతి రుతుపవనాల ద్వితీయార్థంలో దేశంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దీర్ఘ కాల సగటు (ఎల్‌పీఏ)తో పోలిస్తే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 100% వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ అంచనాల్లో 8% అటూఇటూగా ఉండవచ్చని పేర్కొంది. ఎల్‌పీఏలో 94 నుంచి 104% మేర వానలు కురియడాన్ని సాధారణంగా పరిగణిస్తారు. ఈ నెలలో పడాల్సిన వర్షంలో 99% మేర కురుస్తుందని ఐఎండీ అంచనా.

వైద్య కళాశాలలకు స్థల నిబంధన సడలింపు

ఈనాడు, హైదరాబాద్: మెట్రో నగరాల్లో వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రస్తుతమున్న నిబంధనలను కేంద్ర ఆరోగ్యకుటుంబ మంత్రిత్వశాఖ సడలించింది. ఇక నుంచీ స్థలంపై ప్రత్యేకంగా నిబంధనలేమీ వర్తించవు. మెట్రోనగరాల్లో స్థల లభ్యతలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈనిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. వైద్యకళాశాల నిర్వహణకు అవసరమైన అంతస్తులతో పాటు అనుబంధ ఆసుపత్రి, వైద్యులు, విద్యార్థుల వసతిగృహాల నిర్మాణానికి అవసరమైన స్థలముంటే చాలనితెలిపింది. వీటన్నింటినీ ఒకేభవనంలో అంతస్తుల రూపంలో నిర్మించాలనుకున్నా.. స్థానిక భవన నిర్మాణ నిబంధనలకు సరిపోయేలా స్థలాన్ని సమకూర్చుకుంటే సరిపోతుందని పేర్కొంది. ఇక హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో నిర్మించబోయే వైద్యకళాశాలలు బహుళ అంతస్తుల నమూనాల్లోనే ఉండే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

నీల్ గోగ్టే కళాశాలలో బీటెక్‌లో ప్రవేశాలకు అనుమతి

ఆదేశాలిచ్చిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: సీఎస్ఈ, ఐటీ విభాగాల్లో బీటెక్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహించుకునేందుకు హైదరాబాద్ ఉప్పల్‌లోని నీల్ గోగ్టే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు మంగళవారం ఉమ్మడి హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఏఎఫ్ఆర్‌సీ రుసుములను నిర్ణయించే దాకా రూ.35 వేలు వసూలు చేయాలని కళాశాలను ఆదేశించింది. ప్రవేశాలకు తెలంగాణ ప్రభుత్వం నిరాకరించడాన్ని సవాలు చేస్తూ నీల్ గోగ్టే ఇంజనీరింగ్ కాలేజీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ చల్లా కోదండరామ్ విచారణ చేపట్టారు. ఏఐసీటీఈ కళాశాలకు అనుమతి ఇచ్చిందని, అన్ని వసతులుండగా తుది అనుమతులను ప్రభుత్వం నిరాకరించడం చెల్లదన్నారు. తమ కళాశాలను కౌన్సెలింగ్ జాబితాలో చేర్చనందున స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహించుకోవడానికి అనుమతించాలన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఈ మేరకు తీర్పుచెప్పారు.

పాతాళం నుంచి పైకిరాని జలం

- జులైలో సాధారణం కన్నా పదిశాతం తక్కువ వర్షం
- 168 మండలాల్లో 15 మీటర్ల లోతుకుపైగానే భూగర్భ జల మట్టం
- 25 జిల్లాల్లో గతేడాదికన్నా కాస్తనయం

ఈనాడు, హైదరాబాద్: వానాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో భూగర్భ జలమట్టంలో ఆశించినంత పెరుగుదల నమోదు కాలేదు. 60 మండలాల్లో భూగర్భ జల మట్టం ఇరవై మీటర్ల కన్నా మరింతలోతుకు పడిపోయింది. మరో 68 మండలాల్లో 15 నుంచి 20 మీటర్లలోతుల్లో ఉంది. రాష్ట్ర సగటు భూగర్భ జలమట్టం(జులై) 10.57 మీటర్లుగా ఉంది. గతేడాది జులై నెలలో ఇది 13.40 మీటర్లు కాగా ప్రస్తుతం 25 జిల్లాల్లో మాత్రమే జలమట్టంలో పెరుగుదల సగటున 2.83 మీటర్లు నమోదైంది. రాష్ట్ర సాధారణ వర్షపాతం 372 మిల్లీ మీటర్లు కాగా 2017-18 నీటి సంవత్సరం(వాటర్ ఇయర్)లో జులై వరకు పదిశాతం తక్కువగానే నమోదైంది. నైరుతి కూడా జూన్ రెండోవారంలో రాష్ట్రంలోకి ప్రవేశించింది. దీంతో వర్షాలు కురిసినా ఆశించినంత జలం భూగర్భంలోకి ఇంకనేలేదు. ఈ ఫలితంగా రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మాత్రమే సాధారణం కన్నా 20 శాతానికిపైగా వర్షం నమోదయింది. మరో 18 జిల్లాల్లో సాధారణ వర్షపాతం ఉండగా 9 జిల్లాల్లో అతితక్కువగా నమోదు కావడం గమనార్హం.

- రాష్ట్రంలో 20 మీటర్ల కన్నా ఎక్కువ లోతులో భూగర్భజలం ఉన్న మండలాలు సంగారెడ్డి జిల్లాలో 9, మహబూబ్‌నగర్ 8, రంగారెడ్డి జిల్లా 7, సిద్దిపేట జిల్లాలో 7 చొప్పున ఉన్నాయి.
- రాష్ట్రంలో అత్యంతలోతులో భూగర్భ జలం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో 40.85 మీటర్లుగా ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో మహబూబ్‌నగర్ అర్బన్‌లో 35.15 మీటర్లు, నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో 33.81 మీటర్లు, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, రాజాపూర్‌లలో 31.59 మీటర్ల లోతులో జలం ఉంది.

చిరుత కళేబరం లభ్యం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట్ శివారులో అటవీ ప్రాంతంలో సుమారు మూడేళ్ల వయసున్న మగ చిరుతపులి కళేబరం మంగళవారం లభ్యమైంది. గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి, క్షేత్ర సహాయకుడు శ్రీనివాస్‌లు హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తుండగా కళేబరం కనిపించింది. సర్పంచి అమ్ముల లక్ష్మణ్ ద్వారా సమాచారం అందుకున్న మెట్‌పల్లి సబ్ కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారుఖీ, జిల్లా అటవీ అధికారి రమేష్‌లు చిరుత కళేబరాన్ని పరిశీలించారు. ఇది రెండు, మూడు రోజుల కిందట అనారోగ్యంతో మరణించి ఉంటుందని డీఎఫ్‌వో తెలిపారు. అక్కడే చిరుతకు పశు వైద్యురాలు మనీషా పంచనామా నిర్వహించారు. నమూనాలను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. చిరుత వేళ్లకు అన్ని గోర్లు ఉన్నాయని, వేటగాళ్ల కారణంగా మృతి చెందలేదని పేర్కొన్నారు. కాగా చిరుత మెడ చుట్టూ నల్లని మచ్చ ఉండటంతో వేటగాళ్ల ఉచ్చుకు బలై ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.



చిరుతపులి కళేబరాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, అటవీ అధికారులు

మానవహక్కుల ఉల్లంఘనపై విచారించండి

ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్‌కు టీపీసీసీ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందని, దీనిపై సత్వర విచారణ చేయించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ హెచ్ఎల్ దత్తుకి టీపీసీసీ నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారమిక్కడ తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌ఛార్జి ఆర్‌సీ కుంతియా నేతృత్వంలో పార్టీ నేతలు వి.హన్మంతరావు, పొన్నాలలక్ష్మయ్య, ఎంపీలు రాపోలు ఆనందభాస్కర్, రేణుకాచౌదరి, నంది ఎల్లయ్య, అధికారప్రతినిధి దాసోజు శ్రవణ్ తదితరులు జస్టిస్ హెచ్ఎల్ దత్తుతో భేటీ అయ్యారు. తెలంగాణ మానవహక్కుల ఉల్లంఘనపై విచారణ చేయించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ.. నేరెళ్లలో అమాయకులను అరెస్టుచేసి నాలుగురోజులపాటు కోర్టుకి పంపకుండా పోలీసులు వ్యవహరించిన తీరు, ఖమ్మంలో రైతులకు బేడీలు వేయడాన్ని ఎన్‌హెచ్ఆర్సీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని జస్టిస్ దత్తు హామీ ఇచ్చారని దాసోజు చెప్పారు. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కటారియాను కలవడానికి యత్నించగా ఆయన లేకపోవడంతో కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

మంత్రి సమక్షంలో మాజీ ఎంపీ, ఎమ్మెల్యేల వాగ్వాదం

పరస్పరం దూషించుకొన్న రమేష్ రాథోడ్, రేఖానాయక్

ఖానాపూర్, న్యూస్‌టుడే: శ్రీ రాంసాగర్ జలాశయ పునరుజ్జీవన బహిరంగ సభకు ఈ నెల 10న సీఎం కేసీఆర్ వస్తుండడంతో, జన సమీకరణకు మంగళవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశం రణరంగంగా మారింది. ఇక్కడి విశ్రాంతి భవనంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పైడిపల్లి రవీందర్ రావు, శ్రీనివాస్‌గౌడ్‌ల ఎదుట మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖనాయక్‌లు వాగ్వాదానికి దిగారు. పరస్పరం దూషించుకుంటున్న వారిద్దరిని అక్కడున్న వాళ్లు వారించేందుకు యత్నించిన పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరు వర్గాల కార్యకర్తలు రెచ్చిపోవడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అనే పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి సభాస్థలికి వచ్చినా పరిస్థితి అలాగే ఉంది. మంత్రి కల్పించుకొని అందరూ కలిసిపోయి పని చేయాలని, అందరం ఒకే గొడుగు కింద పని చేస్తున్నామని, సీఎం కేసీఆరే మన నాయకుడని, తెరాస నినాదాలే వినిపించాలని హితవు పలికారు. అప్పటితో గొడవ సద్దుమణిగిందనుకొన్నా, సమావేశం కాగానే రాథోడ్, ఎమ్మెల్యే వర్గీయులు పరస్పరం దూషించుకొన్నారు. ఎమ్మెల్యే రేఖానాయక్ ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు.



మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, ఎమ్మెల్యే రేఖానాయక్‌ల వాగ్వాదం

చైనాలో భూకంపం ధాటికి ఐదుగురు మృతి

బీజింగ్: నైరుతి చైనాలో పర్వతాలతో కూడిన మారుమూల ప్రాంతమైన సిచువన్ ప్రావిన్స్‌లో మంగళవారం భూకంపం సంభవించింది. భూకంపలేఖినిపై 7.0గా నమోదైన ఈ భూకంపం ధాటికి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది వరకు గాయపడ్డారు. ఆధ్యాత్మికంగా జీవించే టిబెటన్లు ఎక్కువగా జీవించే ఈ ప్రాంతంలో తరచూ భూకంపాలు వస్తుంటాయి. జనసాంద్రత కూడా చాలా తక్కువ.

వచ్చే ఏడాది నుంచి ఉర్దూలోనూ నీట్

దిల్లీ: వచ్చే సంవత్సరం (2018-19) నుంచి ఉర్దూమాధ్యమంలోనూ నీట్ నిర్వహిస్తామని కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ మేరకు కేంద్రం అభ్యర్థనను కోర్టు పరిగణలోకి తీసుకుంది. 2018 నుంచి ఉర్దూ మాధ్యమంలో నీట్ నిర్వహించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎమ్ ఖాన్‌విల్కర్‌తో కూడిన ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ రంజిత్ కుమార్ నివేదించారు. ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో చేరేందుకు దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 2017 విద్యాసంవత్సరం నుంచే నీట్‌ను ఉర్దూ మాధ్యమంలో నిర్వహించాలని కొన్ని ముస్లిం విద్యార్థి సంఘాలు కేంద్రాన్ని కోరాయి. భారత ముస్లిం విద్యార్థుల సమాఖ్య జాతీయ కార్యదర్శి తౌసీఫ్ అహ్మద్ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. మంగళవారం ఈ అంశం విచారణకు వచ్చిన నేపథ్యంలో వచ్చే సంవత్సరం నుంచి ఉర్దూ మాధ్యమంలోనూ నీట్ నిర్వహిస్తామని కేంద్రం కోర్టుకు తెలిపింది. ఇప్పటి వరకు ఈ పరీక్షను పది భాషల్లో నిర్వహిస్తున్నారు.

విపక్షాలతోనే శరద్‌యాదవ్

రాజ్యసభలో ప్రతిపక్షాలతో కలిసి నిరసన

దిల్లీ: బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ భాజపాతో జట్టు కట్టడం పట్ల విముఖంగా ఉన్న జేడీ(యూ) నేత శరద్ యాదవ్ ఎన్డీయే సర్కారుపై తన వ్యతిరేక వైఖరిని కొనసాగిస్తున్నారు. ఇటీవల బిహార్‌లో నెలకొన్న రాజకీయ పరిణామాలపై మౌనం వహిస్తున్న ఆయన రాజ్యసభలో విపక్షాలతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం రాజ్యసభలో రూ.500 నోటును వివిధ పరిమాణాలతో తయారు చేస్తున్నారని విపక్షాలు తెలిపిన నిరసనల్లో ఆయన కూడా పాల్గొన్నారు. జేడీ(యూ) ఎన్డీయే కూటమిలో చేరినప్పటికీ శరద్‌యాదవ్ మాత్రం అంతకుముందు విపక్షంలో ఉన్న సమయంలో కేటాయించిన స్థానంలోనే కూర్చున్నారు.

'కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి' పై స్పందన తెలపండి

కేంద్రానికి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం

దిల్లీ: జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగ అధికరణ 370 చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన ఒక వ్యాజ్యంపై నాలుగు వారాల్లోగా స్పందన తెలపాలని కేంద్ర ప్రభుతాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్‌సింగ్ ఖేహర్, జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం నోటీసు జారీచేసింది. వ్యాజ్యాన్ని కుమారి విజయలక్ష్మి ఝా దాఖలు చేశారు. జమ్మూకశ్మీర్ రాజ్యాంగం చెల్లదని, అది భారత రాజ్యాంగానికి విరుద్ధమైనదని ప్రకటించాలని కూడా ఇందులో కోరారు. అధికరణ 370ను చెల్లదని ప్రకటించాలంటూ ఆమె లోగడ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఇలాంటి అభ్యర్థనతో దాఖలైన వ్యాజ్యాన్ని తిరస్కరిస్తూ సుప్రీం 1969లో తీర్పు ఇచ్చిందంటూ ఆమె పిటిషన్‌ను ఏప్రిల్ 11న హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ విజయలక్ష్మి సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

జమ్మూకశ్మీర్‌లో 'మైనారిటీ' అంశాన్ని మూడు నెలల్లో తేల్చండి

దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో మైనారిటీ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మంగళవారం మూడు నెలల గడువు ఇచ్చింది. ఈ విషయంలో కేంద్రానికి తాము ఇస్తున్న ఆఖరి అవకాశం ఇదేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహర్, జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. 2011 జనగణన ప్రకారం జమ్మూకశ్మీర్ జనాభాలో 68.31 శాతం మంది ముస్లింలు. రాష్ట్రంలో మైనారిటీ వర్గాలకు ఉద్దేశించిన పథకాలు, కార్యక్రమాల కింద ప్రయోజనాలు కల్పించేటప్పుడు వీరిని మైనారిటీలుగా పరిగణించవచ్చా, లేదా అనే అంశంతోపాటు మరికొన్ని వివాదాస్పద అంశాల పరిష్కారానికి కేంద్రానికి కోర్టు గడువు విధించింది. మైనారిటీ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని, దీనిపై తమ వైఖరిని కోర్టు దృష్టికి తీసుకొచ్చేందుకు మరో ఎనిమిది వారాల సమయం ఇవ్వాలని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. కేంద్రం అభ్యర్థనను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకొంది.

అవినీతి కేసుల విచారణపై నిలుపుదల ఆదేశాల అంశం త్రిసభ్య ధర్మాసనానికి

దిల్లీ: అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసులపై కోర్టుల నిలుపుదల ఆదేశాలను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనానికి సుప్రీం కోర్టు అప్పగించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 29న పిటిషన్లపై త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టనుందని పేర్కొంది. దీంతో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న 45 కేసులకు పరిష్కారం లభించే అవకాశముంది.

ఆమెది ఆత్మహత్యే!

ముంబయి: ఆశాసహాని(63) మృతి కేసులో మంగళవారం కొత్త మలుపు చోటు చేసుకుంది. ముంబయిలోని ఓషివారాలోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో ఆమె అస్థిపంజరం లభ్యమైన విషయం తెలిసిందే. పోలీసులు సహజ మరణంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఆమె ఫ్లాట్‌లో ఫోరెన్సిక్ నిపుణుల తనిఖీల్లో ఓ ఆత్మహత్య లేఖ, ఐదు డైరీలు లభ్యమయ్యాయి. తన మృతికి ఎవరూ కారణం కాదని మృతురాలు ఆ లేఖలో పేర్కొన్నారు. భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉండలేక తాను వృద్ధాశ్రమంలో ఉండాలనుకుంటున్నానని తనతో అన్నట్లు ఆమె కుమారుడు రీతురాజ్ సహాని పోలీసులకు తెలిపారు.

పాక్ సైనిక కాల్పుల్లో భారత జవాను మృతి

దిల్లీ: జమ్ము కశ్మీరులోని పూంచ్ జిల్లా పరిధిలో నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో భారత జవాను ప్రాణాలు కోల్పోయాడు. పాక్ సైనిక కాల్పులను భారత సైన్యం దీటుగా, సమర్థంగా ఎదుర్కొందని భారత సైనిక అధికారి ఒకరు తెలిపారు. మంగళవారం కృష్ణఘాటి సెక్టార్‌లో పాక్ సైన్యం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భారత సైన్యంపై కాల్పులు జరిపిందని ఆయన పేర్కొన్నారు. ఈ కాల్పుల్లో పవన్ సింగ్ సుగ్ర(21) తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోయాడని సైనికాధికారి తెలిపారు.

'విలీనం'లో చోటుదక్కలేదని ఒప్పంద కార్మికుడి ఆత్మహత్య

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: విలీన జాబితాలో చోటు దక్కకపోవటంతో మనస్తాపానికి గురైన ఓ ఒప్పంద కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాలు.. మృతదేహంతో కర్మాగారం ఎదుట 5 గంటలపాటు ఆందోళన చేయటం ఉద్రిక్తతకు దారితీసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బొల్లోరిగూడెంకి చెందిన కేశబోయిన నాగేశ్వరరావు(38) కేటీపీఎస్ ఐదో దశలో క్యామ్ డివిజన్‌లో 15 ఏళ్లుగా వెల్డింగ్, ఫిట్టర్ పనులు చేస్తున్నాడు. ఇటీవల విద్యుత్తు సంస్థల్లో తాత్కాలిక ఉద్యోగుల విలీన జాబితాలో నాగేశ్వరరావు పేరు లేదు. ఇందుకు కేటీపీఎస్ అధికారులే కారణమంటూ మంగళవారం సంబంధిత అధికారులను నాగేశ్వరరావు ప్రశ్నించాడు. వారి నుంచి సరైన సమాధానం రాలేదు. దాంతో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక నేతలు, ఒప్పంద కార్మికులు.. మృతదేహంతో కేటీపీఎస్ కర్మాగారం ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్మిక సంఘాల డిమాండ్లను నెరవేర్చడానికి అధికారులు నిరాకరించటంతో విపక్షాలు బుధవారం పాల్వంచ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాయి.



నాగేశ్వరరావు మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, కార్మికులు

రాజ్యసభలో కొత్తనోట్ల వివాదం

- **రూ.500, 2వేల నోట్ల పరిమాణాల్లో తేడాలున్నాయంటూ కాంగ్రెస్ ఆందోళన**

దిల్లీ

కొత్త కరెన్సీ నోట్ల వివాదం రాజ్యసభను స్తంభింపజేసింది. విపక్షాల ఆందోళనలు, నినాదాలతో మంగళవారం సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. రూ.500 నోట్లు, రూ.2000 నోట్ల ముద్రణలో భారీ కుంభకోణం జరిగిందని కాంగ్రెస్ సభ్యులు ఆరోపిస్తూ చర్చకు పట్టుపట్టి ఆందోళనకు దిగగా ... శూన్య అవధిలో ముందస్తు నోటీసు ఇవ్వకుండా నియమభంగ ఆక్షేపణ(పాయింట్ ఆఫ్ ఆర్డర్) ఎలా లేవనెత్తుతారంటూ సభలో ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అభ్యంతరం తెలిపారు. స్వల్ప విషయాలపై కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తుందని, సభా సమయాన్ని వృథా చేస్తుందని విమర్శించారు. ఈ అంశంపై విపక్ష సభ్యుల నినాదాలకు ప్రతిగా అధికారపక్ష సభ్యులూ స్పందించటంతో సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

మంగళవారం రాజ్యసభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్..రూ.500 నోట్ల పరిమాణాల్లో తేడాలున్నాయంటూ నియమభంగ ఆక్షేపణ(పాయింట్ ఆర్డర్) లేవనెత్తారు. 'ఒక రకం రూ.500 నోట్లు అధికారపక్షం కోసం...మరోరకం రూ.500 నోట్లు మిగిలిన వారి కోసం' అంటూ ఆరోపించారు. పెద్ద కరెన్సీ నోట్లలో తేడాల వెనుక భారీ కుంభకోణమే ఉందని, ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే అర్హత ఏమాత్రం లేదని గులాంనబీ ఆజాద్ అన్నారు. కాంగ్రెస్ సభ్యుల వాదనకు సమర్థనగా టీఎంసీ సభ్యుడు డెరెక్ ఒబ్రియాన్ రెండు కొత్త రూ.500 నోట్లను సభకు చూపారు. వీటి పరిమాణంలో, నమూనాలో తేడాలున్నాయని చెబుతూ వాటిని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి చూపారు. కాంగ్రెస్ సభ్యుల ఆందోళనకు జేడీ(యు) నేత శరద్ యాదవ్ మద్దతు తెలిపారు.

కాంగ్రెస్ సభ్యుల ఆరోపణలకు కేంద్ర మంత్రులు రవిశంకర్ ప్రసాద్, ముఖ్తర్ అబ్బాస్ నఖ్వీ దీటుగా స్పందించారు. అవినీతి పరులను దెబ్బ తీసిన పెద్దనోట్ల రద్దుపై ప్రజల్లో గందరగోళం సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని విమర్శించారు. నల్లధన కుబేరులను రక్షించాలనే ప్రయత్నాలు ఫలించబోవన్నారు.

కరెన్సీ నోట్లలో తేడా అంశంపై వెంటనే చర్చకు అనుమతించటానికి సభాధ్యక్షస్థానంలో ఉన్న డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ అంగీకరించలేదు. ముందస్తు నోటీసు లేకుండా నియమభంగ ఆక్షేపణను ఈ రూపంలో అనుమతించబోమని స్పష్టం చేశారు. విపక్ష, అధికార సభ్యుల నినాదాలు.. ప్రతినినాదాలతో సభలో గందరగోళం నెలకొనటం, కాంగ్రెస్ సభ్యులు సభ మధ్యలోకి రావటంతో డిప్యూటీ ఛైర్మన్ తొలుత 15 నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి సమావేశమైనా ఇదే పరిస్థితి. మొత్తం ఆరుసార్లు వాయిదాపడగా మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో చివరిగా బుధవారానికి సభను వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు. అంతకు ముందు మధ్యాహ్నం 2 గంటల సమయంలో సభ... మోటారు వాహనాల బిల్లు (2017)ను సెలెక్ట్ కమిటీకి పంపిస్తూ నిర్ణయం తీసుకుంది.

ప్రధాని, ఆర్థిక మంత్రి వివరణకు కాంగ్రెస్ డిమాండ్

దేశ కరెన్సీ విశ్వసనీయతను దెబ్బతీసేలా రూ.500, రూ.రెండు వేల నోట్లలోని తేడాలపై వస్తున్న సందేహాలను ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నివృత్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. దేశ ఆర్థిక వ్యవస్థనే ప్రశ్నార్థకం చేస్తున్న నోట్ల ఆకృతి, నమూనా, ముద్రణల్లోని తేడాలపై వారు వివరణ ఇవ్వాలని విలేకరుల సమావేశంలో ఆ పార్టీ ఎంపీ కపిల్ సిబల్ కోరారు.

సిబల్ తెలిపిన తేడాలివి..

- రిజర్వుబ్యాంకు ప్రకటించిన ప్రకారం.. రూ.500 నోటు వెడల్పు, పొడవు 66ఎంఎం×150ఎంఎం ఉండాలి. కానీ కొన్ని నోట్లు 151ఎంఎం నుంచి 153 ఎంఎం పొడవు వరకూ ఉంటున్నాయి.
- రూ.2వేల నోటు ఆర్బీఐ నిర్ధారిత సైజు 66 ఎంఎం×166ఎంఎం. కానీ కొన్ని నోట్లు 167మిల్లీమీటర్ల వరకూ పొడవు ఉంటున్నాయి.
- ఆయా నోట్ల కుడి, ఎడం, కింది భాగాల్లో ముద్రణ, డిజైన్ పరంగా తేడాలున్నాయి. రూ.500 నోట్లపై అశోకుడి స్థూపం చిత్రం, రూ.2000 నోట్లపై మహాత్మా గాంధీ అని రాసిన అక్షరాలు ఉంచిన చోట తేడాలున్నాయి.
- ఒకే సిరీస్‌తో వచ్చిన నోట్లలోనూ తేడాలున్నాయి.
- విభిన్న రకాల్లో ముద్రణ ఆర్బీఐకి తెలిసే జరిగిందా అని కపిల్ సిబల్ ప్రశ్నించారు. ఒకవేళ ఆర్బీఐకి తెలిసే జరిగితే ప్రజలకు ఎందుకు తెలపలేదన్నారు.



పెద్ద నోట్లకు విశిష్ఠ పరిమాణాలు: ఆర్థిక మంత్రి

ముద్రిత రూ.500, రూ.2000 కరెన్సీ నోట్లు దేనికవే ప్రత్యేక పరిమాణాలను కలిగి ఉన్నాయని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాలే రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. జాతీయ నేర నమోదు విభాగం(ఎన్‌సీఆర్‌బి) సమాచారం ప్రకారం దేశంలో నకిలీ కరెన్సీ చెలామణి ఘటనలు నమోదయ్యాయి. ఆ నోట్ల నాణ్యతలో తేడాలున్నాయని తేలిందన్నారు. పెద్ద కరెన్సీ విషయంలో నకిలీ నోట్లు ఇంతవరకూ ఎక్కడా పట్టుబడలేదని వెల్లడించారు.

రాహుల్ పర్యటనల్లో దాపరికం ఎందుకు?

- **గుజరాత్ ఘటనపై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టిన రాజ్‌నాథ్**



దిల్లీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ వాహనంపై ఇటీవల గుజరాత్‌లో రాళ్లు రువ్విన ఘటనపై మంగళవారం లోక్‌సభలో దుమారం రేగింది. కాంగ్రెస్ సభ్యుల అరుపులు, కేకలు, నినాదాలు, నిరసనల మధ్య సభ బుధవారానికి వాయిదా పడింది. కాంగ్రెస్ ఆరోపణలకు దీటుగా కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ జవాబిచ్చారు. రాహుల్ గాంధీని అమూల్య సంపదగా వర్ణించిన ఆయన - గుజరాత్‌లో రాహుల్ భద్రత ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని పేర్కొన్నారు. సభకు సోనియా, రాహుల్‌లు హాజరు కాలేదు. అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే - గుజరాత్ ఘటనలో రాహుల్ ప్రాణాలకే ముప్పు వాటిల్లేదని.. భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. గుజరాత్‌లో ఉగ్రవాదులున్నారా? లేదా భాజపా కార్యకర్తలు ఉగ్రవాదులయ్యారా? అంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. దీంతో భాజపా సభ్యులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

100 సార్లు ఉల్లంఘించారు..: ప్రణాళికతోను, ప్రణాళిక ప్రకటించకుండాను.. రాహుల్ 121 దేశీ, విదేశీ పర్యటనలు చేశారని.. దాదాపు 100 సార్లు ఆయన తూటా నిరోధక కారును వినియోగించలేదని రాజ్‌నాథ్ తెలిపారు. రెండేళ్లలో ఆయన 72 రోజుల పాటు 6 విదేశీ పర్యటనలు జరిపినట్లు వివరించారు. వీటికి ఎస్పీజీ భద్రతను పొందని ఆయన ఏం దాచాలని చూస్తున్నారో దేశం, సభ తెలుసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్‌లో తూటా నిరోధక కారు, జామర్ ఏర్పాటు చేసినా.. హెలిప్యాడ్ నుంచి రాహుల్ వేరే వాహనంలో వెళ్లారన్నారు. రాళ్లు రువ్విన ఘటనలో ఎస్పీజీ సిబ్బంది ఒకరు గాయపడగా.. నిందితుడిని పట్టుకుని జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ సభ్యులు నినాదాలతో వెల్‌లోకి దూసుకురావడంతో సభ మధ్యాహ్నం 30 నిమిషాలు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన తర్వాత టీఎంసీ సభ్యుడు సుదీప్ బంధోపాధ్యాయ్ - రాహుల్‌పై దాడిని సభ ఖండించాలని సూచించారు. ఆయన ఎస్పీజీ రక్షణ తీసుకుని ఉండాల్సిందన్నారు. రాజ్‌నాథ్ సభను తప్పుతోవ పట్టించారని ఖర్గే విమర్శించగా.. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ ఖండించారు. అనంతరం కాంగ్రెస్ సభ్యులు అడ్డుకోవడంతో సభ వాయిదా పడింది.

కొత్త సీజేఐగా జస్టిస్ దీపక్‌మిశ్ర!

దిల్లీ

సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్ర నియమితులయ్యారు. ఈమేరకు న్యాయ మంత్రిత్వశాఖ మంగళవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ దీపక్‌మిశ్ర వయసు 63సంవత్సరాలు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్. ఖేహర్ ఈ నెల 27న పదవీవిరమణ చేస్తున్న నేపథ్యంలో తదుపరి సీజేఐగా జస్టిస్ దీపక్‌మిశ్రను నియమిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది.

కీలక తీర్పులెన్నో..

జస్టిస్. దీపక్ మిశ్ర ఎన్నో కీలక తీర్పులు వెలువరించారు. ముంబయి బాంబుపేలుళ్ల కేసులో దోషి యాకూబ్ మెమన్‌ను, దిల్లీలో 'నిర్భయ'పై అత్యంత దారుణంగా అత్యాచారానికి పాల్పడి...కిరాతకంగా చంపేసిన నలుగురికి ఉరిశిక్ష విధిస్తూ ఆయన వెలువరించిన తీర్పులు చరిత్రాత్మకం. 2015లో ఉరిని తప్పించుకోవడానికి మెమన్ చివరిక్షణంలో వేసిన ఎత్తును చిత్తు చేశారు. తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో సుప్రీంకోర్టు తలుపులు తీయించిన జస్టిస్ మిశ్ర సారథ్యంలోని ధర్మాసనమే మెమన్ కేసును విన్న విషయం గమనార్హం.

'అయోధ్య'...'కావేరి'...'పనామా' కేసులూ..: ఈ నెల 28న భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే జస్టిస్ దీపక్ మిశ్ర 13 నెలల పాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఇప్పుడాయన ముందుకు అత్యంత కీలకమైన 'అయోధ్య' ప్రార్థనా స్థలం కేసు వచ్చే అవకాశం ఉంది. ఎప్పటి నుంచో కొలిక్కి రాకుండా ఉన్న కావేరీ జలాల వివాదం, 'సెబీ'-సహారా చెల్లింపులు, బీసీసీఐ సంస్కరణలు, పనామా పత్రాలు లీకైన వ్యవహారం.... వంటివెన్నో కూడా జస్టిస్. మిశ్ర ముందుకు రావచ్చు.

ఒడిశా హైకోర్టు నుంచి..

జస్టిస్. మిశ్ర 1977లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగ, సివిల్, క్రిమినల్, రెవిన్యూ, అమ్మకం పన్ను తదితర ఎన్నో కేసుల్లో ఒడిశా హైకోర్టులోనూ... ట్రైబ్యునల్స్ ముందు తన వాదనలను వినిపించారు. 1996లో ఒడిశా హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1997లో మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2009లో పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2010లో దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. 2011లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇప్పుడిక భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలను నిర్వర్తించనున్నారు.

ఉత్కంఠ మధ్య అహ్మద్ పటేల్ గెలుపు

గాంధీనగర్, దిల్లీ: గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో అత్యంత నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయినా లెక్కింపు వద్దకు వచ్చేసరికి బుధవారం తెల్లవారుజాము వరకు హైడ్రామా కొనసాగింది. కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ విజయం సాధించినట్లు తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో అనధికారికంగా వెల్లడయింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ ట్విటర్‌లో ప్రకటించింది. పటేల్ కూడా ట్విటర్ ద్వారా తన విజయాన్ని పంచుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. భాజపా అభ్యర్థులు అమిత్ షా, స్మృతి ఇరానీలు సులభంగానే గట్టెక్కినా పటేల్ విషయంలోనే గంటల తరబడి తీవ్ర ప్రతిష్టంభన కొనసాగింది. తమ పార్టీకి చెందిన ఇద్దరు శాసనసభ్యులు క్రాస్ ఓటింగుకు పాల్పడిన దృష్ట్యా వారి ఓట్లను రద్దు చేయాలని కాంగ్రెస్ చేసిన డిమాండుతో లెక్కింపు ప్రక్రియకు అవరోధం ఎదురయింది. దాదాపు అర్ధరాత్రి సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం తన నిర్ణయాన్ని వెలువరిస్తూ- ఆ రెండు ఓట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత లెక్కింపు మొదలయింది. ఈసీ నిర్ణయంతో కాంగ్రెస్ శిబిరంలో ఉత్సాహం వెల్లివిరిసింది. రాత్రి 1.15 గంటల వరకు లెక్కింపు కొనసాగింది. ఆ తర్వాత మరో ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్ల గోప్యత విషయంలో భాజపా అభ్యంతరాలు లేవనెత్తడంతో లెక్కింపు మళ్లీ ఆగిపోయింది. విషయాన్ని వెంటనే కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించారు. ఆ తర్వాత 1.35 గంటలకు తిరిగి లెక్కింపు మొదలుపెట్టారు. ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాల కోసం అమిత్ షా, స్మృతి ఇరానీ, ఇటీవల కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన బల్వంత్‌సింగ్ రాజ్‌పుట్‌లు పోటీ చేయగా, కాంగ్రెస్ తరపున అహ్మద్ పటేల్ బరిలో దిగిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో మొత్తం 176 మంది శాసనసభ్యులూ ఓట్లు వేశారు.



గాంధీనగర్‌లో ఓటుహక్కు వినియోగించుకున్న తరువాత విజయసంకేతం చూపుతున్న స్మృతిఇరానీ

కాంగ్రెస్ అభ్యంతరంతో లెక్కింపులో ఆలస్యం: భాజపా అభ్యర్థికి ఓటు వేశామని తమ శాసనసభ్యుల్లో ఇద్దరు ప్రకటించిన దృష్ట్యా వారి ఓట్లు చెల్లబోవంటూ ప్రకటించాలని కాంగ్రెస్ చేసిన డిమాండుతో ఓట్ల లెక్కింపు బాగా ఆలస్యమయింది. రాఘవ పటేల్, భోలా గోహిల్ అనే ఎమ్మెల్యేలు భాజపా అభ్యర్థికి ఓటు వేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా- పార్టీ అధికార ప్రతినిధులకు కాకుండా తమ బ్యాలెట్ పత్రాలను ఇతర ఏజెంట్లకు చూపించారనీ, అందువల్ల అవి చెల్లబోవని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

ఈసీని కలిసిన కేంద్ర మంత్రులు: ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఇలాంటి పసలేని ఆరోపణలు చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జీతూ వాఘానీ విమర్శించారు. కాంగ్రెస్ డిమాండును తిప్పికొట్టడానికి కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్ తదితరుల బృందం ఎన్నికల సంఘాన్ని మూడుసార్లు కలిసింది. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఓటు వేస్తున్నప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగానీ, పరిశీలకులుగానీ అభ్యంతరం వ్యక్తం చేయలేదనీ, అందువల్ల వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టాలనీ విజ్ఞప్తి చేసినట్లు గోయల్ విలేకరులకు తెలిపారు. ఒకసారి బ్యాలెట్ పెట్టెలో ఓటు పడిన తర్వాత దాని చెల్లుబాటును ప్రశ్నించరాదని చెప్పారు. ఈసీ నుంచి భాజపా బృందం బయటకు రాగానే కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం నేతృత్వంలో ఒక బృందం వెళ్లి అధికారుల్ని కలిసింది. తీవ్ర తర్జనభర్జనల తర్వాత, వీడియో దృశ్యాలను చూసిన మీదట ఈసీ తన నిర్ణయాన్ని వెలువరిస్తూ రెండు ఓట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో విజయానికి కావాల్సిన ఓట్ల సంఖ్య 45 నుంచి 44కి తగ్గినట్లయింది. అమిత్‌షా, స్మృతి ఇరానీలకు 46 చొప్పున ఓట్లు వచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా- ఎన్నికల్లో తాను అహ్మద్ పటేల్‌కు ఓటు వేసినట్లు జేడీ(యు) ఏకైక శాసనసభ్యుడు ఛోటూ వాసవ వెల్లడించారు.

చండీగఢ్ కేసులో అయిదు సీసీటీవీ కెమెరా దృశ్యాల సేకరణ

విశ్లేషిస్తున్న పోలీసులు

చండీగఢ్: సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తెను వెంబడించి భయాందోళనలకు గురి చేసిన కేసులో అయిదు సీసీటీవీ కెమెరాల నుంచి చండీగడ్ పోలీసులు దృశ్యాలను సేకరించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న హరియాణా భాజపా నేత కుమారుడు వికాస్ బరాలా, అతడి స్నేహితుడు ఆశిష్ కుమార్‌లను పోలీసులు అరెస్టు చేసి... ఆ తర్వాత బెయిలుపై విడుదల చేసిన విషయం గమనార్హం. ఈ అయిదు సీసీటీవీ కెమెరాల దృశ్యాలను విశ్లేషిస్తున్నట్లు ఛండీగడ్ పోలీసు ఉన్నతాధికారి ఈష్ సింఘాల్ తెలిపారు. ఈ వ్యవహారంలో చండీగఢ్‌లో ఇంకా నిరసనలు వ్యక్తమౌతూనే ఉన్నాయి. మంగళవారం పంజాబ్ గవర్నర్ నివాసం వైపునకు ప్రదర్శనగా వెళుతున్న ఐఎన్ఎల్‌డీ మహిళా విభాగం ప్రతినిధులను పోలీసులు మధ్యలోనే నిలువరించారు. ఈ ఘటనపై హరియాణా భాజపా సారథి సుభాష్ బరాలా మంగళవారం మాట్లాడారు. బాధితురాలు తన కుమార్తె వంటిదన్నారు. ఈ కేసులో తన కుమారుడు ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతిని ప్రస్తావిస్తూ...విచారణ విషయంలో తమవైపు నుంచి కానీ...పార్టీ పరంగా కానీ ఎలాంటి వత్తిడులూ ఉండవని స్పష్టం చేశారు. చట్టప్రకారం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ ఘటనపై విచారణలో చండీగఢ్ పోలీసులకు తగిన స్వేచ్ఛనివ్వాలని పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ డిమాండ్ చేశారు.

వ్యక్తిగత స్వేచ్ఛ రక్షణలో అగ్రభాగాన నిలుద్దాం

- **కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక భేటీలో సోనియా గాంధీ**

దిల్లీ: వ్యక్తులు, సంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పరిరక్షణలో కాంగ్రెస్ అగ్రభాగాన నిలుస్తుందని ఆ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలిపారు. వ్యక్తిగత స్వేచ్ఛపై దాడులకు పాల్పడుతున్న వ్యక్తులను భాజపా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. క్విట్‌ఇండియా ఉద్యమ 75ఏళ్ల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దిల్లీలో నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యక్తులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని హింసకు పాల్పడుతున్న ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. "ఇటీవల వ్యక్తుల, సంస్థల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలపై దాడి జరుగుతోంది. ఎవరికివారుగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోటం వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రమాదకరం. బహుళత్వానికి, భిన్నత్వానికి అది బద్ధ శత్రువు" అని సోనియా గాంధీ అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించి, వలసపాలకులకు మద్దతుగా నిలిచిన వారి అనుయాయులు ఇప్పుడు అత్యున్నత స్థానాల్లో ఉన్నారంటూ భాజపా, ఆరెస్సెస్‌లపై విమర్శలు ఎక్కుపెట్టారు. 1942నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పాత్రపై సమావేశంలో చర్చించారు. ఉద్యమంలో భాగస్వాములైన వేల మంది పార్టీ కార్యకర్తలకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల కలల సాకారానికి పునరంకితం కావాలని, దేశ వారసత్వాన్ని దెబ్బతీయాలని చూసే శక్తులను ఓడిస్తామంటూ రెండు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. ఇటీవల గుజరాత్‌లో రాహుల్ వాహనంపై జరిగిన దాడిని ఖండించింది. భేటీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఏకే ఆంటోని, గులాంనబీ ఆజాద్, చిదంబరం తదితరులు పాల్గొన్నారు. విషజ్వరంతో బాధపడుతున్న ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ గైర్హాజరయ్యారు.



కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీ, ఏకే ఆంటోనీ

రాహుల్ వాహనాల అసౌకర్య ఆరోపణలను తోసిపుచ్చిన హోంశాఖ: కేంద్ర ప్రభుత్వం రాహుల్ గాంధీకి సమకూర్చిన కార్లు తీవ్ర అసౌకర్యంగా ఉన్నాయంటూ ఆయన సహాయకుడు కౌశల్ కిషోర్ విద్యార్థి చేసిన ఆరోపణలను కేంద్ర హోంశాఖ తోసిపుచ్చింది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జైట్లీతో పాటు జెడ్ ప్లస్ భద్రతఉన్న వ్యక్తులు ఉపయోగిస్తున్నటువంటి టాటా సఫారీ కార్లనే రాహుల్‌కు సమకూర్చామని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు.

వివాదాస్పద స్థలానికి సముచిత దూరంలో


మసీదు నిర్మించుకోవచ్చు!

- **సుప్రీంకోర్టుకు ఓ పరిష్కారాన్ని సూచించిన యూపీ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు**

దిల్లీ: అయోధ్యలో వివాదాస్పద స్థలానికి సముచిత దూరంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతంలో మసీదును నిరభ్యంతరంగా నిర్మించుకోవచ్చంటూ ఉత్తరప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు మంగళవారం సుప్రీంకోర్టుకు తన అభిప్రాయాన్ని సూచనప్రాయంగా తెలిపింది. దీంతో, ఎంతోకాలం నుంచీ అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు బోర్డు ఓ పరిష్కారాన్ని సూచించనట్లయింది. ఈ వ్యవహారంలో వివిధ హిందూ సంస్థలు చేస్తున్న డిమాండ్‌కు మద్దతుగా ముందుకొచ్చిన తొలి ముస్లిం సంస్థ యూపీ షియా బోర్డే అవుతుంది. అయితే, అదే సమయంలో బాబ్రీ మసీదు స్థలం తమ సొంత ఆస్తి అనీ...ఈ వివాదానికి సామరస్య పూర్వక పరిష్కారానికి చర్చలు జరిపే హక్కు తమకు మాత్రమే ఉందని కూడా వక్ఫ్‌బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానంలో యూపీ షియా సెంట్రల్ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ సయీద్ వసీం రిజ్వి తరపున 30 పుటల అఫిడవిట్ దాఖలైంది. ఈ రెండు ప్రార్థనాస్థలాలు (మందిరం, మసీదు) చేరువగా ఉండకుండా చూడాలి. ఉభయులూ వాడే లౌడ్‌స్పీకర్ల వల్ల మతపరమైన విధివిధానాల విషయంలో ఇరు పక్షాలకూ అంతరాయాలు కలిగే అవకాశం ఉంది. దరిమిలా రెండు వర్గాల మధ్య ఘర్షణలకు దారితీసే పరిస్థితులున్నాయి. దీనిని నివారించేందుకు మర్యాద పురుషోత్తం శ్రీరాం జన్మస్థలంగా ఎంతో పవిత్రంగా భావిస్తున్న చోటికి సాధ్యమైనంత దూరంలో ముస్లిం జనాభా అధికంగా ఉన్న ప్రాంతంలో మసీదును నిర్మించుకోవచ్చన్న అభిప్రాయాన్ని వక్ఫ్‌బోర్డు దాఖలు చేసిన అఫిడవిట్ పేర్కొంది. ఈ కేసులో స్థల వివాదానికి సంబంధించి అలహాబాదు హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ లోగడ దాఖలైన అప్పీళ్లను శీఘ్రగతిన (ఫాస్ట్ ట్రాక్) విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించిన కొద్దిరోజుల్లోపే వక్ఫ్‌బోర్డు ఈ అఫిడవిట్‌ను సమర్పించడం గమనార్హం. సుదీర్ఘకాలం నుంచీ అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసుకునేందుకు వ్యవధినివ్వాల్సిందిగా సర్వోన్నత న్యాయస్థానాన్ని వక్ఫ్‌బోర్డు అభ్యర్థించింది. ఒక్కమాటలో చెప్పాలంటే....బాబ్రీ మసీదు కేవలం తమ ఆస్తి మాత్రమేననీ...కాబట్టి సంబంధితులతో కలిసి ఈ సమస్యకు శాంతియుత పరిష్కారానికి వచ్చే హక్కు కూడా తమదేనని యూపీ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు స్పష్టం చేసింది.

జగన్ ఓ ఉన్మాది

- ఆయన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం
- వాటితోనే వైకాపా పతనం
- అధికారం వస్తే ఇంకెంత ఉన్మాదిగా మారతాడో
- సీఎం చంద్రబాబు ధ్వజం



ఈనాడు, అమరావతి: వైకాపా నాయకుడు జగన్ చేస్తున్న ఉన్మాద వ్యాఖ్యలు ఆ పార్టీనే పతనం చేస్తాయని ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని చెప్పుతో కొట్టమనడం, నడిరోడ్డుపై కాల్చి చంపాలనడం, పోలీస్ కమిషనర్‌ను జైలుకి తీసుకెళ్తాననడం, పోలీసు కమిషనర్ పెన్షన్ కట్ చేస్తాననడం ఉన్మాదం కాకపోతే మరేంటని ఆయన ప్రశ్నించారు. "జగన్ ఎంత శాడిస్టో చెప్పడానికి ఆయన చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనం. అధికారంలో లేనపుడే ఇంత శాడిస్టుగా ఉంటే, అధికారంలోకి వస్తే ఇంకెంత ఉన్మాది అవుతాడో" అని ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో జగన్‌పై ధ్వజమెత్తారు. చంద్రబాబు మంగళవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి పార్టీ నాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పార్టీ కమిటీల బాధ్యులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతిపక్షాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా సంయమనం పాటించాలని నాయకులు, కార్యకర్తలకు హితవు చెప్పారు. నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా విజయం తథ్యమని, 2019 ఎన్నికల్లో వైకాపాకి 30కి మించి సీట్లు రావని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. సెప్టెంబరు 1 నుంచి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని అన్ని గ్రామాలు, వార్డుల్లో ఉత్సాహంగా నిర్వహించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

గంగిరెడ్డితో వైఎస్‌కు సంబంధాలు

భావోద్వేగాల్ని ఎలా నియంత్రించుకోవాలనేది దాన్నిబట్టే నాయకుని వ్యక్తిత్వం తెలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. నేరుగా పేరు ప్రస్తావించకుండా వైకాపా అధ్యక్షుడు జగన్ జీవిత నేపథ్యంలో చేసిన వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యవహారశైలిపైనా విరుచుకుపడ్డారు. "గతంలో నేను అధికారంలో ఉన్నపుడు అనంతపురం జిల్లాలో సూట్‌కేస్ బాంబు కేసులో జగన్ నిందితుడు. దీనిపై శాసనసభలో అప్పటి ప్రతిపక్ష నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ తన కుమారుడిపైన కాదు మనవడి మీదా కేసు పెట్టుకోమని సవాల్ విసిరారు. ఎంఐఎం ఎమ్మెల్యే అసదుద్దీన్ సైతం కేసు పెట్టటం సరికాదన్నారు. దీంతో ఆ కేసు వదిలేశాం. వైఎస్ అధికారంలోకొచ్చాక పరిటాల రవి హత్యకు గురయ్యారు. ఆవేశంలో ఉన్నా మేం సంయమనం కోల్పోలేదు" అని వ్యాఖ్యానించారు. సచివాలయంలో మంగళవారం విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఎర్రచందనం స్మగ్లర్ గంగిరెడ్డికి వై.ఎస్.కి సన్నిహిత సంబంధాలున్నాయని చంద్రబాబు తెలిపారు. 'నాపై అలిపిరిలో మావోయిస్టులు చేసిన దాడికి గంగిరెడ్డి సాయం చేశాడు. అతనికి వైఎస్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి' అని వివరించారు.

విలేకరులకు అపార్ట్‌మెంట్ల నిర్మాణంపై కమిటీ: రాష్ట్రస్థాయిలో విలేకరులకు అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. అమరావతిలో పనిచేసే విలేకరులకు రాజధానిలో భాగంగా వచ్చే మీడియా సిటీలో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తామని చెప్పారు. దీనికోసం అధికారులు, విలేకరులతో కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఇక్కడే పత్రికలు, ఛానళ్లకు భూమి కేటాయిస్తామని చెప్పారు. కార్యాలయాలు, నివాసాలు పక్కపక్కనే వస్తాయని తెలిపారు.

ఉమ్మడి సమస్యల పరిష్కారానికి కృషి

- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలతో మాట్లాడతా: గవర్నర్
- విద్యుత్ ఛార్జీలు పెంచం: సీఎం చంద్రబాబు



విజయవాడలో విద్యుత్‌సౌధ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి కళావెంకట్రావు, ట్రాన్స్‌కో ఎండీ యోగానంద్ తదితరులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ హామీనిచ్చారు. "కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంలతో మాట్లాడతా"నని ఆయన అన్నారు. విజయవాడలోని గుణదలలో నిర్మించిన 'విద్యుత్ సౌధ', ఆంధ్రప్రదేశ్ లోడ్ డిస్పాచ్ సెంటర్(ఏపీఎస్ఎల్‌డీసీ)ను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు కిమిడి కళావెంకట్రావు, దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి గవర్నర్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. 'విద్యుత్ సౌధ', ఎస్ఎల్‌డీసీ భవనాల్లో కల్పించిన వసతులను చూసి ఆనందపడ్డారు. సంతోషానికి చిహ్నంగా ఈ భవనానికి 'సమృద్ధి' అనే పేరు పెట్టాలని సూచించారు. తాను గవర్నర్‌గా ఉన్నా, లేకపోయినా అందమైన భవనం ప్రారంభోత్సవ ఫలకాలపై తన పేరు ఉండాలని ఆకాంక్షించారు. తన పేరు ఉందా లేదా అనే విషయాన్ని చెన్నై నుంచి అయినా తెలుసుకునేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఎస్ఎల్‌డీసీ నుంచి రాష్ట్రం మొత్తం మీద విద్యుత్ సరఫరా, పంపిణీ తీరును పర్యవేక్షించే సౌకర్యం ఉంది. దీన్ని అధికారులు గవర్నర్‌కు చూపించారు. ఈ సందర్భంగా గవర్నర్ అడిగిన ఒక సందేహానికి ముఖ్యమంత్రి స్పందించి సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ఇంజినీరు మాదిరి ముఖ్యమంత్రి సమాచారాన్ని తెలిపారని, విద్యుత్ రంగంపై ఆయనకు పూర్తి పట్టు ఉన్నదని గవర్నర్ పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకువచ్చిన ముఖ్యమంత్రిని అభినందిస్తున్నానని, రెండో దశ సంస్కరణల్లోనూ విజయం సాధిస్తారని ఆకాంక్షించారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గించేందుకు ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. విద్యుత్ రంగంలో ఉత్తమ సలహాలు ఇచ్చిన ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించారు. 'ఉద్యోగులను బాధ పెట్టను. ఒత్తిడి లేకుండా పని చేసే అవకాశం కల్పిస్తా. ఉద్యోగుల బాగోగులను ప్రభుత్వం చూసుకుంటుంది. ప్రజల బాగోగులను ఉద్యోగులు చూసుకోవాలి' అని ఆయన అన్నారు.

ఆ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60

- 9, 10 షెడ్యూళ్లలోని సంస్థల వారికి వర్తింపు

ఈనాడు అమరావతి: రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 9, 10 షెడ్యూళ్ల పరిధిలోకి వచ్చే కంపెనీలు, కార్పొరేషన్లు, సొసైటీలు వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సుని 60 ఏళ్లకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులు.. 2014 జూన్ 2 నుంచే అమల్లోకి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. దీనికి సంబంధించి గతంలో జారీ చేసిన జీవో నెం.102లో కొన్ని సవరణలు చేస్తూ ఆర్థిక శాఖ మంగళవారం జీవో నెం. 138 జారీ చేసింది. సంబంధిత సంస్థల నిబంధనలు, బైలాస్‌లో సవరణలు చేస్తూ కాంపిటెంట్ అథారిటీ (సంబంధిత సంస్థ యాజమాన్యం/డైరెక్టర్ల బోర్డు) ఉత్తర్వులు జారీ చేసిన రోజు నుంచే పదవీ విరమణ వయస్సు పెంపు అమల్లోకి వస్తుందని జీవో నెం. 102లో ప్రభుత్వం ఒక షరతు పెట్టింది. దానిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకి వెళ్లిన నేపథ్యంలో... గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు సవరణ చేస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఎవర్నీ 58 ఏళ్లు నిండాయన్న కారణంతో పదవీ విరమణ చేయించరాదని స్పష్టంచేసింది. ఒక వేళ ఎవరైనా ఉద్యోగిని అదే కారణంతో పదవీ విరమణ చేయించి ఉంటే వారిని మళ్లీ ఉద్యోగంలో నియమించి, 60 ఏళ్ల వయసు వచ్చేంత వరకు కొనసాగించాలని స్పష్టంచేసింది.

ప్రజాస్వామ్య విలువలు కాలరాశారు

- ఫిరాయింపుల్ని ప్రోత్సహించారు
- హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేశారు
- ఆవేదనతోనే సీఎం చంద్రబాబుపై ఆ వ్యాఖ్యలు చేశాను
- ఎన్నికల సంఘానికి వైకాపా అధ్యక్షుడు జగన్ వివరణ

ఈనాడు అమరావతి, కర్నూలు: "ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు, రైతులకు, డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు ఎన్నో హామీలిచ్చారు. వారిలో ఎన్నో ఆశలు కల్పించారు. అవేమీ నెరవేర్చకుండా వారిని మోసం చేశారు. పార్టీ ఫిరాయింపుల్ని ప్రోత్సహించారు. మా పార్టీ టిక్కెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా తమ పార్టీలో చేర్చుకున్నారు. వారికి మంత్రి పదవులిచ్చారు. ప్రజాస్వామ్య విలువల్నీ కాలరాశారు. ఈ నేపథ్యంలో... ప్రజల కష్టాలు చూసిన ఆవేదనతో, ఆగ్రహంతో అన్న మాటలే తప్ప నాకు చంద్రబాబుపై వ్యక్తిగత విద్వేషమేమీ లేదు..." అని ఎన్నికల సంఘానికి ఇచ్చిన వివరణలో వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నట్టు తెలిసింది. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్ ఈ నెల 3న నంద్యాలలో బహిరంగ సభలో మాట్లాడుతూ... "ముఖ్యమంత్రి చంద్రబాబుని నడిరోడ్డుపై కాల్చినా తప్పులేదు..." అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వాటిపై తెదేపా నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిపై జగన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పట్ల ఎన్నికల సంఘం స్పందించింది. దీన్ని సుమోటోగా స్వీకరించి జగన్‌కు నోటీసులు జారీ చేసింది. మీరు ఇలాంటి వ్యాఖ్యలు చేసినందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో... 48 గంటల్లో వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జగన్ సోమవారం రాత్రి నాలుగు పేజీల వివరణను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్‌కి ఫ్యాక్స్, మెయిల్ ద్వారా పంపించారు. దాన్ని ఆయన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సత్యనారాయణకు పంపారు. సత్యనారాయణ దాన్ని మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌కు పంపించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... జగన్ ఆంగ్లంలో ఈ వివరణ పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను వరుసగా ప్రస్తావించారు. 2014లో కర్నూలులో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో వేటినీ నెరవేర్చలేదని, అనేక హామీలిచ్చి ప్రజల్ని వంచించారన్న బాధ, ఆవేదన, ఆగ్రహంతోనే సీఎంపై తాను ఆ వ్యాఖ్యలు చేశానని, తనకు ఎలాంటి దురుద్దేశాలు లేవని తెలిపారు. తనకు ప్రజాస్వామ్య విలువల పట్ల అపారమైన గౌరవం ఉందని, తాను ఎలాంటి తప్పూ చేయలేదని వివరించారు.



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడిని సన్మానిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘ ప్రతినిధులు

వెంకయ్యకు ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం సన్మానం

ఈనాడు, న్యూస్‌టుడే-హైదరాబాద్: ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడిని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘ ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చల్లా ధనంజయ, ఉపాధ్యక్షుడు ఆనంద్‌శేషు, కార్యదర్శి బాచిన హనుమంతరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం: ఉపరాష్ట్రపతిగా గెలుపొంది తొలిసారిగా మంగళవారం శంషాబాద్ విమానాశ్రయానికి విచ్చేసిన ఎం.వెంకయ్యనాయుడుకు ఘన స్వాగతం లభించింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డా.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర నేతలు డా.ప్రేమ్‌రాజ్, కొప్పుల ప్రశాంత్, నందకిషోర్, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి బొకేలు, శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించారు.

హరియాణా రజతోత్సవాలకు తెలంగాణ కళాకారులు

ఈనాడు, హైదరాబాద్: అక్టోబరు 21 నుంచి 29 వరకు హరియాణాలో జరిగే ఆ రాష్ట్ర రజతోత్సవాలకు తెలంగాణ సాంస్కృతిక, యువజన బృందం హాజరుకానుంది. ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందంలో భాగంగా, హరియాణా కళాబృందాలు తెలంగాణ ఉత్సవాల్లో పాల్గొంటున్నాయి. ఈ క్రమంలో తమ ఉత్సవాలకు తెలంగాణా బృందాన్ని పంపించాలని హరియాణా యువజనశాఖ ప్రతినిధి డాక్టర్ భరత్‌నాథన్ మంగళవారం తెలంగాణ యువజన సంక్షేమ మంత్రి పద్మారావును కోరారు. దీంతో వంద మందితో కూడిన బృందాన్ని పంపుతున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ యువజన అవార్డు గ్రహీతల సంఘం ప్రతినిధులు సామల వేణు, రెండ్ల కళింగశేఖర్, ఎ.కిరణ్‌కుమార్, అలువాల విష్ణు, భగవాన్‌దాస్‌తో పాటు పలువురు కళాకారులు ఈ బృందంలో ఉంటారు.

ఫరూక్‌తో మెహబూబా భేటీ

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్న ఆర్టికల్‌పై చర్చ జరుగుతున్న వేళ.. ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఆశ్చర్యకరంగా ప్రతిపక్ష నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితిపై మంగళవారం సాయంత్రం నేతలిద్దరూ సమావేశమైనట్లు ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు. స్నేహపూర్వక భేటీ జరిగినట్లు పేర్కొన్నారు. సమావేశ వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

ముగిసిన ఎంసెట్ తుదివిడత కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: ఏపీ ఎంసెట్-2017 తుది(మూడో)విడత సీట్ల కేటాయింపు మంగళవారం పూర్తి చేశారు. చివరి విడతలో 13,379 మంది ఆప్షన్లు నమోదు చేసుకున్నారు. కొత్తగా 2040మందికి సీట్లు కేటాయించారు. 7,355 మంది విద్యార్థులు స్లైడింగ్ తీసుకున్నారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 11 లోపు కళాశాలల్లో చేరాలని కన్వీనర్ పండాదాస్ తెలిపారు. మొత్తం 1,45,433మంది ఎంసెట్‌లో అర్హత సాధించగా.. ఇందులో 77,143 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరయ్యారు. కన్వీనర్ కోటా సీట్లు 98,251 సీట్లు ఉండగా.. 66,073 భర్తీ అయ్యాయి. ఇంకా 32, 178 సీట్లు మిగిలిపోయాయి. విశ్వవిద్యాలయాల ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 4,456 సీట్లు ఉండగా.. 4,452 భర్తీ అయ్యాయి. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 89,643 ఉండగా.. 61,252 భర్తీ అయ్యాయి.

- బీ.ఫార్మసీ, ఫార్మ్-డీలకు సంబంధించి వర్సిటీ కళాశాలల్లో 205సీట్లు ఉండగా.. కేవలం 81సీట్లు భర్తీ అయ్యాయి. ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 3,947 ఉండగా.. కేవలం 288 మాత్రమే భర్తీ అయ్యాయి.
- ఆకుల శ్రీరాములు, అమర, శ్రీచైతన్య డీజేఆర్ ఇంజినీరింగ్, టెక్నాలజీ, గోకుల్ గ్రూపు సంస్థలు, సరోజిని టెక్నాలజీ కళాశాలల్లో ఒక్కరూ చేరలేదు.

తితిదే పాలకమండలి అధ్యక్షునిగా సుధాకర్ యాదవ్?

ఈనాడు, అమరావతి: తిరుపతి తిరుమల దేవస్థానం (తితిదే) పాలకమండలి అధ్యక్షునిగా కడప జిల్లాకు చెందిన పుట్టా సుధాకర్ యాదవ్ పేరు పరిశీలనలో ఉంది. ఇతను కిందటి ఎన్నికల్లో తెదేపా తరఫున మైదుకూరు నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేసి ఓడిపోయారు. తితిదే పాలకమండలి అధ్యక్ష పదవికి పలువురి పేర్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... తాజాగా ఇతని పేరుపై మొగ్గు చూపుతున్నట్లు తెదేపా వర్గాల్లో ప్రచారంలో ఉంది. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడికి సుధాకర్ యాదవ్ వియ్యంకుడు.



కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో చేతులకు తాళ్లు, నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఐకాస, కాపు సంఘాల నాయకులు

సంకెళ్లు వేసి పాదయాత్రకు అనుమతించండి

- మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: తమను సంఘ విద్రోహశక్తులుగా భావిస్తే చేతులకు సంకెళ్లు వేసి పాదయాత్రకు అనుమతించాలని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం పోలీసు అధికారులను కోరారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం ఐకాస, కాపు సంఘాల నాయకులతో కలసి పాదయాత్రకు బయలుదేరగా పోలీసు అధికారులు అడ్డగించారు. దీంతో వారితో ముద్రగడ, ఐకాస నాయకులు వాగ్వాదానికి దిగారు. ఎన్నిసార్లు అడ్డగించినా, ఇంట్లోకి వచ్చి కొట్టినా పాదయాత్రను వాయిదా వేసుకోవడం, ఆపడం జరగబోదని ముద్రగడ స్పష్టం చేశారు. రోజులు, నెలలు కాదు ఏడాదిపాటు ఇలాగే చేస్తామన్నారు. ఎవరికీ లేని నిబంధనలు కాపుల కోసమే ప్రత్యేకంగా తయారుచేశారా.. అంటూ డీఎస్పీ రామారావును ప్రశ్నించారు. అనంతరం గేటు వద్ద చేతులకు తాళ్లు, రిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రకటించారు. ప్రభుత్వం తీరు రాష్ట్రంలో 30శాతం మంది కాపులను కలచివేస్తుందని ముద్రగడ అన్నారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు ఆకుల రామకృష్ణ, ఏసుదాను, ఆరేటి ప్రకాష్, గౌతు స్వామి, గుండా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిని ఆకర్షించిన 'మినీ ఎయిర్ టెక్'

- రాజధాని డ్రైయిన్ల పరిశుభ్రతకు యంత్రాల వినియోగం
- సిద్ధమవుతున్న జలమండలి



మురుగునీటి కాల్వను మినీ ఎయిర్‌టెక్ యంత్రంతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: హైదరాబాద్ నగరంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్మిక వ్యవస్థకు స్వస్తి చెప్పి మినీ ఎయిర్‌టెక్ యంత్రాలతో మురుగు డ్రెయిన్లను పరిశుభ్రం చేసే సరికొత్త వ్యవస్థ ప్రధాని నరేంద్ర మోదీని ఆకర్షించింది. ఇది ఎలా పనిచేస్తుంది, కార్మికుల ఇబ్బందులు ఎలా తీరాయన్న దానిపై ఓ ప్రదర్శన ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి కార్యాలయం హైదరాబాద్ జలమండలి ఎండీ దానకిషోర్‌ను ఆదేశించింది. ఈమేరకు ఆయన సిద్ధమవుతున్నారు.

జలమండలి ఎండీ ఆలోచనకు కార్యరూపం: నగరంలో డ్రెయిన్ల పరిశుభ్రతను భారీసంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టేవారు. మ్యాన్‌హోల్స్‌లోకి దిగి విషవాయులను పీల్చి చనిపోయిన దాఖలాలు అనేకం. ఈనేపథ్యంలో డ్రెయిన్ల పరిశుభ్రత విషయంలో అత్యాధునిక వ్యవస్థను ప్రవేశపెట్టాలని జలమండలి ఎండీ దానకిషోర్ తలపెట్టారు. ఇందులోభాగంగా కొందరు పారిశుద్ధ్య కార్మికులతోనే మినీ ఎయిర్‌టెక్ యంత్రాలను కొనుగోలు చేయించాలని నిర్ణయించారు. దళిత పారిశామికవేత్తల సంఘం ఆధ్వర్యంలో వాహనాలను కొనుగోలు చేయించారు. రూ.25 లక్షల వ్యయమయ్యే వీటికి 25 శాతం పరిశ్రమలశాఖ రాయితీ ఇచ్చింది. మిగిలిన నిధులను జలమండలి బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలను ఇప్పించింది. ఇలా 70 యంత్రాలను కొనుగోలు చేయించింది. ప్రతి రోజూ ఒక్కో యంత్రం 50 మీటర్ల మేర డ్రెయిన్‌లను పరిశుభ్రం చేయాలి. దీనికోసం నెలకు రూ.1.75 లక్షల వరకు జలమండలి ప్రతి యంత్ర యజమానికీ చెల్లిస్తోంది. ఒక్కో యంత్రంలో రెండువేల లీటర్ల నీటిని నింపే సామర్థ్యం ఉంది. డ్రెయిన్ మ్యాన్‌హోల్‌లోకి నాజిల్‌తో కూడిన వైరును పంపించి వేగంగా నీటిని పంపింగ్ చేయడం ద్వారా అక్కడ పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి, పూడికను కరిగిస్తున్నారు. దీంతో మురుగునీరు ముందుకు ఆటంకాల్లేకుండా ప్రవహిస్తోంది. మినీ ఎయిర్‌టెక్ యంత్రాలను చిన్నచిన్న సందుల్లోకి తీసుకువెళ్లడానికి వీలవుతోంది. గతంలో ప్రతి నెలా 6వేల ఫిర్యాదులు వస్తే, ఈ యంత్రాల వాడకం వచ్చాక 900 ఫిర్యాదులే వస్తున్నాయని జలమండలి అధికారి ప్రభాకర్ 'ఈనాడు'కు తెలిపారు.

మేం కశ్మీర్‌లో అడుగుపెడితే?

డోక్లాం వివాదంపై స్వరం పెంచిన చైనా

బీజింగ్

డోక్లాం వివాదంపై చైనా స్వరాన్ని మరింత పెంచింది. రెండు దేశాలు ఒకేసారి బలగాలను ఉపసంహరించుకోవాలన్న భారత్ సూచనను తిరస్కరిస్తూ.. 'కశ్మీర్ లేదా ఉత్తరాఖండ్‌లోని కాలాపానీలో మేం అడుగుపెడితే ఏం జరుగుతుంది'అంటూ ప్రశ్నించింది. భారత్, చైనా, భూటాన్ కూడలైన డోక్లాంలో.. భారత్, చైనా బలగాల మధ్య 50 రోజులుగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. భూటాన్ భూభాగంలోని వివాదాస్పద ప్రాంతంలో చైనా సైన్యం రోడ్డు నిర్మాణం చేపడుతుంటే భారత బలగాలు అడ్డుకోవడంతో ఈ వివాదం మొదలైంది. ఈ భూభాగం తమదేనని, వెంటనే భారత బలగాలు వెనక్కు వెళ్లాలని చైనా డిమాండ్ చేస్తోంది. ఈ విషయంపై చైనా విదేశాంగ శాఖలోని సరిహద్దులు, విదేశీ వ్యవహారాల విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వాంగ్ వెన్లీ స్పందించారు. భారత మీడియా ప్రతినిధులతో మంగళవారం ఆమె మాట్లాడారు. 'డోక్లాంలో భారత సైనికులు ఒక్కరున్నా... మా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించినట్లే. భారత్ సైనికులందరూ వెనక్కు వెళ్లేవరకూ ఎలాంటి చర్చలూ ఉండవు. అలా చేయకపోతే మా ప్రభుత్వం చేతకానిదని ప్రజలు అనుకుంటారు'అని వ్యాఖ్యానించారు. అంతేకాదు ఈ సమస్యకు భారత బలగాలు వెనక్కి వెళ్లడమే ఏకైక పరిష్కారమని నొక్కిచెప్పారు.

భారత్‌తో యుద్ధానికి చైనా సిద్ధమవుతోందా? అని విలేకరులు ప్రశ్నించగా.. 'ఆ విషయాన్ని మా సైన్యమే చెప్పగలదు. భారత్ తప్పుడు మార్గంలో వెళ్లాలని నిర్ణయించుకున్నా లేదా ఈ విషయంలో ఏమైనా భ్రమలు పెట్టుకున్నా... మా హక్కులను పరిరక్షించుకునేందుకు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఏ చర్యలయినా తీసుకునే హక్కు మాకు ఉంటుంది'అని ఆమె చెప్పారు.

డోక్లామ్ మీదేనని భూటాన్ చెప్పింది: భారత్, చైనాల మధ్య సైనిక ప్రతిష్టంభనకు కారణమైన డోక్లామ్ ప్రాంతం తమది కాదని భూటాన్ అంగీకరించినట్లు చైనా అధికారి చెప్పారు. ఈ మేరకు దౌత్య మార్గాల్లో తమకు సమాచారం అందించిందన్నారు. అయితే దీనిపై ఎలాంటి ఆధారాలను ఇవ్వలేదు.

రాహుల్‌గాంధీ కనిపించడం లేదని గోడపత్రికలు

అమేఠీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ.. తన లోక్‌సభ నియోజకవర్గంలో కనిపించడం లేదని(అదృశ్యమయ్యారని) అవహేళన చేస్తూ అమేఠిలో పలు గోడపత్రికలు దర్శనమిచ్చాయి. నియోజకవర్గంలో నిలిచిపోయిన, చేపట్టాల్సిన పలు పనుల గురించి వాటిపై వివరంగా ఉన్నాయి. ప్రజలను మోసం చేశారని, తన ప్రవర్తనతో రాహుల్ అవమానించారని వ్యాఖ్యలు ఉన్నాయి. ఇదంతా భాజపా, ఆర్.ఎస్.ఎస్. పనేనని, గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు యోగేంద్ర మిశ్రా అన్నారు.

ఫ్యాషన్ డిజైనర్ కారును వెంబడించిన హైదరాబాద్ ఐటీ నిపుణుడు

- అరెస్టు చేసిన పోలీసులు
- ముంబయిలో ఛండీగఢ్ తరహా ఘటన

ముంబయి: ఇటీవల ఛండీగఢ్‌లో ఓ ఐఏఎస్ అధికారి కుమార్తెను ఇద్దరు వ్యక్తులు కారులో వెంటాడి భయభ్రాంతులకు గురిచేసిన దుర్ఘటనను మరవకముందే ముంబయిలో 34 ఏళ్ల ఓ ఫ్యాషన్ డిజైనర్‌కు అదే తరహా చేదు అనుభవం ఎదురైంది. నిందితుడిని పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. సోమవారం తెల్లవారుజామున రెండుగంటల ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. తన పిల్లలతో కలిసి బీఎండబ్ల్యు కారులో లోఖండ్‌వాలాలోని ఇంటికి వెళుతున్న ఆ ఫ్యాషన్ డిజైనర్ కారును ఇక్కడి శివారుల్లోని జోగేశ్వరి ప్రాంతంలో నితేశ్‌శర్మ(36) అనే వ్యక్తి హోండా సివిక్ కారుతో వెంబడించారు. వెంటాడుతూ ఆమె ఇంటిదాకా వెళ్లారు. అక్కడితో ఆగకుండా ఆమె ఇంటి డోర్‌బెల్‌ను అదేపనిగా మోగించారు.

ఆ మహిళ ధైర్యంగా తనను వెంటాడిన వ్యక్తిని, అతడి కారునూ కూడా స్పష్టంగా ఫొటోలు తీశారు. వాటిని తీసుకెళ్లి ఇక్కడి అంబోలీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ వ్యక్తి తెలంగాణలోని హైదరాబాద్‌లో ఐటీ నిపుణుడిగా పనిచేస్తున్న సతీష్ శర్మ అని పోలీసుల విచారణలో తేలింది. అతడు తన బంధువులను కలుసుకునేందుకు ఇక్కడికి వచ్చిఉన్నట్లు తెలిసింది.

తనకు ఎదురైన ఈ దారుణ సంఘటనపై బాధితురాలు తన ఫేస్‌బుక్ ఖాతాలో ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఇంటిదాకా వెంటాడుతూ వచ్చిన ఆ వ్యక్తికి అసలు సీసీకెమెరాల భయం కానీ... సెక్యూరిటీ సిబ్బంది గురించిన యోచన గానీ ఏమీ ఉన్నట్లు కనపడలేదన్నారు. పోలీసుల భయం కూడా ఉన్నట్లు కనిపించలేదని బాధితురాలు చెప్పారు. తనను వెంటాడుతూ వచ్చి... ఇంటి కాలింగ్‌బెల్ కొట్టి వెళ్లిన తర్వాత కూడా అతడు అక్కడే తచ్చాడుతూ ఫొటోలు తీసుకున్నాడని వెల్లడించారు.

కేంద్రహోం మంత్రి ప్రకటన

దిల్లీ: చండీగఢ్‌లో ఓ ఐఏఎస్ అధికారి కుమార్తెను ఇద్దరు వ్యక్తులు కారులో వెంబడించి... భయాందోళనలకు గురిచేసిన ఘటనపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బుధవారం పార్లమెంటులో ఓ ప్రకటన చేయవచ్చు. చండీగఢ్ పోలీసుల నుంచి నివేదిక అందినట్లు కేంద్రహోంశాఖ తెలిపింది. దీనిని పరిశీలిస్తున్నామనీ, హోంమంత్రి బుధవారం పార్లమెంటులో ఒక ప్రకటన చేయవచ్చనీ ఓ అధికారి తెలిపారు.

హెచ్-1బీని కఠినతరం చేస్తే పోటీలో వెనకబడతాం!

- యూఎస్ మేధో సంస్థ అధ్యయన పత్రం వెల్లడి

వాషింగ్టన్: హెచ్-1బీ వీసా విధానాన్ని తీవ్రస్థాయిలో కఠినతరం చేస్తే అమెరికానే నష్టపోవొచ్చని దేశంలోని మేధో సంస్థ 'సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్(సీజీడీ)' ఆందోళన వ్యక్తంచేసింది. అలా చేస్తే భారత్ లాంటి దేశాల నుంచి ప్రతిభావంతులైన వృత్తినిపుణులను అమెరికా ఐటీ రంగంలోకి రప్పించడం కష్టమవుతుందని, అప్పుడు పోటీలో దేశం వెనకబడిపోయే ఆస్కారముందని హెచ్చరించింది. ఐటీ సంస్థలు కెనడా లాంటి దేశాలకు తరలిపోవొచ్చని అంచనా వేసింది. హెచ్-1బీ, ఇతర వలసేతర వీసా విధానాలపై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సమీక్ష జరుపుతున్న తరుణంలో ఈ అంశంపై సీజీడీ ఒక అధ్యయన పత్రాన్ని విడుదల చేసింది. హెచ్-1బీతో అమెరికా, భారత్‌ల ఆర్థిక వ్యవస్థలు రెండూ ప్రయోజనం పొందుతున్నాయని ఈ పత్రం రూపకర్తల్లో ఒకరైన సీజీడీ ఫెలో గౌరవ్ ఖన్నా చెప్పారు. రెండు దేశాల ఐటీ రంగాల్లోకి సరైన ప్రతిభావంతులు వచ్చేందుకు వీలుండాలని, అప్పుడే వినూత్న ఆవిష్కరణలు, వృద్ధి పెంపు సాధ్యమవుతాయని తెలిపారు. సగటున చూస్తే హెచ్-1బీతో అమెరికాకే ఎక్కువ ప్రయోజనం కలిగిందన్నారు. ఉద్యోగాల విషయంలో ఈ వీసాతో ఒక వర్గం అమెరికన్లకు కొన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ మొత్తమ్మీద దేశానికి లాభమేనని అధ్యయన పత్రం తెలిపింది.

కాళేశ్వరం.. తెలంగాణకు గర్వకారణం

- హైదరాబాదు సిటీ పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి
- ప్రాజెక్టు పనులు పరిశీలించిన ఐపీఎస్ అధికారుల బృందం



నందిమేడారంలో పంప్‌హౌజ్ పనులను పరిశీలిస్తున్న ఐపీఎస్ అధికారులు

ధర్మారం, రామడుగు, న్యూస్‌టుడే: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెలంగాణకు గర్వకారణమని హైదరాబాదు సిటీ పోలీసు కమిషనర్ ఎం. మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నేతృత్వంలో 17మంది ఐపీఎస్ అధికారుల బృందం కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు పరిశీలించింది. సీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ..రాబోయే తరాలకు ఈ ప్రాజెక్టు గొప్ప వరమన్నారు. తెలంగాణలోని ఇంజినీరింగ్ అధికారులు వివిధ ఐఐటీల్లో ప్రాజెక్టు రూపకల్పనపై అధ్యయనం చేసి స్వల్ప గడువులో పూర్తి చేస్తుండటం గొప్ప విషయమన్నారు. ప్రాజెక్టుతో తెలంగాణలోని 70శాతం బీడు భూములు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందితే నేరాలు తగ్గుతాయన్నారు. ఐపీఎస్ అధికారులు మొదట కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపురం వద్ద ఎనిమిదో ప్యాకేజీ పనులను పరిశీలించిన అనంతరం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వేమునూరుకు చేరుకుని ఎల్లంపల్లి జలాలు, అప్రోచ్, గ్రావిటీ కాలువలు, రెగ్యులేటర్ నిర్మాణ పనులు పరిశీలించారు. అక్కడ్నుంచి నాలుగు కిలోమీటర్ల సొరంగమార్గంలో ప్రయాణించారు. నందిమేడారంలో పంప్‌హౌజ్ పనులను చూశారు. తాము పరిశీలించిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ప్రాజెక్టు వివరాలు, నీటి లభ్యత అంశాలపై ప్రాజెక్టు సీఈ ఎన్. వెంకటేశ్వర్లు, ఎస్ఈ వెంకటరాములు, ఈఈ శ్రీధర్ అధికారులకు వివరించారు. అధికారుల బృందంలో వి.శ్రీనివాసరావు, టి.మురళీకృష్ణ, డా.వి.రవీందర్, అవినాష్ మహంతి, డి.జోయెల్‌డెవిస్, వి.సత్యనారాయణ, ఏవీ రంగనాథ్, ఎల్ఎస్.చౌహాన్, బి.సుమతి, ఎ.వెంకటేశ్వర్‌రావు, జె.సురేందర్‌రెడ్డి, జె.నర్సయ్య, ఎ.గంగారాం, మల్లయ్య, ఎస్.రవీందర్, జె.జగన్ ఉన్నారు. రామగుండం పోలీసు కమిషనర్ విక్రమ్‌జీత్ దుగ్గల్, డీసీపీ విజయేందర్‌రెడ్డి, ఏసీపీ సింధు శర్మ వారి వెంట ఉన్నారు.

పకడ్బందీగా బతుకమ్మ చీరల పంపిణీ

- డిసెంబరు నాటికి మిషన్ భగీరథ
- కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: వచ్చే నెల 20న ప్రారంభమయ్యే బతుకమ్మ పండగ సందర్భంగా చీరల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. 90 లక్షల మంది మహిళలకు చీరలు పంపిణీ చేయడం చాలా పెద్ద కార్యక్రమమనీ, గ్రామస్థాయి నుంచి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని పేర్కొన్నారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్లతో సచివాలయం నుంచి దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. డిసెంబరు నెలాఖరుకు అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు చేరాలన్నారు. ఈ పథకం కింద 19 ఇంటేక్‌వెల్స్‌కుగాను 16 పూర్తయ్యాయన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. బతుకమ్మ చీరల పంపిణీకి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో సమన్వయ అధికారులను నియమించాలని, అర్హులైన వారి ఎంపికకు బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. చీరలను భద్రపరిచేందుకు అవసరమైన గోదాములను గుర్తించాలని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు వచ్చిన దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ భూమి రికార్డుల ప్రక్షాళనపై త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామన్నారు. క్షేత్రస్థాయి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా రికార్డులను రూపొందించాలన్నారు. జిల్లాల్లో కొత్త బోరుబావుల తవ్వకానికి అనుమతులు ఇవ్వవద్దని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు.

కాళోజి స్మారక పురస్కార ఎంపికకు కమిటీ

ఈనాడు, హైదారాబాద్: దివంగత ప్రజాకవి కాళోజి నారాయణరావు పేరిట అందజేసే పురస్కారానికి 2017 ఏడాదికిగాను ఒకరిని ఎంపిక చేసేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి ఛైర్మన్‌గా ఏర్పాటైన ఈ కమిటీలో సభ్యులుగా ప్రొఫెసర్ బన్న ఐలయ్య, వేణు, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఉన్నారు.

కోడలికి 4కోట్ల భరణం

కుమారునిచే చెల్లించేలా చేసిన తల్లి

బెంగళూరు: ఆడదంటే ఆడదానికి శత్రువు కాదని, అన్యాయమైపోతుంటే ఆదుకుంటుందని నిరూపించిన సంఘటన ఇది. కన్న కొడుకుకి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పి, కోడలికి బాసటగా నిలిచిన ఉదంతం బెంగళూరులో చోటుచేసుకుంది. కర్ణాటక మాజీ మంత్రి కాశప్పనవర్ కుమారుడు దేవానంద్ శివశంకరప్ప తనభార్యకు రూ.4కోట్లు భరణం చెల్లించేలా నగర కుటుంబ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈమొత్తాన్ని 60రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించింది. దేవానంద్ భార్య తమ నాలుగేళ్ల వైవాహిక బంధానికి తెరదించుతూ, రూ.4.85కోట్ల మనోవర్తిని కోరుతూ 2015లో న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. దీనికి తోడుగా దేవానంద్ తల్లి ఒక ప్రమాణపత్రాన్ని జత చేశారు. కుటుంబపెద్దల్ని కాదని తనకుమారుడు మరొకఅమ్మాయిని వివాహం చేసుకున్నాడని, వారికి ఒక బాబు ఉన్నాడని పేర్కొన్నారు. దేవానంద్‌కు చాలా భూమి ఉందని, క్వారీ వ్యాపారం నిర్వహిస్తున్నారని పత్రంలో తెలిపారు. దేవానంద్ తల్లి పిటిషనర్‌కు అమ్మమ్మ. తనమేనమామ అయిన దేవానంద్‌ను పిటిషనర్ 2011లో పెళ్లిచేసుకుంది.

వరంగల్‌లో నైపుణ్య, విజ్ఞాన సంస్థ

- మంత్రి కేటీఆర్ హామీ
- ఏర్పాట్లు చేయాలని టాస్క్ సీఈవోకు ఆదేశాలు



వరంగల్‌లో టాస్క్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్య. చిత్రంలో టాస్క్ సీఈవో సుజీవ్‌నాయర్

ఈనాడు, హైదరాబాద్: వరంగల్‌లో తెలంగాణ నైపుణ్య, విజ్ఞాన సంస్థ (టాస్క్)ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. వెంటనే వరంగల్‌కు వెళ్లి, అక్కడి విద్యా సంస్థలు, విద్యార్థులు, అధికారులతో సమావేశమై చర్చించాలనీ... వీలైనంత త్వరగా దానిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేయాలని ఆయన టాస్క్ సీఈవో సుజీవ్‌నాయర్‌ను ఆదేశించారు. శాసనసభ్యులు వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్యలు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. వరంగల్ అర్బన్ జిల్లాలో నిట్, 20 ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఉన్నాయనీ.. ఏటా 30 వేల మంది గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి శిక్షణ సంస్థల చుట్టూ తిరుగుతున్నారన్నారు. వారికి మార్గనిర్దేశనం చేసేందుకు ‘టాస్క్’ కావాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

2016-17లో రూ.13,715 కోట్ల అప్రకటిత ఆదాయం వెలికితీత

దిల్లీ: ఆదాయపు పన్ను శాఖ 2016-17 ఆర్థిక సంవత్సరంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో 12,526 సోదాలు నిర్వహించి, రూ.13,715 కోట్ల అప్రకటిత ఆదాయాన్ని వెలికితీసింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్ మంగళవారం రాజ్యసభకు లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1.26 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులు చేరారని చెప్పారు. గత ఏడాది 1152 గ్రూపులకు చెందిన 5102 ప్రాంగణాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు జరిగాయనీ, వాటిలో రూ.15,496 కోట్ల అప్రకటిత ఆదాయాన్ని అవి అంగీకరించాయనీ మంత్రి వివరించారు. గత నవంబరు 9 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 1.96 కోట్ల ఐ.టి. రిటర్న్‌లు దాఖలయ్యాయనీ, అంతకు ముందు ఏడాది అదే వ్యవధిలో ఇది 1.63 కోట్లు మాత్రమేననీ చెప్పారు.

ఆలమట్టిలోకి ఆరువేల క్యూసెక్కులే

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి బేసిన్లలోని రిజర్వాయర్లలోకి ప్రవాహం రోజురోజుకు తగ్గిపోతోంది. ఆలమట్టిలోకి ప్రవాహం మంగళవారం పూర్తిగా తగ్గింది. ఆదివారం 21 వేల క్యూసెక్కులు, సోమవారం 11836 క్యూసెక్కులు రాగా, మంగళవారం ప్రవాహం ఆరువేల క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో ఆగస్టు రెండో వారం కూడా శ్రీశైలంలోకి కొంత నీరయినా వచ్చే అవకాశం కనిపించడం లేదు. అలాగైతే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారనుంది. నారాయణపూర్‌లోకి 4779 క్యూసెక్కులురాగా, 11369 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదిలారు. విద్యుదుత్పత్తి నిలిపివేశారు. జూరాలలోకి మాత్రం కొద్దిగా పెరిగి 7251 క్యూసెక్కుల ప్రవాహం రాగా, 4774 క్యూసెక్కుల నీటిని కాలువలకు వదిలారు. తుంగభద్రలోకి 16890 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. శ్రీశైలంలోకి 411 క్యూసెక్కులు, పులిచింతలలోకి 1551 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, నాగార్జునసాగర్‌లోకి అసలు ప్రవాహమే లేదు. సాగర్ మట్టం 500.40 అడుగులకు చేరింది. దీంతో బయటకు వదిలే నీటిలో బురద వస్తుందని సంబంధిత ఇంజినీర్లు పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే సాగర్ నుంచి తాగునీటికి విడుదల చేయడం కష్టమవుతుంది. గోదావరిలో సింగూరు, నిజాంసాగర్, శ్రీరామసాగర్, కడెం, ఎల్లంపల్లి ఇలా ఏ ప్రాజెక్టులోకీ ప్రవాహం లేదు. దవళేశ్వరం వద్ద కూడా గోదావరి ప్రవాహం తగ్గింది.. 37 వేల క్యూసెక్కులు మాత్రమే ఉంది.

సీఏ సిలబస్‌లో మార్పులు

పాఠ్యాంశాలుగా జీఎస్టీ, సీఎస్ఐర్

దిల్లీ: చార్టర్డ్ అకౌంటెంట్స్ (సీఏ) కోర్సు సిలబస్‌లో మార్పులు చేసినట్లు చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తెలిపింది. పరోక్షపన్నులు, సేవా పన్నులు, ఎక్సైజ్ పన్ను, విలువ ఆధారిత పన్ను(వ్యాట్) వంటి పాత పాఠ్యాంశాల స్థానే, సమకాలీన అంశాలైన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), వస్తు సేవల పన్ను (జీఎస్టీ)లను పాఠ్యాంశాలుగా చేర్చిందని కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ రాజ్యసభకు తెలిపారు. వీటితో పాటు గ్లోబల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్, ఇస్లామిక్ ఫైనాన్స్, స్టార్టప్ ఫైనాన్స్, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎస్ఎమ్ఈ)లను సైతం సిలబస్‌లో ప్రవేశపెట్టిందన్నారు.

పంచాయతీ నిధులు పక్కదారి!

- రాష్ట్రంలో పలుచోట్ల వెలుగులోకి వస్తున్న అవకతవకలు
- సొమ్ము వినియోగంపై దృష్టి సారించాలని రాష్ట్రాలకు కేంద్రం సూచన

ఈనాడు,హైదరాబాద్: రాష్ట్రంలోని కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రస్తుతం దిల్లీ నుంచి వీటికి అధికంగా నిధులు వస్తున్నాయి. పాలకవర్గాల గడువు మరో ఏడాదిలో ముగుస్తుండటంతో, వచ్చే ఎన్నికల్లో విరివిగా ఖర్చుపెట్టేలా ఆర్థికపరిపుష్టికోసం కొందరు సర్పంచులు అక్రమాలకు పాల్పడుతున్నారు. తమకు ఇదే చివరి అవకాశమని, వచ్చే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి ఉండదని భావించి, మరికొందరు అందినకాడికి దండుకుంటున్నారు. ఈ క్రమంలో పంచాయతీలు నిధులను ఖర్చుపెడుతున్న తీరుపై కన్నేసి ఉంచాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు... 2015-16 నుంచి గ్రామ పంచాయతీలకు భారీగా నిధులు వస్తున్నాయి. తెలంగాణలోని పంచాయతీలకు 2016-17లో రూ.908 కోట్లు అందగా, 2017-18లో రూ.1,047 కోట్లు మంజూరు కానున్నాయి. వివిధ పద్దులు, పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేవి వీటికి అదనం. ఈ నిధులను కొన్ని పంచాయతీల్లో వక్రమార్గం పడుతున్నాయి. ఆయా జిల్లాల పంచాయతీ అధికారులు కొన్నింటిపై దర్యాప్తు చేసి, కలెక్టర్లకు నివేదికలను అందజేస్తున్నారు. రాజధాని చుట్టుపక్కల పంచాయతీల్లో అక్రమాలు దారుణంగా ఉండటంతో, దాదాపు 20 మంది సర్పంచులకు నోటీసులిచ్చి, విచారణ చేపడుతున్నారు. మునుపటి సంవత్సరాల ఆడిట్ నివేదికలు వెలువడుతుండటంతో, అప్పటి బాగోతాలు ఇప్పుడు వెలుగుచూస్తున్నాయి.

- నిజామాబాద్ జిల్లాలో 2015-16లో పంచాయతీలకు రూ.44 కోట్లు అందగా, అందులో రూ.45 లక్షలు దుర్వినియోగమైనట్టు తేలింది.
- ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2014-15లో రూ.127కోట్లు విడుదలకాగా, రూ.4.30కోట్లు దుర్వినియోగమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా వక్రమార్గం పడుతున్న నిధులు ఏటా 10%కిపైగా ఉంటున్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి.

అక్రమాలు ఇలా వెలుగులోకి..

- పంచాయతీల్లో ఖర్చులకు సరైనబిల్లులు ఉండటంలేదు. కల్వర్టులు తదితరనిర్మాణాలకు ఒప్పందంలో పేర్కొన్న మొత్తాలకంటే అధికంగా చెల్లిస్తున్నారు. కార్యాలయాల్లో నగదు పుస్తకాలు, ఆస్తులు, అడ్వాన్సులు, స్టాక్‌రిజిస్టర్లు ఉండటంలేదు.
- వసూలైన ఆస్తి పన్ను మొత్తాలను ఖజానాల్లో సక్రమంగా జమ చేయటంలేదు. నిజామాబాద్ జిల్లాలో ఇలా రూ.12 లక్షల మేర జమచేయలేదని తేలింది.
- కొన్ని పంచాయతీల్లోని పనులు కేవలం దస్త్రాల్లోనే కనిపిస్తున్నాయి. వాటి పేర నిధులను మాత్రం కైంకర్యం చేస్తున్నట్టు తెలుస్తోంది.

చర్యలు అంతంతే...

అక్రమాలకు పాల్పడ్డవారిపై ప్రాథమిక దర్యాప్తులు పూర్తయి, చెక్‌పవర్ రద్దు వంటి చర్యలు చేపడుతున్నా... సర్పంచులు రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి సులభంగానే కేసుల నుంచి బయటపడుతున్నారు. ఫిర్యాదు వచ్చిన తర్వాత డీపీవో దర్యాప్తు చేపట్టి, కలెక్టరుకు నివేదిక ఇస్తారు. అక్రమాల తీవ్రత ఎక్కువగా ఉండే పంచాయతీలపై కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదికలు పంపుతారు. దీనిపై పంచాయతీరాజ్‌శాఖ మంత్రి తుదినిర్ణయం తీసుకుంటారు. అక్రమాలు బయటపడినప్పుడు స్వాహా చేసిన మొత్తాలను తిరిగి చెల్లించి మరికొందరు సులభంగా గట్టెక్కుతున్నారు. మరోవైపు... అక్రమాలపై అన్ని జిల్లాల నుంచి సమాచారాన్ని తెప్పించుకుని, సమీక్షించే విధానం కొరవడింది. తనిఖీలు కూడా సరిగా లేవు. దీంతో అక్రమాలు వెలుగుచూసినా తమకేమీ కాదన్న ధీమా చాలా మంది సర్పంచుల్లో నెలకొంది.

కార్యదర్శులు కుమ్మక్కు

అక్రమాలనుఅడ్డుకునేందుకని చెక్కులపై సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శుల సంతకాలను కూడా తెలంగాణ సర్కారు తప్పనిసరి చేసి, చట్టబద్ధత కల్పించింది. కానీ, కొన్నిచోట్ల వీరు కుమ్మక్కయిపోతున్నారు. స్థిరాస్తిరంగం బాగా పుంజుకొన్న సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ పంచాయతీ.. కార్యదర్శుల అక్రమాలకు అడ్డాగా మారింది. ఇక్కడ 15 ఏళ్లలో 12 మంది కార్యదర్శులు పనిచేయగా, 9మంది అక్రమాలకుపాల్పడి, ఉద్వాసనకు గురికావడం విశేషం. మహబూబ్‌నగర్ జిల్లాలో 16 మంది కార్యదర్శుల అక్రమాలపై కలెక్టరుకు నివేదికలు వెళ్లినట్టు సమాచారం.

- పంచాయతీల్లో నిధుల వ్యయం పారదర్శకంగా ఉండేలా చూడాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. కానీ, ఆన్‌లైన్ అకౌంటింగ్ విధానం ఇంకా రాష్ట్రంలో అమల్లోకి రాలేదు.

యాప్‌రే బంగారు బామ్మా!



టోక్యో: వృద్ధాప్యం మీదపడ్డ వారు ఏం చేస్తారు. ఏ మూలో కూర్చుని కృష్ణారామా అనుకుంటారు తప్ప ఏం చేయగలరు అని అనుకుంటాం. జపాన్‌కు చెందిన 81 ఏళ్ల మసాకో వకామియా మాత్రం అందరిలాంటి బామ్మ కాదు. ఎప్పుడూ ఏదోఒక వ్యాపకం ఉండాల్సిందే. తనలాంటి వృద్ధులు ఆడుకోవడానికి వీలైన యాప్‌లు ఏమైనా దొరుకుతాయా అని తెగవెతికింది. కానీ, ఆమెకు సంతృప్తి కలగలేదు. ఇదేవిషయమై ఆమెను కదిపితే చాలు.. ‘ ‘యువకులతో పోటీగా మొబైల్ గేం ఆడితే మేం సులువుగా ఓడిపోతాం. వారి చేతివేళ్లు కదిలినంత వేగంగా మా చేతి వేళ్లు కదలకపోవడమే ఇందుకు కారణం” అని చెబుతుంది. ఇదే విషయమై ఆమె తమలాంటి వృద్ధులు ఆడుకునేందుకు వీలుగా ఉండే యాప్‌లు తయారుచేయాలని అనేకమందిని కోరింది. కానీ, ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో వకామియా రంగంలోకి దిగి ఓయాప్‌ను రూపొందించింది. “స్మార్ట్‌ఫోన్‌లు వాడే నాలాంటి వృద్ధులు ఆడుకునేందుకు వీలుగా ఉండే యాప్‌ను రూపొందించాలని భావించాను. ఇందుకు ఆరునెలల సమయం పట్టింది” అని వకామియా చెబుతుంది. బ్యాంకర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆమె 60 ఏళ్ల వయస్సులో కంప్యూటర్‌ను వాడడం ప్రారంభించింది. తన తల్లిని చూసుకోవాల్సి రావడంతో ఆమెకు బయటివారితో విరివిగా గడిపే వీలు లేకుండా పోయింది. దీంతో ఆమె సిల్వర్‌క్లబ్‌లో చేరి అంతర్జాలం వినియోగం, ఇతరలతో అనుసంధానం కావడం వంటి విషయాలను నేర్చుకుంది. అలా పట్టువదలకుండా నైపుణ్యాన్ని పెంచుకుంటూ పోయి.. చివరకు జపాన్‌లో మార్చి మొదటి వారంలో జరుపుకునే హినమాత్సురి పండగకు సంబంధించి హిండాన్ పేరుతో ఐఓఎస్ గేమింగ్ యాప్‌ను ఆవిష్కరించింది.

కొనుగోలు‘దారులు’ మూసేద్దాం..!

- ఓపెన్ యాక్సెస్‌కు అడ్డుకట్టే లక్ష్యంగా డిస్కంల ప్రణాళిక
- అదనపు సర్‌ఛార్జీలకు ప్రతిపాదన
- అన్యాయమంటున్న పరిశ్రమల వినియోగదారులు
- సలహాలు, అభ్యంతరాలను ఆహ్వానించిన ఈఆర్‌సీ

ఈనాడు, హైదరాబాద్: ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్కేంద్రాల నుంచి విద్యుత్ కొనుగోలుచేసే వారి సంఖ్య తగ్గితేనే..బహిరంగ విపణిలో విద్యుత్ ధరలు తగ్గుతాయని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు భావిస్తున్నాయి. ఈ వ్యూహంలో భాగంగా ఓపెన్ యాక్సెస్ విధానంలో విద్యుత్తు కొనుగోళ్లపై సర్‌ఛార్జి వసూలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించగా... ఈ నిర్ణయంపై పరిశ్రమల వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

తెలంగాణలో విద్యుత్తు వినియోగం రికార్డుస్థాయిలో పెరుగుతున్నందున రోజూవారీ సరఫరా తాలూకా డిమాండును తీర్చడానికి డిస్కంలు స్పాట్ ఎక్స్ఛేంజీలో నిత్యం విద్యుత్తును కొనాల్సి వస్తోంది. అక్కడ షేర్ మార్కెట్‌లో మాదిరిగా సైతం పోటీదారులు పెరిగే కొద్దీ ధరలు పెరుగుతున్నందున తెలంగాణ డిస్కంలపై ఆర్థికభారం పెరుగుతోంది. ఉదాహరణకు గత నెలలో ఎక్స్ఛేంజీలు యూనిట్ విద్యుత్తును రూ.1.02 నుంచి గరిష్ఠంగా రూ.3.44 వరకూ విక్రయించాయి. నెల మొత్తమ్మీద చూస్తే సగటున ఉత్తరాది రాష్ట్రాలు యూనిట్‌ను రూ.2.54 చొప్పున కొంటే...దక్షిణాది రాష్ట్రాలు యూనిట్‌కు రూ.2.59 చొప్పున చెల్లించాయి. తాజాగా రికార్డు స్థాయిలో ఈ నెల 7న 191 మిలియన్ యూనిట్లు (9397 మెగావాట్లు) విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రజలు వినియోగించారు. ఇందులో 39 మిలియన్ యూనిట్లను డిస్కంలు స్పాట్ ఎక్స్ఛేంజీలోనే కొన్నాయి. రోజుకు యూనిట్‌కు 5 పైసలు అదనంగా చెల్లించినా..నెలలో వందల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందన్నమాట.

నష్టాల బేరం

తెలంగాణ విద్యుత్ సంస్థలకు సొంత విద్యుదుత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉన్నందున అవి అత్యధికశాతం కరెంటును బయటే కొంటున్నాయి. ఈ దృష్ట్యా దీర్ఘకాలిక ఒప్పందాలు, ఇతర ఖర్చుల వల్ల సగటున ఒక యూనిట్ సరఫరాకు రూ.4.50 నుంచి రూ.5 వరకు వ్యయమవుతోంది. ఈ ధర అధికంగా ఉందని భావిస్తున్న పెద్ద పరిశ్రమల వినియోగదారులు ఓపెన్ యాక్సెస్‌లో (డిస్కంల నుంచి కాకుండా నేరుగా బయటి విద్యుత్కేంద్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయడాన్ని ఓపెన్ యాక్సెస్ విధానం అని పిలుస్తారు. రోజుకు మెగావాట్ కన్నా ఎక్కువ కరెంటు వినియోగించేవారినే ఓపెన్ యాక్సెస్‌కు అనుమతిస్తారు.) విద్యుత్తును బయటే కొంటున్నారు. స్పాట్ ఎక్స్ఛేంజీలో యూనిట్ ధర బాగా పడిపోయినప్పుడు ఓపెన్ యాక్సెస్‌లో ప్రైవేటు కొనుగోళ్లు 500 మెగావాట్లకు పైగా ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

భారమైన ఒప్పందాలు

గతంలో ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లేవారు పెద్దగా లేనందున గిరాకీకి తగ్గట్టుగా సరఫరా చేసేందుకు వీలుగా 9 వేల మెగావాట్ల వరకూ కొనుగోలుకు తెలంగాణ డిస్కంలు వివిధ విద్యుత్కేంద్రాలతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఇప్పుడు పెద్ద వినియోగదారులు బయటి కొనుగోళ్లకు వెళ్లిన సమయాల్లో..తొలి ఒప్పందాల ప్రకారం కొన్న విద్యుత్‌ను ఎక్కడ అమ్ముకోవాలన్నది డిస్కంలకు సమస్యగా మారుతోంది. ఒక్కోసారి డిమాండు బాగా పడిపోతే విధిలేని పరిస్థితుల్లో సొంత థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తిని సైతం ఆపివేస్తున్నారు. దీనివల్ల వ్యాపారం తగ్గి ఆదాయం కోల్పోవడంతోపాటు..బయటి కేంద్రాల నుంచి ఒప్పందాల ప్రకారం కొనాల్సి వస్తోందని డిస్కంలు వాపోతున్నాయి. ఈ సమస్యలన్నింటి నుంచి గట్టెక్కాలంటే ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లేవారిని తగ్గించేలా అదనపు సర్‌ఛార్జీ పెంచడమే మార్గమని డిస్కంల యోచిస్తున్నాయి. వీరికి కరెంటు సరఫరాలో భాగంగా లైన్ల రవాణా ఛార్జీలే కాకుండా అదనంగా మరికొంత సర్‌ఛార్జి వసూలుకు అనుమతించాలని కోరాయి. ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో ఇలా వసూలు చేస్తున్నాయని ఈఆర్‌సీకి తెలిపాయి. ఒక్కో యూనిట్‌కు అదనంగా రూపాయిన్నర దాకా వసూలు చేయాలని ప్రతిపాదిస్తున్నాయి. తద్వారా ఓపెన్ యాక్సెస్‌కు వెళ్లాలనుకునే వారు ఆర్థికభారంతో వెనక్కి తగ్గుతారని డిస్కంలు యోచిస్తున్నాయి. దీనిపై పెద్ద పరిశ్రమల యాజమాన్యాల వాదన మరోలా ఉంది. తెలంగాణ డిస్కంల అంతర్గత నిర్వహణ వ్యయం అధికమవడం వల్ల విద్యుత్ సరఫరా ధరలు పెరుగుతున్నాయని, చౌకగా దొరుకుతున్నందున స్పాట్ ఎక్స్ఛేంజీలో కొంటున్నామని వాదిస్తున్నాయి.

6వ తేదీ లోపు అభ్యంతరాలను పంపవచ్చు

ఓపెన్ యాక్సెస్ వినియోగదారుల నుంచి అదనపు సర్‌ఛార్జి వసూలు చేయాలని డిస్కంల ప్రతిపాదనలపై ప్రజలెవరైనా సలహాలు, అభ్యంతరాలను పంపవచ్చని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) మంగళవారం తెలిపింది. వచ్చే నెల 6లోగా మండలికి ఈమెయిల్ లేదా స్వయంగా వీటిని అందజేయవచ్చని తెలిపింది.

విద్యుత్ స్పాట్ ఎక్స్ఛేంజీలో రోజుకు సగటున కరెంటు కొనుగోళ్లు

(మెగావాట్లలో)

ప్రాంతం	జులై	జూన్
దక్షిణాది రాష్ట్రాలు	2,008	1,119
పశ్చిమ రాష్ట్రాలు	1,019	1,973
ఉత్తరాది రాష్ట్రాలు	990	1,178
తూర్పు రాష్ట్రాలు	747	989
ఈశాన్య భారతం	176	184

ఏ రంగమైనా ఆల్ రౌండర్లకే డిమాండ్

- విద్యార్థులు ప్రపంచస్థాయి పోటీకి సిద్ధమవ్వాలి
- ‘టాస్క్’తో కలిసి యువతకు ఆంగ్లం, సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ
- ‘ఈనాడు’తో ప్రముఖ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్

ఈనాడు – హైదరాబాద్



టాస్క్ సీఈవో సుజీవ్ నాయర్‌తో క్రికెట్ క్రీడాకారుడు కృష్ణమాచారి శ్రీకాంత్

“క్రికెట్‌లో ఆల్‌రౌండర్లకే డిమాండ్ ఎక్కువ. బౌలింగ్, బ్యాటింగ్‌ల్లో ప్రతిభ కనబరిచేవారికే జట్టులో స్థానం, ప్రాధాన్యం దక్కుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ ఇదే వర్తిస్తుంది. చదువుతో పాటు ఆంగ్లం, సాఫ్ట్‌స్కిల్స్, ఉద్యోగ నైపుణ్యాలు కనబరిచేవారికే అవకాశాలు దక్కుతాయి. కేవలం డిగ్రీలుంటే సరిపోదు” అని ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నారు. తెలంగాణ నైపుణ్యాభివృద్ధి సంస్థ (టాస్క్)తో కలిసి విద్యార్థులు, యువతకు ఆంగ్లం, సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇప్పించేందుకు చర్చిస్తున్నామన్నారు. ఇందుకు బ్రిటిష్ కౌన్సిల్, టాస్క్‌లతో కలసి ‘లెర్నింగ్ విత్ క్రికెట్’ అనే కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ మేరకు సోమవారం ఆయనిక్కడ ‘ఈనాడు’తో ప్రత్యేకంగా మాట్లాడారు.

‘లెర్నింగ్ విత్ క్రికెట్’ ప్రత్యేకతలేంటి?

కొత్త అంశాలను నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్నవారికి వాళ్ల అభిరుచుల ఆధారంగా నేర్పిస్తే సులభంగా నేర్చుకుంటారు. ఇలా క్రికెట్‌కు సంబంధించిన అంశాల ఆధారంగా విద్యార్థులు, యువతకు ఆంగ్లం నేర్పించడమే దీని ఉద్దేశం. ఇందుకు బ్రిటిష్ కౌన్సిల్‌తో కలసి ‘ఇంగ్లిష్ స్ట్రోక్స్’ అనే పాఠ్యాంశాన్ని అభివృద్ధి చేశాం. యువతలో విశ్వాసం నింపడానికి, లక్ష్యాలను సాధించడానికి ఈ ఆన్‌లైన్ కోర్సు దోహదపడుతుంది. దీనికి టాస్క్ ద్వారా జాబ్‌స్కిల్స్ కోర్సును కూడా జోడించాం. మహబూబ్‌నగర్‌లోని ఓ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రయోగాత్మకంగా 60 మందికి శిక్షణ ఇవ్వగా, మంచి ఫలితాలొచ్చాయి.

తెలంగాణలో ఎలా ముందుకెళ్తారు?

విద్యార్థుల్లో రకరకాల నైపుణ్యాలను పెంపొందించేందుకు ‘టాస్క్’ ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. తెలంగాణలోని గ్రామీణ, చిన్నపాటి పట్టణాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులున్నారు. వీరి కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడంపై టాస్క్‌తో చర్చిస్తున్నాం. ఇప్పటికే జాతీయ నైపుణ్యాభివృద్ధి మండలితో కలిసి పనిచేస్తున్నాం. ప్రభుత్వంతో నేరుగా కలసి పనిచేసే అవకాశం రావడం మాత్రం ఇదే తొలిసారి.

యువత లక్ష్యం ఎలా ఉండాలి?

ప్రపంచ వ్యాప్తంగా లెక్కలేనన్ని అవకాశాలున్నాయి. వీటిని అందిపుచ్చుకునేందుకు యువత సిద్ధం కావాలి. కేవలం సబ్జెక్ట్ అంశాలకే పరిమితమైతే సరిపోదు. వృత్తి, సంభాషణ నైపుణ్యాలతో కూడిన ఉత్తమ ప్రతిభ ఎంతో కీలకం. డిజిటల్ విధానంలో నేర్చుకునేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. యువత వాటిని అందిపుచ్చుకోవాలి.


పొన్నం ప్రభాకర్ దీక్ష భగ్నం



దీక్షను భగ్నం చేసి పొన్నం ప్రభాకర్‌ను తీసుకెళుతున్న పోలీసులు

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: కరీంనగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన ఆమరణ దీక్షను కరీంనగర్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున భగ్నం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యాధికారుల నివేదిక ప్రకారం చర్యలకు ఉపక్రమించారు. తన ఇంటి ముందే ఈనెల 5నుంచి పొన్నం ఆమరణ దీక్షకు పూనుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ, శాసనమండలి పక్ష నాయకులు జానారెడ్డి, షబ్బీర్‌అలీతో పాటు రాష్ట్ర, జిల్లా నేతలు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంఘీభావం ప్రకటించారు. మంగళవారం తెల్లవారుజామున 4.30గంటల ప్రాంతంలో భారీగా తరలివచ్చిన పోలీసులు ప్రభాకర్‌ను అరెస్టు చేసి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత నెలకొనడంతో కొందరు కార్యకర్తలను అరెస్టు చేశారు. ఆసుపత్రిలో చికిత్సకు ప్రభాకర్ నిరాకరించినప్పటికీ వైద్యులు, కుటుంబసభ్యుల ఒత్తిడి మేరకు ఉదయం 9.30 గంటలకు అంగీకరించారు. ఆసుపత్రిలో తెఐకాస ఛైర్మన్ కోదండరాం, కాంగ్రెస్ శాసనసభ విప్ సంపత్‌కుమార్‌లు ఆయనను పరామర్శించారు. పొన్నం ఆందోళనకు మద్దతు ప్రకటించారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి కుంతియా, మాజీ ఎంపీ విజయశాంతిలు చరవాణి ద్వారా ప్రభాకర్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీక్ష సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు.

జడ్డూ.. నం.1



దుబాయ్: రవీంద్ర జడేజా నంబర్‌వన్ అయ్యాడు. ఐసీసీ తాజా టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో అతను షకిబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్)ను వెనక్కి నెట్టి నంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. శ్రీలంకతో రెండో టెస్టులో 70 పరుగులు చేసిన జడేజా.. ఏడు వికెట్లు తీసి టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆల్‌రౌండర్‌తో పాటు బౌలింగ్ ర్యాంకుల్లోనూ జడేజా నంబర్‌వన్‌గా నిలిచాడు. బ్యాట్స్‌మెన్ జాబితాలో చెతేశ్వర్ పుజారా ఒక ర్యాంకు మెరుగుపరుచుకుని మూడో స్థానంలో నిలువగా, విరాట్ కోహ్లి ఐదో ర్యాంకులో కొనసాగుతున్నాడు. మరోవైపు ఐదు ర్యాంకులు ఎగబాకిన రహానె.. ఆరో స్థానంలో నిలిచాడు. బౌలర్ల జాబితాలో అశ్విన్ ఒక స్థానం కిందకు పడి మూడో ర్యాంకులో నిలువగా, షమి 20, ఉమేశ్‌యాదవ్ 22 స్థానాల్లో కొనసాగుతున్నారు.

శాస్త్రితో సరదాగా..: ఒక మ్యాచ్ సస్పెన్షన్ వేటుకు గురైన జడేజా.. విరామ సమయంలో చీఫ్ కోచ్ రవిశాస్త్రితో చర్చల్లో పాల్గొన్నాడు. గతంలోనూ ఆటగాళ్లు ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నప్పుడు శాస్త్రి వారితో మాట్లాడి, స్థైర్యాన్ని ఇచ్చాడు. ఇలా సస్పెన్షన్ వేటుకు గురి కావడం జడేజాకు ఇది రెండోసారి. 2014 ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా అండర్సన్‌తో జడేజా ఇలాగే వాగ్వివాదానికి దిగి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోల్పోయాడు. కానీ సస్పెన్షన్ వేటు పడకుండా తప్పించుకున్నాడు. అప్పుడు ధోని అతనికి మానసికంగా అండగా నిలిచాడు.

అవసరమైతే స్లెడ్జింగ్ చేస్తా: పుజారా



కొలంబో: టీమ్‌ఇండియా బ్యాట్స్‌మన్ చెతేశ్వర్ పుజారా మైదానంలో ఎంత ప్రశాంతంగా కనిపిస్తాడో తెలిసిందే. అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అతను ప్రత్యర్థుల్ని కవ్వించిన ఉదంతాలు ఇప్పటిదాకా లేవనే చెప్పాలి. అలాంటివాడు అవసరమైతే స్లెడ్జింగ్ చేస్తానంటున్నాడు. బౌలర్లకు ఉపయోగపడతుందనిపిస్తే ఫీల్డింగ్ చేస్తున్నపుడు స్లెడ్జింగ్‌కు వెనుకాడనని చెప్పాడు పుజారా. బీసీసీఐ టీవీ కోసం అజింక్య రహానె తనను ఇంటర్వ్యూ చేసిన సందర్భంగా పుజారా ఈ వ్యాఖ్యలు చేశాడు. "ప్రాక్టీస్‌లో భాగంగా ఫుట్‌బాల్ ఆడేటప్పుడు చాలా అరుస్తాను. ఫీల్డింగ్ చేస్తున్నపుడు ఎలా అరుస్తున్నానో నువ్వు చూసే ఉంటావు. ఒక బ్యాట్స్‌మన్‌ను స్లెడ్జ్ చేయాలనుకుంటే.. చేసి తీరాల్సిందే. అది మన బౌలర్లకు ఉపయోగపడుతుంది" అని రహానెతో పుజారా అన్నాడు. తాను ఎప్పుడూ శతకాలతో సంతృప్తి చెందనని, దాన్ని మరింత భారీ ఇన్నింగ్స్‌గా మలచాలని భావిస్తానని పుజారా తెలిపాడు. "నా తొలి అండర్-14 మ్యాచ్‌లో 300 పరుగులు సాధించడం నాకు ఇప్పటికీ గుర్తుంది. టెస్టుల్లో విజయం సాధించాలంటే శతకం సరిపోదు. ఇంకా భారీగా పరుగులు చేయాలని నేనెప్పుడూ భావిస్తాను' అని పుజారా అన్నాడు.

భార్యతో చాలా మాట్లాడతా: రహానె: తాను ఇతరులతో అంత కలివిడిగా ఉండననే అభిప్రాయం తప్పని రహానె అన్నాడు. "నేను కలివిడిగా ఉండనని చాలామంది అనుకుంటారు. కానీ నేను అందరితో ఎక్కువ మాట్లాడటానికి ఇష్టపడతాను. నిజంగా చెప్పాలంటే నా భార్యతో చాలా మాట్లాడతాను. చిన్నప్పటి నుంచి చాలా నిశ్శబ్దంగా ఉండేవాడిని. నా కుటుంబ నేపథ్యం ఇందుకు కారణం కావచ్చు. ప్రశాంతంగా ఉండడం మ్యాచ్‌ల్లో ఎంతో ఉపయోగపడుతోంది. ముఖ్యంగా టెస్టులో దాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఐతే నేను అందరూ అనుకున్నంత గుంభనంగా మాత్రం ఉండను' అని రహానె చెప్పాడు.

ఛాంపియన్స్

ఒలింపిక్స్‌లో ఆడాలా వద్దా?

బీసీసీఐ పాలకుల కమిటీ సమావేశం నేడు

దిల్లీ: బీసీసీఐ పరిపాలకుల కమిటీ (సీఓఏ) బుధవారం ఇక్కడ సమావేశం కానుంది. ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేరిస్తే ఆడడం, దేశవాళీలో జీతాల పెంపు వంటి అంశాలను కమిటీ ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనుంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఒకవేళ క్రికెట్‌ను చేరిస్తే.. ఒలింపిక్స్‌లో ఆడాలా వద్దా అన్న అంశంపై పాలకుల కమిటీ నిర్ణయం తీసుకోనుంది. బీసీసీఐ స్వయం ప్రతిపత్తి పోతుందన్న ఉద్దేశంతో బోర్డులో చాలా మంది ఒలింపిక్స్‌లో క్రికెట్ చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఆసియా గేమ్స్ వంటి బహుళ క్రీడాంశాలున్న ఈవెంట్లకు బీసీసీఐ చాలా ఏళ్లుగా జట్టును పంపట్లేదు. ఒక్క 1998 కామన్వెల్త్ క్రీడలకు మాత్రం జట్టును పంపింది. దేశవాళీలో అన్ని వయో విభాగాల ఆటగాళ్లతోపాటు అధికారులు, సహాయ సిబ్బంది జీతాల పెంచాలన్న ప్రతిపాదనపై సీఓఏ దృష్టి సారించనుంది. 2007 తర్వాత దేశవాళీ ఆటగాళ్లకు ఇచ్చే జీతాలను సవరించలేదు. రాష్ట్ర సంఘాల్లో ఆర్థిక అవకతవకలపై డెలాయిట్ సంస్థ ఇచ్చిన నివేదికపై కూడా పాలకుల కమిటీ చర్చ జరపనుంది.

సాహో.. సమీర్



పది కిలోమీటర్ల నడక అంటేనే వామ్మో అంటాం. కిలోమీటర్‌కే గగ్గోలు పెట్టేవేళ్లాందరో! కానీ ఈ మారథాన్ యోధుడు ఏకంగా వంద రోజుల్లో 10000 కిలోమీటర్లకు గురి పెట్టి ఔరా అనిపించాడు. సమీర్ సింగ్ లక్ష్యానికి 36 కిలోమీటర్ల దూరంలో నిలిచిపోయినా అతడి ప్రయత్నం, పట్టుదల అందరినీ ఆకట్టుకుంది.

తక్కువ శ్రమా మరి! కాళ్లు బొబ్బలెక్కినా, గాయాలు వేధించినా.. జ్వరం బాధపెట్టినా దృఢ సంకల్పంతో సాగుతూ పోయాడు. చిట్టచివరికి తీవ్రమైన నొప్పితో, ఏమాత్రం ముందుకెళ్లలేని పరిస్థితిలో లక్ష్యానికి కొద్దిదూరంలో ఆగిపోయాడు.

అయినా.. తక్కువ దూరం పరుగెత్తాడా మరి! ఆ పరుగు గ్రేట్‌వాల్ ఆఫ్ చైనా పొడవు కన్నా. . ముంబయి, లండన్ మధ్య దూరం కన్నా ఎక్కువే.

- ముంబయి అథ్లెట్ అద్భుత ప్రయత్నం
- 100 రోజుల్లో 10 వేల కి.మీ పరుగు!

ముంబయి



ఇంత కఠినమైన లక్ష్యం పెట్టుకున్నందుకు స్నేహితులు ఎగతాళి చేసినా సంకల్పంతో ముందడుగు వేశాడు సమీర్. మిత్రులేమన్నా అతడి ప్రయత్నం మాత్రం అందరినీ ఆకట్టుకుంది. సమీర్ సింగ్ మూడు నెలల మారథాన్ అంతా ముంబయి మురికివాడలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో సాగింది. దాతలు ఇచ్చిన దుస్తులు, పరికరాలనే అతడు ఉపయోగించాడు. కేవలం రూ.190తోనే రోజంతా గడిపాడు. ఏప్రిల్ 29న మంటలు పుట్టిస్తున్న ఎండలో పరుగు ఆరంభించిన సమీర్.. ఒక్క రోజు కూడా విశ్రాంతి తీసుకోకుండా వర్షాల్లోనూ ముందుకు సాగాడు. ఐతే అనారోగ్యం కారణంగా షెడ్యూలు ప్రకారం కొన్నిసార్లు అనుకున్నంత దూరం పరుగెత్తలేకపోవడంతో ఆఖరి రోజైన ఆదివారం లక్ష్యాన్ని అందుకోవడానికి సమీర్‌కు 150 కిలోమీటర్లు పరుగెత్తాల్సిన పరిస్థితి వచ్చింది. కానీ అతడు 114 కి.మీ. మాత్రమే పూర్తి చేయగలిగాడు. "పొట్టలో ఇన్‌ఫెక్షన్, వైరల్ జ్వరం బాధించినా వంద రోజుల్లో అతడు 9,964 కిలోమీటర్లు పరుగెత్తాడు" అని సమీర్ సింగ్ పరుగును పర్యవేక్షించిన విక్రమ్ బట్టి చెప్పాడు. "రోజుకు వంద కిలోమీటర్లు పరుగెత్తడం పెను సవాల్. కానీ మనిషి సహనశక్తి ఎంతుంటుందో చాటి చెప్పాలనుకున్నా" అన్నది సమీర్ మాట.

సమీర్ ప్రతి రోజు ఉదయం ముంబయి మురికివాడలో పరుగు ప్రారంభించేవాడు. జీపీఎస్ గడియారం, బేసిక్ మొబైల్ ఫోన్, అత్యవసరాల కోసం రూ.200 మాత్రమే అతడు తనతో ఉంచుకున్నాడు. ఫేస్‌బుక్‌లో ప్రచారం జరగడంతో వివిధ ప్రదేశాల్లో అతణ్ని చూసేందుకు చాలా మందే వచ్చారు. రన్నింగ్ కోచ్ అయిన 44 ఏళ్ల సమీర్.. తన పరుగు పూర్తయ్యేసరికి ఏకంగా 16 కిలోలు తగ్గి 40 కిలోలకు చేరుకున్నాడు. ఇంత శ్రమించిన సమీర్‌కు ఇంతటితో ఆగిపోయే ఉద్దేశమేమీ లేదట. నా తదుపరి లక్ష్యం "40000 కిలోమీటర్లు" అని ప్రకటించాడు.

ఎందుకీ మారథాన్

ఎందుకింత శ్రమకు ఓర్చి సమీర్ ఇన్ని వేల కిలోమీటర్లు ఎందుకు పరుగెత్తాడు ? అంతర్జాతీయ మారథాన్‌లే గరిష్ఠంగా 43 కిలోమీటర్లు ఉంటున్నప్పుడు, రోజుకు వంద కిలోమీటర్లు పరుగెత్తే సాహసం ఎందుకు చేశాడు ? అన్నవి అందరి నుంచే వచ్చే ప్రశ్నలు. ఈ ప్రశ్నలనే అతడినే అడిగితే.. "శరీరానికి పరిమితులు ఉంటాయని జనం అంటుంటారు. కానీ పవిత్ర గ్రంథాల ప్రకారం దేహానికి ఎలాంటి పరిమితులు లేవు. దాన్నే నిరూపించాలనుకున్నా. దేవుడు మనకు దేహం ఇచ్చాడు. మానసిక సామర్థ్యం దాని పరిమితిని నిర్ణయిస్తుంది" అని చెప్పాడు సమీర్.



ట్రోఫీతో భారత్-ఎ జట్టు

శ్రేయస్ మెరుపు శతకం

ముక్కోణపు సిరీస్ టైటిల్ భారత్-ఎ సొంతం

ప్రిటోరియా: యువ ఆటగాడు శ్రేయస్ అయ్యర్ (140 నాటౌట్; 131 బంతుల్లో 11×4, 4×6) మెరుపు శతకం సాధించడంతో ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఎ విజేతగా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో భారత్ 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా-ఎను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన సఫారీ జట్టు బెహార్దియన్ (101 నాటౌట్; 114 బంతుల్లో 4×4, 4×6) సెంచరీ సాయంతో 50 ఓవర్లలో 7 వికెట్లకు 267 పరుగులు చేసింది. ప్రిటోరియస్ (58) రాణించాడు. శార్దూల్ ఠాకూర్ (3/52), సిద్ధార్థ్ కౌల్ (2/55) ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఛేదనలో భారత్ 20 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో శ్రేయస్ అయ్యర్, వరుణ్ శంకర్ (72; 86 బంతుల్లో 9×4)తో కలిసి జట్టును విజయపథంలో నడిపించాడు. శంకర్ ఔటైనా.. అయ్యర్, పాండే (32 నాటౌట్)తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

కైనన్‌కు కాంస్యం



దిల్లీ: ఆసియా షాట్‌గన్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ షూటర్ కైనన్ చెనాయ్ సత్తా చాటాడు. అతను ట్రాప్ విభాగంలో కాంస్యం గెలుచుకున్నాడు. కజక్‌స్థాన్‌లో జరిగిన ఈ పోటీల్లో మంగళవారం జరిగిన అర్హత రౌండ్లో కైనన్ (116/125) మూడో స్థానంతో ఫైనల్ చేరాడు. ఆరుగురు పోటీ పడిన తుది సమరంలో అతను అదే జోరు ప్రదర్శించి కాంస్యం నెగ్గాడు.

ఓటమి తప్పినా గెలుపు దూరమే...

టైటాన్స్ పరాజయ పరంపరకు బ్రేక్

బెంగళూరుతో మ్యాచ్‌లో పాయింట్లు సమం



బెంగళూరు-టైటాన్స్ మ్యాచ్‌లో ఓ దృశ్యం

నాగ్‌పూర్

మ్యాచ్‌లో ఇంకో మూడు నిమిషాలు మాత్రమే మిగిలున్నాయి. అప్పటికి తెలుగు టైటాన్స్ 15-20తో వెనుకబడి ఉంది. ఇక టైటాన్స్ ఖాతాలో వరుసగా ఆరో ఓటమి జమ అయినట్లే అని అంతా ఓ అంచనాకు వచ్చేశారు. కానీ ఆఖరి మూడు నిమిషాల్లో టైటాన్స్ అనూహ్యంగా పుంజుకుంది. పాయింట్లు సమం చేసింది. ఓ దశలో ఆ జట్టు మ్యాచ్ గెలిచేసేలా కూడా కనిపించింది. కానీ అదృష్టం కలిసి రాక టైతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఓటముల డబుల్ హ్యాట్రిక్ తప్పినందుకు టైటాన్స్‌కు కొంత మేర ఉపశమనమే. మంగళవారం బెంగళూరు బుల్స్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ప్రొ కబడ్డీ మ్యాచ్‌ను తెలుగు టైటాన్స్ 21-21తో డ్రాగా ముగించింది. ప్రథమార్ధం ముగిసేసరికి టైటాన్స్ 8-9తో వెనుకబడగా.. ద్వితీయార్ధంలో బుల్స్ ఆటగాళ్లు జోరు పెంచి ఆధిక్యాన్ని 20-15కు తీసుకెళ్లారు. మ్యాచ్‌లో మూడు నిమిషాలే మిగిలుండటంతో టైటాన్స్ నైరాశ్యంలో కనిపించింది. ఐతే ఈ దశలో రక్షిత్ రైడ్‌కు వెళ్లి 2 పాయింట్లు తెచ్చాడు. ఆ తర్వాత కెప్టెన్ రాహుల్ చౌదరి కూడా రైడ్‌లో రెండు పాయింట్లు సాధించాడు. దీంతో స్కోరు 20-20తో సమమైంది. తర్వాతి రైడ్‌లో బుల్స్‌కు బోనస్ పాయింట్ లభించగా.. చివరగా రాహుల్ రైడ్‌కు వెళ్లి ఒక పాయింట్ తేవడంతో మ్యాచ్ టైగా ముగిసింది. టైటాన్స్ ఎప్పట్లాగే కెప్టెన్ రాహుల్ మీద ఎక్కువ ఆధారపడింది. ఆ జట్టు సాధించిన 21 పాయింట్లలో కెప్టెన్ రాహుల్ సాధించినవే ఎనిమిది కావడం విశేషం. అతడికి మిగతా ఆటగాళ్ల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదు. బెంగళూరు జట్టులో రోహిత్ కుమార్ ఐదు రైడ్ పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 32-20తో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. ప్రథమార్ధం ముగిసేసరికి 13-9తో ఆధిక్యంలో నిలిచిన హరియాణా.. ద్వితీయార్ధంలో విజృంభించి ఆడింది. టోర్నీలో మూడు మ్యాచ్‌లు ఆడిన హరియాణాకు ఇదే తొలి విజయం కాగా.. అన్ని మ్యాచ్‌లే ఆడిన గుజరాత్‌కు ఇదే తొలి ఓటమి.

ప్రొకబడ్డీలో ఈనాడు
బెంగళూరు × బెంగాల్
రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో

నిరాశపరిచిన నిర్మల



లండన్: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల 400 మీ పరుగులో భారత యువ అథ్లెట్ నిర్మల షెరోన్ నిరాశ పరిచింది. సెమీఫైనల్లో ఆమె 53.07 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. మొత్తం మీద నిర్మల 24 మంది అథ్లెట్లలో 22వ స్థానంలో నిలిచింది. తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన (51.28 సె)ను కూడా ఆమె అందుకోలేకపోయింది.

ద్యుతి.. శిక్షణ మీదే దృష్టి పెట్టు



లండన్: తనలో పురుష హార్మోన్లు ఎక్కువగా ఉన్నాయన్న వివాదంపై కాకుండా శిక్షణపైనే దృష్టి సారించాలని దక్షిణాఫ్రికా స్టార్ కాస్టర్ సెమన్యా.. భారత స్ప్రింటర్ ద్యుతిచంద్‌కు సలహా ఇచ్చింది. "ద్యుతికి నాకు ఇప్పటిదాకా పలకరింపులు తప్ప.. మాటల్లేవు. వివాదాలను పక్కకు పెట్టి ట్రయినింగ్‌పై దృష్టి సారించడం కీలకం. ద్యుతిని చూస్తే బాధ కలుగుతుంది. ఆమె ఇంకా చిన్నమ్మాయే" అని సెమన్యా చెప్పింది. రియో ఒలింపిక్స్‌లో సెమన్యా 800 మీ పరుగులో స్వర్ణం గెలిచింది. 2009 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఆమె పసిడి నెగ్గాక.. ఆమె మగాడిలా ఉందనే ఆరోపణలు వినిపించాయి. సెమన్యాకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన ప్రపంచ అథ్లెటిక్ సమాఖ్య పోటీల్లో పాల్గొనేందుకు ఆమెకు పచ్చజెండా ఊపింది.

బోల్ట్, థాంప్సన్‌ల వల్ల కానిది..

లండన్: 2011 ప్రపంచ ఛాంపియన్‌షిప్ 100 మీటర్ల పరుగును మినహాయిస్తే 2008 ఒలింపిక్స్ నుంచి ఏ ప్రపంచ స్థాయి టోర్నీలో బోల్ట్ బరిలోకి దిగినా అతడిదే స్వర్ణం. ఐతే ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్‌షిప్ 100 మీటర్ల పరుగులో మాత్రం బోల్ట్ కాంస్యానికి పరిమితమయ్యాడు. అతడితో పాటు మహిళల 100 మీటర్ల పరుగులో ఫేవరెట్ అయిన జమైకా స్ప్రింటర్ ఎలైన్ థాంప్సన్ సైతం స్వర్ణానికి దూరమైంది. దీంతో జమైకా అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎప్పుడూ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆరంభంలోనే పసిడి పతకాలతో పట్టికలో ముందుండే జమైకా.. ఈసారి వెనుకబడిపోయింది. ఐతే ఎట్టకేలకు జమైకా పసిడి కరవు తీరింది. 110 మీటర్ల హర్డిల్స్‌లో ఒమర్ మెక్‌లాడ్ స్వర్ణం సాధించి జమైకా పసిడి ఖాతా తెరిచాడు. మెక్‌లాడ్ 13.04 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని పసిడి సాధించాడు.

కడుపు చెడె.. పరుగు పోయె!



మక్వాలా

లండన్: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో పోటీ పడటం ఎంత ప్రతిష్ఠాత్మకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇందులో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పోటీలు మరింత ప్రత్యేకం. 10-20 సెకన్లలో ముగిసిపోయే ఈ పందేల కోసం అథ్లెట్లు కొన్నేళ్ల పాటు కష్టపడతారు. ఆ కొన్ని క్షణాల కోసం ఎన్నో త్యాగాలు చేస్తారు. ఎంతో ఖర్చు పెడతారు. పగలూ రాత్రీ తేడా లేకుండా శ్రమిస్తారు. అంత కష్టపడి రేసు కోసం సిద్ధమై. . అనారోగ్యం కారణంగా పోటీకి దూరం కావాల్సి వస్తే ఎంత బాధ ఉంటుంది? అందులోనూ పతకానికి ఫేవరెట్‌గా ఉన్న అథ్లెట్.. రేసులో పాల్గొనే అవకాశం కోల్పోతే ఆ బాధ మరింత ఎక్కువగా ఉంటుంది. బోట్స్‌వానా అథ్లెట్ ఐజాక్ మక్వాలా పరిస్థితి ఇదే. లండన్‌లో జరుగుతున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో 200 మీటర్లు, 400 మీటర్ల పరుగులో మక్వాలా ఫేవరెట్లలో ఒకడు. ఐతే అతను లండన్‌లో బస చేస్తున్న టవర్ హోటల్లో కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల కడుపు నొప్పి వచ్చింది. దీంతో అతను రెండు పరుగు పందేల్లోనూ పోటీపడలేకపోయాడు. మక్వాలా బరిలో ఉంటే రెండు పోటీల్లోనూ కచ్చితంగా పతకాలు సాధించేవాడని అంచనా. నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఎంతో విలువైన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు కోల్పోయానని మక్వాలా తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. మక్వాలా మాత్రమే కాదు.. టవర్ హోటల్లో బస చేసిన బోట్స్‌వానా, జర్మనీ, కెనడా, ఐర్లాండ్, ప్యూర్టోరికా అథ్లెట్లలో దాదాపు 30 మంది కలుషిత ఆహారం కారణంగా అనారోగ్యం పాలైనట్లు సమాచారం. వీరిలో కొందరు పోటీలకు దూరమయ్యారు. అనారోగ్యం పాలైన అథ్లెట్లకు ప్రస్తుతం చికిత్స జరుగుతోంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో అథ్లెట్లకు ఇలా జరగడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

స్పర్శతోనే దెబ్బతిన్న అవయవాలు పూర్వస్థితికి

★ అధునాతన పరికరం అభివృద్ధి



వాషింగ్టన్: చర్మకణాలను మనకు అవసరమైనట్లుగా మార్చుకునేందుకు తోడ్పడే ఓ అధునాతన పరికరాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. కేవలం స్పర్శతోనే ఇది చక్కని ఫలితాల నివ్వడం విశేషం. దెబ్బతిన్న కణజాలం, రక్తనాళాలు, నాడులను దీని సాయంతో పూర్వస్థితికి తీసుకొచ్చే వీలుంది. టిస్యూ నానోట్రాన్స్‌ఫెక్షన్ (టీఎన్‌టీ) సాంకేతికత ఆధారంగా అమెరికాలోని ఒహైయో స్టేట్ వర్సిటీ నిపుణులు ఈ పరికరాన్ని అభివృద్ధిచేశారు. పందులపై దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. వాటి చర్మ కణాలను రక్తనాళాల్లోని కణాలుగా మార్చగలిగారు. రక్తసరఫరా నిలిచిపోయిన వాటికాళ్లలో ఈ కణాలను ప్రవేశపెట్టారు. దీంతో వారం రోజుల్లోనే నాళాల్లో రక్త సరఫరా మెరుగుపడిందని, రెండో వారానికి వాటి కాళ్లు పూర్వస్థితికి వచ్చాయని పరిశోధకులు తెలిపారు. మరోవైపు పక్షవాత బాధిత ఎలుకలపైనా ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. చర్మ కణాలను నాడీకణాలుగా మార్చి వాటికి ఎక్కించారు. దీంతో వాటి మెదడు పూర్వస్థితికి వచ్చింది. ఈ పరిశోధనలో భారత సంతతికి చెందిన చందన్ సేన్ పాలుపంచుకున్నారు. 'ఈ పరికరంలో రెండు ప్రధాన భాగాలున్నాయి. వాటిలో నానోచిప్ మొదటిది. ఇది మన శరీరంలోని కణాలకు సమాచారాన్ని చేరవేయడంలో తోడ్పడుతుంది. ఈ సమాచారాన్ని కణాల రూపాంతరీకరణకు ఉపయోగించే సాంకేతికత రెండోది. ఈ ప్రక్రియకు స్వల్ప మోతాదులో విద్యుత్తు అవసరం. రోగులపై ఈ విద్యుత్తు ఎలాంటి ప్రభావాన్ని చూపించదు. ఈ పరికరంతో చర్మ కణాలను తాకినవెంటనే మనం కోరుకున్నట్లు రూపాంతరం చెందుతాయి. సెకనులోనే ఈ పని పూర్తవుతుంది. 98 శాతం కచ్చితత్వంతో ఇది పనిచేస్తుంది'అని సేన్ చెప్పారు.

3డీ పరిజ్ఞానంలో సజీవ పిండనిర్మాణ చిత్రాలు



వాషింగ్టన్: 3డీ పద్ధతుల ద్వారా సజీవ పిండాల నిర్మాణ చిత్రాలను ఆవిష్కరించే విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనివల్ల కృత్రిమ గర్భధారణ(ఐవీఎఫ్)లో సరైన పిండాలను ఎంచుకోవడానికి వీలుకలుగుతుంది. ఒక్క ఐవీఎఫ్ చక్రం పూర్తి చేయడానికి డబ్బు ఎక్కువగా ఖర్చవుతుంది. దీనిని తగ్గించుకోవాలని అందరికీ ఉంటుందని, తాము అభివృద్ధి చేసిన విధానంతో సాధ్యమైనంత తక్కువ ప్రయత్నాల్లో కృత్రిమ గర్భధారణను విజయవంతం చేసే అవకాశం ఉందని అమెరికాలోని ఇల్లినాయిస్ విశవిద్యాలయ పరిశోధకులు పేర్కొన్నారు. కృత్రిమ గర్భాధారణ సమయంలో ఆరోగ్యంగా ఉన్న సరైన పిండాలను ఎంపిక చేసుకోవడంలో ఈ విధానం వైద్యులకు ఉపయోగపడుతుందని పరిశోధకులు వెల్లడించారు. నూతన పద్ధతిలో గ్రేడియంట్ కాంతి సూక్ష్మదర్శిని(జీఎల్ఐఎం)లో ప్రవేశపెట్టిన లోతైన మందపాటి నమూనా ద్వారా కాంతి ప్రయాణించి వివిధ కణాలనుంచి చిత్రాలను ఉత్పత్తి చేసి, వాటిని ఒకే త్రీడీ చిత్రంగా ప్రతి పిండ కణాన్ని స్పష్టంగా చూపిస్తుంది. దీని ద్వారా లోపాలున్న పిండాలను ఎంపిక చేసుకోకుండా గర్భధారణకు ఉపయోగపడే వాటినే ఎంపిక చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

వీడియోగేమ్‌ల వల్ల మెదడుకు హాని

★ కెనడా శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి



టొరెంటో: యాక్షన్ వీడియో గేమ్‌లు ఆడటం మెదడులోని హిప్పోకాంపస్‌లో ఉండే ముదురురంగు కణజాలం క్షీణించడానికి కారణమవుతోందని కెనడాకు చెందిన పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఫలితంగా డిప్రెషన్, అల్జీమర్స్ వంటి అసాధారణ మానసిక ప్రవర్తన వ్యాధులకు దారితీస్తోందన్నారు. కెనడాలోని మాంట్రియల్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు 100మందిపై శోధించి ఈ విషయాన్ని తేల్చారు. వీరు వీడియోగేమ్‌లు ఆడేవారితో కాల్ ఆఫ్ డ్యూటీ, కిల్ జోన్, బార్డర్‌ల్యాండ్స్ 2 తోపాటు సూపర్ మ్యారియో సిరీస్‌లోని త్రీడీ గేమ్‌లను 90గంటలపాటు ఆడించారు. గత అనుభవాలను గుర్తుపెట్టుకొనే బాధ్యతను మెదడులోని హిప్పోకాంపస్ అనే భాగం నిర్వర్తిస్తుందని, ఈ భాగం క్షీణించడం వల్ల మెదడు అనారోగ్యం బారినపడే ప్రమాదం అధికంగా ఉంటుందన్నారు. దీనివల్ల తీవ్ర నిరాశలోకి కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ఇది పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసార్డర్ (పీటీఎస్‌డీ)కి దారితీస్తుందని ఇప్పటికే జరిగిన పరిశోధన అధ్యయనాలు తెలిపాయన్నారు. వీటికితోడు మతిమరుపు (అల్జీమర్స్) వచ్చే అవకాశాలు ఎక్కువ అని తెలిపారు. మెదడులో హిప్పోకాంపస్ భాగానికి సరిసమానమైనది స్ట్రియేటం అనే నిర్మాణామన్నారు. ఇందులోని కేంద్రకం స్వయంప్రేరితంగా పనిచేస్తుంది అంటే సరైన సమయానికి భోజనం చేసేలా, నీరు తాగేలా ప్రేరేపిస్తుందన్నారు. యాక్షన్ వీడియోగేమ్ ఆడేవారిలో 85శాతం మంది హిప్పోకాంపస్‌పై కాకుండా స్ట్రియేటం కేంద్రకంపై ఆధారపడుతున్నారన్నారు. దీనివల్ల తక్కువస్థాయిలో హిప్పోకాంపస్‌ను ఉపయోగిస్తున్నారు. ఫలితంగా దానిలోని కణాలను కోల్పోతుందన్నారు. రోజూ వీడియోగేమ్‌లు ఆడేవారితోపాటు, ఆడనివారిని పోల్చి చూసినపుడు తరచూ ఆడేవారిలోనూ ఇలాంటి లక్షణాలే కనిపించాయన్నారు. ఇవి మెదడులోని మార్పులకు కారణమవుతున్నాయని తెలుస్తోందన్నారు.

ఉత్సవమూర్తి ఎక్కడ..!

- ప్రధానార్చకునికే ఇచ్చామంటున్న ఉద్యోగులు
- నా దగ్గర లేదంటున్న అర్చకుడు
- విగ్రహాన్ని మాయం చేసి ఉంటారని అనుమానాలు
- అజ్ఞాతంలో ప్రధాన అర్చకుడు



అమ్మవారి ఉత్సవమూర్తి(పాత చిత్రం)

బాసర, న్యూస్‌టుడే: బాసర అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం దాటించి ప్రైవేటుగా అక్షరాభ్యాస పూజలు నిర్వహించిన ఘటన కీలక మలుపు తిరిగింది. ఇందులో తమ ప్రమేయం లేదని చెప్పేందుకు, క్రమశిక్షణ చర్యలు తప్పించుకునే వ్యూహంలో భాగంగా ఉత్సవమూర్తి జాడలేకుండా చేశారు. ఆలయాధికారులు ఎంతగా ప్రయత్నించినా ఉత్సవమూర్తి ఎక్కడుందన్న విషయం తెలియకపోవటం, ప్రధాన అర్చకుడు అజ్ఞాతంలో ఉండటంతో ఈ విషయంలో స్పష్టత కరవైంది.

శ్రావణమాస మొదటి శుక్రవారం నల్గొండ జిల్లా దేవరకొండలో అక్షరాభ్యాసాల కోసం ఒప్పందం కుదుర్చుకున్న ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్ ఆలయంలో పూజ సామగ్రి స్టోర్ బాధ్యతలు చూస్తున్న ఉద్యోగి సుశీల నుంచి ఉత్సవమూర్తిని తీసుకున్నారు. వివాదం నేపథ్యంలో ఆమె దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. పూజాధికాల కోసమేనని భావించి తాను ఉత్సవమూర్తిని సంజీవ్‌కుమార్‌కు అప్పగించినట్టు అందులో పేర్కొన్నారు. అక్షరాభ్యాస పూజల అనంతరం సంజీవ్‌కుమార్ తిరిగి ఉత్సవమూర్తిని తనకు అప్పగించేందుకు ప్రయత్నించారని, తాను దాన్ని స్వీకరించేందుకు నిరాకరించడంతోపాటు..ఆ విషయాన్ని ఆలయ పర్యవేక్షకుడు గిరిధర్ దృష్టికి తీసుకెళ్లాననీ చెబుతున్నారు. ప్రధానార్చకుడు ఉత్సవ మూర్తిని ఆలయ దక్షిణభాగం నుంచి తన వాహన డిక్కీలో ఉంచి దేవరకొండకు తీసుకెళ్లినట్టు ఆలయ ఉద్యోగులు చెబుతున్నారు. వీరి వాదన ఇలా ఉండగా..ప్రధానార్చకుడు మాత్రం విగ్రహం తన వద్ద లేదని చెబుతుండటంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది.

అర్చకుని బీరువా సీజ్: ఉత్సవమూర్తి ఎక్కడుందన్న విషయమై ఆరా తీసేందుకు ఆలయ పర్యవేక్షకుడు గిరిధర్ సోమవారం మధ్యాహ్నం సంజీవ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా..ఉత్సవమూర్తి తన వద్ద లేదని ఆయన సమాధానమిచ్చినట్టు సమాచారం. సాయంత్రం నుంచి ఆయన ఫోన్‌లోనూ అందుబాటులోకి రాలేదు. మంగళవారం ఆలయాధికారులు విగ్రహ ఆచూకీ తెలుసుకునే క్రమంలో ప్రధానార్చకుని ఇంటివద్దకు సిబ్బందిని పంపగా ప్రధానార్చకుని కుటుంబసభ్యులు ఆయన ఇంట్లో లేరంటూ సమాధానమిచ్చారు. ఉత్సవమూర్తిని ఆయన ఆలయంలో తనకు కేటాయించిన బీరువాలో దాచి ఉంటాడని అనుమానిస్తున్న అధికారులు మంగళవారం దాన్ని సీజ్ చేశారు. ఇప్పటివరకు ఉత్సవమూర్తి ఆచూకీ తెలియకపోగా..ఎవరికి వారు భిన్న వాదనలు విన్పిస్తుండటంతో ఉద్దేశ పూర్వకంగానే విగ్రహాన్ని మాయం చేసి ఉంటారన్న అనుమానాలు బలపడుతున్నాయి.

బయటపడేందుకు ప్రయత్నాలు: ఈ వివాదం నుంచి బయటపడేందుకు ప్రధాన అర్చకుడు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. జిల్లాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి ద్వారా దేవాదాయశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి 'తాను అసలు ఉత్సవమూర్తిని తీసుకెళ్లలేదని, సరస్వతీ పూజ మాత్రమే చేశానని' నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వివాదం నుంచి సురక్షితంగా బయటపడేందుకు ఉన్న మార్గాలను అన్వేషించే క్రమంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు ఆలయాధికారులు అభిప్రాయపడుతున్నారు.



రవీంద్ర భారతిలో మంగళవారం గిరిజన దినోత్సవ ప్రదర్శనలిచ్చేందుకు వచ్చిన కళాకారులు వీరు. రాత్రంతా ప్రయాణం చేసి అలసి పోయారు. ఉదయం 9 గంటలకు ప్రదర్శన ఉంటుందని సిద్ధమయ్యారు. సభా ప్రారంభ సమయానికి మంత్రులు రాలేదు. వారికోసం నిరీక్షించి.. ప్రయాణపు బడలిక తీర్చుకునేందుకు మూత్రశాలల వద్దే కింద నిద్రించారు. – ఈనాడు హైదరాబాద్

2018-19 నుంచి ఎయిమ్స్ తరగతులు

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం (2018-19) నుంచి ఎయిమ్స్ ఆధ్వర్యంలో వైద్య విద్య తరగతులు అమరావతిలో ప్రారంభం కానున్నాయని పూనం మాలకొండయ్య తెలిపారు. విజయవాడలోనే అవసరాలకు అనుగుణంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఈ తరగతులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఉద్దానం మూత్రపిండాల వ్యాధులపై పరిశోధనల నిమిత్తం అధ్యయన సంస్థల నుంచి టెండర్ విధానంలో దరఖాస్తులను స్వీకరించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని పూనం మాలకొండయ్య తెలిపారు. వచ్చే సంస్థల సామర్థ్యాలను అనుసరించి ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలోని పర్యావరణం, నీరు, ఇతర అంశాలపై అధ్యయనం కూలంకుషంగా జరగాల్సి ఉందని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం లభిస్తుందని తెలిపారు. ఎమ్మార్ (మీజిల్స్, రుబెల్లా)వ్యాక్సిన్‌ను 36లక్షల మంది చిన్నారులకు వేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల మధ్య ఉన్న చిన్నారులకు ఈ వ్యాక్సినేషన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా వేస్తున్నామని పేర్కొన్నారు.

నిరీక్షణ ఫలించింది

అంతరరాష్ట్ర బదిలీలపై ఏపీలోని తెలంగాణ ఉద్యోగుల హర్షం

ఈనాడు, హైదరాబాద్: అంతరరాష్ట్ర బదిలీల విషయంలో తమ నిరీక్షణ ఎట్టకేలకు ఫలించిందని సీమాంధ్రలో పని చేస్తున్న తెలంగాణ అధికారులు, ఉద్యోగుల సంఘం నేతలు డాక్టర్ జగన్, తిరుపతి హర్షం వ్యక్తం చేశారు. తాము స్వరాష్ట్రానికి వెళ్లేందుకు మార్గం సుగమమైందన్నారు. అంతరరాష్ట్ర బదిలీలకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సరోత్తంరెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు.

పాఠశాలల్లో యోగాపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి: సుప్రీంకోర్టు

దిల్లీ: దేశవ్యాప్తంగా 1 నుంచి 8 తరగతి విద్యార్థులకు యోగాభ్యాసాన్ని తప్పనిసరి చేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీనిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని, పిటిషనర్ల కోరినట్లుగా తాము ఆదేశాలు జారీ చేయలేమని జస్టిస్ ఎంబీ లోకుర్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 1 నుంచి 8తరగతి చదివే విద్యార్థులకు యోగాను పాఠ్యాంశంగా చేర్చాలని, భాజపా అధికార ప్రతినిధి అశ్విన్‌కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఇంజినీరును డిస్మిస్ చేసిన గూగుల్

న్యూయార్క్: సాంకేతిక రంగంలో మహిళలు అత్యున్నతస్థాయికి చేరకపోవడానికి జీవసంబంధమైన వైవిధ్యమే కారణమంటూ వ్యాసం రాసి తీవ్ర సంచలనానికి కారణమైన ఇంజినీరును 'గూగుల్' తొలగించి వేసింది. పేరు..వివరాలేవీ లేకుండా ఆ వ్యాసం రాసిన 'ఆకాశరామన్న'ను జేమ్స్ డెమోర్‌గా గుర్తించింది. విధినిర్వహణ, కార్యదక్షత విషయంలో స్త్రీ, పురుష అంతరాలనే వాదనలను కొనసాగించినందుకు ఆయన (జేమ్స్‌డెమోర్)ను సోమవారం(అమెరికా కాలమానం ప్రకారం) డిస్మిస్ చేస్తున్నట్లు గూగుల్ తెలిపింది. అయితే, తనను తొలగించిన నేపథ్యంలో చట్టపరంగా తనకున్న అవకాశాలన్నిటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు డెమోర్ చెప్పారు. తనను డిస్మిస్ చేయడానికంటే ముందే... తాను అమెరికా 'జాతీయ కార్మిక సంబంధాల బోర్డు'(ఎన్‌ఎల్‌ఆర్‌బీ)కి ఓ ఫిర్యాదు చేసినట్లు డెమోర్ వెల్లడించారు. తనను పెదవి విప్పకుండా చేసేందుకు గూగుల్ ఉన్నత స్థాయి యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఎన్‌ఎల్‌ఆర్‌బీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఖండించిన సుందర్‌పిచాయ్: జేమ్స్‌డెమోర్ రాసినవ్యాసాన్ని 'గూగుల్' సీఈవో సుందర్‌పిచాయ్ సోమవారం రాసిన ఒక ఈ-మెయిల్‌లో ఖండించారు. అత్యంత ప్రమాదకరమైన అంశాన్ని డెమోర్ స్పృశించారన్నారు. గురువారం తన సిబ్బందితో సమావేశమయ్యేందుకు సెలవును మధ్యలోనే విరమించుకుని వెనుదిరిగి వచ్చేస్తున్నట్లు పిచాయ్ తన ఈ-మెయిల్‌లో తెలిపారు. సహోద్యోగులెవరైనా సరే తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వెలిబుచ్చవచ్చు. అయితే, మహిళల గురించి జేమ్స్ డెమోర్ రాసిన వ్యాసం నిజంగా పరిమితులను అతిక్రమించిందని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు.

అదనపు బోగీలతో ప్రత్యేకరైళ్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు అదనపు బోగీల(స్లీపర్ క్లాస్)తో ప్రత్యేకరైళ్లు నడిపించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. 11న సికింద్రాబాద్-కాకినాడ, 12న కాకినాడ-సికింద్రాబాద్ రైళ్లకు రెండేసి స్లీపర్‌క్లాస్ బోగీలు అదనంగా ఏర్పాటు చేస్తారు. 11 నుంచి 22 వరకు కాచిగూడ-కాకినాడ, 12 నుంచి 23 వరకు కాకినాడ నుంచి కాచిగూడకు నడిచే ప్రత్యేకరైళ్లకు అదనంగా ఓ బోగి ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఆర్వో ఉమాశంకర్‌కుమార్ తెలిపారు. 13 నుంచి 24 వరకు కాచిగూడ నుంచి కృష్ణరాజపురానికి, 14 నుంచి 25 వరకు అక్కడ్నుంచి కాచిగూడకు వచ్చే ప్రత్యేక రైలులో ఒక్కో బోగీ అదనంగా ఉంటుందన్నారు.

హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదుల అరెస్టు

శ్రీనగర్: హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థలో చేరేలా యువకులకు ఎరవేస్తున్న ఓ ముఠా కుట్రను పోలీసులు బయటపెట్టారు. దీనికి సంబంధించిన ముగ్గురు వ్యక్తుల్ని పోలీసులు ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో అరెస్టు చేశారు. వీరు తీవ్రవాద సంస్థలో చేరేలా అక్కడి యువతకు ఎరవేస్తున్నారు. ఈ ముగ్గురిలో వసీం అహ్మద్ మీర్‌ది అందేర్‌గాం పఠాన్ కాగా, ఉమర్ హుస్సేన్, అఖిఫ్ హుస్సేన్‌లు ఆచాబల్ సోపోర్‌కి చెందినవారు. వీరినుంచి రెండు చైనీస్ పిస్తోళ్లతోపాటు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. వీరు హిజ్బుల్ ముజాహిదీన్ సంస్థ కోసం పనిచేస్తున్నారని, యువకుల్ని ఈ సంస్థలో చేరేలా ప్రోత్సహించడంతోపాటు పఠాన్, సోపోర్ ప్రాంతాల్లో వారికి కావాల్సిన ఏర్పాట్లు చూస్తున్నారని పోలీసులు తెలిపారు.

సందర్శకుల ముఖాలపై గుర్తింపు ముద్ర వేసిన జైలు సిబ్బంది

భోపాల్: సాధారణంగా కారాగారంలో ఉన్న ఖైదీలను కలిసేందుకు వచ్చే సందర్శకుల కోసం సిబ్బంది తాత్కాలిక గుర్తింపు కార్డులు జారీ చేస్తారు. కానీ మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కేంద్ర కారాగారంలో మాత్రం ఏకంగా సందర్శకుల ముఖాలపైనే గుర్తింపు ముద్ర వేశారు. ఇది మీడియాలో ప్రసారం కావడంతో ఆ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వివరణ కోరింది. స్థానిక కేంద్ర కారాగారంలో ఖైదీలుగా ఉన్న తమ బంధువులను కలిసేందుకు రక్షాబంధన్ సందర్భంగా పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు. ఈ సందర్భంగా గుర్తింపునకు జైలు సిబ్బంది ఇద్దరు చిన్నారుల ముఖాల మీద స్టాంపులు వేసిన చిత్రాలు ప్రసార మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. దీన్ని బాలల హక్కుల ఉల్లంఘన కింద పరిగణించిన ఆ రాష్ట్ర మానవహక్కుల కమిషన్, వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని జైళ్ల శాఖ డీజీకి నోటీసులు జారీ చేసింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2015-17, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.